# నా శాన్‌ఫ్రాన్సిస్కో డైరీ

- మధురవాణి




శ్రీ
కౌముది
మీ మనోగిల్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 66

అనుభవాలని అనుభూతులుగా మార్చుకోవడం, అనుభూతులకు అందమైన అక్షరరూపం ఇవ్వడం ఓ కళ!

అలాంటి కళకి ఓ అందమైన మచ్చుతునక మధురవాణి వ్రాసిన ఈ డైరీలో పేజీలు.

కౌముది

# My San Francisco Diary - 1

కాలం ఒక మాయల మరాఠీ!

మనసుకి నచ్చే క్షణాల ఆగమనం కోసం నిరీక్షిస్తున్నప్పుడు ప్రతీ నిమిషం భారంగా కదులుతున్నా సరే ఆ ఎదురుచూపే అతి మధురంగా మారి మురిపిస్తుంది. ఆ అరుదైన క్షణాలని అందుకున్న మైమరపులో ఉండగానే ఒక్క ఉదుటున అలలా ఎగిసి వచ్చి నేటి ఆనందానుభూతులన్నీటినీ నిర్దాక్షిణ్యంగా లాక్కెళ్ళి నిన్నల్లో కలిపేస్తుంది. అందాకా అరచేతుల్లో ఒదిగి ఉన్న అపురూప క్షణాలన్నీ రెప్పపాటులో వేళ్ళ సందుల్లోంచి ఇసుకలా మెత్తగా జారిపోయి గతం పరమైపోతాయి. అందమైనదని ఆరాధించిన అదే కాలాన్ని కర్కశమైనదని నిందించాలనిపించేలా తన రూపం మారుస్తుంది. కానీ ఈ కాలమానాలు, దశ దిశలు, సరిహద్దులు మనుషులకే గానీ మనసులకు నిర్దేశించగలవారెవ్వరు?

అప్పుడప్పుడూ జీవితపు ఒడ్డున కూర్చుని కనుచూపుమేరా పరుచుకున్న ఇసుక మేటల్లో ఎక్కడో ఏదో పొరల్లో నన్ను వదిలి వెళ్ళిన ఆనాటి మధుర క్షణాలు రంగురంగుల జ్ఞాపకాల గవ్వలుగా మారి దొరుకుతాయేమోనని వెతుకుతూ కూర్చోవాలనిపిస్తుంది. ఆ జ్ఞాపకాల వేలు పట్టుకుని గతంలోకి అడుగులేసి మళ్ళీ మళ్ళీ ఆ మధురానుభూతులని పునర్జీవించాలనిపిస్తుంది.

అలాంటి చిన్ని ప్రయత్నమే ఈ San Francisco Diary! నాకోసం నేను రాసుకుంటున్నా సరే నేను పంచే నా జ్ఞాపకాల పరిమళం మిమ్మల్ని కూడా అలరిస్తుందని నమ్ముతూ...

~~~~~~~~~~~~~~~

ఊ.. అసలు ఎప్పుడు ఎక్కడ మొదలైందీ స్నేహం, ఎలా ముడిపడింది బంధం అని వెనక్కి తిరిగి చూడాలనుంది ఒకసారి!

2010 మార్చిలో ఈనాడు 'వసుంధర' లో కౌముది కో-ఎడిటర్ అయిన శ్రీమతి కాంతి కిరణ్ గారి ఇంటర్వ్యూ వచ్చింది. అప్పటికే కౌముది పత్రిక చూస్తూ ఉండేదాన్ని గానీ అది ఎవరు నడుపుతున్నారు ఏంటీ అనే విషయాల గురించి అస్సలు అవగాహన లేదు. అప్పుడప్పుడూ బ్లాగులో నాలుగు వాక్యాలు రాసుకోడానికే ఏదో బోల్డు సమయం ఖర్చు పెడుతున్నట్టు తెగ ఇదయిపోతుంటే వీళ్ళు అసలెటువంటి లాభాపేక్ష లేకుండా కేవలం మాతృభాష
~~~~~~~~~~~~~~~

మీద, సాహిత్యం మీదున్న మమకారంతో ఇంత శ్రమ, సమయం వెచ్చించి పత్రిక నడుపుతున్నారంటే చాలా ఆశ్చర్యంగా, గొప్పగా అనిపించింది.

నా స్నేహితురాలు సుజ్జీ తనకి ఫేస్ బుక్లో 'కౌముది' కాంతి కిరణ్ గారితో పరిచయం అయిందని, ఆవిడ చాలా చక్కగా మాట్లాడతారు, స్నేహశీలి అనీ, తను పంపిన కవిత కౌముదిలో ప్రచురణకి ఎంపికైందని చెప్పి నేను రాసిన కథని కూడా కౌముదికి పంపించి చూద్దామంది. నేను వద్దులే అన్నా సరే వినకుండా బలవంతం చేసి మరీ కథ పంపేలా చేసింది. కౌముది ఎడిటర్ కిరణ్ ప్రభ గారు కథ ఇంకా బాగా రాయడానికి ఉపయోగపడే కొన్ని సలహాలు, సూచనలతో జవాబిచ్చారు. కొత్తగా రాసేవారిని ప్రోత్సహించడం కౌముది లక్ష్యాల్లో ఒకటని అందుకే నా కథని ప్రచురిస్తామని, కథ రావడానికి కనీసం మూడు నెలలైనా పడుతుందని చెప్పారు. నేను చాలా సంతోషించి బదులుగా ధన్యవాదాలు తెలిపాను. ఆ కథ చివర్లో నా బ్లాగు లింక్ ప్రచురించమని చెప్పమంది సుజ్జీ. నేను మొహమాటపడిపోతుంటే ఏంపర్లేదు అందులో తప్పేముంది. పోనీ ఎడిటర్ గారికి చెప్పడానికి మొహమాటంగా అనిపిస్తే కాంతి గారికి మెయిల్ పెట్టు అని మళ్ళీ నన్ను గట్టిగా ముందుకి తోసి కాంతి గారితో మాట్లాడేలా చేసింది.

అప్పుడు నేను రాసిన ఈమెయిలుకి ఆవిడ సమాధానం ఇచ్చారు. వెంటనే కథ, కౌముది విషయం మర్చిపోయి ఎప్పటి నుంచో చాలా పరిచయం ఉన్నవాళ్ళలాగా చాలా విషయాలు మాట్లాడేసుకున్నాం. కొత్త పరిచయాలు, స్నేహాలు పెంచుకునే విషయంలో కాస్త నెమ్మదిగా ఆచి తూచి మాట్లాడే నేను ఆవిడతో చాలా తక్కువ సమయంలోనే ఎక్కువ మాట్లాడేసాను. అప్పుడు మొదలైన మా పరిచయం ఈ మెయిల్స్ దాటి ఫోనులో కబుర్లు చెప్పుకునే దాకా రావడానికి కనీసం నెలరోజులు కూడా పట్టలేదు. 2010 ఆగస్టులో నేను ఇండియా వెళ్ళినప్పుడు వచ్చే వీలుంటే కాంతి గారు కలుస్తానన్నారు. కానీ అప్పుడు కుదరలేదు. తర్వాతకాలంతో పాటు మా స్నేహం పెరిగి పెద్దదైపోతూ మా పరిచయం వయసు కేవలం కొన్ని నెలలేనని మర్చిపోయాం. అసలు మేము కేవలం స్నేహితులే అన్న విషయం మర్చిపోయి ఒకే కుటుంబ సభ్యులమన్నట్టు దగ్గరైపోయాము. మా పిల్లల వయసున్న నువ్వు నాకు స్నేహితురాలు అవ్వడం భలే చిత్రం కదాని కాంతి గారు ఇప్పటికీ ఆశ్చర్యపడుతుంటారు. అదేంటో మరి మా ఇద్దరి మధ్యనా వయసు తేడా ఎప్పుడూ కనిపించదు. :-)

కాంతి గారు తరచూ అడుగుతూ ఉండేవారు సెలవులుంటే అమెరికాకి వచ్చి వెళ్ళమని. నాక్కూడా వెళ్ళాలని ఉన్నా నా రీసెర్చ్ గోలలో పడి సెలవులు ఉన్నా సరే వాటిని తీరిగ్గా ఉపయోగించుకునే వీలు చిక్కక చూద్దాం చూద్దాం అంటూ ఉండేదాన్ని. ఇలా అయితే ఎప్పటికీ కుదిరేలా లేదని చెప్పి నువ్వు ముందు వీసాకి అప్లైచేస్తే అది కాస్తా వస్తే తర్వాత వీలుని బట్టి ఎప్పుడో అప్పుడు రావచ్చని ఇన్విటేషన్ లెటర్ పంపిస్తానన్నారు. జూన్ 2012 లో లెటర్

పంపిస్తే నేను కొత్త పాస్పోర్ట్ తెచ్చుకోవాల్సిన పని కాస్తా చూసుకుని తీరిగ్గా వీసాకి అప్లై చేసేసరికి జూలై వచ్చింది. సెప్టెంబర్ లోపు అయితే వచ్చే వీలుంటుంది కానీ ఈ లోపు కుదరకపోతే మళ్ళీ వచ్చే ఏడాది దాకా నేను సెలవలు తీసుకోలేనని చెప్పాను. మొత్తానికి మాకిక్కడ ఎండాకాలం సెలవుల సీజన్ అవ్వడం వల్లనో ఏమో గానీ అమెరికన్ ఎంబసీ చాలా బిజీగా ఉండి నాకు వీసా అపాయింట్మెంట్ ఆగస్టుకి గానీ దొరకలేదు. తర్వాత తతంగం అంతా పూర్తయ్యి వీసా నా చేతికి వచ్చేసరికి అక్టోబర్ వచ్చేసింది. అది కూడా మళ్ళీ అక్టోబర్ దాకా ఒక్క ఏడాదికే వీసా వచ్చింది. సరేలే 2013 లో చూద్దాం అనుకుంటూ ఉండగానే మా తమ్ముడి పెళ్ళికుదిరి రెండు నెలలు ఇండియాలో సెలవులు తీసుకోవాల్సి వచ్చింది. ఈసారికి అమెరికా ప్రయాణం పెట్టుకోలేను కదా అనుకుని ఇక ఇప్పట్లో కుదరదేమో అనుకుని నీరసపడిపోయాం.

ఇంతలో కాంతి గారు అనుకోకుండా 2013 జనవరిలో ఇండియా ప్రయాణం పెట్టుకున్నారు. నేను తనని కలవాలన్న ఉద్దేశ్యంతో పది రోజులు నా ప్రయాణాన్ని ముందుకి జరిపి ఎలాగైతేనేం అటు అమెరికాలోనూ, ఇటు జర్మనీలోనూ కాకుండా అస్సలు ఊహించని విధంగా ఇండియాలో మొదటిసారి కలిసాం. జనవరి 8 న నేను వెళ్తే 9 న ఆవిడ అమెరికా తిరుగు ప్రయాణం కాబట్టి మాకు ఒక్క రోజే సమయం దొరికింది. ఆ ఒక్క రోజులోనే మా అభిమాన రచయిత్రి బలభద్రపాత్రుని రమణి గారిని, పద్మజ గారిని కలవాలనుకున్నాం. నాకు ఎప్పటినుంచో రమణి గారి కథలు, నవలలు, సినిమాలు, కౌముదిలో కాలం దాటని కబుర్లు చదివిన అభిమానం ఉన్నప్పటికీ నేరుగా ఆవిడతో పరిచయం ఏర్పడింది మాత్రం కాంతి గారి ద్వారానే. రమణి గారు అమెరికా వచ్చినప్పుడు ఒకసారి ఫోన్లో మాట్లాడాను కానీ పద్మజ గారితో ఎప్పుడూ మాట్లాడలేదు. పద్మజ గారు రాసిన 'సోక్రటీసు భార్య' కథ చదివాక చాలా నచ్చేసారు. ఇప్పుడు ఆవిడ కౌముదిలో రాస్తున్న 'సంసారంలోసరిగమలు' కూడా చాలా బాగుంటున్నాయి. మొత్తానికి కాంతి గారి మాటల్లో ఒకరి గురించి ఒకరికి బాగా తెలుసు కాబట్టి ఆ రోజు హైదరాబాదులో అందరం కలుద్దాం అనుకున్నాం. సరదాగా బయట లంచ్ చేసి మిథునం సినిమాకి వెళదామని రమణి గారు అప్పటికే టికెట్స్ బుక్ చేసుంచారు. పద్మజ గారు ఆ రోజు ఉదయమే బెంగళూరు నుంచి రావడం వల్ల తనకి రావడం కుదరలేదు. ఆ రోజు పొద్దున్నే నేను విమానం దిగడం వల్ల ప్రయాణంలో అలసట మూలాన హెల్త్ అప్సెట్ అయి నా వల్ల ప్లాన్ అంతా మారిపోయింది. నాకు చాలా గిల్టీగా అనిపించినా సరే ఏం చెయ్యలేకపోయాను. రమణి గారికి కాల్ చేసి చెప్తే ఆవిడే బోల్డు శ్రమపడి ఎక్కడో ఉన్న రామానాయుడు స్టూడియోస్ నుంచి ఊరికి పూర్తిగా ఇంకో మూలాన ఉన్న కాంతి గారింటికి వచ్చారు. ఆ రోజు లంచ్ మూడింటికి చెయ్యాల్సి వచ్చింది నా పుణ్యమా అని. ఏంటమ్మాయ్ రాగానే అడ్డం పడిపోయావు అనుకుంటూ వస్తూ వస్తూ పెద్ద సంచీ నిండా ఫ్రూట్స్ పట్టుకొచ్చారు. రమణి గారితో ఫోన్లో అయినా, ఎదురుగా అయినా

మాట్లాడుతుంటే మనకి అస్సలు టైం తెలీకపోగా నవ్వీ నవ్వీ బుగ్గలు నొప్పెట్టేస్తాయి. ఆ రోజు మేము కలిసున్నది ఒక్క పూటే అయినా బోల్డు కబుర్లు, నవ్వులతో సాయంత్రానికి నేను సరైపోయాను.:-)




తర్వాత మళ్ళీ ఎవరి గూటికి వాళ్ళం చేరుకొని యథావిధిగా పనుల్లో పడిపోయాం. ఇండియాలో కలిసినప్పుడు మనకి ఎక్కువ టైమే దొరకలేదు కదా.. ఆ వీసా ఎక్స్పైర్ అయ్యేలోపు నువ్వు అమెరికా వచ్చెయ్. నాలుగు రోజులుండి వెళుదువు గానీ అంటూ కాంతి గారు మళ్ళీ మళ్ళీ గుర్తు చేస్తూనే ఉన్నారు. నేను ఇంక ఈ సంవత్సరం కుదరదేమోలే అనుకుంటూ ఉండగానే 2013 మే నెల వచ్చేసింది. ఒక రోజు మా ఇంటబ్బాయ్ తను కాన్ఫరెన్స్ కోసం ఒక పది రోజులు సిడ్నీ వెళ్తానని చెప్పాడు. నేను దిగులుగా మొహం పెట్టేసరికి నేను ఆస్ట్రేలియా వెళ్ళినప్పుడు నీకొక్కదానికి బోర్ కదా.. పోనీ నీ అమెరికా ప్రయాణం ఇప్పుడు పెట్టుకోరాదూ అన్నాడు. ఆ మాట విని నా మొహంలో వచ్చి చేరిన వెలుగుకి చిచ్చుబుడ్లు, మతాబులు కూడా సాటి రావు. నిజంగా వెళ్ళనా అని ఇంకా అనుమానంగా అడుగుతుంటే తనేమో పోనీ సిడ్నీ వెళ్దాం పద.. సిడ్నీనా, శాన్ఫ్రాన్సిస్కోనా, చెప్పు నీ ఇష్టం.. అన్నాడు. అప్పుడు చూడాలి నా మొహం అసలు. ఏం బదులు చెప్పకుండా దీనంగా చూసాను తనకేసి. ఇంక చాల్లే ఆ ఎక్స్ప్రెషన్ మార్చు. నాకు

తెలుసులే నీకు మీ ఫ్రెండ్స్ దగ్గరికే వెళ్ళాలని ఉంది కదా.. అన్నాడు. అంటే మరి నా వీసా కూడా వేస్ట్ అయిపోతుంది కదా, ఇప్పుడు వెళ్ళకపోతే మళ్ళీ ఎప్పటికి కుదురుతుందో కదా అన్నాను మెల్లగా. సరే అమెరికానే వెళుదువు గానిలే, మనం మళ్ళీ ఇంకెప్పుడైనా సిడ్నీ వెళదాంలే అని చెప్పాడు. నేను హిప్హిప్‌హే అని ఎగిరి గంతులేస్తుంటే ఈ గంతులన్నీ అమెరికాలో వెయ్యొచ్చులే గానీ ముందు టికెట్స్ సంగతి చూడు అన్నాడు. అమెరికాలో గంతులు ఎలానూ ఉంటాయిలే కానీ ఇవి జర్మనీ గంతుల్లే అన్నాను. అప్పుడససలు పట్టలేనంత సంబరం.. ఉక్కిరిబిక్కిరి అయిపోయేంత సంతోషం.. నన్ను చూసి మా ఇంటబ్బాయ్ నవ్వుతూ పండగ చేస్కో అన్నాడు. నిజంగానే తను అన్నట్టు ఆ క్షణం నుంచి పండగ మొదలైంది...



# My San Francisco Diary – 2

మొత్తానికి అలా నా శాన్ ఫ్రాన్సిస్కో ప్రయాణం అనుకోగానే ఫ్లైట్ టికెట్లు బుక్ చేసుకునే ముందు చెయ్యాల్సిన ఒక ముఖ్యమైన పని ఒకటుందని గుర్తొచ్చింది. ఈ ప్రయాణం అంటూ కుదిరితే కలవాల్సిన ఇంకో స్నేహితురాలికి కుదురుతుందో లేదో కనుక్కోవాలి. అదంతా చెప్పే ముందు అసలు తనెలా నా స్నేహితురాలైందో.. ఉహూ కాదు కాదు నేనెలా తనకి స్నేహితురాలిని అయ్యానో చెప్పాలి మరి! :-)

2008 సెప్టెంబరులో నేను బ్లాగు మొదలుపెట్టే సమయానికి నాకు ఇంటర్నెట్లో తెలుగులో టైప్ చెయ్యొచ్చన్న విషయం కూడా తెలీదు. అప్పటికి ఏదో చిన్నప్పుడు స్కూల్లో తెలుగు చదవడం తప్పించి తెలుగు సాహిత్యం గురించి ఏ మాత్రం అవగాహన లేదు కాబట్టి ఈ తెలుగు బ్లాగులున్నాయని తెలిసిన కొత్తలో కొత్త బిచ్చగాడు పొద్దెరగడన్న సామెతలాగా ఏ మాత్రం వీలు దొరికినా తెలుగు కథలు, బ్లాగులూ తెగ చదివేస్తూ ఉండేదాన్ని. అలా అప్పుడప్పుడూ కౌముది చూస్తుండేదాన్ని. 2008 డిసెంబరులో ఒక శుక్రవారం రాత్రి అలా కౌముది చూస్తుండగా 2008 లో సీరియల్ గా వచ్చిన ఒక నవల కంటపడింది. ఏ సీరియల్ అయినా నెలకో భాగం చదివి హీరోయిన్ ఎవరిని ప్రేమిస్తుంది, హీరో బతుకుతాడా లేదా అనుకుంటూ మళ్ళీ వచ్చే నెల దాకా గోళ్ళు కొరుక్కుంటూ టెన్షన్ పడటమంటే నాకు మా చెడ్డ బద్ధకం. అందుకని ఏవైనా సరే పూర్తిగా ఉన్న నవలలే మొదలెట్టి ఇంకది అయిపోయేదాకా కాళ్ళు తిమ్మిర్లు పట్టినా, కళ్ళు పోయేలా ఉన్నా సరే మధ్యలో ఆపకుండా ఎంసెట్ కి ప్రిపేర్ అయినదానికంటే ఎక్కువ ఏకాగ్రతతో చదువుతుంటాను. అలా ఆ శుక్రవారం రాత్రి దాదాపు పదిన్నర దాటాక 'ఊసులాడే ఒక జాబిలట' అనే పేరుతో ఒక నవల కనపడింది కౌముదిలో. ఊరికే ఏంటో చూద్దామని ఒక పేజీ చదివాక ఇక ఆపడం అనేది నా చేతుల్లో లేకుండా పోయింది. ఎలాగూ వీకెండ్ కదా అన్న ధైర్యంతో అలా కూర్చుని నవలంతా పూర్తి చేసాను. అంటే ఏదో న్యూస్ పేపర్ చదివినట్టు కాదు మళ్ళీ . మధ్య మధ్యలో నవలలో వచ్చే చిన్ని కవితల దగ్గర అలా ఆగిపోయి, వాటి గురించి ఆలోచించుకుంటూ, నవలలో పాత్రలు చెప్పే మాటలు, అభిప్రాయాలే కాకుండా, వాళ్ళు చెప్పనివి, వాళ్ళ చుట్టూ జరిగేవన్నీ నేను ఊహించుకుంటూ వాళ్ళ వెనకాలే వాళ్ళ ఊరి వీధుల్లో, ఇళ్ళల్లో తిరిగేస్తూ, వాళ్ళ సంతోషాలని, నొప్పినీ నేను కూడా అనుభవిస్తూ ముగింపుకొచ్చేసరికి నవల్లో ప్రధాన పాత్ర అయిన కార్తీకని వదల్లేక అదేదో మా ఇంటి

పక్కనమ్మాయి నన్ను వదిలేసి వెళ్ళిపోయినట్టు బేర్ మని ఒకట ఏడుపు.. :-) పుస్తకాలు చదివి కూడా ఏడుపొస్తుందని నాకప్పటిదాకా అనుభవం కాకపోవడం వల్లనుకుంటా చాలా అంటే చాలా కదిలిపోయాను.

నేనంత మెల్లమెల్లగా చదువుతూ కూర్చోవడం వల్ల నవల పూర్తయ్యేసరికి తెల్లవారుజాము నాలుగు గంటలు దాటింది. అప్పుడు కూడా నాకు నిద్ర పోవాలనిపించలేదు. అప్పుడే కొత్తగా బ్లాగు రాస్తున్న ఉత్సాహం కూడా ఉందేమో, అంతగా కదిలించిన కార్తీక గురించి, ఊసులాడే ఒక జాబిలట నవల గురించి అప్పటికప్పుడు నా మనసులో మెదులుతున్న భావాలన్నీ రాయడం మొదలుపెట్టాను. అప్పట్లో నేరుగా బ్లాగర్ పేజీలో టైప్ చేసుకోడం ఒక్కటే తెలుసు నాకు. అలా దాదాపు ఒక రెండు గంటల సేపు కూర్చుని నవల పేజీలు వెనక్కీ ముందుకీ తిప్పుకుంటూ, అందులోని చిన్ని కవితల్ని కూడా కోట్ చేస్తూ ఒక యాభై లైన్ల దాకా రాసాక ఏదో టెక్నికల్ ఎర్రర్ వచ్చి బ్రౌసర్ ఫ్రీజ్ అయింది. నేను రాసిన డ్రాఫ్ట్ అంతా సేవ్ అవ్వకుండా పొరపాటున డిలీట్ అయిపోయిందని నాకు అర్థం కావడానికి ఇంకో పదిహేను నిమిషాలు పట్టింది. ఎంత ప్రయత్నించినా అది రిట్రైవ్ చెయ్యడం చేతకాలేదు. అప్పటికే ఉన్న కార్తీక తాలూకు దిగులు, నేను రాసిన పోస్టు డిలీట్ అయిపోవడం, రాత్రంతా నిద్ర లేకపోవడం అన్నీ కలిసి బాధతో పాటు విపరీతమైన అసహనం, కోపం వచ్చాయి. లాప్టాప్ పక్కన పడేసి నిద్రపోయాను ఆ రోజుకి. తర్వాత చాలా రోజుల దాకా నాకు బ్లాగర్ పేజీ మీద కోపం పోలేదు. అప్పటినుంచీ బ్లాగర్లో టైప్ చెయ్యడం మానేసాను. వేరే ఎలా రాసుకోవాలో నేర్చుకుని అక్కడ రాసి తెచ్చి బ్లాగ్లో పేస్ట్ చెయ్యడమే. ఆ నవల చదివాక దాదాపు చాలా రోజుల దాకా ఏ పని చేస్తున్నా కార్తీక గుర్తొస్తూ ఉండేది. లాబ్లో మొక్కలు నాటుకుంటూ, ఇంట్లో గిన్నెలు కడుక్కుంటూ, వంట చేసుకుంటూ కార్తీక గురించి ఆలోచిస్తూ ఉండేదాన్ని.

అప్పటి దిగుల్లోంచి కాస్త బయట పడ్డాక ఒక రోజు... సరే నవల గురించి నేనొక పోస్టు రాసి రచయిత్రి బ్లాగులో ఆ లింక్ నాకింత నచ్చిందండీ అని చెప్దామనుకున్నది ఎలానూ కుదరలేదు. అంతమాత్రాన అసలు కనీసం ఒక్క ముక్క కూడా చెప్పకపోతే ఎలా అనిపించింది. మళ్ళీ అంతలోనే 'చాలా బాగా రాసారండీ' అని ఒక్క ముక్కలో చెప్తే నాకింత నచ్చిందని ఆవిడకెలా తెలుస్తుంది అని పెద్ద సందేహమొకటి. ఉహూ ఇలాక్కాదు, చెప్పి తీరాల్సిందేనని అనుకుని 'ఊసులాడే ఒక జాబిలట' నవలా రచయిత్రి నిషిగంధ గారి బ్లాగులో ఒక కామెంట్ పెట్టాను. దానికి ఆవిడ నాకు ఫ్యాన్లూ, ఏసీలూ వద్దులే గానీ ఒక ఫ్రెండ్ కావాలి. ఒకే నా.. అని సమాధానం ఇచ్చారు. అప్పుడు నేనెంత సంబరపడ్డానో చెప్పాలంటే, బహుశా చిరంజీవి ఫ్యాన్స్ ఎవరికైనా చిరంజీవి ఎక్కడో కనిపించి తిరిగి హాలో చెప్తే ఎలా


కౌముది

కిందా మీదా అయిపోతారో.. ఇంచుమించు అంత థ్రిల్ అయిపోయాను. ఇంత గొప్ప రచయిత్రి నేనెవరో ఏవిటో తెలీకుండా నన్ను స్నేహితురాలిగా ఉండమని అడుగుతోందేంటి.. అని చా..లా హాశ్చర్యపోయాను.

మనం ఎప్పుడైనా ఎవరినైనా మరీ అభిమానిస్తే, ఎవరి మీదైనా ఎక్కువ గౌరవం పెంచుకుంటే వాళ్ళని ఎప్పుడూ కనీసం ఒక కిలోమీటరు ఎత్తులో కూర్చోబెట్టి చూస్తూ ఉంటాం. వాళ్ళు మామూలుగానే మాట్లాడినా సరే మనం మాత్రం మాములుగా ఫీలవ్వకుండా వాళ్ళని మామూలు మనుషుల్లా చూడకుండా వేరే లోకానికి సంబంధించిన వాళ్ళని చూసినట్టు చూస్తూ అతి గౌరవమర్యాదలు ప్రకటిస్తుంటాం. అచ్చం నేను అలాగే చూసేదాన్ని నిషి బ్లాగుల్లో ఎక్కడన్నా ఎదురుపడినప్పుడు. తను మొదటిసారి నా బ్లాగులో కామెంట్ పెట్టినప్పుడు నాకేదో అవార్డ్ వచ్చినంత పొంగిపోయా.. :-)

సరే.. అలా నాకు అభిమాన రచయిత్రి అయిపోయిన నిషిగంధ గారితో పరిచయం కలిగాక నేను కాస్త భయం భయంగా దూరదూరంగా నించుని మాట్లాడుతూ ఉండే రోజుల్లోనే తన ఈమెయిల్ ఐడీ తెలిసి 2011 జనవరిలో తన పుట్టినరోజుకి విష్ చేస్తూ మెయిల్ చేస్తే తను చాలా ఆప్యాయంగా బదులిచ్చారు. తర్వాత కొన్ని నెలలకి నిషి గూగుల్ బజ్లోకి వచ్చి అప్పుడప్పుడూ కబుర్లు చెప్పేవారు. నిషిగంధ గారు, పద్మవల్లి గారు, కొత్తావకాయ గారు, వీళ్ళందరూ కొత్తగా ఆ టైములోనే పరిచయం అయ్యారు గూగుల్ బజ్లో. 2011 సెప్టెంబరులో ఒక రోజు బజ్లో వాళ్ళందరూ తిలక్ 'అమృతం కురిసిన రాత్రి' గురించి మాట్లాడుకుంటూ ఏదో కవిత తన దగ్గరుందని వాళ్ళకి పంపిస్తానని చెప్పారు నిషి. అప్పుడు నేను తనకి మెయిల్ చేసి నాక్కూడా పంపండి అని అడిగితే "అలాగే పంపిస్తాను కానీ ఒక షరతు. నువ్వు 'మీరు, గారు' మానేసి అర్జెంటుగా 'నువ్వు' అనాల్సిందే. నీకు చాలాసార్లు చెప్పాను కానీ నువ్వసలు నా మాట వింటున్నట్టు లేదు" అన్నారు. అప్పుడసలు మామూలుగా మొహమాటపడలేదు నేను. అయ్యో బాబోయ్ మీ అంతటి మిమ్మల్ని పట్టుకుని నువ్వు అనడానికి నాకు నోరెలా వస్తుందండీ అని చాలా ఫీలైపోయి తనతో కూడా అదే అన్నాను కానీ తను ససేమిరా అనేసరికి నాకింక తప్పలేదు. :-)

అప్పటి నుంచీ అప్పుడప్పుడూ బజ్లో పాటల చర్చలు జరిగినప్పుడు మెయిల్లో కొన్ని మంచి మంచి పాటలు పంపిస్తూ ఉండేది నిషి. 2012 జనవరిలో తన పుట్టినరోజు వచ్చినప్పుడు నిషికి సర్ప్రైజ్ లా ఉంటుందని తనకి కాల్ చేసి విష్ చెయ్యమని తన ఫోన్ నంబర్ నాకిచ్చారు పద్మవల్లి గారు. అప్పుడే మొదటిసారి తనతో నేను ఫోన్లో మాట్లాడటం. మేమిద్దరం మొదటిసారి ఫోన్లో మాట్లాడుకుంది కేవలం 18 నెలల క్రితమేనని గుర్తొస్తే అస్సలు నమ్మలేని విషయంలా అనిపిస్తుంది ఇప్పుడు. ఆ రోజు నేను హేపీ బర్త్ డే అని చెప్పి నువ్వు బిజీగా ఉంటావేమో కదా ఈ రోజు అని మొహమాటంగా వెంటనే పెట్టేస్తానంటే తను పర్లేదని చెప్పి ఎప్పటినుంచో తెలిసున్న పాత స్నేహితురాలితో

మాట్లాడినట్టు చాలాసేపే మాట్లాడింది. తర్వాత మా మధ్య మాటల వారధి బలపడి స్నేహం ఎదుగుతూ ఉన్న రోజుల్లో ఉన్నట్టుండి ఒక రోజు ఎందుకో ఊసులాడే ఒక జాబిలట కార్తీక గుర్తొచ్చి అప్పుడు 2008 లో నవల చదివినప్పటి జ్ఞాపకం గురించి చెప్తూ నిషికి ఒక మెయిల్ రాసాను. దానికి తను స్పందించిన తీరు ఎప్పటికీ మర్చిపోలేను. దాని గురించి ఇప్పుడు మళ్ళీ వర్ణించనులెండి. అది నాకొక్కదానికే సొంతం అన్నమాట! ;-)

2012 ఫిబ్రవరిలో ఒక రోజు ఉదయాన్నే పోస్టులో నాకోసం అట్టపెట్టె ఒకటి వచ్చింది. దాని మీదున్న నిషి పేరు చూసి ఆశ్చర్యం కాదు ఏకంగా షాకే అయ్యాను. తనో చిన్ని కానుక పంపించింది నాకోసం. నా బెస్ట్ ఫ్రెండ్ అనబడే ఒక మనిషి నాకు తెలీకుండా నా అడ్రస్ నిషికి ఇచ్చి హెల్ప్ చేసి ఇద్దరూ కలిసి సైలెంట్ గా సర్ప్రైజ్ ప్లాన్ చేసారని తర్వాత తెలిసింది. కానీ అసలా గిఫ్ట్ వచ్చిన రోజు మాత్రం నేల మీద పాదాలు ఆనలేదంటే మీరు నమ్మాలి! తర్వాత అలా అలా రోజూ పాటల గురించి మాట్లాడుకోవడంతో మొదలెట్టి కాదేదీ మాట్లాడుకోడానికీ, నవ్వుకోడానికీ అనర్హం అన్నట్టు వాగులా, వరదలా, ఇంకా వాటన్నీటికంటే ఉధృతంగా అంతూ పొంతూ లేకుండా మా కబుర్లు సాగుతూ...నే ఉన్నాయి, ఉంటాయి కూడా! ఒకసారి ఇంకో స్నేహితురాలు సౌమ్య మా ఇంటికొచ్చినప్పుడు నేను, నిషి మాట్లాడుకున్నది చూసి మీరిద్దరూ మాట్లాడుకోడం తక్కువ, నవ్వుకోడం ఎక్కువ అనుకుంటా కదా అని సరదాగా అంటే నిజమే కదా అనిపించి భలే నవ్వొచ్చింది. అసలు ఇప్పుడు పరిస్థితి ఎలా అయిపోయిందంటే ఒకప్పుడు నిషిగంధ అంటే కార్తీక గుర్తొచ్చే నాకు ఆ మర్యాద, గౌరవం అన్నీ పక్కకి పోయి నేను ఎదురు తనని బెదిరించే స్థాయికి వచ్చేసాను. మరేం చేస్తాం చెప్పండి. బాగా గారం చేసి పాడు చేసేవాళ్ళదే బాధ్యతంతా, నేనే పాపమూ ఎరుగను. ;-) కాంతి గారు, నిషి ముందు నుంచే మంచి స్నేహితులవడం, తర్వాత నాకు వీళ్ళిద్దరితో స్నేహం కలవడంతో ట్రయాంగిల్ ఫ్రెండ్షిప్ స్టోరీ అయిందన్నమాట కథ! అసలు వీళ్ళిద్దరూ నన్నెంత గారం చేస్తుంటారంటే నా గురించి వీళ్ళిద్దరి మాటలు వింటే నేనెవరో కిండర్ గార్డెన్ కి వెళ్ళే పిల్లనేమో అనుకోగలరు ఎవరైనా. పొద్దున్నే ఎనిమిదింటికి నిద్ర లేచాను తెలుసా అంటే అయ్యో తల్లీ ఎనిమిదింటికే నిద్ర లేచావామ్మా నిద్ర సరిపోయిందా అని అడిగే టైపన్నమాట. ఎప్పుడన్నా మాటల్లో ఏదన్నా వస్తువు బాగుందంటే చాలు ఏదో చిన్నపిల్లలకి బొమ్మలు కొనిచ్చినట్టు చిటుక్కున పంపించేస్తారు. ఎవరికి ఎప్పుడు ఏం కొన్నా +1 లాగా ప్రతీసారీ పక్కన నాకుండాలి. నేనేది చేసినా అద్భుతం కంటే ఒక్క మెట్టు కూడా కిందకి దిగి రారన్నమాట. అయితే నాలో అంత గొప్పతనమూ, అద్భుతమూ లేవని నాకు తెలిసినా సరే వాళ్ళు చెప్పేవన్నీ అబద్ధాలు కావు, నిజాలే! ఎందుకంటే ఆ అద్భుతం వాళ్ళకి నా మీదున్న ప్రేమలో ఉంది. అందుకని వాళ్ళ కళ్ళలోంచి నేనెప్పుడూ అలానే కనిపిస్తుంటాను. నాది భలే అదృష్టం కదూ! :-)

ఊ.. ఇప్పుడు మనం ఫ్లాష్ బ్యాక్ లోంచి రింగులు తిప్పుకుంటూ మళ్ళీ మన San Francisco ట్రిప్ దగ్గరికి వస్తే టికెట్స్ బుక్ చేసుకునే ముందు మన నిషి మాత గారి వీలు తెలుసుకోవాలన్నమాట. తనకి అస్సలే మాత్రం ఛాయిస్ లేకుండా ఇలా నేను జూన్ రెండో వారంలో మాత్రమే రాగలను. ఈసారికి మీ ఊరి వైపు రాలేను కాబట్టి నువ్వే శాన్ ఫ్రాన్సిస్కో రాగలవా, నువ్వు ఏ సంగతీ చెప్తే దాన్ని బట్టి ట్రిప్ సంగతి ఆలోచిద్దాం అని మెయిల్ రాసాను. తను వెంటనే అదేంటీ మా ఊరికి రావా అని ఒక్క ఎదురు ప్రశ్న కూడా వెయ్యకుండా ఆ టైంలో మాకు చాలా బిజీ ఉంటుంది ఆఫీసులో. అయినాసరే నువ్వింకేం ఆలోచించకుండా టికెట్స్ బుక్ చేసెయ్. అంతగా సెలవులు తీసుకోవడం కుదరకపోతే నేను వీకెండ్ రెండు రోజుల కోసమైనా వస్తాను అని చాలా సంబరంగా రిప్లై ఇచ్చింది. అలా రెండు రోజులు వచ్చి పోడానికి తను ఉండేది కాలిఫోర్నియాలో కాదు. అమెరికాకి ఇంకో పక్క నుంచి ఆరేడు గంటలు పైగా ఫ్లైట్ జర్నీ చేసి రావాలి. అయినా సరే నిమిషం కన్నా ఎక్కువ ఆలోచించకుండా, నువ్విలా చెయ్యొచ్చు కదా అనో, చెయ్యలేదు ఎందుకనో ఒక్క ఎదురు ప్రశ్న కూడా వెయ్యకుండా సరేనంది. ఎందుకలా.. అంటే మరి తను నిషిగంధ కదా.. అందుకే అలా! :-)

నేను నిషి ఊ.. అన్నాక కాంతి గారితో ఇంకో నాలుగు వారాల్లో నేనూ, నిషీ మీ ముందుండాం అనుకుంటున్నాం.. మరి మీరేవంటారు? అని అడిగాను. రోజూ అడిగే అడిగే అప్పుడే రెండు రోజుల నుంచీ అడగడం మానేసారేమో నేను చెప్పింది నిజమేనా అని నమ్మడానికి కాసేపు పట్టింది కాంతి గారికి. నిజ్జంగా నిజమేనని చెప్పి టికెట్స్ బుక్ చెయ్యగానే డేట్స్ చెప్తాను. నేను బుక్ చేసాక నిషి కూడా చేస్తుంది అని చెప్పాను. ఆ రోజు ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయిపోయి మా ముగ్గురిలో ఎవరికీ నిద్ర పట్టలేదని తెల్లారి చెప్పుకున్నాం. తర్వాత రెండు మూడు రోజుల్లో నేను టికెట్స్ బుక్ చేసాక నిషి కూడా చేసేసింది. ఇంక అప్పటి నుంచీ మూడు వారాల తర్వాత ఈ రోజు ఏం చేస్తూ ఉంటామో అని రోజూ ఊహించుకుంటూ, కలలు కంటూ, తెల్లారాక రాత్రి నాకేం కలొచ్చిందో తెల్సా అని చెప్పుకుంటూ అలా అలా మూడు వారాలు గడిచిపోయాయి.

ప్రయాణం ఇంకో వారంలోకి వచ్చాక నాకు ఉన్నట్టుండి ఇంటి మీద, ఇంటబ్బాయ్ మీద బెంగొచ్చేసింది తన కన్నా ముందే ఊరెళ్ళిపోతున్నానని. తనతో పాటు సిడ్నీకి వెళ్ళడం లేదుగా అని మళ్ళీ ఇంకో దిగులు. ఏదో సామెత చెప్పినట్టు భరించాల్సిన బాధ్యత ఉన్నవాళ్ళకి తప్పదు కదా పాపం. అందరిళ్ళలోలా కాకుండా మా ఇంట్లో ఎప్పుడూ రివర్స్ సర్దిచెప్పడాలు ఉంటాయన్నమాట. రెండు వారాలే కదా.. ఇప్పుడిలా అంటున్నావ్ గానీ ఒక్కసారి మీ ఫ్రెండ్స్ ని చూడగానే నన్నూ, ఇంటినే కాదు, నీ రీసెర్చ్ టాపిక్ ఏంటో కూడా మర్చిపోతావ్.. ఏం పర్లేదు, అయాం ష్యూర్ యు

విల్ హేవ్ ఎ గ్రేట్ టైం దేర్ అని చెప్పాడు. బయలుదేరే ముందు వచ్చిన శనివారం రోజు బోల్డు కష్టపడి నాతో పాటు ఎండలో తిరిగి తనకస్సలు ఇష్టం లేని షాపింగ్ పనిలో కూడా హెల్ప్ చేసాడు మా ఇంటబ్బాయ్. :-)

ఇంకేముంది... తర్వాతి పేజీ ప్రయాణమే.. About to take off to San Francisco... I'm all excited!






## My San Francisco Diary – 3

**12.06.2013**

**బుధవారం**

ఎప్పట్లాగే తెల్లారి పొద్దున్న ప్రయాణం ఉందనేసరికి ముందు రోజు రాత్రి నాకు రకరకాల ఆలోచనలతో సరిగ్గా నిద్ర పట్టలేదు. ఉదయం 9:50 కి నా ఫ్లైట్ టైం అయినా సరే ముందు రోజు రాత్రి ఆన్లైన్ చెకిన్ చేసేసాను కదాని ఎయిర్పోర్టుకి కాస్త ఆలస్యంగానే బయలుదేరాము. లగేజ్ చెకిన్ కౌంటర్ దగ్గరికి వెళ్ళేసరికి దాదాపు ఎనిమిదిన్నర కావొస్తోంది. అక్కడ కౌంటర్లో ఉన్న అమ్మాయి బోర్డింగ్ పాస్ ఇచ్చే ముందు చిన్నపాటి ఇంటర్వ్యూ చేసింది. నువ్వెప్పుడు జర్మనీ వచ్చావు, ఎన్నేళ్ళ నుంచి ఉన్నావు, ఏం ఉద్యోగం చేస్తావు, ఏయే ఊర్లలో ఉన్నావు, అమెరికాలో ఎక్కడికి

వెళ్తున్నావు, ఎందుకు వెళ్తున్నావు వగైరా ప్రశ్నలన్నీ ఒక పావుగంట సేపు అడిగి నేను చెప్పిన సమాధానాలన్నీ ఒక పేపర్ మీద రాసుకుంది. అమెరికాలో అడుగు పెట్టక ముందే ఇక్కడి నుంచే స్పెషల్ ట్రీట్మెంట్ మొదలవుతుందని ముందే సౌమ్య చెప్పి ఉండటం వల్ల నేనేం కంగారు పడలేదు. లగేజ్ చెకిన్ అయిపోయి, సెక్యూరిటీ చెక్ కూడా అయిపోయి లోపలికి వెళ్ళేదాకా నన్ను జాగ్రత్తగా చూసుకుని ఇంకప్పుడు టాటా చెప్పేసి మా ఇంటబ్బాయ్ వెళ్ళిపోయాడు. బోర్డింగ్ గేట్ దగ్గరికి వెళ్ళేసరికి అప్పటికే బోర్డింగ్ మొదలైపోయి పెద్ద క్యూ ఉంది. మళ్ళీ అక్కడ కూడా ఓ నాలుగైదు ప్రశ్నలడిగి ఫ్లైట్లోకి పంపిస్తున్నారు. ఫ్లైట్లోకి వెళ్ళి కూర్చున్నాక అంతా బానే అయింది, నేను ఎగరడానికి రెక్కలు సిద్ధం అని చెప్పాల్సిన వాళ్ళందరికీ ఫోన్లో నుంచి మెయిల్స్ పెట్టేసి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసేసాను.

నేను ఎక్కిన డెల్టా ఎయిర్ లైన్స్ విమానం పది గంటల పైన ప్రయాణం చేసి నన్ను అట్లాంటా నగరానికి చేరుస్తుంది. ఇప్పటిదాకా ఎప్పుడూ పది గంటల సేపు ఒకే ఫ్లైట్లో కూర్చోలేదు, అన్ని గంటలు ఎలా గడుస్తాయో అనుకుంటూ కిటికీలోంచి పగటి వెలుగులో ఆకుపచ్చగా మెరిసిపోతున్న ఐరోపా ఖండపు అందాలని, ఇంద్రనీలంలా కాంతులు విరజిమ్ముతున్న అట్లాంటిక్ మహా సముద్రపు నయగారాన్నీ చూస్తూ అసలు ఇంతందంగా ఈ భూమిని ఎవరు సృష్టించారో, ఈ మబ్బుల్ని, నీలాకాశాన్నీ దాటుకుని అనంత విశ్వంలోకి వెళ్తే ఇంకా ఏమేం కనిపిస్తాయో అని రకరకాల ఆలోచనలు, ఊహలు చుట్టుముట్టేసరికి చాలా సమయం గడిచిపోయింది. తర్వాత చెవిలో పాటలు పెట్టుకుని లత 'మోహన వంశీ' పుస్తకం చేతిలో పట్టుకున్నాను. కృష్ణుడిని తల్చుకోడమంటే మనకి మహదానందం కాబట్టి కృష్ణమాయలో పడి అప్పుడప్పుడూ నిద్రలోకి జారిపోతూ మళ్ళీ లేస్తూ కృష్ణుడి కథ చదూకుంటూ పది గంటలు తొందరగానే గడిచిపోయాయనిపించింది.


మబ్బుల పల్లకీ ఎక్కి మది కోరిన తీరాలకి ప్రయాణం..

నేను ఎక్కిన విమానం హార్ట్స్ ఫీల్డ్ - జాక్సన్ అట్లాంటా ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ లో దిగేసరికి లోకల్ టైం ప్రకారం మధ్యాహ్నం రెండు గంటలైంది. ఎయిర్పోర్ట్ లో వాతావరణం చూడగానే నాకు అమెరికాకి, జర్మనీకి తేడా తెలిసినట్టనిపించింది. మా ఊరి ఎయిర్పోర్ట్ లో జనాలు ఎక్కువ ఉన్నాసరే ఎప్పుడూ అదొకలాంటి నిశబ్దమైన వాతావరణం ఉంటుంది. జనాల మాటలు, నవ్వులు బిగ్గరగా వినపడవు. అందరూ మెల్లగా మాట్లాడుకుంటూ ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటున్నట్టు కనపడతారు. అదే అట్లాంటా ఎయిర్పోర్ట్ లో అయితే సెక్యూరిటీ చెక్ క్యూ లో నించుంటే ఎంతమంది అప్పటికప్పుడు పరిచయాలు చేసేసుకుని ఏదో ఒక కాలక్షేపం కబుర్లు మాట్లాడుకుంటూ కనిపించారో! అక్కడున్న ఎయిర్పోర్ట్ స్టాఫ్ కూడా సరదాగా జోకులేస్తూ మాట్లాడుతూనే ఉన్నారు. జర్మన్లు వాళ్ళ విధుల్ని వాళ్ళు చక్కగా నిర్వర్తిస్తారు కానీ కొత్తవారితో అంత ఎక్కువ మాట్లాడరు. అవసరమైనంత మేరకే మాట్లాడతారు. అట్లాంటా ఎయిర్పోర్ట్ చాలా పెద్దది. ఫ్లైట్ లాండ్ అయిన దగ్గరినుంచీ చుట్టూ ఎటు చూసినా అట్లాంటాస్ హోమ్ ఎయిర్ లైన్స్ డెల్టా అని మహా గర్వంగా ప్రతీ చోటా రాసేసుకున్నారు. భలే అనిపించింది అది చూసి. ఏ విషయంలోనైనా ఇలా వారి గొప్పతనాన్ని ఇలా గర్వంగా ప్రకటించుకోడం అమెరికా ప్రత్యేకతేమో అనిపిస్తుంది. జర్మనీలో, ఇతర యూరోపియన్ దేశాల్లో తక్కువగా కనిపిస్తుంది ఇది. అంటే నా ఉద్దేశ్యం అమెరికన్స్ కి వారిదంటూ ఒక ప్రత్యేకమైన ఎక్స్ప్రెషన్, స్టైల్ ఉంటుందనిపిస్తుంది ఈ విషయంలో. :-)


విమానంలో నుంచి జర్మనీ

అట్లాంటా నుంచి శాన్ ఫ్రాన్సిస్కో కి వెళ్ళే విమానం బయలుదేరడానికి రెండు గంటల పైనే సమయం ఉంది. కస్టమ్స్ క్లియరెన్స్ దగ్గర చాలానే ప్రశ్నలడిగారు. ఎందుకొచ్చారు, ఎవరి దగ్గరికొచ్చారు, వాళ్ళు ఎలా స్నేహితులయ్యారు, ఇదివరకు మీరెప్పుడు కలిసారు, ఇప్పటిదాకా

ఎందుకు రాలేదు వగైరా చాలాసేపు అడుగుతూనే ఉన్నాడు కస్టమ్స్ ఆఫీసర్. కాసేపయ్యాక జర్మనీలో ఏం చేస్తుంటావు అంటే సైంటిస్ట్ ని అని చెప్తే "ఓహ్, యు మస్ట్ బి వెరీ స్మార్ట్ దెన్.." అని నవ్వి ఇంక వెళ్ళమన్నాడు. ఓహో.. సైంటిస్టుల మీద బానే నమ్మకం ఉందన్నమాట అని నవ్వొచ్చింది. కస్టమ్స్ క్లియరెన్స్ అయిపోయి, లగేజ్ తీసుకుని మళ్ళీ శాన్ఫ్రాన్సిస్కో వెళ్ళే ఫ్లైట్ కౌంటర్ దగ్గర అప్పగించి లోకల్ ఫ్లైట్స్ టెర్మినల్ కి అండర్ గ్రౌండ్ ట్రైన్లో వెళ్ళేసరికి గంట పైనే పట్టింది. మళ్ళీ కాసేపు పుస్తకం చదువుకుంటూ కూర్చున్నాక శాన్ ఫ్రాన్సిస్కో ఫ్లైట్ బోర్డింగ్ మొదలైంది. లోపలికెళ్ళాక ముందు ఫ్లైట్ కీ, దీనికీ బాగా తేడా తెలిసింది. ఎందుకో ఎప్పుడూ యూరప్లో తిరిగే ఫ్లైట్స్ మంచివి కొత్తవి ఉంటాయనిపిస్తుంది. మనకి తినే ఆసక్తి ఉందా లేదా అనే విషయం పక్కన పెడితే ఈ లోకల్ ఫ్లైట్లో ఐదు గంటల ప్రయాణానికి సింపుల్ గా స్నాక్స్, సాండ్ విచ్ పెట్టాడు. అట్లాంటా నుంచి శాన్ఫ్రాన్సిస్కోకి ఐదు గంటల ప్రయాణం. అప్పటికి అలసట తెలిసొచ్చి, అబ్బా.. ఈ ఐదు గంటలు ఎప్పుడు గడుస్తాయో కదాని చాలా అసహనంగా అనిపించింది. నిద్ర పోడానికి చాలా కష్టపడ్డాను కానీ ఎంత బతిమాలినా నిద్ర రానని మొండికేసింది.

విమానంలోంచి భూమిని దూరం నుంచీ గమనించడం భలే ఆసక్తికరంగా ఉంటుంది. యూరోప్ మీదుగా ఎగురుతున్నప్పుడు చలికాలంలో అయితే పూర్తిగా మంచు కప్పేసిన తెల్లటి ఆల్ప్స్ పర్వతాలతో, మధ్య మధ్యన నీరు పూర్తిగా గడ్డ కట్టుకుపోయిన నదులు, సరస్సులతో కనిపిస్తే, ఎండాకాలంలో ఎటు చూసినా ఆకుపచ్చగా మెరిసిపోయే కొండలు, పొలాలతో అంతా పచ్చ పచ్చగా కనిపిస్తూ మధ్యలో ఊర్లు ఉన్న చోట ఎర్రటి పెంకుల ఇళ్ళు ఎక్కువ కనిపిస్తుంటాయి. దుబాయి లాంటి ప్రదేశాల మీదుగా చూసినప్పుడేమో విశాలమైన ఇసుక ఎడారులు, పెద్ద పెద్ద స్కై స్క్రాపర్స్ తో ఇంకొక రకంగా ఉంటుంది. మన హైదరాబాదేమో చిన్నపిల్లల ఆట వస్తువులన్నీ తీసుకొచ్చి ఒక పెద్ద కుప్పలా పోసినట్టు భలే కనిపిస్తుంది బొమ్మలు బొమ్మల్లాగా. అమెరికా ఏమో వీటన్నిటికీ భిన్నంగా కనిపించింది నా కళ్ళకి. బోల్డు ఎక్కువ రోడ్లూ, వందల కొద్దీ పార్క్ చేసిన కార్లు, ఇళ్ళు ఉన్న విధానం కూడా వేరేలా ఉంది. చక్కగా వరసల్లో ఒకేలాంటి బొమ్మరిళ్ళు కట్టినట్టు భలే ఉన్నాయి. కొన్ని చోట్ల అంతా ఆకుపచ్చగా కనిపించినా అది యూరోప్ లా కాకుండా ఇంకో రకంగా ఉంది. పెద్ద పెద్ద రాతి కొండలు, పర్వతాలు, ఎడారులు, సన్నగా పాయల్లా కనిపించే నదులు, శాన్ ఫ్రాన్సిస్కో దగ్గరికి రాగానే అదేదో సముద్రం లాంటిది.. ఏంటో ఆ ఐదు గంటల ప్రయాణంలోనే చాలా వైవిధ్యం ఉన్న భూభాగాలు కనిపించేసాయి. మొత్తానికి ఎలాగైతేనేం అలా దిక్కులు చూస్తూ, ఇంకా ఎన్ని మైళ్ళు వెళ్ళాలో విమానం మ్యాప్లో చూసుకుంటూ ఎలాగో ఐదు గంటలు గడిపేసాను.



ఆకాశంలో నుంచి అమెరికా.. :-)

శాన్ ఫ్రాన్సిస్కో లోకల్ టైం ప్రకారం సాయంత్రం ఆరున్నర గంటలకి విమానం నన్ను భద్రంగా తీసుకెళ్ళి కాంతి గారి ముందు నిలబెట్టేసింది. నిజానికి విమానం దిగాక చెకింగ్లు ఏమీ లేకపోయినా లగేజ్ తీసుకుని వెళ్ళేసరికి కాస్తైనా టైం పడుతుందనుకున్నాను. తీరా చూస్తే ఇలా దిగేసి అలా కొంచెం నడిచి ఒక ఎస్కలేటర్ మీద నుంచీ దిగుతుంటే కింద కాంతి గారు, కిరణ్ ప్రభ గారు కనిపించేశారు ఎదురుగ్గా! ఒక్క క్షణం "కనిపించేసారోచ్.." అని గాల్లో తేలిపోయినట్టు అనిపించినా మరుక్షణంలో నేనింకా నా లగేజ్ తీసుకోలేదు కదా, తప్పు దారిలో వచ్చానా ఏంటీ అని సందేహం కూడా వచ్చింది. ఈ లోపు మొదటి రోజు స్కూలుకి పంపించిన పిల్ల కోసం స్కూలు బయట నించుని ఎదురు చూస్తున్నట్టు నించున్న కాంతి గారు నన్ను చూసి "అదిగో మధుర.." అని పరిగెత్తుకుంటూ అరక్షణంలో నా దగ్గరికొచ్చి రెండు చేతులతో నన్ను చుట్టేసారు. నిజంగా స్కూలు ముందు అయ్యుంటే ఎత్తుకునే పని కానీ నేనింత పెద్దైపోయాను కాబట్టి కుదర్లేదన్నమాట. :-) కిరణ్ ప్రభ గారు మాత్రం వెంటనే మా దగ్గరికి రాకుండా మాఇద్దరి ఉద్వేగాన్ని, సంబరాన్ని తన బ్లాక్ బెర్రీలో బంధించే ప్రయత్నం చేసారు. కాంతి గారి మొదటి మాట ఏంటంటే.. "ఇంత దూరం ప్రయాణం చేసి నువ్వెంత వడలిపోయి వస్తావో అని రాత్రి నుంచీ విపరీతంగా టెన్షన్ పడిపోతున్నాను. అప్పుడు ఇండియా ప్రయాణానికే అలా నీరసపడిపోయావు కదా.. అమెరికా ఇంకా దూరం కదాని చాలా కంగారుగా అనిపించింది. హమ్మయ్యా మొహం కాస్త బానే ఉంది. నాకిప్పుడు ధైర్యం వచ్చింది" అన్నారు. వెంటనే కిరణ్ ప్రభ గారు

వచ్చి "ఉదయం నుంచీ ఇదే కంగారు, తన కంగారు చూసి నేను కూడా కంగారు పడ్డాను" అని నవ్వించారు. వెంటనే ఇంకా నేను లగేజ్ తీస్కోలేదు అంటే లగేజ్ కోసం అందరం కలిసి వెళ్ళొచ్చు అన్నారు. ఇంతలో కాంతి గారు "లగేజ్ సంగతి తర్వాత అసలీ జుట్టేంటి ఇలా చేసావ్? బంగారంలాంటి జుట్టంతా ఏమైపోయింది? ఈ పిచ్చి పిలక వచ్చిందేంటి? అసలు నీకెలా మనసొప్పింది....." అంటూ ప్రైవేటు మొదలెట్టేసరికి ఒక్కక్షణం నేను ఇండియా వచ్చానా అమెరికా వచ్చానా అని సందేహం వచ్చింది నాకు. ఎందుకంటే జుట్టు విషయంలో ఏమన్నా తేడాలొస్తే మా అమ్మ కూడా ఇవే అక్షింతలు వేస్తుంటుంది. అది కూడా ఒక్కసారి కాదు, కళ్ళ ముందు ఉన్నన్ని రోజులు రోజూ టిఫిను, అన్నం పెట్టినట్టు పూటకోసారి ఉంటుంది జుట్టు గురించి ప్రైవేట్ క్లాస్.. :-) సరే మొత్తానికి ముగ్గురం కలిసి వెళ్ళి లగేజ్ కలక్ట్ చేసుకుని పార్కింగ్ లోకి వెళ్ళి కారు తీసుకుని ఇంటికి బయలుదేరాం. కార్లో ఎక్కగానే "ఇదిగో నీ కోసం తెచ్చిన ఫోన్ సిమ్ కార్డ్. ఫోన్ చేతిలో పెట్టుకో. నీకే ఫోన్లు వచ్చేస్తాయి" అన్నారు. అబ్బా అప్పుడే ఎవరు చేస్తార్లెండి మరీనూ.. అన్నానో లేదో కాసేపట్లో నిషి ఫోన్ చేసింది. "నిషీ.. నేనొచ్చేసా!" గట్టిగ్గా అని అరిచేసరికి "గొంతు బ్రహ్మాండంగా వినిపిస్తుందిగా.. హమ్మయ్యా బానే ఉన్నావన్నమాట.. ఇంక నేను ప్రశాంతంగా నిద్రపోవచ్చు" అంది నిషి. తనకి పడుకునే టైం అవుతోందని మరీ ఎక్కువసేపు మాట్లాడకుండా టాటా చెప్పేసాం.

శాన్ ఫ్రాన్సిస్కో ఎయిర్పోర్ట్ నుంచీ డబ్లిన్ వెళ్ళడానికి San Mateo bridge దాటి వెళ్ళాలి. ఆ వంతెన పక్కనే చాలా తక్కువ ఎత్తులో నీళ్ళు కనిపిస్తుంటే చూసి "ఇదేనా మీ ఊరి సముద్రం.. భలే ఉంది కదా.. ఫ్లైట్లో నుంచి కూడా కనిపించింది. అయినా నీళ్ళు ఇంత పైకి ఉంటే ఎలా వంతెన మీదకి వచ్చెయ్యవా?" అని చాలా ఆశ్చర్యంగా అడిగాను. కిరణ్ ప్రభ గారు నవ్వి, "అది సముద్రం కాదమ్మా.. దాన్ని 'బే' అంటారు. ఎప్పుడూ ఇలానే ఉంటుంది. ఇప్పటిదాకా అయితే నువ్వన్నట్టు పొంగలేదు మరి.. ఎంతసేపూ ఆ నీళ్ళ వంకే కాకుండా ఎదురుగా చూడు ఒకసారి. వంతెన అలా గాల్లోకి పైకి వెళుతూ ఆకాశానికి వేసిన నిచ్చెన లాగా ఉంటుంది. అక్కడికి వెళ్ళాక మళ్ళీ కిందకి దిగుతాం మనం. మన ఊరు ఇంకా కొన్ని వేరే ఊర్లని కూడా కలిపి 'బే ఏరియా' అని పిలుస్తారు" అని చెప్పారు. నిజంగానే ఆ వంతెన మీద వెళుతూ అలా చూస్తుంటే చుట్టూ నీళ్ళు, ఏదో ఎక్కడో మబ్బుల చాటున దాగున్న లోకాలకి వేసిన దారి లాగా భలే కనిపించింది. తర్వాత ఆ దారిలో బోల్డన్ని సార్లు తిరిగాక మనింటికి వెళ్ళే దారి కాబట్టి స్వర్గలోకపు ముఖద్వారం అని పేరు పెట్టేసాను నేను. :-)

ఎయిర్పోర్ట్ నుంచి ఇంటికి వెళ్ళేసరికి సాయంత్రం ఏడున్నర దాటింది. ఇంకా అప్పటికి సూర్యాస్తమయపు ఛాయలు మొదలవలేదు. ఇంటికి దగ్గరలోకి వెళ్ళేసరికి అక్కడున్న 'రీగల్ సినిమాస్' థియేటర్ చూపించి "ఇది వచ్చిందంటే మనింటికి వచ్చేసినట్టే.." అని చెప్పారు కాంతి గారు. అప్పటి నుంచీ ప్రతి రోజూ అక్కడికి

రాగానే "కాంతి గారూ.. రీగల్ సినిమాస్ వచ్చింది కదా అంటే మనింటికి వచ్చేసినట్టే.. మీరు బాగా గుర్తు పెట్టుకోండి.." అని చెప్పేదాన్ని. :-)

ఇంట్లోకి అడుగు పెట్టగానే "ఆహ్.. మొత్తానికి ఖండాలు దాటి, సముద్రాన్ని దాటుకుని ఇంత దూరం ప్రయాణించి అలసిపోయాక చివరికి ఇంట్లోకొచ్చిపడ్డాను. ఇప్పుడు ప్రాణానికి ఎంత హాయిగా ఉందో కదా.." అనిపించింది. గోరువెచ్చటి నీళ్ళు సగం అలసటని మాయం చేసాక ముందు అర్జెంటుగా నా కోసం ఎదురు చూసే వాళ్ళందరికీ క్షేమంగా ఇల్లు చేరానని మెయిల్స్ పెట్టేసాను. కాంతి గారు వేడి వేడిగా మూడు నాలుగు రకాల కూరలతో అన్నం పెట్టారు కానీ అప్పుడు సరిగ్గా తినబుద్ధి కాలేదు. ఈ లోపు కాంతి గారి బంధువులు పద్మ గారు ఫోన్ చేసి నాతో కూడా మాట్లాడారు. అదే మొదటిసారి మాట్లాడటం అయినా "ఆంటీ మీ కోసం ఎన్ని రోజుల నుంచీ ఎదురు చూస్తున్నారో, తన ఎక్సైట్మెంట్ చూస్తూ మేము కూడా ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాం మీకోసం" అని చెప్తే నాకేం చెప్పాలో తెలీలేదు. తర్వాత చిమట శ్రీని గారు కాల్ చేసి "మా బే ఏరియాకి స్వాగతమండీ.. మీతో నేరుగా ఎప్పుడూ మాట్లాడకపోయినా నిషిగంధ గారి ద్వారా మీ కబుర్లు తెలుస్తూ ఉంటాయి. తను కూడా వచ్చాక మనం తప్పకుండా కలుద్దాం" అని చెప్పారు. పాత పాటల పర్ణశాల 'చిమట మ్యూజిక్' సైట్ తెలీని తెలుగు పాటల ప్రేమికులు ఉండరంటే అతిశయోక్తి కాదు కదా! నాకు కూడా అలా ఆ వెబ్సైట్ తెలుసు గానీ దాని వెనకున్న శ్రీని గారితో పరిచయం లేదు. 2011 లో మొదటిసారి ఆయనే స్వయంగా నన్ను పలకరించి "మీ బ్లాగు చూస్తుంటాను. చాలా బాగా రాస్తున్నారు. మీ బ్లాగ్ లింక్ మా చిమట సైట్లో పెడతాను" అని అడిగారు. "నా అక్షరాలకి అంత గొప్ప గౌరవం ఇస్తానంటే మహదానందం కదండీ" అని సరేనన్నాను. అప్పటి నుంచీ ఉన్న పరిచయం కొద్దీ ఇప్పుడు వాళ్ళ ఊరికి వచ్చానని నాకు సాదరంగా స్వాగతం చెప్పారన్నమాట. నేను శ్రీని గారితో ఫోన్ మాట్లాడి వచ్చేసరికి కాంతి గారు, కిరణ్ ప్రభ గారూ రామజోగయ్య శాస్త్రి గారితోనూ, వారి శ్రీమతి గారితోనూ వీడియో చాట్లో మాట్లాడుతున్నారు. అంతకు ముందు వారమే వాళ్ళు ఇక్కడికి వచ్చి వెళ్ళారట. నన్ను పిలిచి "తనేనండీ మధుర.. ఇందాకే ఎయిర్పోర్ట్ నుంచి తీసుకొచ్చాం" అని బోల్డు సంబరంగా చూపించారు. దానికే నేను ఆశ్చర్యపోతుంటే "పోయిన వారం మీ గురించి చాలా చెప్పారండీ. ఎంతగా ఎదురు చూస్తున్నారో మీ కోసం" అని ఆవిడ కూడా చెప్తుంటే నాకు మళ్ళీ బదులివ్వడానికి మాటలు కరువయ్యాయి. అక్కడ ఉన్నన్ని రోజులూ రోజూ ఎవరో ఒకరు ఇవే మాటలు చెప్పీ చెప్పీ నాకైతే ఆశ్చర్యమో ఆనందమో తెలీని ఏదో భావం కలిగింది. వీళ్ళందరికీ కాంతి గారు నా గురించి ఎంతలా చెప్పి ఉంటే వాళ్ళు అంతిదిగా గుర్తుంచుకుని అడుగుతారు అనిపించింది. హ్మ్.. కొంతమంది మనలో ఏ గొప్పతనమూ లేకపోయినా వాళ్ళకున్న స్వచ్ఛమైన మనసుతో మనల్ని గొప్పగా ప్రేమించగలరు. అలాంటి నేస్తాలు దొరకడం మన అదృష్టం అనుకోవడం తప్ప ఇంకేం అనుకోవాలో తోచదు!

అసలు పన్నెండో తారీఖు ఉదయం జర్మనీలో నిద్ర లేచి ఇంట్లోనే ఎనిమిదింటి దాకా ఉండి తర్వాత విమానాలు ఎక్కేసి ఇంత దూరంలో ఉన్న అమెరికా వచ్చేసినా ఇంకా ఇప్పుడు పన్నెండో తారీఖు రాత్రేనా... ఒక్క రోజులో ఇంత జరిగిపోయిందా.. ఏదో ఎన్నో రోజులు ప్రయాణించి చాలా దూరం వచ్చేసి ఏదో కొత్త లోకంలో ఉన్నట్టు చిత్రంగా అనిపించింది. "కబుర్లన్నీ రేపటి నుంచీ చెప్పుకుందాం గానీ ఇవాల్టికి హాయిగా నిద్రపోమ్మా.." అని గబగబా పడుకోబెట్టేసారు కాంతి గారు. కిటికీకున్న బ్లైండ్స్ సందుల్లోంచి కనిపిస్తున్న వీధి దీపం కాంతినీ, ఆ వెలుతురులో మెరుస్తున్న పచ్చటి ఆకులున్న పెద్ద చెట్టునీ, ఆకాశంలో వెలుగుతున్న చందమామనీ చూస్తూ.... అలా అలవోకగా నిద్రలోకి జారిపోయాను.

## My San Francisco Diary – 4

## 13.06.2013

## గురువారం

భూగోళానికి ఓ పక్కనుంచీ ఇంకో పక్కకి ఎగిరొచ్చేసాను కదా.. అకస్మాత్తుగా స్థలకాలాల్లో వచ్చిన మార్పు, ప్రయాణం మోసుకొచ్చిన అలసట వల్ల కమ్ముకొచ్చిన మగత రెండూ కలిసిపోయిన కలత నిద్ర నన్ను ఏదో లోకాల్లోకి లాక్కెళ్ళి పోయింది. కిటికీ బయటున్న చెట్ల ఆకులు గాలికి చేసే శబ్దాలు వినిపిస్తూ, ఉదయపు కాంతో, వెన్నెల వెలుగో తేడా తెలీనట్టు, అసలు నేనెక్కడున్నానో తెలీని అయోమయంలో ఏదో కల లీలగా మెదిలి కలవరపెట్టేసరికి నిద్ర తేలిపోయి మెలకువొచ్చేసింది. లేచి టైము చూస్తే తెల్లవారుజాము నాలుగున్నర అయ్యింది. మళ్ళీ ఎంతసేపటికీ నిద్ర రాక రాత్రి కాంతి గారు ఫేస్ బుక్లో ఫొటోస్ పెట్టానని చెప్పిన విషయం జ్ఞాపకానికొచ్చి సరే అదన్నా చూద్దాం కదాని లాప్ టాప్ ముందేసుకున్నాను. నాకోసం ఎదురుచూస్తున్నానని వేసిన పోస్టుకి, ఎయిర్ పోర్ట్లో తీసిన ఫొటోస్ కి రమణి గారు, ఉమ గారు, పద్మవల్లి గారు, నిషి వాళ్ళందరూ పెట్టిన కామెంట్స్ చూసి రిప్లై రాస్తే "ఏంటీ.. నిద్రపట్టడం లేదా?" అని అడిగి నవ్వింది నిషి. కాసేపు ఫేస్బుక్లో అటూ ఇటూ దిక్కులు చూసి మళ్ళీ నిద్ర పోదామని ప్రయత్నించి కుదరక ఇంక లేచి కిందకొచ్చేసాను. కాంతి గారు అప్పటికే కిచెన్లో వంట పని మొదలుపెట్టేసారు. నన్ను మెట్ల మీద నుంచి చూసే "లేచావా తల్లీ.. ఇంకాసేపు పడుకోవాల్సిందిగా" అంటే నిద్ర పట్టట్లేదని చెప్పాను. అమ్మా వాళ్ళకి ఫోన్ చేస్తానంటే

ఫోన్ తెచ్చిచ్చారు. నాన్న ఫోన్ కి చేస్తే బిజీ వచ్చింది. అప్పుడే కిరణ్ ప్రభ గారు మార్నింగ్ వాక్ నుంచి వచ్చారు. ఉదయాన్నే మనింటి పక్కనున్న పార్కులో వాకింగ్ కి వెళ్ళడం చాలా బాగుంటుంది. రేపటి నుంచీ నువ్వు కూడా వస్తావా తల్లీ" అన్నారు. కాంతి గారు నాకు చాన్స్ ఇవ్వకుండా "పిల్లని అప్పుడే వాకింగులూ అవీ అని పొద్దున్నే లేపకండి. నాలుగు రోజులు పోయాక వస్తుందిలే" అనేసారు. నేను మళ్ళీ నాన్నకి కాల్ చేద్దామనుకుంటే "ఫోన్లో రీడయల్ బటన్ ప్రెస్ చెయ్యమ్మా సరిపోతుంది" అన్నారు కాంతి గారు. అవతల ఫోన్ రింగ్ అయ్యి ఎత్తగానే నాన్న కాకుండా ఎవరో కొత్త గొంతు "హలో చెప్పండి కిరణ్ గారూ.." అన్నారు. దెబ్బకి నా నిద్ర మత్తు వదిలిపోయి వెంటనే నేను పొరపాటున రీడయల్ రెండు సార్లు నొక్కేసానేమో, రాత్రి చివరి కాల్ కిరణ్ ప్రభ గారు చంద్రబోస్ గారితో మాట్లాడారు కదా, ఇప్పుడు ఆయనకి వెళ్ళిపోయినట్టుంది కాల్ అని అర్థమయ్యి "ఒక్క నిమిషం ఉండండి.." అని చెప్పేసి పరిగెత్తుకెళ్ళి కిరణ్ ప్రభ గారికి ఫోన్ ఇచ్చేసి పొరపాటున చంద్రబోస్ గారికి చేసానని చెప్పాను. తర్వాత వాళ్ళు చాలాసేపే మాట్లాడుకున్నారు కానీ అలా నా వల్ల పొరపాటు జరిగినందుకు నాకు చాలా ఇబ్బందిగా అనిపించింది. "ఈ టైంకి నేను కాల్ చేస్తానని చంద్రబోస్ గారికి చెప్పాను. ఆయన ఎలాగూ నా కాల్ కోసం ఎదురుచూస్తున్నారు కాబట్టి ఏం పర్లేదులేమ్మా.." అని సర్దిచెప్పారు కిరణ్ ప్రభ గారు. తర్వాత అమ్మా వాళ్ళతో మాట్లాడాము. "మా అమ్మాయిని తెచ్చేసుకున్నామండీ.." అని కాంతి గారంటే అమ్మేమో "మాకేం బెంగ లేదులెండి.. జర్మనీలో కన్నా ఇక్కడుంటేనే అసలు పట్టించుకో అక్కర్లేదు. మీరుంటారు కదా అన్నీ చూస్కోడానికి" అంది. "అప్పుడు హైదరాబాదులో చూసినప్పటి కంటే రాత్రి చాలా నయమండి. బానే వచ్చింది..." అని మొదలుపెట్టి ఇంకా ఏదేదో సోది మాట్లాడుకున్నారు నా గురించి. :-) తమ్ముడేమో "నువ్వు అక్కడికెళ్ళి ఇలా మా అందరితో గంటలు గంటలు ఫోన్లో మాట్లాడతావా, మళ్ళీ జర్మనీ వచ్చేదాకా ఎక్కువ కాల్ చెయ్యకు. మీరు బాగా ఎంజాయ్ చెయ్యండి" అని వెంటనే ఫోన్ పెట్టేసాడు.

బ్రేక్ ఫాస్ట్ లో వేడి వేడి ఇడ్లీలు, నెయ్యిలో కారప్పొడి, అల్లం పచ్చడి వేసిస్తే ఆహా ఇండియా వెళ్ళిపోయినట్టుంది కదాని సంబరపడిపోతూ నేను కడుపు నిండా ఇడ్లీలు నింపేసరికి కాంతి గారు వంట పూర్తి చేసేసారు. రోజూ ఉదయాన్నే చకచకా ఓ గంటసేపట్లో రెండు మూడు కూరలు చేసేసి వంట పని ముగించేస్తారు కాంతి గారు. అందుకని తర్వాత రోజంతా తీరిగ్గా కబుర్లు చెప్పుకోడానికి మాకు బోల్డు టైముంటుంది. ఉదయం తొమ్మిదయ్యేసరికి కిరణ్ ప్రభ గారు ఆఫీసుకి వెళ్ళిపోతారు. ఇంక అప్పటినుంచీ మధ్యాహ్నం లంచ్ టైముకి ఆయనొచ్చేదాకా మాకసలు సమయం ఎలా గడిచేదో తెలిసేది కాదు. అలా అలా ఆపకుండా కబుర్ల ప్రవాహంలో అప్పుడే లంచ్ టైమయ్యిందా అనిపించేది. మా ఇద్దరి కబుర్లు కాకుండా ఫోన్ కబుర్లు కూడా ఉండేవి. అసలు నేను అమెరికా వస్తున్నాని చెప్పినప్పుడే మా మధ్యనున్న చనువు కొద్దీ "ఇప్పుడా పిల్లా చెప్పేది.." అని పోట్లాడారు పద్మవల్లి

గారు. నాకేమో ఈసారికి వాళ్ళ ఊరి వైపు వెళ్ళడం కుదరదు. నాకోసం ఇంత దూరం రావాలన్నా తనకీ వీలయ్యే పని కాదని తెలుసు కాబట్టి ఈ ట్రిప్లో పద్మవల్లి గారిని కలవడం మిస్సయిపోయాను. :-( కానీ, ఒకరకంగా అసలు మిస్సయినట్టే అనిపించలేదు. ఎందుకంటే దాదాపు ప్రతిరోజూ ఉదయాన్నే పద్మవల్లి గారు కాల్ చేసేవారు. ఏ రోజు ఏమేం చేసామని చెప్పి కనీసం ఓ గంటసేపన్నా సరదాగా కబుర్లు చెప్పుకునేవాళ్ళం. ఆ రోజు కూడా పద్మవల్లి గారితో మాట్లాడాక రమణి గారికి కాల్ చేసి మాట్లాడాము. ఎప్పట్లాగే రమణి గారు నేను తిన్న ఇడ్లీలు సగం అరిగిపోయేదాకా తెగ నవ్వించేసారు. తర్వాత పద్మజ గారితో మాట్లాడాము. "కాంతి గారి ఎక్సైట్మెంట్ ని మేము కూడా షేర్ చేసుకున్నాం. మీ ఇద్దరూ బాగా ఎంజాయ్ చెయ్యండి. ఫేస్బుక్లో ఫోటోస్ పోస్ట్ చేస్తూ ఉండండి. మనందరం ఒకేసారి కలుసుకోడానికి ఎప్పుడైనా ప్లాన్ చెయ్యాలి" అని చెప్పారు రమణి గారు, పద్మజ గారు. తర్వాత నిషితో మాట్లాడాము. "వచ్చే వారం ఈ టైముకి నువ్వు వచ్చేస్తావు, మనం ముగ్గురం కలిసి ఉంటాం కదా.." అని కాసేపు దాని గురించి బోల్డు ఊహించేసుకుని ఆనందించాం. ఈ ఫోన్ కాల్స్ అన్నీ అయ్యేసరికి లంచ్ టైం అయింది. కిరణ్ ప్రభ గారు వచ్చేసారు. ముగ్గురం కలిసి లంచ్ చేసాక "సాయంత్రం ఐదింటికల్లా బయలుదేరి బయటికి వెళదాం. నేనొచ్చేసరికి రెడీ అయ్యి ఉండండి" అని చెప్పి కిరణ్ ప్రభ గారు ఆఫీసుకి వెళ్ళిపోయారు.

అసలు నాకప్పటిదాకా కాంతి గారి దగ్గరికెళ్ళాలి అన్న ఉత్సాహమే తప్ప ప్రపంచంలోనే ప్రఖ్యాతి గాంచిన నగరాల్లో ఒకటైన శాన్ ఫ్రాన్సిస్కో కి వెళుతున్నాను అన్న స్పృహే లేదు. అందుకని ఇక్కడికొచ్చాక ఏం చూడాలి అని ప్రత్యేకంగా ఆలోచించలేదు. కానీ కాంతి గారు, కిరణ్ ప్రభ గారు మాత్రం బాగా ఆలోచించి నాకు ఈ ట్రిప్పులో ఏమేం చూపించాలి ఒక పెద్ద లిస్టు రాసి పెట్టారు. అందులో భాగంగా మొదటి రోజు వెళ్ళాలనుకున్న ప్లేస్ Livermore Hindu Temple. సాయంత్రం తీసుకెళ్తానన్నది అక్కడికే. అసలు నేను అమెరికా ప్రయాణం అనుకోగానే కాంతి గారికీ నాకూ మధ్య ఒక ఒప్పందం జరిగింది. అదేంటంటే "నువ్వు ఎప్పుడు అమెరికా వస్తావో తెలీదు కానీ ఎప్పుడొచ్చినా సరే వచ్చేప్పుడు లంగా ఓణీ మాత్రం తెచ్చుకోవాలి" అని కాంతి గారి ఆజ్ఞ. అసలెలా చెప్పారంటే రాగానే సూట్కేస్ చెక్ చేసి లంగా వోణీ తెచ్చుకోకపోతే వెనక్కి పంపిస్తారేమో అన్నంత గట్టిగా చెప్పారు. మళ్ళీ వచ్చేలోపు ఓ అరడజను సార్లు గుర్తు చేసారు కూడా "లంగా వోణీ పెట్టుకున్నావా లేదా?" అని. ఇవాళ గుడికి కదా వెళ్ళేది. అందుకని మధ్యాహ్నం నుంచే ఒకటే హడావుడి తొందరగా రెడీ అయిపోదాం పద అని. మొత్తానికి నా బద్ధకం వదిలించి ఎలాగైతేనేం ఇద్దరం ఎంచక్కా నెమలి పింఛం నీలం రంగులో మ్యాచింగ్ మ్యాచింగ్ లంగా వోణీ, చీర సింగారించి, ఈ గొలుసు బాలేదు, ఆ

నెక్లెస్ బాలేదు అనుకుంటూ మార్చి మార్చి మొత్తానికి ఐదింటికి అంటే ఓ అరగంట ఆలస్యంగా ఐదున్నర కల్లా రెడీ అయిపోయాం.



California Ranches

ఇంట్లోంచి బయలుదేరగానే కిరణ్ ప్రభ గారు "ఇప్పుడు నిన్నొక అందమైన దారిలో తీసుకెళతాను. నీకేమనిపిస్తుందో చూద్దాం.." అన్నారు. ఇల్లు దాటి ఒక ఐదు నిమిషాలు వెళ్ళామో లేదో రోడ్డుకి ఇరుపక్కలా ఎటు చూసినా సూర్యకాంతికి బంగారు వర్ణంలో మెరిసిపోతూ చిన్న చిన్న కొండలూ, వాటి నిండా ఎవరో శ్రద్ధగా కత్తిరించినట్టు ఒకే ఎత్తులో మెత్తగా పెరిగిన ఎండుగడ్డి పరుచుకుని ఉన్న విశాలమైన మైదానాలు... అలా చూస్తుంటే నాకు అసలు కళ్ళు ఆర్పబుద్ధి కాలేదు. అసలు బంగారు పోత పోసినట్టు, ఎవరో గొప్ప కళాత్మకంగా వేసిన వర్ణచిత్రంలాగా, అత్యంత నైపుణ్యంగా నేసిన తివాచీలాగా ఆ కొండలు ఎంత బాగున్నాయో! అక్కడక్కడా ఒంటరిగా ఒకటో రెండో పచ్చని చెట్లు, కొండల దిగువన మైదానాల్లో కొన్ని చోట్ల గుర్రాలు, కొన్ని చోట్ల ఆవులు, గొర్రెలు.. మొత్తంగా ఎటువైపు చూసినా అక్కడ దిగిపోయి అలా నడుచుకుంటూ ఆ కొండల మీదకి ఎక్కేసి ఆ లోయల్లో చిన్నప్పటిలా జారుడుబండ ఆటలా దొర్లుకుంటూ ఆడుకుంటే బావుండు.. అసలు అక్కడే ఒక చిన్న ఇల్లు కట్టేసుకుని ఉండిపోతే బావుండు అని ఎంత అనిపించిందో! ఆ చుట్టూ పక్కల అక్కడక్కడా గుర్రపుశాలలు, పశువుల శాలలు తప్ప వేరేం లేవు. 'కంట్రీ సైడ్' అంటారు కదా.. అలాంటి గ్రామీణ వాతావరణంలో గాలి చేసే శబ్దం, ఆ సన్నటి రోడ్డు మీద తిరిగే కార్లు చేసే చప్పుడు మినహా మరింకే అలజడి లేకుండా చాలా ప్రశాంతంగా ఉంది. ఇప్పుడు ఎండాకాలం కాబట్టి గడ్డి అంతా ఎండిపోయి ఇలా ఉన్నాయి. మళ్ళీ వేసవి అయిపోయాక కొండలన్నీ ఆకుపచ్చగా మారిపోతాయి. ఇలా

ఉండే ప్రదేశాలని Ranches అంటారు. ఈ మైదానాలని ఎక్కువగా గుర్రాలు, పశువుల పెంపకానికి ఉపయోగిస్తారు. పాతకాలంలో ఇంకా ఎక్కువ ఉండేవి అవన్నీ. ఇప్పటికీ అక్కడక్కడా గుర్రాలూ అవీ కనిపిస్తుంటాయి చూడు" అని చెప్పారు కిరణ్ ప్రభ గారు.



Strawberry Fields

మేము వెళ్ళే దారిలో ఒక చోట ఒక పెద్ద స్ట్రాబెర్రీ తోట కనిపించింది. అక్కడ ఆగి స్టాల్ దగ్గరున్న అతనితో మాట్లాడితే 'బెర్రీ పికింగ్' లేదు కానీ కొనుక్కోవచ్చు అన్నాడు. స్ట్రాబెర్రీస్ తో పాటు ఆప్రికాట్స్, కొన్నికూరగాయలు ఉన్నాయి. బెర్రీస్, ఆప్రికాట్స్ కొనుక్కుని అక్కడినుంచి నేరుగా 'లివర్ మోర్' గుడికి వెళ్ళాము. గుడి బయటినుంచి చూడ్డానికి అచ్చం ఇండియాలో గుళ్ళలాగే ఉంది. ఈ గుడికి శంఖుస్థాపన చేసింది అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పద్మశ్రీ NT రామారావు గారు అని రాసున్న శిలాఫలకం చూసి ఈ గుడి అప్పటినుంచీ ఉందా అని ఆశ్చర్యం అనిపించింది. "1984 అంటే ఇంకా నువ్వు పుట్టకముందే మొదలుపెట్టేసారు కట్టడం.." అని నవ్వి "ఈ బే ఏరియాలో ఇంకా చాలానే హిందూ గుళ్ళు ఉన్నాయి కానీ అన్నీటికన్నా ముందు కట్టిన గుడి మాత్రం ఇదేనమ్మా.." అని చెప్పారు కిరణ్ ప్రభ గారు. గుడి ప్రాంగణంలో లోపల ఒక్కో దేవుడికీ ఒక్కో చిన్న గుడి ఉంది. వినాయకుడు, మురుగన్, శివుడు, అమ్మవారు, రాముడు, కృష్ణుడు, హనుమాన్, వెంకటేశ్వరస్వామి, ఇలా అందరు దేవుళ్ళూ ఉన్నారు. కాంతి గారూ, నేనూ కలిసి అందరి దేవుళ్ళకీ దణ్ణాలు పెట్టేసుకున్నాక ఎన్నో డాలర్స్ నోటు ఇచ్చి హుండీలో వెయ్యమన్నారు. "పర్లేదులెండి మనం హుండీలో కానుక వెయ్యకపోతే దేవుడు ఏమీ అనుకోడులే.." అని నేనంటే "అలా అనకూడదు. వెయ్యి నువ్వు ముందు.." అని దగ్గరుండి హుండీలో కానుక వేయించి తీసుకొచ్చారు. తీర్థప్రసాదాలు తీసుకుని కాసేపు

గుడి లోపల కూర్చున్నాం. చాలామంది భక్తులు ఉన్నారు. బుజ్జి బుజ్జి పిల్లల దగ్గరనుంచీ ముసలివాళ్ళ దాకా అన్నీ వయసుల వాళ్ళూ కనిపించారు. తర్వాత గుళ్ళో ఇంకొక పక్కన పులిహోర, దద్దోజనం, రవ్వకేసరి ప్రసాదాలు ఉంటాయని అక్కడికి వెళ్ళాం. అక్కడ పెద్ద పెద్ద గిన్నెల్లో ప్రసాదాలు పెట్టి పక్కన ప్లేట్లు. స్పూన్లు ఉన్నాయి. ఎవరికి వారు పెట్టేసుకుని తినెయ్యడమే. కమ్మటి ప్రసాదాలన్నీ కొంచెం కొంచెం పెట్టుకుని తినేసి బయటికి రాగానే అక్కడొక నిమ్మచెట్టు కనపడింది. ఆ చెట్టు చిటారు కొమ్మలకి పెద్ద పెద్ద నిమ్మకాయలు పసుపురంగులో మెరిసిపోతున్నాయి. నేను నిమ్మచెట్టు భలే పెంచారు కదా గుళ్ళో.. అని చూస్తుంటే కాంతి గారు "2012 లో రమణి గారిని తీసుకొచ్చినప్పుడు ఈ నిమ్మచెట్టు చిన్నగా ఉండేది. అయినా బోల్డు కాయలున్నాయి అప్పుడే. ఈ చెట్టు ముందు నిలబడి రమణి గారు ఫోటో తీయించుకున్నారు" అని గుర్తు చేసుకున్నారు. మేము కూడా ఆ నిమ్మచెట్టు దగ్గర ఫోటో దిగి వెళ్ళబోతుంటే అక్కడ పూజామందిరం దగ్గర నించున్న ఒక తమిళాయన మమ్మల్ని పిలిచి "మీకు ఈ గుడి చరిత్ర తెలుసా?" అని అడిగారు. తెలీదండి అంటే "మీరు తప్పకుండా తెలుసుకోవాలి. ఎనభైల్లో అమెరికాలో ఉండే ఒక భక్తుడి కలలో గణేష్ కనిపించి ఇలా ఈ ప్రదేశంలో గుడి కట్టమని చెప్పారు. తర్వాత ఇక్కడ ఈ చిన్న పూజామందిరం మొదలుపెట్టారు.




మెల్లమెల్లగా కొన్నేళ్ళకి ఇంత పెద్ద గుడి కట్టారు. హిందూ దేవతల్లో అతి ముఖ్యమైనవారు అని ఎనిమిది మంది ఉంటారు. వారందరికీ ఒకే ప్రాంగణంలో గుడి కట్టడం అనేది చాలా అరుదుగా జరిగే విషయయం. అలాంటి అరుదైన గుళ్ళలో ఈ లివర్ మోర్ టెంపుల్ ఒకటి. మీరు చాలా ప్రత్యేకమైన గుడికి వచ్చారు. శుభం." అని దీవించి ప్రసాదం ఇచ్చి పంపించారు.

గుడిలోంచి బయటికి వచ్చి కార్లో ఎక్కగానే "నీకు చూపించాల్సిన వాటి లిస్టులో మొదటిది అయిపోయింది కదా.. టిక్ మార్క్ పెట్టేస్కో తల్లీ.." అని నవ్వించారు కిరణ్ ప్రభ గారు. "మనింటికి ఎవరు వచ్చినా

ముందు ఈ గుడితోనే మొదలుపెడతాం అన్నీ చూపించడం" అని చెప్పారు కాంతి గారు. గుడి నుంచి కాంతి గారు వాళ్ళ బంధువులు ప్రసాద్, పద్మ గారింటికి వెళ్ళాం. వాళ్ళ పిల్లలిద్దరూ "అత్తా.. నువ్వేంటి అసలు ఇంత ఉత్సాహంగా గంతులు వేస్తున్నావు.." అని ఆటపట్టిస్తే మరి నా ఫ్రెండ్ వచ్చింది కదా అందుకని అంత సంబరం.." అని చెప్పారు కాంతి గారు. పద్మ గారు Quesadilla చేసి పెట్టారు. చాలా టేస్టీగా ఉన్నాయని బాగా తినేసి, వాళ్ళతో కాసేపు కబుర్లు చెప్పి అక్కడినుంచి ఇంటికి బయలుదేరాం. దారిలో కిరణ్ ప్రభ గారి ఆఫీసు దగ్గర ఆగి అలా అలా చుట్టూ తిరిగి ఆయన వర్క్ ప్లేస్ చూసి ఇంటికి వచ్చేసాం. అప్పుడింక ఎవరికీ మళ్ళీ ప్రత్యేకంగా డిన్నర్ తినే ఆసక్తి లేదు. ముందు రోజు నిద్ర సరిగ్గా లేక చాలా అలసిపోయినట్టుంది నాకు. కాంతి గారేమో ఇంటికి రాగానే దిష్టి తీసే ప్రోగ్రాం పూర్తి చేసి "మన నేస్తాలందరూ ఎదురు చూస్తారు కదా.. ఫేస్ బుక్లో ఫొటోస్ పెట్టి పడుకుందాం" అన్నారు. సరేనని ఆ పని చేసి 'గుడ్ నైట్' చెప్పేసుకున్నాం. అంత అలసిపోయున్నా సరే వెంటనే నిద్ర రాక అలా కిటికీలోంచి బయటికి చూస్తూ ఏవో ఆలోచనల్లో తప్పిపోతూ ఎప్పటికో నిద్రపోయాను.

## 14.06.2013

## శుక్రవారం

అచ్చం ముందు రోజు ఉదయంలాగే అస్పష్టంగా మళ్ళీ ఏదో కల నిద్రలోంచి నాలుగున్నరకే లేపేసింది. కల గురించి ఆలోచిస్తూ ఎలాగో కాలక్షేపం చేస్తుంటే ఎప్పటికో మళ్ళీ కాస్త కన్నంటుకుంది. ఫోన్ మోగేసరికి మెలకువ వచ్చేసింది. ఈ సారి మా ఇంటబ్బాయ్. అక్కడ ఉన్నన్ని రోజులూ ప్రతి రోజూ మా ఇంటబ్బాయ్, పద్మవల్లి గారు.. వీళ్ళిద్దర్లో ఎవరో ఒకరు పొద్దున్నే కాల్ చేసి నిద్ర లేపేవారు. అలా వాళ్ళతో మాట్లాడుతూ మాట్లాడుతూ నిద్రమత్తు వదిలిపోయేది. తర్వాత మెల్లగా దిగి కిందకొచ్చేసరికి కిరణ్ ప్రభ గారు మార్నింగ్ వాక్ నుంచి వచ్చి "రేపు వస్తావా తల్లీ వాకింగ్ కి?" అని అడిగారు. రాత్రి పడుకునే ముందు కూడా "పొద్దున్నే వస్తావా వాక్ కి?" అని అడిగేవారు. ఎప్పుడు అడిగినా ఊ.. అనేదాన్ని కానీ ఒక్కరోజు కూడా ఆ టైముకి లేచి వచ్చేదాన్ని కాదు. అయినా సరే ప్రతీరోజూ ఉదయం, రాత్రి అడుగుతూనే ఉండేవారు. :-)

నా నిదురని దోచుకెళుతున్న కలని తీసుకెళ్ళి బ్లాగులో దాచేసి వచ్చాక బ్రేక్ ఫాస్ట్ ఇంకేం చేసుకుందామని కాంతి గారు అడిగితే నాకు ఇడ్లీ ఉంటే చాలని చెప్పాను. నేను ఇడ్లీల్లో నెయ్యి కాకుండా నెయ్యిలో

ఇడ్లీలు తింటున్నానని పెద్ద సీసా నిండా నెయ్యి కరిగించి పోసి పెట్టారు. ఇంక ప్రతీ పూటా అన్నీట్లోనూ నెయ్యి గుమ్మరించుకోడమే పని.. ఇలాగైతే నేను జర్మనీకి వెళ్ళాక ఓ సంవత్సరం కష్టపడాల్సి వస్తుంది కాంతి గారూ ఇక్కడ పెరిగిన బరువు తగ్గడానికి అని రోజూ ఓ పక్క అంటూనే ఇంకో పక్క ఎంచక్కా నెయ్యి గిన్నె ఖాళీ చేస్తూ ఉండేదాన్ని. మళ్ళీ సరిగ్గా ఇడ్లీ తినేప్పుడే పద్మవల్లి గారు కాల్ చేసారు. "లంగా వోణీ బాగుంది పిల్లా.." అని చెప్దామని చేసానన్నారు. కానీ మా కబుర్లు అంత సింపుల్ గా అయిపోవు కదా.. జస్ట్ ఓ గంటసేపు మాత్రం మాట్లాడేసుకున్నాం. :-) తర్వాత నిషితో మాట్లాడాము. "నువ్వు తొందరగా అన్నీ సర్దేసుకో ప్రయాణానికి.." అని తనని కంగారు పెట్టేస్తే "అసలు మీ ఇద్దరి ఆత్రం మరీనూ.. ఇంకా చాలా టైం ఉంది కదా వీకెండ్లో సర్దుకుంటాలే.." అంది నిషి. మధ్యాహ్నం లంచ్ కి వచ్చినప్పుడు కిరణ్ ప్రభ గారు అప్పుడెప్పుడో నేను పుట్టకముందు పత్రికల్లో వచ్చిన ఆయన కవితల పేజీలు, ఇంకా పాత ఫోటో ఆల్బమ్ ఇచ్చి ఆఫీసుకి వెళ్ళారు. నేనూ, కాంతి గారు అవన్నీ చూస్తూ బోల్డు కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాం. మళ్ళీ సాయంత్రం అయిపోతోంది, మేము బయటికెళ్ళాలి కదా.. అందుకని చకచకా తయారైపోయి కిరణ్ ప్రభ గారి కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాం.

కార్లో కూర్చోగానే "మధురా.. ఇప్పుడు మనం వెళ్ళబోయేది మాతా అమృతానందమయి ఆశ్రమానికి.." అని చెప్పారు. నేను "ఆశ్రమానికా.. ఏముంటుంది అక్కడ?" అని అడగ్గానే "ఆశ్రమంలో భక్తులు ఉంటారు. మనం కూడా నచ్చితే మఠంలో చేరిపోయి అక్కడే ఉండొచ్చు" అన్నారు. నేను "నిజంగానా?" అనగానే గట్టిగా నవ్వేసి "ఏంటో వీళ్ళు గుళ్ళూ, ఆశ్రమాలు తిప్పేస్తున్నారు నన్ను అని భయపడుతున్నావా? మనం వెళ్ళేది ఊరికే ఆ ప్లేస్ చూడటానికి. చుట్టూ కొండలు, లోయల మధ్యలో ఉంటుందా ఆశ్రమం. నీకు నచ్చుతుందని తీసుకువెళ్తున్నా" అన్నారు. అమ్మ ఆశ్రమం Castro valley అనే ప్లేస్లో ఉంది. అక్కడికి వెళ్ళే దారి సీనిక్ గా చాలా బాగుంది. ఆశ్రమం పరిసరాల్లోకి వెళ్ళగానే స్వాగతం బోర్డులు కనిపించాయి. చాలా నిశబ్దంగా, నిర్మానుష్యంగా ఉంది. గడ్డిలో తిరుగుతూ చిన్న చిన్న జింకలు, పక్షులు, బాతులు కనిపించాయి. పక్కనే దగ్గరలో ఒక నీళ్ళ కొలను, అందులో హంసలు, తామరపూలు కనిపించాయి. చుట్టూ నిన్నటి Ranches లాంటివే పెద్ద పెద్ద కొండలు, లోయలు ఉన్నాయి. ఒక కొండ పైకి చివరిదాకా వెళ్తే అక్కడ ఆశ్రమం ఉంది. ఏదో ద్యానమందిరం లాంటిది ఉంటే అక్కడికి వెళ్తే ఇద్దరు అమెరికన్స్ కనిపించారు. పది రోజుల క్రితమే అమ్మ వచ్చారని చెప్పి మాకు తెలీక అప్పుడు రాలేకపోయినందుకు చాలా చింతించారు. ఇప్పుడు అమ్మ వేరే ఏదో ఊర్లో ఉన్నారని అందరూ అక్కడికి వెళ్ళారని, అందుకే ఇక్కడ ఖాళీగా ఉందని చెప్పారు. "రండి లోపల చూపిస్తాం" అని తీసుకెళ్ళారు. లోపల గోడలకి అమ్మ ఫోటోలు పెద్ద పెద్దవి ఉన్నాయి. అక్కడ రకరకాల విధులు నిర్వహించే వారందరూ అమ్మ భక్తులేనట. అదంతా నిర్వహించడానికి అయ్యే ఖర్చు, టైము అన్నీ అందరూ

స్వచ్ఛందంగా సమర్పించేవేనట. మన సొంత నమ్మకాలు, అభిప్రాయాల సంగతి పక్కన పెడితే ఎక్కడో అమెరికాలో అంత పెద్ద ఆశ్రమాన్ని అంత శ్రద్ధగా, నిస్వార్ధంగా నడుపుతున్న భక్తులు అంతమంది ఉన్నారంటే చాలా ఆశ్చర్యంగా, ఆసక్తిగా అనిపించింది. ఆ ఎత్తైన కొండ మీద నించుని చుట్టూ చూస్తే భక్తి సంగతెలా ఉన్నా అంతందమైన పరిసరాల్లో ఉంటే ముక్తి మాత్రం తప్పక లభిస్తుందనిపించింది. ఆ కొండల మీద రకరకాల పండ్ల చెట్లు కూడా పెంచుతున్నారు బహుశా ఆశ్రమంలో ప్రసాదాల కోసం అనుకుంటాను. అక్కడున్నంతసేపు ప్రకృతి ఒడిలో ప్రశాంతసీమల్లో హాయిగా సేద తీరినట్టు అనిపించింది.



మాతా అమృతానందమయి ఆశ్రమం, Castro Valley

అసలు నన్ను కాలిఫోర్నియాతో ప్రేమలో పడేసినవాటిల్లో ఈ గాలి ఒకటి. ఆహ్.. ఎంత హాయిగా వీస్తుందో అక్కడ గాలి! మరీ అతి చల్లదనం, అతి వేగం కాకుండా అలా అలా సుతారంగా పక్కనుండి వీవెనతో విసిరినట్టు అలవోకగా వీస్తుంటుంది గాలి మాయాబజార్ సినిమాలో 'లాహిరి లాహిరి లాహిరిలో' పాటలో లాగా.. బయటికొస్తే చాలు.. ఆ చల్లగాలికి అలా మెల్లగా నడుచుకుంటూ నడుచుకుంటూ ఎక్కడికో తెలీకపోయినా వెళ్ళిపోతూ ఉంటే బావుండు అనిపిస్తుంది. ఆ గాలి మాయలో పడి నేనలా వెనక్కి తిరిగి చూడకుండా ఎటో వెళ్ళిపోతానేమోనని కాంతి గారు నేను తప్పిపోకుండా ఎప్పుడూ నా చెయ్యి గట్టిగా పట్టుకుని తిరిగేవారు. ;-)

అలా ఆ రోజు మాతా అమృతానందమయి ఆశ్రమం చూసుకుని దారిలో ఇండియన్ స్టోర్స్ కి వెళ్ళి అవసరమైన కూరగాయలు, వస్తువులతో పాటు ఇంకా స్వీట్స్ అనీ, స్నాక్స్ అనీ ఏవేవో కళ్ళకి నచ్చిన పదార్థాలన్నీ రెండు పెద్ద సంచుల నిండా కొనేస్కుని ఇంటికొచ్చిపడేసరికి రాత్రయిపోయింది. గబగబా అన్నం తినేసి, మా దినచర్యలో భాగంగా ఈ రోజు మా విహారం గురించి నేస్తాలకి తెలియచేయడానికి ఫేస్ బుక్లో ఫొటోస్ పెట్టేసి క్షణం ఆలస్యం

చెయ్యకుండా బజ్జుందాం అనుకున్నాం. మరి ఎందుకంటే తెల్లారితే శనివారం కదా.. We have a long day tomorrow.. It's time to sleep now! :-)

## My San Francisco Diary – 5

## 15.06.2013

## శనివారం

ఈ రోజు ఉదయాన్నే ఆరున్నర కల్లా ఇంట్లోంచి బయలుదేరితే దాదాపు రెండొందల మైళ్ళ దూరంలో ఉన్న Lake Tahoe కి పది గంటల లోపే చేరుకోవచ్చని కిరణ్ ప్రభ గారు ప్లాన్ చేసారు. మేము ఉదయాన్నే వేడివేడిగా పెసరట్లు తిని తీరిగ్గా తయారయ్యేసరికి ఏడు గంటలైపోయింది. ఇంట్లోంచి బయలుదేరేసరికి ఏడు దాటింది. కార్లో కిరణ్ ప్రభ గారి పక్కన నా ప్లేస్ అయితే కాంతి గారేమో వెనక సీట్లో నా వెనుక కాకుండా నేను కనిపించేలా వేరే వైపు కూర్చునేవారు. కారెక్కగానే "ఇప్పుడు వెనక నేనొక్కదాన్నే కదా.. ఇంకో నాలుగు రోజులాగితే మా పెద్దమ్మాయి వచ్చేస్తుంది. ఎంచక్కా నా పక్కన కూర్చుని బోల్డు కబుర్లు చెప్తుంది" అని ఖాళీగా ఉన్న పక్క సీటుని చూస్తూ నిషిని గుర్తు చేశారు. నిషి వచ్చేదాకా రోజూ చాలా సందర్భాల్లో ఇలా తన గురించి ఏదోకటి అనుకుంటూ ఉండేవాళ్ళం. కార్లో మంచినీళ్ళ బాటిల్స్ పెట్టుకున్నాం కానీ నిన్న ఇండియన్ స్టోర్స్ లో కొనుక్కొచ్చిన స్నాక్స్ పెట్టుకోడం మర్చిపోయామని కొంచెం దూరం వెళ్ళాక గుర్తొచ్చి అయ్యో అనుకున్నాం. ముందురోజు Safeway కి వెళ్ళినప్పుడు అక్కడ ఏమన్నా కొనుక్కుంటావా రేపు డ్రైవ్ లో తినడానికి అని కాంతి గారంటే అప్పుడే నాకు మైక్రోవేవ్ పాప్ కార్న్ కనిపించాయి. ఇంకేమన్నా కొనుక్కో అంటే "ఓ గది నిండా పాప్ కార్న్ నింపి, తాగడానికి మంచి నీళ్ళిచ్చి నన్ను అందులో పడేస్తే హాయిగా బతికేస్తాను కాంతి గారూ.. ఇంకేం అక్కర్లేదు" అని చెప్తే చాలాసేపు నవ్వారు. పొద్దున్నే ఆ పాప్ కార్న్ మాత్రం ఫ్రై చేసి కార్లో పెట్టుకున్నాం గానీ వేరే స్నాక్స్ సంగతే మర్చిపోయాం. సరే కావాలంటే మధ్యలో ఏమన్నా కొనుక్కుందాంలే అనుకున్నాం కానీ అప్పుడే పెసరట్లు బొజ్జ నిండా నింపెయ్యడం వల్ల ఎవ్వరికీ తిండి మీద ఆసక్తి కలగలేదు. "మూడు గంటల పైనే డ్రైవ్ కదా.. నీకు పర్లేదా తల్లీ.. ఏం ఇబ్బంది లేదు కదా.." అని కాంతి గారు కొంచెం కంగారుగా అడిగారు.

"అన్ని గంటలు ఫ్లైట్ జర్నీ చేసి నిద్ర లేకపోవడం వల్ల కాస్త తేడా చేసింది కానీ ఇప్పుడు అమెరికా టైంకి సెట్ అయిపోయాను కదా.. ఇంకేం సమస్య ఉండదులెండి" అని ధైర్యం చెప్పాను.

ఇంకప్పుడు మొదలయ్యాయి మా కబుర్లు.. ఎక్కడెక్కడి నుంచో మొదలుపెట్టి అంతూ పొంతూ లేనట్టు ఎటో ఎటో వెళ్ళిపోయాం. కాసేపటికి కాంతి గారు ఊ కొడుతూనే నిద్రలోకి జారిపోయారు. "నువ్వు కూడా కాసేపు పడుకో తల్లీ.." అని కిరణ్ ప్రభ గారంటే "పర్లేదులెండి.. మీకు బోర్ కొడుతుంది కదా.." అని మేమిద్దరం మాట్లాడుకుంటూ కూర్చున్నాం. Lake Tahoe కి వెళ్ళే దారిలో ముందు చాలా దూరం వరకూ మొన్న చెప్పిన Ranches లాంటి కొండలే ఉన్నాయి. ఆ కొండల మీద చాలా విండ్ మిల్స్ ఉండి అవన్నీ గాలికి తిరుగుతూ చాలా అందంగా ఉందా దృశ్యం చూడడానికి. సగం దూరం పైన వెళ్ళాక రోడ్డుకి ఇరుపక్కలా ముదురాకుపచ్చ పైన్ చెట్లు దట్టంగా పెరిగిన కొండలు కనిపించడం మొదలయ్యాయి. అక్కడక్కడా ఆ కొండల మధ్యన సన్నగా పారే వాగులు కూడా ఉన్నాయి. రోడ్డంతా కొండల అంచుల మీద వెయ్యడం వల్ల దారిలో ఎటు పక్కకి చూసినా ఎత్తు పల్లాలతో కొండలు లోయలు, నిండైన పచ్చదనంతో మనసుకి ఆహ్లాదాన్ని కలిగించేలా ఉన్నాయా పరిసరాలు. కాంతి గారు "ఈ కొండల అందానికి సరితూగే పాటలు పెట్టండి. వినుకుంటూ వెళదాం" అని అడిగారు. ఘంటసాల పాత పాటలు కొన్ని కేవలం వాయిద్యాల మీద వాయించిన (ఇన్స్ట్రుమెంటేషన్) సంగీతం పెట్టారు కిరణ్ ప్రభ గారు. 'కొండగాలి తిరిగింది, రేపంటి



రూపం కంటి, గోరొంక గూటికే చేరావే చిలకా, నన్ను వదలి నీవు పోలేవులే, నా పాట నీ నోట పలకాల సిలకా..' ఇలాంటివే బోల్డు పాటలు వినిపించారు. అందమైన ప్రకృతి, వీనుల విందైన సంగీతం రెండూ కలిసి మూడు గంటలు అసలెలా గడిచాయన్న శ్రమ తెలీకుండా చేశాయి.

Lake Tahoe అనేది చాలా పెద్ద మంచినీటి సరస్సు. సముద్ర మట్టానికి చాలా ఎత్తులో మంచు కొండల మధ్యన ఏర్పడే ఇలాంటి సరస్సులని 'ఆల్పైన్ లేక్స్' అంటారు. మామూలు సరస్సుల కన్నా ఈ ఆల్పైన్ లేక్స్ లో నీళ్ళు మరింత స్వచ్ఛంగా ఉంటాయి. ఉత్తర అమెరికాలో ఉన్న అతి పెద్ద సరస్సుల్లో ఈ లేక్ టాహో కూడా ఒకటి అవ్వడం వల్ల ఇది చాలా ప్రముఖమైన పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చెందింది. ఇప్పుడు వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు ఎక్కువుంటాయి గానీ చలికాలంలో ఇక్కడ చాలా తక్కువ ఉష్ణోగ్రతలు ఉండి కొండలు మొత్తం మంచుతో కప్పబడిపోతాయి. అందుకని ఈ ఊర్లో బోలెడన్ని స్కీయింగ్ రిసార్ట్స్ ఉన్నాయి. అవన్నీ చూసాక ఎండాకాలంలో కన్నా చలికాలంలోనే చాలామంది స్కీయింగ్ కోసం అక్కడికి వెళుతూ ఉంటారేమో అనిపించింది. లేక్ టాహో కాలిఫోర్నియా, నెవాడా రాష్ట్రాల సరిహద్దులో ఉంది. రోడ్డు మీద ఒక ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర సిగ్నల్ కి అటు వైపు కాలిఫోర్నియా, ఇటువైపు నెవాడా అని రాసిన బోర్డులు చూసి భలే అనిపించింది.

ఊర్లోకి వెళ్ళగానే మరిన్ని వివరాలు తెలుస్తాయి కదాని ముందు అక్కడున్న టూరిస్ట్ కేంద్రానికి వెళ్ళాం. వాళ్ళు చాలా చక్కగా అన్నీ వివరించి పెద్ద మ్యాప్ చేతిలో పెట్టారు. మొత్తం సరస్సు చుట్టూ కొండల మధ్య నుంచి వేసిన ఘాట్ రోడ్డులో డ్రైవ్ చేసుకుంటూ అక్కడక్కడా మధ్యలో ఉన్న విస్టా పాయింట్స్, బీచుల దగ్గర ఆగుతూ అన్నీ చూసుకుంటూ సాయంత్రం కల్లా మళ్ళీ ఇక్కడికి వచ్చెయ్యొచ్చు అని చెప్పారు టూరిస్ట్ ఆఫీసులో వాళ్ళు. అక్కడ Gondola ride అని కేబుల్ కార్ సర్వీస్ ఒకటి ఉంది. అది ఎక్కితే ఒక పెద్ద కొండ అంచు దాకా తీసుకెళతాడు. అక్కడి నుంచీ మొత్తం లేక్ వ్యూ చూడగలగడంతో పాటు పైన ఇంకేవో రిక్రియేషనల్ యాక్టివిటీస్ కూడా ఉన్నాయని చెప్పారు. Gondola ride సాయంత్రం ఐదింటి దాకానో ఏమో ఉంటుందని చెప్పారు కాబట్టి ముందు అది చూద్దాం అనుకున్నాం. కాంతి గారు ఎప్పుడో చిన్నప్పుడు 'అన్నదమ్ముల సవాల్' సినిమాలో ఏదో పాటలో కృష్ణ, జయచిత్ర ఇలాంటి కేబుల్ కార్లో తిరిగే పాట ఒకటి చూసినప్పటి నుంచీ అలాంటిది ఎక్కాలని ముచ్చట పడుతున్నారట. కానీ ఎందుకనో ఇప్పటిదాకా అది కుదరలేదు. అదీ కాకుండా అంత ఎత్తు అనేసరికి కొంచెం భయమన్నమాట తనకి. ఈ మాట వినగానే నేను అర్జెంటుగా మనం ముందు ఆ రైడ్ కి వెళ్ళాల్సిందేనన్నాను. మ్యాప్ ప్రకారం అక్కడే ఉందని చూపిస్తున్నా వాళ్ళు పెద్ద బోర్డు పెట్టకపోవడంతో మేము చాలాసేపు అక్కడక్కడే తిరుగుతూ Gondola ride point వెతికి పట్టుకునేసరికి చాలాసేపే పట్టింది.




మొత్తానికి టికెట్లు కొనుక్కుని మేము ముగ్గురం ఒక కేబుల్ కార్లో ఎక్కి కూర్చున్నాం. మొత్తం రైడ్ ని రెండు భాగాలుగా చేసారు. పైకి వెళ్ళేప్పుడు మధ్యలో ఒక విస్టా పాయింట్ ఉన్న చోట దిగి అక్కడ మనకి నచ్చినంతసేపు ఉండి చుట్టూ చూసాక మళ్ళీ అక్కడి నుంచి ఇంకా పైనున్న కొండల మీదకి వెళ్ళొచ్చు. అక్కడ ఇంకేవో రైడ్స్, స్పోర్ట్స్ యాక్టివిటీస్ ఉంటాయి. అక్కడి నుంచి మళ్ళీ నేరుగా కిందకి వచ్చెయ్యొచ్చు. అలా మెల్లగా కేబుల్ కార్లో పైకి వెళ్తుంటే కిందున్న మనుషులు, ఇళ్ళు , కార్లు, రోడ్లు అన్నీ క్రమంగా చిన్నవైపోతూ, ఇంకా పైకెళ్ళే కొద్దీ కొండల నిండా ఎటువైపు చూసినా సన్నగా పొడవుగా తలెత్తి ఆకాశంలోకి చూస్తూ నిటారుగా నించున్న పైన్ చెట్లు, కిందకి చూస్తేనేమో ఎండలో మెరిసిపోతూ చిక్కటి నీలం రంగులో ప్రశాంతంగా కనిపిస్తున్న సరస్సు, దాని చుట్టూరా పెద్ద పెద్ద కొండలు, ఇంకా అక్కడక్కడా కొన్ని ఎత్తైన పర్వత శిఖరాల అంచున తెల్లగా మెరుస్తున్న మంచు... అవన్నీ చూస్తుంటే వేరే ఏదో లోకంలోకి ప్రయాణిస్తున్నట్టు అనిపించింది. ఓ పక్కన అంతెత్తు నుంచి కిందకి చూడటానికి కొద్దిగా భయపడుతూనే, ఆ కనిపించే అందమైన దృశ్యానికి ముగ్ధురాలైపోతూ.. అప్పుడు కాంతి గారి కేరింతలు చూస్తే నాకు స్కూలు పిల్లని పిక్నిక్ కి తీసుకెళ్ళినట్టు అనిపించింది. :-) తర్వాత కొండ మీదున్న విస్టా పాయింట్ దగ్గర దిగి చుట్టూ తిరిగి చూసాం. అంతెత్తు నుంచీ ప్రపంచాన్ని చూడటం చాలా బాగుందని కాంతి గారు సంబరపడిపోతుంటే "మా యూరోప్లో ఎక్కువ అన్నీ ఇలాంటి మంచు కొండలు, సరస్సులే ఉంటాయి. నాకు ఈ ప్రదేశం చూస్తుంటే మా దేశంలోనే ఉన్నట్టుంది. మీరు గానీ మా ఊరొస్తే ఇలాంటివి బోల్డు చూపిస్తాను" అని చెప్పాను కాంతి గారితో. "ఊ ఊ.. వస్తాంలే ఎప్పటికో.. కదండీ.." అన్నారు తను కిరణ్ ప్రభ గారి వైపు చూస్తూ. ఆయన వెంటనే వరమిచ్చేస్తున్నట్టు "అలాగే, తప్పకుండా వెళదాం" అన్నారు.

ఆ విస్టా పాయింట్ దాటి అక్కడి నుంచి ఇంకా ఎత్తు మీదున్న ఇంకో కొండ పైకి వెళ్ళేసరికి అసలు కిందున్న ప్రపంచమే కనిపించకుండా పోయింది. అక్కడంతా అడవిలా ఉంటే ఆ చెట్ల మధ్యలో పిల్లలకి, పెద్దలకి రకరకాల రిక్రియేషనల్ యాక్టివిటీస్ ఉన్నాయి. ఆ కొండ మీద రెండు దిక్కుల్లో రెండు బోర్డులు పెట్టారు. ఒకవైపు వెళితే కాలిఫోర్నియా, ఇంకో పక్కంతా నెవాడా అని రాసుంది. కాసేపు అక్కడుండి మేము నేరుగా కిందకి వచ్చేసాం. కిందకి దిగేప్పుడు చుట్టూ దట్టంగా ఉన్న అడవిలో చెట్లని చూస్తూ నేను కొన్ని మొక్కల పాఠాలు చెప్తుంటే చాలా శ్రద్ధగా ఊ కొడుతూ విన్నారు కాంతి గారు, కిరణ్ ప్రభ గారు ఇద్దరూ. Gondola ride అయిపోయి మేము కిందకి వచ్చేసరికి మధ్యాహ్నం రెండు గంటలు దాటింది. అప్పటికి మాకు ఆకలి బాగా తెలిసొచ్చింది. దగ్గరలో subway ఉంటే వెళ్ళాం. కాంతి గారికేమో ఆ ఆకులు, అలములు అంటే అస్సలు పడదు. తను ఎప్పుడూ తినే మిని పిజ్జా వాడి దగ్గర లేదన్నాడు. ఇక చేసేదేం లేక నేనూ, కిరణ్ ప్రభ గారు చెరొక వెజ్జీ డిలైట్ తో లంచ్ తినేశాం. ఆ రోజు అసలెంత ఆకలంటే ఎప్పుడూ సగం సాండ్ విచ్ తినడానికి దిక్కులు చూసే నేను పెద్ద సబ్ మొత్తం తినేసాను. తర్వాత దగ్గరలో పిజ్జా షాప్ ఉందేమో అని వెతుక్కుంటూ నేనూ, కాంతి గారు నడుస్తుంటే ఈ లోపు కిరణ్ ప్రభ గారు కారు తీసుకొస్తానన్నారు. ఇంతలో మాకు 'బ్లూ డాగ్ పిజ్జా' అని ఒకటి కనిపించింది. ఆ షాప్ అద్దం మీద ఒక కుక్కపిల్ల పిజ్జా తింటున్న బొమ్మ ఉంది. అది చూసి మా ఇద్దరికీ నిజంగా సందేహం వచ్చింది అది మనుషుల కోసం పిజ్జానా, పప్పీల కోసం పిజ్జానా అని. ఇంతలో లోపల చాలామంది మనుషులు పిజ్జా తింటూ కనిపించారు. హమ్మయ్యా పర్లేదు అనుకుని ఇద్దరం లోపలకెళ్ళి పిజ్జా ఆర్డర్ చేసాం. ఇంతలో కిరణ్ ప్రభ గారొచ్చేశారు. కాసేపు డాగ్ పిజ్జా అని పేరు పెట్టిన వాళ్ళ క్రియేటివిటీ గురించి బాగా చర్చించుకుని నవ్వుకుంటూ పిజ్జా తినేసి అక్కడ నుంచి బయటపడ్డాం. ఏమాటకామాటే, అక్కడ పిజ్జా మాత్రం రుచిగా ఉంది. ;-)





ఆ రోజు ఎండ మండిపోతూ ఉండటం, నేనూ, కాంతి గారు అనుకోకుండా నల్ల బట్టలు వేసుకోవడం, తిరిగేదంతా బయట ఎండలోనే అవడం వల్ల తొందరగానే అలసిపోయినట్టు అనిపించింది. లంచ్ తిన్నాక మరీ బద్ధకంగా అనిపించింది.మేమిద్దరం ఎన్ని ఆపసోపాలు పడ్డా కానీ మా డైరెక్టర్ కమ్ ప్రొడ్యూసర్ గారు మాత్రం ఎప్పుడైనా సరే మొత్తం షెడ్యూల్ ప్రకారం అన్నీ విజయవంతంగా పూర్తి చేసేవరకూ విశ్రమించరు. కనీసం కాస్తైనా అలసట, విసుగు, బద్ధకం లాంటివి క్షణంసేపైనా ఎప్పుడూ చూపించరు. మా ఇద్దర్నీ బోల్డు మోటివేట్ చేసేస్తుంటారు అది బాగుంటుంది, ఈ కొంచెం సేపే కదా పదండి పర్లేదు అనుకుంటూ.. :-) సరే మొత్తానికి మళ్ళీ లేక్ చుట్టూ ఘాట్ రోడ్లో వెళ్ళాల్సిన డ్రైవ్ మొదలుపెట్టాం. ఆ ఊర్లో కొన్ని కాసినోలు కనిపించాయి. దగ్గరలో ఉన్న 'Reno' అనే ఊర్లో ఇంకా చాలా ఉంటాయని కిరణ్ ప్రభ గారు చెప్పారు. అక్కడికి కూడా ఒకరోజు వెళ్దామనుకున్నాం గానీ మాకు టైం సరిపోలేదు. లేక్ మ్యాప్ చూసుకుంటూ ఆ కొండల్లో డ్రైవ్ చేసుకుంటూ వెళ్తుంటే అక్కడక్కడా కొన్ని బీచులు కనిపించాయి. సరస్సు ఒడ్డున చిన్న చిన్న గులకరాళ్ళతో ఉన్న ఒక బీచ్లో కాసేపు కూర్చుని ఆ ఎర్రటి ఎండలో నేనూ కాంతి గారు గులక రాళ్ళతో అచ్చనగిల్లలు ఆడుకున్నాం. మెత్తటి ఇసుక ఉన్న కొన్ని బీచుల్లో జనాలు క్రిక్కిరిసిపోయి ఉన్నారు. పిల్లలు, పెద్దలూ, ఈతలు, పడవలు, గాల్లో ఎగిరే ప్యారాషూట్లతో బీచులన్నీ సందడి సందడిగా ఉన్నాయి. మేము చూసిన రకరకాల వ్యూ పాయింట్స్ లో Emerald Bay వ్యూ చాలా నచ్చేసింది నాకు. అక్కడ నించుని చూస్తే మూడు పక్కలా పైన్ చెట్లతో నిండిన కొండలు ఉంటే నాలుగో పక్కంతా ముదురు నీలం రంగులో ఏవో మణిమాణిక్యాలు పరిచినట్టు మిలమిలా మెరిసిపోతున్న సరస్సు, మధ్యలో పచ్చటి చెట్లతో ఉన్న ఒక చిన్న ద్వీపంతో చాలా అందంగా ఉందా ప్రదేశం. అలా అలా సరస్సు చుట్టూ ప్రదక్షిణం చేసి మళ్ళీ మొదలైన చోటుకి వచ్చేసరికి సాయంకాలం ఏడు గంటలు అయిపోయింది.




Lake Tahoe నుంచి కాస్త తొందరగా వస్తే సాయంకాలం తెలిసిన వాళ్ళింట్లో సత్యనారాయణ వ్రతానికి వెళదాం అనుకున్నాం కానీ మాకు అక్కడే ఏడు దాటిపోవడం వల్ల సాధ్యపడలేదు. పైగా మేము ఇంటికెళ్ళి మళ్ళీ సిలికాన్ వ్యాలీ వైపు వెళ్ళాలంటే ఎంతలేదన్నా నలభై నిముషాలైనా పడుతుందని చివరి నిముషంలో అది కాన్సిల్ చేసుకోవాల్సి వచ్చింది. రోజంతా ఎండ బాగా ఉండటం వల్ల కూడా సాయంత్రానికి బాగా అలసిపోయాం. వెనక్కి బయలుదేరిన కాసేపటికే కాంతి గారు నిద్రపోయారు. నేనూ, కిరణ్ ప్రభ గారు పాటలు విందామనుకున్నాం. సిరివెన్నెల గారి 'విరించినై విరచించించితిని, ఈ గాలీ ఈ నేలా..', ఇళయరాజా గారి 'ఆకాశం ఏనాటిదో.. ' లాంటి పాటలు వరుసగా వినిపిస్తుంటే ఆ పాటల గురించిన చర్చలు మొదలై కాసేపటికి పాటలు ఆపేసి పూర్తిగా కబుర్లలోనే మునిగిపోయాం. కిరణ్ ప్రభ గారు కవిగా, కౌముది పత్రికా సంపాదకులు గానే కాకుండా రేడియో ప్రయోక్తగా అందరికీ సుపరిచితులే. తెలుగు సినిమా చరిత్రలో ఆణిముత్యాలని చెప్పబడే సినిమాల గురించి, తెలుగు సినీపరిశ్రమలో చెరగని ముద్రలు వేసిన గొప్ప సినీజీవుల గురించి చాలా పరిశోధించి రేడియో ప్రోగ్రాముల్లో ఆసక్తికరంగా శ్రోతలకి వినిపిస్తుంటారు. విరిజల్లు, టోరి రేడియోల్లో ఆయన రేడియో షోలు వస్తుంటాయి. ఇప్పుడు వాటన్నీటిని అందరికీ అందుబాటులో ఉంచేందుకు వీలుగా youtube లో పెట్టే ప్రయత్నం కూడా చేస్తున్నారు. ఆ రోజు మూడు గంటల డ్రైవ్ లో సిరివెన్నెల గారి గురించి మొదలెట్టి తర్వాత వరసగా ఇళయరాజా, కాంచనమాల, రచయిత 'శారద'.. ఇలా ఒకరి తర్వాత ఒకరి జీవిత గాథలన్నీ చెప్పుకుంటూ కూర్చున్నాం. ఆయనలా చెప్తూ ఉంటే నేను అలా బుద్ధిగా గడ్డం కింద చేతులు పెట్టుక్కూర్చుని ఊ కొడుతూ మధ్య మధ్యలో వాళ్ళ విజయాలకి పొంగిపోతూ, కష్టాలు, కన్నీళ్ళకి కదిలిపోతూ.. అలా అలా మూడు గంటలు ఎలా గడిచాయో తెలీకుండా డబ్లిన్ కి వచ్చేశాం. కాంతి గారు నిద్ర లేచి ఇంతసేపూ ఏం చేశారని అడిగితే తెనాలి వెళ్ళి కాంచనమాలని, చెన్నై వెళ్ళి ఇళయరాజాని చూసొచ్చామని చెప్తే "అవన్నీ నేనెప్పుడో వెళ్ళి వచ్చానుగా, అయితే నేనేం మిస్సవ్వలేదన్నమాట.." అని నవ్వారు.

ఆ రోజు ట్రిప్ ముగించుకుని ఇంటికొచ్చి పడేసరికి రాత్రి పదిన్నర అయింది. వచ్చాక కాంతి గారు ఉదయమే వంట చేసి సిద్ధంగా ఉంచిన కూరలతో భోజనం చేసేసాం. అంత అలసిపోయినా మళ్ళీ మాకు ఫేస్ బుక్లో ఫోటోలు పెట్టే బృహత్కార్యం ఒకటి ఉంది కదా! "అబ్బా రేపు పెడదాంలెద్దురూ.." అంటే కాంతి గారు ఎలానూ ఒప్పుకోరు. "నిషి పొద్దున్నే లేచి చూసుకుని ఫోటోలు లేకపోతే డిసప్పాయింట్ అవుతుంది కదా.. మన స్నేహితులందరూ కూడా ఎదురు చూస్తుంటారు మనం ఇవాళ ఏం చేసామో తెలుసుకోడానికి.. కొంచెం ఓపిక చేస్కో తల్లీ.." అని గారంగా అడుగుతారు. దీనితో పాటు ప్రతీరోజూ జరిగే విషయం ఇంకొకటి ఉంది. ఇంటికొచ్చి కార్లోంచి దిగుతూ ఉండగానే కిరణ్ ప్రభ గారు "ఈ రోజెలా గడిచింది తల్లీ.. నీకు నచ్చిందా? హ్యాపీనా.." అని అడుగుతారు. ప్రతీ

రోజూ రెండుసార్లు అడుగుతారు ఆ రోజు సంతృప్తికరంగా గడిచిందా లేదా, ఇంకేమన్నా మిస్సయ్యామా అని. "మీరు పర్ఫెక్ట్ గా ప్లాన్ చేసి అన్నీ టైం ప్రకారం పేపర్ మీద పెట్టినవి పెట్టినట్టు ఇంప్లిమెంట్ చేస్తారైతే అసలీ ప్రశ్న అడగాల్సిన అవసరమే లేదండీ.. ఇవాళ బ్రహ్మాండంగా గడిచింది" అని సమాధానం చెప్తాను నేను. ప్రశ్న, జవాబు రెండూ అవే ఉంటాయని మా ఇద్దరికీ తెలిసినా సరే రోజూ తప్పకుండా మా ఇద్దరి మధ్యనా ఈ ప్రశ్నోత్తరాల సమయం ఉంటుందన్నమాట. కాంతి గారేమో మా ఇద్దర్నీ చూసి ముసి ముసి నవ్వులు నవ్వుతుంటారు. :-)

రోజంతా ఎండలో తిరిగి తిరిగి అలసిపోయి నిద్ర కమ్ముకొచ్చేస్తోంది. అంత నిద్ర మత్తులో కూడా రేపెలా గడవబోతోందోనన్న ఆలోచన రేపుతున్న ఉత్సాహానికి, ఉద్వేగానికి ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా అని ఒకటే తొందరపడిపోతోంది మనసు. ఎందుకంటే.. రేపటి రోజు నేను జీవితాంతం గొప్ప ఆనందంగా తలచుకోబోయే ఓ మధుర జ్ఞాపకాన్ని నా కోసం మోసుకొస్తోంది మరి! :-)

## My San Francisco Diary - 6

## 16.06.2013

## ఆదివారం

ఈ రోజు ఉదయాన్నే ఎక్కడికీ బయలుదేరాల్సిన పని లేదు కాబట్టి నేను తీరిగ్గా ఏడు గంటలు దాటే దాకా నిద్రపోయి, మెలకువొచ్చాక కూడా బద్ధకంగా చాలాసేపు కిటికీలోంచి బయటికి చూస్తూ గడిపి మెల్లగా కిందకి దిగేసరికి టైము ఎనిమిది దాటింది. అప్పటికే కిరణ్ ప్రభ గారు మార్నింగ్ వాక్ నుంచి వచ్చేసారు. లంచ్ కోసం కాంతి గారు పులిహోర కలిపేశారు. వేడి వేడిగా పెసరట్టు బ్రేక్ ఫాస్ట్ ముగించి తీరిగ్గా కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాం. "ఇవాళ మనం వెళ్ళబోయే ప్రోగ్రాం మధ్యాహ్నం రెండు గంటలకి మొదలవుతుంది. ప్రసాద్ వాళ్ళింటికి వెళ్ళి అక్కడి నుంచి కలిసి వెళ్ళడానికి బానే టైం పడుతుంది కాబట్టి మీరిద్దరూ సరిగ్గా పన్నెండింటి కల్లా తయారైపోవాలి. ఇప్పుడింకా టైము తొమ్మిదిన్నరే కాబట్టి పదకొండు దాకా ఎంత బద్ధకంగా కూర్చున్నా పర్లేదు అన్నారు" కిరణ్ ప్రభ గారు. ఇవాళ చుడీదార్లు, స్కర్టు కాకుండా అచ్చ తెలుగు అమ్మాయిల్లాగా చీరలు కట్టుకోవాలని నిర్ణయించుకున్న సంగతి గుర్తొచ్చింది నాకూ, కాంతి గారికీ. "అమ్మో అలాగైతే మనకి చాలా టైం పడుతుంది కదా.. మనం చీరల మ్యాచింగ్

సంగతి కూడా చూసుకుందాం అనుకున్నాం కదా.. పద పద పైకి వెళదాం.." అని కాంతి గారు హడావుడి పెట్టేసి నన్ను హాల్లో నుంచి పైనున్న బెడ్ రూములోకి లాక్కెళ్ళిపోయారు. మేమిద్దరం కలిసి నా పాలనురుగు తెలుపు చీరకి దగ్గరగా ఉన్న గంధం రంగు చీరని కాంతి గారి కోసం సెలెక్ట్ చేసి, ఆ చీరల మీదకి ఏ గాజులైతే బాగుంటుంది, ఏ గొలుసైతే బాగుంటుంది అని ముచ్చటించుకుంటూ దాదాపు గంటసేపు గడిపేశాం. తర్వాత హడావుడిగా రెడీ అవుతున్నాం అన్న భ్రమలో బోల్డంత తీరిగ్గా సింగారాలు పూర్తి చేసుకుని పన్నెండు అవ్వకముందే కిందకొచ్చేసాం. ముగ్గురం కలిసి పులిహోర తినేసి అప్పటికే మాకోసం కాల్ చేసిన ప్రసాద్, పద్మ గారింటికి బయలుదేరిపోయాం. అక్కడి నుంచి వాళ్ళ కుటుంబ సభ్యులందరినీ కలుపుకుని అన్ని కార్లూ Santa Clara Convention Center వైపు పరుగులు తీసాయి.

ఇంతకీ ఈ పరుగు ఎక్కడికో చెప్పాలి కదా ముందు.. :-)

నేను అమెరికా ప్రయాణానికి టికెట్స్ బుక్ చేసుకోగానే నేను వచ్చాక ఎక్కడెక్కడికి తీసుకెళ్ళాలా అని కాంతి గారు, కిరణ్ ప్రభ గారు చర్చించుకుని మొదటి వీకెండ్ Los Angeles ట్రిప్ పెట్టుకుందామని ప్లాన్ చేసారు. అప్పుడే ఒక విషయం తెలిసింది. అదేంటంటే, ఎన్నో ఏళ్ళ నుంచీ మన గానగంధర్వులు 'పద్మభూషణ్' శ్రీ SP బాలసుబ్రహ్మణ్యం గారి చేత విజయవంతంగా నిర్వహించబడుతూ తెలుగునాట సర్వజనాదరణ పొందుతున్న ఈటీవీ 'పాడుతా తీయగా' సంగీత కార్యక్రమాన్ని ఇప్పుడు సరికొత్తగా అమెరికాలోని తెలుగు గాయనీ గాయకుల కోసం అమెరికాలోనే నిర్వహించబోతున్నారు. ఇటీవలే మే నెలలో అమెరికా డాలస్ నగరంలో జరిగిన తానా సభల్లో మెగాస్టార్ చిరంజీవి గారి చేతుల మీదుగా 'అమెరికాలో పాడుతా తీయగా' కార్యక్రమాన్ని ప్రారంభించారు. తర్వాత వరసగా అమెరికాలోని వివిధ నగరాల్లో సెమీ ఫైనల్స్, ఫైనల్స్.. ఇలా ఒక్కో చోట కొన్ని కొన్ని ప్రోగ్రాములని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా కాలిఫోర్నియాలోని బే ఏరియాలో Sacramento, Santa Clara ల్లో జూన్ 15, 16 తారీఖుల్లో బాలు గారి ఆధ్వర్యంలో 'పాడుతా తీయగా' జరగబోతోంది. ఈ సంగతి తెలిసాక కిరణ్ ప్రభ గారు "మధురా.. నీకు ఆసక్తి ఉంటే మనం 16 న 'పాడుతా తీయగా' కి వెళ్ళొచ్చు. లేదంటే లాస్ ఏంజెలిస్ ప్రయాణం పెట్టుకోవచ్చు. నిర్ణయం నీదే" అన్నారు. "అంతటి బాలు గారు పాడుతుంటే దగ్గరగా చూసే అవకాశం ఇలా కలిసొస్తుంటే కాదని ఎలా అనగలనండీ.. లాస్ ఏంజెలిస్ మరొకసారి వచ్చినప్పుడు చూద్దాంలే.." అన్నాను నేను. అలా అప్పుడు ఫిక్స్ అయిన 'పాడుతా తీయగా' ప్రోగ్రాం కే ఇప్పుడు మేము వెళుతోంది. :-)

కాలిఫోర్నియాలోని బే ఏరియాలో ఉన్న (BATA, Bay Area Telugu Association) బే ఏరియా తెలుగు సంఘం అక్కడున్న తెలుగు వారందరికీ సుపరిచితం. వారి ఆధ్వర్యంలో జరగబోతున్న ఈ కార్యక్రమానికి 'విరిజల్లు' రేడియో వాళ్ళు మీడియా పార్ట్నర్స్ గా వ్యవహరించారు. కిరణ్ ప్రభ గారికి సహజంగానే విరిజల్లు వారి

నుంచి ప్రత్యేక ఆహ్వానం అందింది. మేము 'పాడుతా తీయగా' కార్యక్రమం జరగబోతున్న 'శాంటా క్లారా కన్వెన్షన్ సెంటర్' కి చేరుకోగానే 'బాటా' కార్యవర్గ సభ్యులు, విరిజల్లు ద్వారా అందరికీ చిరపరిచితులైన విజయ ఆసూరి గారు, కళ్యాణ్ కట్టమూరి గారు ఎదురై కిరణ్ ప్రభ గారిని, ఆయన కూడా ఉన్న మమ్మల్ని సాదరంగా ఆహ్వానించారు. "మధుర అంటే మీరేనా? నైస్ టు మీట్ యూ.. మీరు వస్తారని చాలా రోజుల నుంచి ఎదురు చూస్తున్నారండీ కిరణ్ ప్రభ గారు.." అని చాలా స్నేహంగా పలకరించారు విజయ ఆసూరి గారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచీ నాలుగు గంటల దాకా ఒక ఎపిసోడ్ నీ, ఆరింటి నుంచీ ఎనిమిదింటి దాకా రెండో ఎపిసోడ్ నీ చిత్రీకరిస్తారని చెప్పారు. మధ్యలో రెండు గంటలు విరామం. మేము మాకిచ్చిన టికెట్స్ తీసుకుని లోపల హాల్లోకి వెళ్ళి చూస్తే మా సీట్లు స్టేజీ నుంచి ఓ పదిహేను అడుగుల దూరంలో సరిగ్గా మధ్యలో ఉన్నాయి. "ఆహా ఎంత మంచి ప్లేస్ ఇచ్చారండీ మనకి.." అని సంతోషించి అందరం వరసగా కూర్చున్నాం. స్టేజీ మీద 'పాడుతా తీయగా' బేనర్, అలంకరణ చూసేసరికి చాలా ఉత్సాహంగా అనిపించింది మా అందరికీ. అక్కడున్న మైకులు, టేబులు, కుర్చీలు చూస్తూ బాలు గారు ఎక్కడ కూర్చుంటారని చర్చించుకుంటూ కార్యక్రమం ఎప్పుడు మొదలవుతుందా అని ఎదురు చూడసాగాం. అప్పటికి సమయం ఇంకా రెండు గంటలు కాలేదు.

ఇంతలో చిమట శ్రీని గారు వచ్చి మమ్మల్ని పలకరించి వారి శ్రీమతి గారిని, పిల్లల్ని కూడా పరిచయం చేసారు. నేను ఆయన్ని నేరుగా కలవడం ఇదే మొదటిసారి. మళ్ళీ ఇంకోసారి "మా బే ఏరియాకి స్వాగతమండీ" అని చెప్పి "బాలు గారిని చూడటం మొదటిసారి అన్నారు కదూ.. కార్యక్రమాన్ని బాగా ఆస్వాదించండి. మనం మళ్ళీ మాట్లాడదాం" అని వెళ్ళిపోయారు. మేము అక్కడికి వచ్చిన దగ్గర నుంచీ కిరణ్ ప్రభ గారి పరిచయస్థులే కాకుండా, ఆయన రేడియో అభిమాన శ్రోతలు, కౌముది అభిమానులు ఎవరో ఒకరు వచ్చి పలకరిస్తూనే ఉన్నారు. అలాగే ఎవరో వచ్చి "కిరణ్ ప్రభ గారు మీరే కదండీ.. నమస్తే" అని అంటుంటే నేనూ, కాంతి గారు మాట్లాడుకోడం ఆపి అటు పక్కకి చూసాం. అక్కడ ఎదురుగా కనిపించిన వ్యక్తిని చూసి నేను బోల్డంత ఆశ్చర్యపోయి "హేయ్.. దిలీప్ నువ్వేంటి ఇక్కడ.. వాటే ప్లెజంట్ సర్ప్రైజ్!" అనగానే దిలీప్ మాత్రం నన్ను చూసి అస్సలే మాత్రం ఆశ్చర్యపోకుండా "నేను నిన్ననే అనుకున్నాలే.. నువ్వు కిరణ్ ప్రభ గారితో కలిసి ఈ ప్రోగ్రాం కి వస్తావని.." అన్నాడు. దిలీప్ అంటే అందమైన కవిత్వం రాస్తుంటాడే, ఆ 'ఏకాంతపు దిలీప్' అన్నమాట. మేమిద్దరం చాన్నాళ్ళ నుంచీ మంచి స్నేహితులం. కానీ ఈ మధ్య ఎవరి బిజీ బిజీలో వాళ్ళం పడిపోయి తీరిగ్గా మాట్లాడుకోక చాలా రోజులైపోయింది. కాంతి గారు ఫేస్ బుక్లో పెట్టిన ఫొటోస్ చూసి "San Jose వచ్చావా?" అని ముందు రోజే మెయిల్ పెడితే "Dublin లో ఉన్నాను" అని చెప్పాను. తన దగ్గరి నుంచీ మళ్ళీ ఏ సమాధానం రాలేదు. తను అమెరికాలోనే ఉన్నాడని నాకు తెలీదు. అందుకని ఉన్నట్టుండి అక్కడ

తనని చూడగానే చాలా ఆశ్చర్యపోయాను, ఆనందించాను. సరే, ఇంకాసేపట్లో ప్రోగ్రాం మొదలవబోతోంది కదా.. మనం మళ్ళీ బ్రేక్లో మాట్లాడుకుందాం అని చెప్పి వెళ్ళిపోయాడు దిలీప్. ఆ సంతోషంలో దిలీప్ గురించి కాంతి గారూ, నేనూ మాట్లాడుకుంటుండగానే స్టేజీ మీదకి అందరూ ఒక్కొక్కరే రాసాగారు. మేము వెంటనే నిశబ్దంగా అయిపోయి బాలు గారు ఎప్పుడు వస్తారా అని రెప్ప వేయకుండా ఆ ద్వారం వైపే చూస్తూ కూర్చున్నాం.

శ్రీ SP బాలసుబ్రహ్మణ్యం గారు అలా వేదిక మీదకి నడిచి వస్తూ కనిపించేసరికి ఆడిటోరియం మొత్తం నిండిపోయున్న ప్రేక్షకులందరమూ అసంకల్పితంగా లేచి నించుని కరతాళ ధ్వనులతో ఆయనకి ఘనస్వాగతం పలికాము. "ముందు అందరూ దయచేసి కెమెరాలు తీసెయ్యండి. టీవీలో టెలీకాస్ట్ అవబోయే ప్రోగ్రాంని మీరు ముందే చిత్రీకరించడం బాగుండదు కదా.." అని మెత్తగానే అయినా స్పష్టంగా చెప్పారు బాలు గారు. కార్యక్రమం ఎలా జరగబోతోంది అని ఆయన వివరిస్తూ ఉంటే నేనసలు రెప్ప వెయ్యడం మర్చిపోయి ఆయనకేసి, ఇంకా చెప్పాలంటే ఆయన గొంతుకేసి చూస్తూ ఉండిపోయాను. ఇది నిజంగా నిజమా, ఇంత దగ్గరలో కూర్చుని ఆయన గొంతు వింటున్నానా, అయినా అసలా స్వరం ఏంటీ మాములుగా మనందరం మాట్లాడుతున్నట్టు లేదు, టేప్ రికార్డర్లో కేసెట్ ప్లే చేస్తే వింటున్నట్టుంది కదా, చిన్నప్పటి నుంచీ ఆయన గొంతు కేసెట్లో వినీ వినీ అలా అనిపిస్తోందా, ఇంకా కొన్ని గంటలసేపు బాలు గారి ఎదురుగా కూర్చుని ఆయన మాటలు, పాటలు వినే భాగ్యం కలిగింది కదా నాకు.... ఇలా నా ఆలోచనలు ఎటో ఎటో పోతూ బ్యాక్ గ్రౌండ్లో అలనాటి 'ఏ దివిలో విరిసిన పారిజాతమో' దగ్గర నుంచీ నిన్నటి 'తలయెత్తి జీవించు తమ్ముడా..' పాట దాకా ఎన్నెన్నో పాటలు నన్ను గుర్తు చేసుకోమంటే నన్ను గుర్తు చేసుకోమంటూ మూకుమ్మడిగా నా మీద దాడి చేస్తున్నట్టు కుప్పలు తెప్పలుగా వినిపించేస్తున్నాయి. ఆ ఉద్వేగం కాస్త తగ్గి, కళ్ళలో తడి పొర కరిగి నేను మాములయ్యే లోపు కార్యక్రమం మొదలైపోయింది. ఈ రెండు ఎపిసోడ్లకీ ముఖ్య అతిథి మరియు సహన్యాయనిర్ణేతగా శ్రీ జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు గారిని ఆహ్వానించారు.

'పాడుతా తీయగా' కార్యక్రమం మొదలైపోయింది. బాలు గారితో పాటు పాడటానికి, అలాగే పోటీలో పాల్గొనే వారికి కోరస్ సహకారం అందించడానికి హరిణి, తేజస్విని అని ఇద్దరు అమ్మాయిలు వచ్చారు. వీళ్ళకి గట్టిగా ఇరవై ఏళ్ళు ఉంటాయేమో.. ఇదివరకు ఇండియాలో జరిగిన 'పాడుతా తీయగా' సిరీస్ విజేతలని చెప్పి వాళ్ళని పరిచయం చేశారు. కార్యక్రమాన్ని ఒక మంచి పాటతో మొదలుపెడదామని చెప్పి బాలు గారు తేజస్వినితో కలిసి మైకు ముందుకి వచ్చారు. ఆర్కెస్ట్రా బృందం సంగీతం మొదలుపెట్టగానే అర్థమైపోయింది అది 'శుభలేఖ రాసుకున్నా ఎదలో ఎపుడో..' పాటని. బాలు గారు అలా పాడుతుంటే అచ్చం చిన్నప్పుడు రేడియోలో పొద్దున్నే ఈ పాట విన్నప్పుడు ఎలా ఉండేదో అలాగే ఉంది. అంటే, దాదాపు ఇరవై యేళ్ళ క్రితంలాగే ఇప్పుడు కూడా ఎలా పాడుతున్నారని నమ్మలేనంత

ఆశ్చర్యం కలిగింది. అది కూడా అంత చిన్నపిల్ల పక్కన అస్సలే మాత్రం తేడా తెలీకుండా అంత వినసొంపుగా యుగళ గీతం పాడుతుంటే అప్పుడు కలిగిన భావాన్ని చెప్పడానికి అద్భుతం కన్నా ఇంకా పెద్ద మాట ఏదన్నా ఉంటే బాగుండుననిపిస్తుంది. ఆ తన్మయత్వంలో ఉండగానే వరసగా పోటీలో పాల్గొనే పిల్లలు ఒక్కొక్కరూ వచ్చి పాడటం మొదలుపెట్టారు. వాళ్ళని చూస్తే అందరికీ కూడా వయసు ఇరవైల్లోనే ఉంటుందనిపించింది. అందరూ అమెరికాలోని రకరకాల రాష్ట్రాల నుంచి వచ్చిన వారే! ప్రతి ఒక్కరూ ఇండియాలో సొంత ఊరు, అమెరికాలో ఉండే ఊరు రెండూ చెప్పి పరిచయం చేసుకున్నారు.

ఒక అబ్బాయి చక్కగా పంచె కట్టుకుని నుదుటన విభూతి రేఖలు పెట్టుకుని వచ్చాడు పాట పాడటానికి. శ్లోకంతో సహా ప్రారంభించి 'వేదంలా ఘోషించే గోదావరి.. అమరధామంలా శోభిల్లే రాజమహేంద్రి..' అంటూ ఆంధ్రకేసరి చిత్రంలోని పాట పాడాడు. బాలు గారు, జొన్నవిత్తుల గారు చాలా చక్కగా పాడాడని ఆ అబ్బాయిని మెచ్చుకుని ఆ పాటలో తెలుగు జాతి వైభవాన్ని ఎంత గొప్పగా వర్ణించారని వివరించి చెప్పారు. పంచె కట్టుకు రావాలన్న అతని ఆలోచనని కూడా అభినందించారు. తర్వాత అమ్మాయి 'స్వాతి ముత్యపు జల్లులలో.. శ్రావణ మేఘపు జావళిలో..' అంటూ పాడింది. ఆ పాట ప్రారంభంలో వినిపించే సిగ్నేచర్ ట్యూన్ లాంటి మ్యూజిక్ ని ఆర్కెస్ట్రా బృందం చాలా గొప్పగా వినిపించారు. "'శ్రావణ మేఘపు జావళి' లాంటి పదప్రయోగాలు మళ్ళీ  ఎవరైనా చేయగలరాండీ మహానుభావుడు వేటూరి తప్ప.." అంటూ బాలు గారు వేటూరి గారికి వందనం అర్పించారు. ఇంకొక అమ్మాయి 'స్వరములు ఏడైనా రాగాలెన్నో..' అనే పాట పాడింది. ఈ పాట నేనెప్పుడూ వినలేదంటే "అయ్యో అవునా.. ఇది చాలా మంచి పాట. తూర్పు-పడమర సినిమాలోది" అని ప్రభ గారు చెప్పారు. డా. సి. నారాయణ రెడ్డి గారు ఈ పాట సాహిత్యంలో గొప్ప వేదాంతాన్ని రంగరించి రాసారని కొన్ని వాక్యాలని జొన్నవిత్తుల గారు వివరించి చెప్పారు. తర్వాత ఒక అబ్బాయి 'దొంగ దొంగ' సినిమాలోని 'కనులు కనులను దోచాయంటే ప్రేమ అని దానర్థం..' పాట పాడాడు. AR రెహమాన్ సంగీతంలో వచ్చిన హుషారైన ఈ పాటని ఆ అబ్బాయి కూడా అంతే హుషారుగా పాడాడు. పాట అయిపోయేసరికి వింటున్న వాళ్ళందరిలో కూడా కొత్త ఉత్సాహం వచ్చింది. ఈ పాట సాహిత్యంలో రాజశ్రీ గారు 'అందగత్తెకి అమ్మై పుడితే ఊరికత్తని అర్థం..' అని భలే చిలిపిగా రాసారని బాలు గారు, జొన్నవిత్తుల గారు వారి సరదా వ్యాఖ్యానాలతో నవ్వించారు. తర్వాత చివరిగా ఒక తమిళ అబ్బాయి వచ్చి సిరివెన్నెల సినిమాలో 'ఈ గాలి, ఈ నేల..' పాట పాడాడు. అతనికి తెలుగు రాకపోయినా తమిళంలో రాసుకుని పాట నేర్చుకుని పాడటం చూసి ఆనందం కలిగింది. అక్కడ స్టేజీ మీద ఆర్కెస్ట్రా బృందంలో అందరూ కలిపి పట్టుమని పది మందైనా లేరు కానీ వాళ్ళ దగ్గరున్న పరిమితమైన వాయిద్యాలతో ఏ పాటకైనా సరే సరిగ్గా అమరేలా సంగీతం ఇవ్వడం మాత్రం చాలా గొప్పగా

అనిపించింది. "చాలా మంది 'పాడుతా తీయగా' లో వెనకాల వేరే ఇంకేదో మిక్సింగ్ ఉంటుందని అనుకుంటారట. కానీ అదేం లేదు, మీరు టీవీలో చూసే మ్యూజిక్ ఇప్పుడు మీ కళ్ళ ముందు వాయిస్తున్న వీళ్ళు ఇప్పటికిప్పుడు సృష్టిస్తున్నదే.." అని బాలు గారు ఆర్కెస్ట్రా బృందాన్ని అభినందిస్తే ప్రేక్షకులందరూ గట్టిగా చప్పట్లతో గొంతు కలిపారు. అక్కడికి ఐదుగురు పాడిన పాటలతో మొదటి ఎపిసోడ్ పూర్తయింది. కాసేపు విరామం తర్వాత రెండో భాగం మొదలవుతుందని చెప్పి అందరూ వేదిక మీద నుంచి నిష్క్రమించారు.

మేము బయటికి వెళదామని లేచి బయలుదేరుతుండగా చిమట శ్రీని గారు వచ్చి "బాలు గారిని కలిసి వద్దాం పదండి" అన్నారు. శ్రీని గారు నేనొచ్చిన రోజు నుంచే చెప్తున్నారు బాలు గారు ఇక్కడున్న నాలుగు రోజుల్లో ఏదో ఒక సమయంలో బాలు గారి దగ్గరికి నన్ను తీసుకెళ్తానని. నిషి ఏమో "శ్రీని గారు బాలు గారు ఉన్నంతసేపు ఆయన వెనకే నీడలా తిరుగుతుంటారు కాబట్టి నిన్నెలాగైనా బాలు గారి దగ్గరికి తీసుకెళ్ళమని నేను కూడా చెప్పాను" అంది. కానీ నేనింకా ఆయన మాటలు, పాటలు విన్న మైమరపులోనే ఉండి శ్రీని గారు వచ్చి పిలిచేసరికి "నిజంగా ఇప్పుడే వెళదామాండీ?" అని అడిగాను బోల్డు ఆశ్చర్యంగా. ఆయన నవ్వి "కెమెరా తీసుకుని పదండి. ఫోటో కూడా తీసుకుందాం" అన్నారు. కాంతి గారు, నేను కలిసి శ్రీని గారి వెనక బయలుదేరాం. శ్రీని గారి స్నేహితులు గోకుల్ గారు కూడా మాతో పాటు వచ్చారు. దారిలో జొన్నవిత్తుల గారు కనిపిస్తే శ్రీని గారు ఆయనతో మాట్లాడి నన్ను పరిచయం చేసి మమ్మల్ని ఫోటో కూడా తీసారు. తర్వాత బాలు గారి దగ్గరికి వెళుతుంటే నాకు చాలా ఉద్వేగంగా, కంగారుగా అనిపించింది. అసలు ఆయన ఎదురుగా నించున్నాక ఏం మాట్లాడాలి.. "బాలు గారూ.. మీరు చాలా అద్భుతంగా పాడతారండీ.. ఆ పాట నాకు ఇష్టమండీ, ఈ పాట చాలా బాగుంటుందండీ" అని చెప్పాలా? ఇలాంటివన్నీ ఇప్పటికి ఆయన కొన్ని కోట్ల సార్లు వినీ వినీ ఉంటారు కదా! అయినా నా పిచ్చి గానీ "సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు, వెన్నెల అందంగా ఉంటుంది, బాలు గారు బాగా పాడతారు, మధుర మంచమ్మాయి.." ఇలాంటివన్నీ ఇప్పుడు కొత్తగా ఎవరన్నా వచ్చి చెప్పాలా ఏంటీ.. అని చాలా సిల్లీగా అనిపించింది. నేనిలా ఆలోచనల్లో ఉండగానే బాలు గారి దగ్గరికి వెళ్ళి ఓ ఐదడుగుల దూరంలో నించున్నాం. ఎవరో ముగ్గురు నలుగురు అప్పటికే ఆయనతో మాట్లాడుతున్నారు. ఎప్పుడో స్కూల్లో ఉన్నప్పుడు ఏదో సినిమా కేసెట్ మీద బాలు గారి పేరు చూసినప్పుడు ఎలా ఫీలయ్యారు, ఏ పాటలు వింటే ఏమనిపిస్తుంది.. అని చాలా అభిమానంగా, ఆరాధనాపూర్వకంగా ఆయనకీ వివరిస్తున్నారు. ఆయనేమో వాళ్ళ ఉత్సాహాన్ని అర్థం చేసుకుని ఆదరంగా " చాలా సంతోషమండీ.." అని చిరునవ్వు నవ్వుతూ ఫోటో కూడా దిగి పంపించారు. తర్వాత మేమే! అప్పటికి నాకు మాటతో పాటు ఆలోచన కూడా పోయి మైండ్ అంతా బ్లాంక్ అయిపోయింది. మూగమ్మాయిలాగా అలా ఆయనకేసి చూస్తూ నించున్నా. శ్రీని గారు నన్ను ఆయన ముందుకి

తీసుకెళ్ళి "ఈ అమ్మాయి మధురవాణి అని జర్మనీ నుంచి వచ్చిందండీ. సైంటిస్టుగా పని చేస్తూనే తెలుగులో చాలా చక్కగా రాస్తూ ఉంటుందండీ.. మీరంటే చాలా అభిమానమని పరిచయం చేద్దామని తీసుకొచ్చాను" అని చెప్పారు. "ఏమ్మా.. మీ ఊరిలో ఉండవా అయితే ఇలాంటివి.. ఇక్కడిదాకా వచ్చి చూడాలన్నమాట.." అని నవ్వారు. అప్పటికి నా నోట్లోంచి మాట బయటికొచ్చింది. "నాకు మిమ్మల్ని ఇలా ఎదురుగా చూసాక ఏం చెప్పాలో మాటలు తోచట్లేదండీ.." అని మాత్రం అనగలిగాను. "ఏం పరవాలేదమ్మా.. నేను అర్థం చేసుకోగలను" అని నవ్వారాయన. నేను ఆయన పాదాలకి నమస్కారం చేస్తే తల పైన చెయ్యి ఉంచి "శుభం తల్లీ.." అని ఆశీర్వదించారు. శ్రీని గారు కాంతి గారిని చూపిస్తూ మిసెస్ కిరణ్ ప్రభ అని చెప్తే "కిరణ్ ప్రభ గారి పేరు బాగా తెలిసిందే కదా.. నాకు తరచూ మెయిల్స్ వస్తూ ఉంటాయి ఆయన దగ్గర నుంచి" అన్నారు. అంతకు ముందు రోజే ఎప్పుడో పాత పత్రికలో బాలు గారి మొట్టమొదటి ఇంటర్వ్యూ కనిపిస్తే కిరణ్ ప్రభ గారు దాన్ని శ్రీని గారికి పంపిస్తే ఆయన అది ఫ్రేం చేయించి బాలు గారికి చిన్న కానుకలా ఇచ్చి ఉన్నారు. ఆ విషయం కూడా ఆయనకి చెప్తే సంతోషించారు. "ఫోటో తీసుకుంటారామ్మా.." అని ఆయనే గుర్తు చేసాక మేము ఫోటోలు తీసుకుని మా కోసం ఆయన విలువైన సమయాన్ని ఇచ్చినందుకు ధన్యవాదాలు చెప్పి గాల్లో తేలుతూ బయటికి వచ్చేసాం. ఈ గొప్ప అనుభూతిని అందించినందుకు శ్రీని గారికి ఎన్ని ధన్యవాదాలు చెప్పినా తక్కువే కదా! చిమట శ్రీని గారి ఆధ్వర్యంలో 12.08.2013 న బాలు గారి పాత పాటల స్వర హేల 'అంకితం.. నీకే అంకితం' అనే కార్యక్రమం హైదరాబాదు రవీంద్ర భారతిలో జరగబోతోంది. ఆసక్తి కలవారు వెళ్ళవచ్చు. ప్రవేశం ఉచితం.

మళ్ళీ ప్రోగ్రాం మొదలయేలోపు ఇంకా టైం ఉండటంతో కాసేపు దిలీప్, నేనూ మాట్లాడుకున్నాం. కాఫీలు అవీ అయ్యాక మళ్ళీ రెండో ఎపిసోడ్ మొదలయ్యింది. ఈ సారి ఇంకొక ఐదుగురు కొత్త వాళ్ళు పాడటానికి వచ్చారు. ముందులాగే వాళ్ళందరూ పాడటం మొదలు పెట్టే ముందు బాలు గారు ఆయన స్వరంతో కార్యక్రమానికి స్వాగతం పలికారు. ఈ ఎపిసోడ్ లో పాటలన్నీ ఇళయరాజా సంగీతంలో వచ్చినవే ఉంటాయన్న తియ్యటి మాట చెప్పి గీతాంజలి సినిమాలోని 'ఓ పాపా లాలీ..' పాట పాడారు. అసలు ఆ సంగీతం, ఎదురుగా బాలు గారు నించుని ఆ పాట పాడుతుంటే.. అలా వింటూ ఉంటే కనులు, మనసు రెండూ తడిసి ప్రాణం ఏదో లోకాల్లోకి వెళ్ళిపోయింది. ముందులాగే మళ్ళీ అదే ఆశ్చర్యం, అద్భుతం కలగలిసిన భావనేదో మనసంతా నిండిపోయింది! పోటీలో పాల్గొన్నవారిలో ఒక అమ్మాయి 'జానకి కలగనలేదు రాముని సతి కాగలనని ఏనాడూ..' పాట పాడింది. బాలు గారు, జొన్నవిత్తుల గారు ప్రతీసారీ పాటల సాహిత్యం గురించి విశ్లేషించడమే కాకుండా కొన్ని పదాలకి అర్థం తెలుసో లేదోనని పాడిన వారిని కనుక్కుని వారికి వివరించి చెప్పడంతో పాటు పాడినప్పుడు దొర్లిన స్వరదోషాలని కూడా

సరిదిద్దారు. తర్వాత ఇంకొకరు 'పరువమా.. చిలిపి పరుగు తీయకే..' పాట పాడుతున్నప్పుడు నాకు ఈ పాట నిషి పరిచయం చేస్తేనే తెలిసిందని కాంతి గారికి చెప్పాను. తర్వాత తెలుగు సరిగ్గా రాని ఇంకొక అమ్మాయి 'కరిగిపోయాను కర్పూర వీణలా..' పాట చాలా బాగా పాడింది. ఈ రెండు పాటలూ వినడానికి చాలా హాయిగా అనిపించినా వాటిల్లో ఉన్న ఆర్కెస్ట్రేషన్ ఎంత క్లిష్టమైనదో, అలాంటివి స్వరపరచడంలో ఇళయరాజా గారి ప్రత్యేకతని వివరించారు బాలు గారు. 'కరిగిపోయాను' పాటలో వేటూరి గారి చిలిపితనాన్ని పట్టి చూపించారు జొన్నవిత్తుల గారు. తర్వాత ఒక అబ్బాయి మహర్షి సినిమాలోని 'సాహసం నా పథం.. రాజసం నా రథం..' పాటని చాలా హైఎనర్జీ లెవెల్స్ తో చక్కగా పాడాడు. ఆ అబ్బాయి పాడుతుంటే స్టేజీతో పాటు మొత్తం ఆడిటోరియం దద్దరిల్లిపోయిందనిపించింది. అతను పాడటం అయిపోయాక బాలు గారు మెచ్చుకుంటూనే కొన్ని చోట్ల ఎనర్జీ సరిపోలేదని అంటుంటే నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఆ అబ్బాయి అంత అద్భుతంగా పాడితే ఈయన ఇలా అంటారేంటి అనిపించింది. ఆ అబ్బాయికి వివరించి చెప్తూ మధ్యలో రెండు లైన్లు ఆయన పాడి వినిపించారు. అది వినగానే చప్పున క్షణంలో అర్థమైపోయింది నాకు నిజంగానే రెండిటికీ తేడా ఉందని. ఆ తేడా ఏంటో, దాన్ని సంగీత పరిభాషలో ఏమంటారో ఇవేవీ తెలియని, స్వరజ్ఞానం లేని నాలాంటి మామూలు వాళ్ళకి ఆయన పాడి వినిపించగానే చాలా తేడా ఉందని మాత్రం చప్పున అర్థమైపోతుంది. ఈ పాట సాహిత్యంలో 'నిర్భయం నా హయం' అన్న పదప్రయోగం గొప్పగా ఉందని జొన్నవిత్తుల గారు వివరించారు. చివరిగా ఒక అబ్బాయి వచ్చాడు పాడటానికి. పేరు నాకు సరిగ్గా గుర్తుంటే అర్జున్ అనుకుంటాను అతని పేరు. ఆ అబ్బాయిని చూస్తే ఇరవయ్యేళ్ళకి మించి ఉండదనిపించింది. 'నిరీక్షణ' సినిమాలో ఏసుదాస్ గారు పాడిన 'చుక్కల్లే తోచావే..' పాటని అస్సలు ఏసుదాసు గారిని గుర్తు చెయ్యకుండా, ఆయన్ని ఏ మాత్రం అనుకరించకుండా తన సొంత శైలిలోనే పాడాడు. ఆ పాట సంగీతం, ఆ అబ్బాయి పాడిన విధానం, సాహిత్యంలో ఉన్న లోతైన భావం.. అన్నీ కలిసి నా చెక్కిళ్ళని తడిపేసాయి. పాట అయిపోయాక తీరిగ్గా గమనించుకుని "బాబోయ్ నేను కళ్ళు తుడుచుకోడం కూడా మర్చిపోయినట్టున్నా.. ఏ కెమెరా వాళ్ళైనా నన్ను గానీ చూపిస్తే ఈ పిల్ల ఎవరో పాపం పాటలు విని ఏడ్చేస్తోంది.." అని చూసేవాళ్ళందరూ నవ్వుకుంటారేమో అనిపించి నాకే నవ్వొచ్చింది. ప్రోగ్రాం అయిపోయాక రెండు మూడు రోజుల దాకా కూడా అప్పుడప్పుడూ ఆ అబ్బాయి పాడిన పాట నా చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంది.

చివర్లో ఇదివరకు సిరీస్ లో గెలిచిన ఒక అబ్బాయి వచ్చి జొన్నవిత్తుల గారు 'దేవుళ్ళు' సినిమా కోసం రాసిన 'అందరి బంధువయా.. భద్రాచల రామయ్యా..' అని అద్భుతంగా పాడి మా ఊరి రాముడిని గుర్తు చేసి కళ్ళు చెమర్చేలా చేసాడు. ఏంటో ఇవాళంతా మాటిమాటికీ కళ్ళు తుడుచుకోడమే సరిపోతోంది అని మళ్ళీ నవ్వొచ్చింది. రెండు భాగాల్లో పాడిన పదిమందిలో ఇద్దరు ఎలిమినేట్ అయిన వారి పేర్లు చెప్పి, వారికి బహుమతి ప్రధానం చేసి

కార్యక్రమాన్ని ముగించారు. కార్యక్రమం పొడవునా బాలు గారు విసిరిన చతురోక్తులు, జొన్నవిత్తుల గారు ఆశువుగా చెప్పిన పద్యాలతో ఆద్యంతం చాలా సరదాగా సాగింది. మధ్యాహ్నం రెండింటి నుంచీ రాత్రి దాదాపు తొమ్మిదింటి దాకా మధ్యలో తిండి సంగతి కూడా మర్చిపోయి అలసట అన్నమాటే తెలీకుండా అలా సంగీత ప్రవాహంలో కొట్టుకుపోయాం. ఇంకా ఆ పాటలే చెవుల్లో మారుమోగుతుండగా వాటి గురించే కబుర్లు చెప్పుకుంటూ అక్కడి నుంచి బయలుదేరి ఇంటికొచ్చేసాం. అప్పటికే చాలా ఆలస్యం అయిందని వస్తూ వస్తూ దారిలో పిజ్జా హట్ నుంచి పిజ్జా తెచ్చుకుని తినేశాం. ఆ రోజు పడుకున్నాక నిద్రలో కూడా నాకు పాటలు వినిపిస్తూనే ఉన్నాయి. ఉదయం నుంచి గడిచిన సమయాన్నంతా మళ్ళీ మననం చేసుకుంటూ నా డైరీలో ఇది ఎప్పటికీ మధుర జ్ఞాపకంగా నిలిచిపోయే రోజని తల్చుకుని మనసు నిండా సంతోషం నింపుకుని సంతృప్తిగా నిద్రాదేవి ఒడిలోకి చేరిపోయాను. :-)

హ్యూస్టన్ లో జరిగిన 'పాడుతా తీయగా' కార్యక్రమం గురించి వంగూరి చిట్టెన్ రాజు గారు రాసిన కాలమ్ ఇక్కడ చదవొచ్చు.

## My San Francisco Diary – 7

## 17.06.2013

## సోమవారం

నిన్న రాత్రంతా కలలో కూడా ఇళయరాజా సంగీతం, బాలు గారి పాటలు వినీ వినీ అలసిపోయానేమో ఈ రోజు పొద్దున్నే ఆలస్యంగా నిద్ర లేచాను. ముగ్గురం కలిసి కూర్చుని నిన్నటి 'పాడుతా తీయగా' కార్యక్రమం గురించి మాట్లాడుకుంటూ టిఫిన్ తినేసాక కిరణ్ ప్రభ గారు ఆఫీసుకి వెళ్ళిపోయారు. తర్వాత నేనూ, కాంతి గారు ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ మధ్యాహ్నం దాకా గడిపేసాం. కిరణ్ ప్రభ గారు లంచ్ కి వచ్చినప్పుడు సాయంత్రం నాలుగున్నర కల్లా తయారై ఉంటే బయటికి వెళదామని చెప్పారు. మధ్యాహ్నం నిషికి ఫోన్లో నిన్నటి పాడుతా తీయగా గురించి పూస గుచ్చినట్టు వర్ణించి చెప్పాక బుద్ధిగా చెప్పిన టైము కల్లా రెడీ అయిపోయి కూర్చున్నాం. కిరణ్ ప్రభ గారొచ్చాక కాఫీ, స్నాక్స్ అయ్యాక ఇంట్లోంచి బయటపడ్డాం.







ఇవాళ మేము వెళ్ళబోయే మొదటి ప్రదేశం పేరు Niles. కాలిఫోర్నియా బే ఏరియాలో Fremont నగరంలో ఉన్న Niles District కి అమెరికా చలనచిత్ర చరిత్రలో గొప్ప ప్రాముఖ్యత ఉంది. చుట్టూ పెద్ద పెద్ద కొండలన్నీ కాపలా కాస్తున్నట్టు ఠీవీగా నించుని ఉంటే వాటి మధ్యలో ఒదిగినట్టుగా ఉంటుంది ఈ Niles అనే చిన్న ఊరు. దాదాపు 1850 ప్రాంతంలో పుట్టిన ఈ ఊర్లో అంత పాత కాలం నుంచే రైళ్ళతో సహా చాలా ఆధునిక సౌకర్యాలు ఉండేవట. 1912 లో Essanay Studios నిర్మాణం Niles లో జరిగాక ఈ ఊరికి ప్రపంచ ప్రఖ్యాతి వచ్చింది. ఎందుకంటే ఆ కాలానికి అత్యంత సూపర్ హిట్ సినిమాలు అయిన చార్లీ చాప్లిన్, బ్రోంకో బిల్లీ ఆండర్సన్ ల మూకీ సినిమాలని నైల్స్ లోనే చిత్రీకరించారట. చార్లీ చాప్లిన్ సినిమాల్లో చాలామందికి తెలిసిన 'The Tramp' సినిమా కూడా ఈ నైల్స్ వీధుల్లోనే






తీసారు.

అయితే ఇప్పుడు ఈ Niles ప్రత్యేకత ఏమిటీ అంటే.. ఈ ఊరికున్న చారిత్రిక విలువని గౌరవిస్తూ ఈ ఊర్లోని ప్రధాన వీధులు, భవనాలు, ఇళ్ళు వీటన్నీటిని ఆ పాతకాలం నాటి రోజుల్లోలాగే ఉంచేశారు. అంటే మనం పాత చార్లీ చాప్లిన్ సినిమాల్లో చూసిన షాపులు, ఇళ్ళు ఉన్నట్టే ఉంటాయి ఇప్పటికి కూడా. ఆ antique look ని వాళ్ళు జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నారన్నమాట. అక్కడ ఒక చిన్న రైల్వే స్టేషన్, రైలు పెట్టెలు కూడా ఉన్నాయి. నైల్స్ లో ఉన్న Essanay సైలెంట్ ఫిలిం మ్యూజియంలో ఆనాటి మూకీ చిత్ర నిర్మాణానికి సంబంధించిన ఆర్ట్స్, క్రాఫ్ట్స్ అన్నీ ఉంటాయట. అప్పుడప్పుడూ ఆ పాతకాలం నాటి సినిమాలు కూడా ప్రదర్శిస్తుంటారట. ఆ మ్యూజియం కేవలం శని, ఆదివారాల్లోనే తెరిచి ఉంటుంది కాబట్టి మేము మ్యూజియంని సందర్శించే వీల్లేకపోయింది. అయినా సరే చార్లీ చాప్లిన్ సినిమాలు తీసిన ప్రదేశాన్ని చూడటం, ఆ వీధుల్లో తిరగడం ఒక గొప్ప అనుభవం అనిపించింది నాకు.







Nyles నుంచి నేరుగా జొన్నవిత్తుల గారిని కలవడం కోసం కిరణ్ ప్రభ గారి స్నేహితులు ఒకరింటికి వెళ్ళాము. జొన్నవిత్తుల గారు గతంలో కౌముది కోసం శంఖారావం రాసి ఉండటం, ఆయన, కిరణ్ ప్రభ గారూ మంచి మిత్రులవడంతో వారిద్దరూ రకరకాల కబుర్లు చెప్పుకుంటూ ఉంటే నేను వింటూ కూర్చున్నాను. నిన్న 'పాడుతా తీయగా' కార్యక్రమంలో ఆయన్ని కలిసే ఉన్నాను కాబట్టి నన్ను కూడా గుర్తు పట్టారు. జర్మనీ గురించి, నా రీసెర్చ్ గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. మిథునం సినిమాలో ఆయన రాసిన కాఫీ దండకం గురించి,

శ్రీరామరాజ్యం పాటల గురించి కాసేపు చర్చ జరిగింది. జొన్నవిత్తుల గారు మామూలు మాటల మధ్యలోనే బోల్డంత సమయస్ఫూర్తితో అప్పటికప్పుడు ఆశుకవిత్వం చెప్పడం మాత్రం భలే ఆశ్చర్యం అనిపిస్తుంది. తెలుగు వైభవాన్ని కీర్తిస్తూ తానా సభల్లో విడుదల చేసిన ఆయన పాటల సీడీలు కిరణ్ ప్రభ గారికీ, నాకూ చెరొకటి ఇచ్చారు. తర్వాత ఆయన దగ్గర సెలవు తీసుకుని అక్కడి నుంచి మేము బయలుదేరాం.

నేను ఇక్కడికి వచ్చే ముందు ఒకరోజు ఏదో మాటల్లో మా ఇంటబ్బాయ్ "Silicon Valley దాకా వెళుతున్నావు కదా.. Google, Facebook, Apple లాంటివన్నీ అక్కడే ఉన్నాయి కాబట్టి నువ్వు సరదాగా అవి కూడా చూడొచ్చు" అన్నాడు. నాకు వాటన్నీటికీ సంబంధించిన సాంకేతిక విషయాల పరిజ్ఞానం పెద్దగా లేకపోయినా తను అలాంటివన్నీ చాలా ఆసక్తిగా ఫాలో అవుతూ ఉంటాడు కాబట్టి ఈసారికి తన బదులు నేను చూసొస్తాలే అని చెప్పాను. నేనిక్కడికి వచ్చాక కిరణ్ ప్రభ గారు Las vegas వెళదామా అని అడిగితే ఈసారికి అంత దూరంలోవి కాకుండా దగ్గర్లోవి మాత్రం చూద్దామని అన్నాను. అప్పుడే Silicon Valley tech companies వైపు వెళ్ళి సరదాగా అలా చూసొద్దామని అడిగాను. "మేము ఇన్నేళ్ళ నుంచీ ఇక్కడే ఉంటున్నాం గానీ ఎప్పుడైనా అటువైపు వెళ్తే చూడటమే కానీ ప్రత్యేకంగా వాటిని చూడటానికని ఎప్పుడూ వెళ్ళలేదు" అన్నారు కిరణ్ ప్రభ గారు. ఏ ఊర్లో ఉన్నవాళ్ళు ఆ ఊర్లోని ప్రదేశాలని అంత ప్రత్యేకంగా తిరిగి చూద్దాం అనుకోకపోవడం సహజమే కదా! నేను జర్మనీలో దాదాపు రెండేళ్ళు ఉన్న ఊరి ఫోటోల కోసం ఎప్పుడో వెతికితే నా దగ్గర ఎక్కువ దొరకలేదు. ఎప్పుడూ తిరిగే చోటే కదా అని నాకు ఫోటోలు తియ్యాలన్న ఆలోచన రాలేదు అప్పట్లో. అలాగే సిలికాన్ వ్యాలీలోనే ఉంటున్న వాళ్ళకి ప్రత్యేకంగా ఏమీ అనిపించదేమో గానీ ఎప్పుడో ఒకసారి బయట నుంచి వచ్చి చూసే వాళ్ళకి మాత్రం ఆ ప్లేస్ చాలా స్పెషల్ గా అనిపిస్తుంది కదా! :-)






Facebook ముందు కిరణ్ ప్రభ గారు, కాంతి గారు..

ముందుగా 1 Hacker way, Menlo Park లో ఉన్న Facebook Headquarters కి వెళ్ళాము. మొదట ప్రారంభించబడిన Palo Alto నుంచి కొన్నేళ్ళ క్రితమే Facebook ఇక్కడికి వచ్చిందట. దాని ముందు నించుని ఆ ఆఫీసులోకి వెళుతున్న ఉద్యోగులని, ఆ భవంతులని చూస్తుంటే "ఈ రోజు ప్రపంచం మొత్తానికీ మంచిదో, పిచ్చిదో అయిన ఒక కొత్త వ్యసనాన్ని పుట్టించింది వీళ్ళే కదా.." అని నవ్వొచ్చింది. అందరూ తీరిగ్గా ఎవరింట్లో వాళ్ళు కూర్చుని ఫ్రెండ్స్, ఫోటోలు, కబుర్లు అంటూ హాయిగా ఉపయోగించుకుంటున్న ఫేస్ బుక్ సాంకేతిక సదుపాయాలు ఇందులో పని చేసే వాళ్ళందరి కృషి ఫలితం కదా అనిపించింది. మా ఇంటబ్బాయ్ చెప్పిన Mark Zuckerberg జీవిత చరిత్ర గుర్తొచ్చింది. కేవలం ఒక వ్యక్తి మేధస్సులో పుట్టిన ఆలోచన మొత్తం ప్రపంచంలోనే ఎంత పెద్ద మార్పు తీసుకొచ్చిందో.. ఇవాళ అందరి జీవితాల్లోనూ ఫేస్ బుక్ ఒక విడదీయలేని బంధంలా పెనవేసుకుపోయింది కదా అనిపించింది. అటూ ఇటూగా నా అంత వయసున్న అబ్బాయి ఎంత ఘనత సాధించాడు, ప్చ్.. అలాంటి వాళ్ళతో పాటు మనమూ పుట్టినా మనం ఎంత మామూలుగా మిగిలిపోయాం.. అన్న ఆలోచన కూడా వచ్చింది. గొప్ప గొప్ప వాళ్ళ గురించి తలచుకున్నప్పుడల్లా నాకెప్పుడూ వచ్చే ఆలోచన ఇది. మళ్ళీ అంతలోనే నా ఆలోచనలకి నాకే నవ్వొచ్చి మా ఇంటబ్బాయ్ వచ్చుంటే చాలా సంతోషించేవాడు కదాని కొంచెం తనని మిస్సయిన ఫీలింగ్ వచ్చింది. ఫేస్ బుక్ మన జీవితాల్లో తెచ్చిన విప్లవాత్మక మార్పులు ఏంటీ అన్న విషయం మీద చర్చించుకుంటూ అక్కడి నుంచి బయలుదేరాం.




Facebook నుంచి నేరుగా Google కి వెళ్ళాము. Amphitheatre Pkwy, Charleston road పేర్లు చూడగానే Google రాజ్యానికి వచ్చేసాం అనిపించింది. అసలు గూగుల్ ని చూసినప్పుడైతే ఇంకా ఎన్నెన్ని ఆలోచనలు వచ్చాయో! ఒక పదేళ్ళ క్రితం అసలు గూగుల్ అనే పేరు కూడా తెలీని నేను గూగుల్ లేకుండా గడిచే రోజుని ఇప్పుడు

ఊహించలేను. అప్పుడప్పుడూ అనిపిస్తుంటుంది ఉన్నట్టుండి గూగుల్ మాయమైపోతే మన పరిస్థితి ఏంటి అని.. అన్నీటికన్నా ముందు "అమ్మో.. నా బ్లాగు.." అనిపిస్తుంది నాకైతే! ;-) నేను అలా ఆలోచిస్తూ "అసలు గూగులే లేకపోతే ఎక్కడో అమెరికాలో ఉన్న మీరు, జర్మనీలో ఉన్న నేను పరిచయమే అయ్యేవాళ్ళం కాదు కదా.. అంటే గూగుల్ లేకపోతే మన స్నేహమే లేకుండా పోయేదేమో.. మన జీవితాల్ని చాలా మార్చేసింది కదూ.." అంటే కిరణ్ ప్రభ గారు, కాంతి గారు నిజమేనంటూ నవ్వారు. అక్కడ ఫోటోలు తియ్యొచ్చో లేదోనని నేను సందేహపడుతుంటే "ఏం పరవాలేదు. ధైర్యంగా తీసుకో.. వేరే వాటి సంగతి చెప్పలేను గానీ మమ్మల్ని ఫోటోలు తియ్యడానికి వీల్లేదు అని చెప్పే హక్కు మన చరిత్ర మొత్తం తెలుసుకునే గూగుల్ కి బహుశా లేదేమో" అని జోక్ చేసారు కిరణ్ ప్రభ గారు. అక్కడ గూగుల్ కాంపస్లో గూగుల్ లోగోలో కనిపించే రంగుల్లో డిజైన్ చేసిన సైకిళ్ళు కనిపించాయి. నేనూ, కాంతి గారూ ఆ గూగుల్ సైకిళ్ళు తొక్కాలని చాలా సరదాపడ్డాము కానీ మరీ బాగోదేమోనని ఊరికే ఫోటో మాత్రం తీసుకుని వచ్చేశాం. గూగుల్ కాంపస్ పరిసర ప్రాంతాలు మాత్రం చాలా ప్రశాంతంగా ఉన్నాయి. చుట్టూ కొండలు, మైదానాలతో ప్రకృతి ఒడిలో ఉన్నట్టుంది.




Google దగ్గర నుంచి వెళ్ళి Sunnyvale లో ఉన్న Yahoo Headquarters ని చూసినప్పుడు "అసలు ఇప్పుడున్న వాళ్ళందరికీ ఆద్యుడు Yahoo వాడే కదా" అనిపించింది. తొంభైల్లో యాహూ మెయిల్ గురించి మొదటిసారి తెలుసుకున్న రోజులు గుర్తొచ్చాయి. తర్వాత Cupertino లో ఉన్న Apple కాంపస్ కి వెళ్ళాం. సహజంగానే స్టీవ్ జాబ్స్ గురించి తలచుకుంటూనే ఐపాడ్ దగ్గర్నుంచీ ఐపాడ్ మినీ దాకా Apple wonders అన్నీ పుట్టింది ఇక్కడేనన్నమాట అనుకున్నాను. ఎవరేమంటేనేం Apple వాడు మాత్రం జనాల్ని క్షణాల్లో మాయ చేసి వాళ్ళ ప్రోడక్ట్స్ కొనిపించెయ్యగలడు కదానిపించి నవ్వొచ్చింది. వాళ్ళ ప్రొడక్ట్స్ లాగే వాళ్ళ ఆఫీసుల ముందున్న బోర్డులు ఒక్కోటి ఒక్కో రంగు apple లోగో తో చూడగానే నచ్చేసేలా ఉన్నాయి. మొత్తానికి ఇంత చిన్న సిలికాన్ వేలీ మొత్తం ప్రపంచాన్ని ఎంత ప్రభావితం చేసిందో,

చేస్తోందో కదా అనుకుంటూ ఇంకా దారిలో Intel, Oracle, Dell, మన Tata Consultancy Services లాంటివన్నీ చూసుకుంటూ వెళ్ళాము. "ఇప్పుడు నువ్వొచ్చి ఇలా చూస్తుంటే మాక్కూడా ఎప్పుడూ చూసే వీటన్నిటినీ కొత్తగా చూస్తున్నట్టుంది" అన్నారు కిరణ్ ప్రభ గారు.

మనందరికీ చిన్నప్పటి నుంచీ మనకి సంబంధించిన రకరకాల విషయాలను పంచుకోడానికి చుట్టూ ఎప్పుడూ స్నేహితులు ఉంటారు కదా.. కాలేజీ చదువుల వరకూ అందరికీ ఎప్పుడూ పక్కన ఆత్మీయంగా మెలిగే స్నేహితులు ఉంటారు గానీ ఆ తర్వాత ఉద్యోగాలు, పెళ్ళిళ్ళు దశలోకి వచ్చాక రకరకాల కారణాల వల్ల అప్పటిదాకా ఉన్న ప్రపంచం నుంచి మనకి దూరం పెరిగిపోయి మన చుట్టూ ఒక పెద్ద ఖాళీ ఏర్పడుతుంది. అంటే మనుషులు ఉండరని కాదు. పరిచయాలు ఉంటాయి కానీ మనసుకి దగ్గరైన స్నేహాలు ఉండడం అరుదు. అంటే ఉదాహరణకి అప్పటికప్పుడు సినిమాకి వెళ్ళడానికో, ఊరికే కాలక్షేపం చెయ్యడానికో ఏ ఆఫీస్ కోలీగో, ఫ్రెండో దొరకొచ్చు. కానీ, ఆ సినిమా కథ గురించో, పాటల గురించో, మనకి నచ్చిన పుస్తకం గురించో విశ్లేషిస్తూ చర్చించతగిన స్నేహితులు దొరక్కపోవచ్చు. బయటికి కనిపించే చదువు, ఉద్యోగం, రోజువారీ విషయాలు కాకుండా మన ఆలోచనలు, అభిప్రాయాలు, భావాలు పంచుకోడానికి మన వ్యక్తిత్వాన్ని పోలిన, మన మనసుకి దగ్గరగా తోచే స్నేహితులు దొరకడం కష్టమైపోతుంది. అలాంటి దశలో ఈ గూగుల్, ఫేస్ బుక్ లాంటివన్నీ మొత్తం ప్రపంచాన్ని తీసుకొచ్చి మన ముందు నిలబెడతాయి. కవిత్వం, సాహిత్యం, రాజకీయాలు, చరిత్ర, సైన్సు, ఆటలు, పాటలు.. మన ఆసక్తి ఏదైనా సరే మనలా ఆలోచించేవాళ్ళు, అచ్చం మనలాగే ఫీలయ్యేవాళ్ళు బోల్డుమందిని మనకి అరచేతిలో నిలబెట్టి చూపిస్తుంది. స్నేహం గురించి ఒక నానుడి ఉంది. ఎవరైనా ఒక విషయం చెప్పగానే "నువ్వు కూడానా.. అచ్చం నేనూ అంతే.." అనే మాటతోనే స్నేహం మొదలవుతుందట. ఇంతకీ నేను చెప్పొచ్చేది ఏంటంటే, మనుషుల మధ్యన ఉండే ఇలాంటి భావసారూప్యతే మన మధ్యన ఉండే దూరాన్ని సైతం లెక్క చేయక వారితో మనకి సాన్నిహిత్యాన్ని, అనుబంధాన్ని పెంచుతుంది. అలా ఏర్పడిన స్నేహాలు అమితమైన సంతోషాన్ని, ఆత్మసంతృప్తిని ఇవ్వడమే కాకుండా జీవితకాలపు అనుబంధాలుగా శాశ్వతంగా నిలిచిపోయే అవకాశం ఉంటుంది.

కేవలం ఆన్లైన్ స్నేహితులే కదా అనో, ఆన్లైన్ స్నేహితులు ఇంత ఆప్తబంధువుల్లా మారిపోతారా అని ఎవరికైనా విచిత్రంగా అనిపిస్తే ఒకోసారి అది ఎలా వివరిస్తే వారికి అర్థమవుతుందో వెంటనే తోచదు. కానీ ఆలోచిస్తే, మామూలుగా ఏ బస్సులోనో, రైల్లోనో, స్కూల్లోనో, కాలేజీలోనో కలుసుకుని స్నేహితులైనట్టుగానే ఇప్పుడు గూగుల్, ఫేస్ బుక్, యాహూ లాంటి వాటిల్లో పరిచయాలు ఏర్పడుతున్నాయంతే కదా! పరిచయం ఎక్కడ మొదలైంది అన్నదాన్ని బట్టి ఆ అనుబంధాల గాఢతని అంచనా వెయ్యడం సరికాదేమో అనిపిస్తుంది. ఒకోసారి పదేళ్ళు పక్కింట్లోనే ఉన్నా

మనకి స్నేహం కలవకపోవచ్చు, ప్రపంచానికి ఆవలి పక్కన ఉంటూ కూడా ప్రాణస్నేహితుల్లా మెలిగేవారు ఉండొచ్చు కదా! ఒకప్పటి కలం స్నేహాలు ఇప్పటి ఆన్లైన్ స్నేహాలు ఒకలాంటివేనేమో అని కూడా అనిపిస్తుంటుంది నాకు. కాకపోతే ఇప్పటిదాకా ఉన్నవాటి కంటే ఈ ఇంటర్నెట్ మాధ్యమం అన్ని రకాలుగానూ మరింత శక్తివంతమైనది. స్పైడర్ మేన్ సినిమాలో "With great power comes great responsibility" అని చెప్పినట్టు కాస్త ఎక్కువ జాగ్రత్తే అవసరమేమో!

మొత్తానికి ఈ సోషల్ నెట్వర్కింగ్ కంపెనీలని చూస్తూ తిరగడం, మా స్నేహం కూడా ఇలానే మొదలవ్వడం వల్లనుకుంటా.. ఈ సాయంత్రపు సిలికాన్ వ్యాలీ విహారం నాలో రకరకాల ఆలోచనలని కదిలించింది. ఇలా ఎక్కడెక్కడికో వెళ్ళిపోయి బోల్డు విషయాలు చర్చించుకుంటూ తిరిగేసరికి మా ముగ్గురికీ చాలా ఆకలేసింది కూడా. మేము Cupertino లో ఉన్నప్పుడు అక్కడ కిరణ్ ప్రభ గారి ఆప్తమిత్రులు ఒకరింటికి వెళదామనుకుని ఆయనకి ఫోన్ చేస్తే "నేనిప్పుడే ఇండియా నుంచి వచ్చాను. ఇంట్లోనే ఉన్నాను రండి" అని ఆహ్వానించారు. ఆయన్ని అందరూ GD గారని పిలుస్తారని, చాలా పెద్ద వ్యాపారవేత్త అని, ఇప్పుడు ఇండియాలో ఉంటున్నారు కానీ బిజినెస్ పనుల మీద ఇండియాకి, అమెరికాకి తరచూ తిరుగుతూ ఉంటారని కిరణ్ ప్రభ గారు చెప్పారు. "వాళ్ళ తోటలో పెద్ద కరివేపాకు చెట్టుంటుంది కాబట్టి మనం తాజా కరివేపాకు కూడా కోసుకొచ్చుకోవచ్చు" అని కాంతి గారు ఉత్సాహపడ్డారు. GD గారింటికి వెళ్ళగానే ఆయన సాదరంగా ఆహ్వానించి అప్పుడే ఇండియా నుంచి తీసుకొచ్చిన నువ్వులడ్డు ఇచ్చారు. అసలే ఆకలేస్తుందేమో చాలా రుచిగా ఉందనిపించింది. కాసేపు వాళ్ళ కబుర్లు విన్నాక "మనం వెళ్ళి కరివేపాకు కోసుకుందాం" అన్నారు కాంతి గారు. మా ఇద్దరితో పాటు GD గారు కూడా తోటలోకి వచ్చి సాయం చేస్తానంటే పర్లేదండీ అని చెప్పి ఆయన్ని పంపించేసాం. నిమ్మచెట్టు మీద పచ్చగా పండి నిగనిగలాడుతున్న నిమ్మకాయలు, లేత కరివేపాకు కోసుకున్నాం. కిరణ్ ప్రభ గారు GD గారికి నన్ను పరిచయం చేస్తూ "రీసెర్చ్ కాకుండా కథలు అవీ రాస్తూ ఉంటుందీ అమ్మాయి. మాకు అలానే పరిచయం అయ్యింది కౌముది ద్వారా.." అని చెప్తే GD గారు "డబ్బు సంపాదించడమన్నా కాస్త సులువేమో గానీ మీ అందరిలాగా కథలు, కవిత్వాలు రాయడం అంటే మహా కష్టమైన పనండీ.. నాకైతే అసాధ్యం" అని జోక్ చేస్తే అంత పెద్ద మాట అనకండి మీరని నవ్వేశాం మేము. మాటల మధ్యలో వచ్చే నెలలో కీరవాణి గారు, రాజమౌళి గారు వస్తున్నారని, కీరవాణి మ్యూజిక్ కన్సర్ట్ ఉంటుందని GD గారు చెప్పారు. తర్వాత మేము వాళ్ళకి టాటా చెప్పేసి కార్లో వెనక్కి వస్తున్నప్పుడు "GD గారు అంత మాములుగా కనిపిస్తున్నారు గానీ చాలా గొప్ప వ్యక్తి. కానీ ఎంత ఎదిగినా ఒదిగి ఉండటం అంటారు కదా అలాంటి వ్యక్తిత్వం ఆయనది. గొప్ప స్నేహశీలి. ఇటీవల శ్రీరామరాజ్యం, ఈగ లాంటి సినిమాలకి గ్రాఫిక్స్ వర్క్ చేసిన మకుట గ్రాఫిక్స్ సంస్థ GD గారికి చెందినదే. ఆయనకి సినిమా పరిశ్రమతో చక్కటి స్నేహాలు ఉన్నాయి. కీరవాణి, రాజమౌళి ఆయనకి దగ్గరి స్నేహితులు అవడం వల్ల కన్సర్ట్

సంగతి ముందే తెలిసింది." అని కిరణ్ ప్రభ గారు చెప్పారు. Cupertino లో ఇదివరకు కిరణ్ ప్రభ గారు పని చేసిన ఆఫీసు, అప్పట్లో ఆరేళ్ళ పాటు వాళ్ళు ఉన్న ఇళ్ళు, వీధులు చూసుకుంటూ అక్కడి నుంచీ డిన్నర్ చెయ్యడానికి Santa Clara లో ఉన్న Dosai Place కి వెళ్ళాం.






అమెరికాలో, అందునా బే ఏరియాలో, సిలికాన్ వ్యాలీలో ఎప్పుడు తల తిప్పి చూసినా చుట్టూ ఇండియన్స్ కనిపిస్తూనే ఉంటారు కాబట్టి సహజంగానే బోలెడు ఇండియన్ రెస్టారెంట్లు ఉన్నాయి. కానీ Dosai Place యజమాని సాగర్ గారు తనకి చాలా మంచి మిత్రులని, అలాంటి మంచి వ్యక్తులని తప్పకుండా కలిసి తీరాలని నన్ను అక్కడికి తీసుకెళుతున్నానని కిరణ్ ప్రభ గారు చెప్పారు. అక్కడికి వెళ్ళే ముందే సాగర్ గారికి ఫోన్ చేస్తే ఆయన రెస్టారెంట్లోనే ఉన్నానని చెప్పారు. మేము అక్కడికి వెళ్ళి కూర్చున్నాక ఫుడ్ ఆర్డర్ చేసి తిని బయటికి రావడానికి దాదాపు గంటన్నర పైనే పట్టింది. అంతసేపూ కూడా సాగర్ గారు మా పక్కనే కూర్చుని బోల్డు కబుర్లు చెప్పారు. అమెరికాలో వస్తున్న తెలుగు మాసపత్రిక 'నమస్తే ఆంధ్ర' కూడా సాగర్ గారిదేనని తెలిసింది. నన్ను పరిచయం చేస్తూ "మధుర రాసినవి కూడా గతంలో 'నమస్తే ఆంధ్ర' లో వేసారు. తను వచ్చినప్పుడు ఇద్దామని ఒక పత్రిక కాపీ తీసి దాచాను. కానీ అదెలాగో మిస్ అయింది" అని కిరణ్ ప్రభ గారు చెప్తే సాగర్ గారు వెంటనే "ఎప్పుడు ఏ నెలలో వచ్చిందో చెప్పండి. నేను కాపీ దొరుకుతుందేమో ప్రయత్నిస్తాను" అని ఎవరికో ఫోన్ చేయబోయారు. "ఫిబ్రవరి 2012 లో వాలెంటైన్స్ డే స్పెషల్ పేజీలో ప్రేమలేఖ లాగా నేను రాసిన పోస్టుని తీసుకుని వేసారండీ. కలర్ పేజీలో అందంగా డిజైన్ చేసారని అప్పట్లో నాకోసం ఒక కాపీ తీసిపెట్టారు కిరణ్ ప్రభ గారు. కానీ, చాలా రోజులైపోయింది కదండీ. ఇప్పుడంత కష్టపడి వెతకడం ఎందుకులెండి. పర్లేదు" అని చెప్పి ఆయన్ని వారించాను నేను. సాగర్ గారి చిన్ననాటి స్నేహితుడి వాళ్ళ అబ్బాయి జర్మనీలో మాస్టర్స్ చదువుకోడానికి వచ్చాడని, తనతో మాట్లాడి తనకి ఏమన్నా సహాయం

అవసరమైతే చెయ్యమని నన్ను కోరారు. ఆ అబ్బాయి పేరు భరత్. అలాగేనని చెప్పి నా ఈమెయిలు ఐడీ ఇచ్చి వస్తే తెల్లారి భరత్ మెయిల్ చేసి "జర్మనీ వచ్చాక మాట్లాడతాను అక్కా.. చాలా థాంక్స్.." అని చెప్పాడు. భలే చిత్రంగా అమెరికా వెళ్ళడం వల్ల జర్మనీలో ఇంకో కొత్త పరిచయం ఏర్పడింది. త్వరలో జరగబోతున్న NATS సభల కోసం ఇండియా నుంచి నందమూరి బాలకృష్ణ వచ్చారని, భోజనం ఇక్కడి నుంచే పంపిస్తున్నారని సాగర్ గారు చెప్తుంటే మాటల్లో ఎన్టీఆర్ గురించి వచ్చింది. కిరణ్ ప్రభ గారు విశ్వవిఖ్యాత నటసార్వభౌమ NTR సినీ జీవిత ప్రస్థానం గురించి చేసిన రేడియో ప్రోగ్రాం మొత్తం 13 భాగాలు కలిపి 24 గంటల నిడివి వచ్చింది. అంటే ఆపకుండా 24 గంటల పాటు ఎన్టీఆర్ సినీజీవిత విశేషాలు వినొచ్చన్నమాట. ఈ సంగతి తెలిసిన సాగర్ గారు చాలా ఉత్సాహంగా ఆ ప్రోగ్రాం సీడీ చేసి ఇస్తే NATS కి వెళ్ళినప్పుడు బాలకృష్ణకి ఇస్తానని, ఆయన ఎన్టీఆర్ గురించి అంత మంచి ప్రోగ్రాం వింటే చాలా సంతోషిస్తారని చెప్పారు. ఆ రోజు డిన్నర్లో రుచి చూసిన పుణుగులు, కొత్తు పరాటా, ఊతప్పం, గోబీ 65, వెజ్ బిరియానీ అన్నీ చాలా బాగున్నాయి. అంత చక్కటి ఆతిథ్యాన్ని ఇచ్చిన సాగర్ గారు బిల్ తీసుకోడానికి మాత్రం ససేమిరా అని మళ్ళీ తప్పకుండా రండి అని చెప్పి గుమ్మం దాకా వచ్చి సాగనంపారు. వచ్చే వారం నిషి వచ్చినప్పుడు వీలైతే మళ్ళీ వస్తాం అని చెప్పాం కానీ మాకు మళ్ళీ కుదరనేలేదు. Dosai Place నుంచి ఇంటికొచ్చేసరికి రాత్రి దాదాపు పదకొండు గంటలయింది. అప్పటికే బాగా అలసిపోయున్నామేమో వెంటనే నిద్రొచ్చేసింది.

## 18.06.2013

## మంగళవారం



ఈ రోజు ఉదయమంతా నేనూ, కాంతి గారూ యథావిధిగా కబుర్లు చెప్పుకున్నాం. మధ్యాహ్నం లంచ్ తర్వాత కిరణ్ ప్రభ గారు మా ఇద్దర్నీ Stone ridge mall లో దింపి వెళ్ళారు. సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చేప్పుడు మళ్ళీ పికప్ చేసుకుంటానని చెప్పారు. మా ఇద్దరికీ కాళ్ళు నొప్పులు పుట్టేదాకా సాయంత్రం వరకూ బోల్డు షాపులు తిరిగేశాం. మాకోసం కొనుక్కోడానికి పెద్దగా నచ్చినవేమీ కనిపించలేదు గానీ ఆ రోజు మా ఇంటబ్బాయ్ కోసం చాలా బట్టలు కొన్నాం. ఆ రోజు సెలెక్షన్ అంతా కాంతి గారిదే. తనకి ఈ కలర్ బాగుంటుంది, ఆ డిజైన్ బాగుంటుంది అనుకుంటూ బోల్డు చొక్కాలు కొనేసాం. కష్టపడి ఆ షాపింగ్ బ్యాగులన్నీ మోసుకుని మాల్ బయటకొచ్చి కిరణ్ ప్రభ గారికి కాల్ చేస్తే పది నిమిషాల్లో వచ్చి మమ్మల్ని ఇంటికి తీసుకెళ్ళారు. అక్కడేమన్నా కొనుక్కుని తినాలన్న ధ్యాస కూడా లేనంతగా షాపింగ్లో మునిగిపోయేసరికి బోల్డు అలసిపోయి చాలా ఆకలేసింది.ఇంటికి వెళ్ళగానే వేడి వేడిగా టొమాటో సూప్ తాగి, పాప్ కార్న తిని హమ్మయ్యా అనుకున్నాం. :-)

ఆ రోజు మంగళవారం కాబట్టి కిరణ్ ప్రభ గారికి 'విరిజల్లు' రేడియో షో ఉంటుంది కాబట్టి బయటికి ఎక్కడికీ వెళ్ళే ప్లాన్ లేదు. ఆయన అరవై సంవత్సరాల 'దేవదాసు' సినిమా గురించి రేడియో ప్రోగ్రాం చేస్తుంటే నేనూ, కాంతి గారూ కూడా శ్రద్ధగా విన్నాం. రేడియో షో అయిపోగానే కిరణ్ ప్రభ గారికి ఎవరో ఫోన్ చేసి పది నిమిషాల్లో ఇంటికి వస్తున్నాం అని చెప్పారు. ఆ వచ్చేది సిరివెన్నెల సీతారామశాస్త్రి గారి తమ్ముడు శ్రీరామ్ గారు అని కాంతి గారు నాతో చెప్పారు. కాసేపటికే శ్రీరామ్ గారు, వారి స్నేహితుడితో కలిసి వచ్చారు. ఆయన రూపం, మాట్లాడుతుంటే గొంతు రెండూ సిరివెన్నెల గారిని బాగా గుర్తు చేసాయి. ఎవరూ చెప్పకుండానే సిరివెన్నెల గారికి, ఈయనకీ ఏమన్నా బంధుత్వం ఉందేమోనని మనకే తెలిసిపోతుంది. కిరణ్ ప్రభ గారు, శ్రీరామ్ గారు ఎవరెవరో చాలా మంది గురించి యోగక్షేమాలు మాట్లాడుకుంటూ ఉంటే నేను వింటూ కూర్చున్నాను. శ్రీరామ్ గారి అమ్మాయి, మనవలతో కలిసి సెలవలకని అమెరికా వచ్చారట. ఆ రోజు ఉదయం నుంచీ Napa valley లో తిరిగి వెనక్కి వస్తూ ఇక్కడికి వచ్చారట. అందరూ రావలసింది గానీ మధ్యలో పిల్లలు అలసిపోయి గొడవ పెట్టేసరికి వాళ్ళు వేరే కారులో ఇంటికి వెళ్ళిపోయారని చెప్పారు. వాళ్ళందరూ ఇదివరకు చాలాసార్లే వచ్చారని, అందరితోనూ కిరణ్ ప్రభ గారికి మంచి స్నేహం ఉందని తెలిసింది. శ్రీరామ్ గారు మాటల్లో వాళ్ళ అల్లుడు గారు పవన్ కళ్యాణ్ 'అత్తారింటికి దారేది' సినిమాతో బిజీగా ఉండి ఈ ట్రిప్ కి రాలేకపోయారని చెప్పారు. తర్వాత మిగతా సినిమాల గురించి ఇంకా ఏవో మాటలు విన్నాక వారి అల్లుడు గారంటే త్రివిక్రమ్ శ్రీనివాస్ గారని నాకు అర్థమైంది. శ్రీరామ్ గారికి నన్ను పరిచయం చేస్తూ జర్మనీలో PhD అని చెప్తే ఆయన మా ఊరు, నాన్న గారి వివరాలు అడిగారు. వాళ్ళ స్నేహితుడి అమ్మాయి ఎవరో జర్మనీలో PhD చేసిందని, ఒకవేళ అది నేనేనేమో అనిపించి అడిగానని అన్నారు. "సిరివెన్నెల తరంగాలు పుస్తకం మళ్ళీ ఎప్పుడు అచ్చు

వేస్తారండీ" అని నేను అడిగితే "తెలీదమ్మా.. చెప్పలేం. అన్నయ్య నిర్ణయిస్తారు ఏ విషయమూ.. అయినా ఇప్పుడు కౌముదిలో వస్తోందిగా.." అన్నారు. శ్రీరామ్ గారు ఉన్నంతసేపు సిరివెన్నెల గారి గురించి కబుర్లు వినడం భలే అనిపించింది.

ఒక గంట పైన కూర్చుని శ్రీరామ్ గారు వాళ్ళు వెళ్ళిపోయాక "సిరివెన్నెల గారు 2004 లో అమెరికా వచ్చినప్పుడు మనింట్లో నలభై రోజులు ఉన్నారు" అని కిరణ్ ప్రభ గారు చెప్పారు. "2008 లో వచ్చినప్పుడు ఇప్పుడు నువ్వు ఉన్న గదిలోనే పది రోజులు ఉన్నారు" అని కాంతి గారు చెప్పగానే నేను ఆశ్చర్యంతో ఎగిరి గంతేసినంత పని చేసాను. నిజంగా నిజమా అని మళ్ళీ మళ్ళీ అడిగితే "నీ గదిలో బీరువా మీదున్న ఫోటో మాగ్నెట్ చూసావా.. అది సిరివెన్నెల గారిని San Francisco తీసుకెళ్ళినప్పుడు దిగిన ఫోటో.." అని మళ్ళీ ఒకసారి దగ్గరుండి చూపించారు కాంతి గారు. "ఈ గదిలో చాలామంది ప్రత్యేక అతిథులు ఉన్నారమ్మా.. సిరివెన్నెల గారు, గొల్లపూడి మారుతీరావు గారు, మల్లాది వెంకటకృష్ణమూర్తి గారు, బలభద్రపాత్రుని రమణి గారు, జొన్నవిత్తుల గారు, ఆకెళ్ళ గారు, ఆర్పీ పట్నాయక్, పార్వతి మెల్టన్, శర్వానంద్, పబ్లిసిటీ ఆర్టిస్ట్ ఈశ్వర్ గారు, రామజోగయ్య శాస్త్రి గారు.. వీళ్ళందరూ కాక ఇంకా మధుర అనే అమ్మాయి కూడా ఉంది. అయినా మధుర మాత్రం గెస్టు కాదులే, ఈ రూమ్ ఇంక తనకేనని ఇచ్చేసాం.." అని నవ్వారు కిరణ్ ప్రభ గారు. "అయ్య బాబోయ్.. అంతమంది గొప్పవాళ్ళు ఉన్నారా ఈ గదిలో.." అని నేనింకా బోల్డు ఆశ్చర్యపోతూనే ఉన్నాను ఆ పూటంతా. ఆ ఆశ్చర్యంలోనే అన్నం తినేసి, నిద్ర కూడా పోయాను ఆ రోజుకి. :-)

ఎప్పుడెప్పుడు తెల్లారిపోయి బుధవారం వస్తుందా అని కాంతి గారు, నేను తెగ ఆరాటపడిపోవడం మొదలెట్టాం. ఎందుకంటే నిషి వచ్చేది రేపే కదా మరి! :-)

## My San Francisco Diary - 8

## 19.06.2013

## బుధవారం

నేను ఉదయం నిద్ర లేచి కిందకి దిగేసరికి అప్పటికే కాంతి గారు కిచెన్లో బిజీ బిజీగా కనిపించారు. నన్ను మెట్ల మీది నుంచి దిగుతుంటే చూస్తూనే "రాత్రి బాగా నిద్ర పట్టిందా తల్లీ.. జర్మనీ నుంచి ఫోన్లో మేలుకొలుపు

సేవ అయ్యిందా?" అని అడుగుతూనే నాకు గ్రీన్ టీ కోసం కప్ లో నీళ్ళు నింపి మైక్రోవేవ్లో పెట్టేసారు. నేను బద్ధకంగా సోఫాలో కూర్చుని ఫోను విశేషాలు చెప్తుంటే కిరణ్ ప్రభ గారు మార్నింగ్ వాక్ నుంచి వచ్చేసారు. "నేనొక పావుగంట ముందు వచ్చుంటే ఈ రోజు మీతో పాటు వచ్చుండేదాన్ని. మళ్ళీ మిస్సయ్యాను" అన్నాను. "పర్లేదులేమ్మా.. గొల్లపూడి గారితో ఫోనులో మాట్లాడాను. మధుర వచ్చేసిందంటే ఈసారి నువ్వున్నప్పుడు మాట్లాడమని చెప్పారు. నిషి కూడా వస్తోంది. ఇద్దరితో ఒకేసారి మాట్లాడిస్తానని చెప్పాను" అన్నారు కిరణ్ ప్రభ గారు. "ఇంకో రెండు గంటల్లో నిషికి లంచ్ టైం అయిపోతుంది. ఆఫీస్ నుంచి బయలుదేరిపోతుంది. ఇంక ఎయిర్పోర్ట్ కి వెళ్ళి విమానం ఎక్కడమే తరువాయి. మన లంచ్ టైము కల్లా తను ఫ్లైట్లో ఉంటుంది.." అంటూ లెక్కలు వెయ్యడం మొదలు పెట్టారు కాంతి గారు. ఆ రోజంతా ఇంకో బెడ్ రూమ్ ముందు నుంచీ తిరిగినప్పుడల్లా "ఇంకొక్క పూట ఆగితే ఈ గదిలో నిషి కనిపిస్తుంది కదా.." అనుకోవడమే సరిపోయింది మాకు. పద్మవల్లి గారు ఫోన్ చేసి నిషి కోసం ఎలా ఎదురుచూస్తున్నామో కనుక్కుని కాసేపు కబుర్లు చెప్పి "నా బదులు కూడా ఎంజాయ్ చెయ్యండి" అని చెప్పారు. ఇలా ఆ మాటా ఈ మాటా చెప్పుకుంటూ ఉండగానే లంచ్ టైం అయిపోయి కిరణ్ ప్రభ గారు ఆఫీసు నుంచి వచ్చారు.

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన నగరాలన్నీటికీ ఆ ఊరి పేరు చెప్పగానే గుర్తొచ్చే 'landmark' లాంటి చిహ్నాలు కొన్ని ఉంటాయి కదా.. Paris అనగానే Eiffel tower, Berlin అనగానే Brandenburg gate గుర్తొచ్చినట్టు San Francisco అనగానే Golden Gate Bridge గుర్తొస్తుంది. ప్రపంచంలోనే అత్యధికంగా ఫోటోలు తీయబడిన బ్రిడ్జి బహుశా ఇదేనేమోనని ఏవో సర్వేల్లో కూడా తెలిసిందట. San Francisco వచ్చిన దగ్గరి నుంచీ మిగతావాటి సంగతెలా ఉన్నా ఎప్పుడెప్పుడు గోల్డెన్ గేట్ బ్రిడ్జ్ చూద్దామా అని బోల్డు ఉత్సాహంగా ఉంది. అది చూడ్డానికి ఎప్పుడు వెళదామన్న మాటలు వచ్చినప్పుడు "నాకు గోల్డెన్ గేట్ బ్రిడ్జ్ పగటి వెలుగులో మాత్రమే కాకుండా చీకటి పడుతుండగా సిటీ లైట్స్ కాంతుల్లో చూడాలనుంది. ఇప్పుడు పౌర్ణమి రోజులు వస్తున్నాయి కాబట్టి ఇంకా వెన్నెల్లో కూడా చూస్తే బావుంటుంది కదా.." అన్నాను నేను. "దానికేం భాగ్యం.. అలానే చేద్దాం. నిషిని రిసీవ్ చేసుకోడానికి ఎయిర్పోర్ట్ కి వెళ్ళాల్సింది ఎలాగూ లేట్ నైట్ కాబట్టి ఆ రోజు సాయంత్రం మనం గోల్డెన్ గేట్ బ్రిడ్జ్ చూడటానికి వెళ్తే నువ్వు అడిగిన అన్ని రకాల దృశ్యాలు చూసేయ్యొచ్చు" అన్నారు కిరణ్ ప్రభ గారు. కాబట్టి ఆ ప్లాన్ ప్రకారం "సాయంత్రం ఆరింటికల్లా ఆఫీసు నుంచి వస్తాను. మీరు రెడీగా ఉంటే బయలుదేరదాం" అని చెప్పారు.



San Francisco – Oakland Bay Bridge

అనుకున్నట్టుగానే సాయంకాలం ఆరు దాటేసరికి శాన్ ఫ్రాన్సిస్కో బయలుదేరాము. కార్లోకి ఎక్కగానే "మళ్ళీ ఇంటికి తిరిగొచ్చేప్పుడు నా పక్కన నిషీ ఉంటుందోచ్.." అని సంబరపడిపోయారు కాంతి గారు. "సాయంకాలం ఆ టైముకి శాన్ ఫ్రాన్సిస్కో సిటీలో ఉద్యోగాలు చేసేవాళ్ళందరూ విధులు ముగించుకుని ఇంటి దారి పడతారు కాబట్టి సిటీ నుంచి బయటికొచ్చే దారులన్నీ బాగా బిజీగా ఉంటాయి కానీ మనం సిటీలోకి వెళతాం కాబట్టి ట్రాఫిక్ కాస్త తక్కువే ఉండొచ్చు" అన్నారు కిరణ్ ప్రభ గారు. వెళ్ళే దారిలో ఇంకొక పెద్ద వంతెన మీద నుంచి వెళ్ళాం. దాన్ని 'బే బ్రిడ్జ్' అంటారని చెప్పారు. అది కూడా బోల్డు విశాలంగా, వందల కొద్దీ కార్లతో నిండిపోయి భలే అందంగా ఉంది. కొద్దిగా ట్రాఫిక్ ఉన్నాసరే దాదాపు గంట సేపట్లో మేము సిటీలోకి ప్రవేశించాం. శాన్ ఫ్రాన్సిస్కో ఊరి వీధుల గుండా గోల్డెన్ గేట్ బ్రిడ్జ్ వైపు వెళుతూ ఉంటే ఆ వీధులన్నీ ఎగుడు దిగుడుగా పైకీ కిందకీ ఎత్తు పల్లాలతో భలే ఉన్నాయి. ఆ వీధుల్లో కార్లో వెళుతూ ఉంటే అదేదో ఫన్ రైడ్స్ ఎక్కినట్టు సరదాగా అనిపించింది. కారు ఎత్తు మీద ఉన్నప్పుడు ఎదురుగా కనుచూపుమేరా ఉన్న రోడ్డుని చూస్తే చిన్నప్పుడు ఫిజిక్స్ లో చదువుకున్న తరంగాల (waves, nodes) బొమ్మలు గుర్తొచ్చాయి. ఏదో పెయింటింగ్ లో గీసినట్టు పైకి చూస్తేనేమో నీలాకాశం, ఆ wavy road చివరన లేత నీలం రంగులో సముద్రం.. అద్భుతం అనిపించింది. కార్ ని కనుక ఇక్కడ వదిలేస్తే అలా జారుడుబండ లాంటి రోడ్డు మీద జారుతూ వెళ్ళి సముద్రంలో దూకేస్తుందా అన్న చిలిపి ఆలోచన కూడా వచ్చింది. :-)





"Golden Gate Bridge దగ్గర సంవత్సరం పొడవునా ఎక్కువ శాతం మబ్బులు, పొగ మంచు ఉంటాయి. ఎప్పుడో ఒకసారి చాలా అరుదుగా, వెళ్ళి చూసేవాళ్ళు అదృష్టవంతులైతే ఆకాశం తేటగా ఉండి బ్రిడ్జి మొత్తం క్లియర్ గా కనపడుతుంది. ఈ రోజెలా ఉంటుందో చూద్దాం" అన్నారు కిరణ్ ప్రభ గారు. మేము అక్కడిదాకా వెళ్ళేసరికి అస్సలే మాత్రం మబ్బుల జాడే లేని ఆకాశం పూర్తి నీలంగా ఎండలో మెరుస్తూ ఎర్రటి వంతెనని మరింత మెరిపిస్తూ కనిపించింది. "అయితే నేను బోల్డు అదృష్టవంతురాలినని గోల్డెన్ గేట్ చెప్తోందన్నమాట" అంటే కాంతి గారు నవ్వి "ఆ మాట ఇప్పుడు కొత్తగా గోల్డెన్ గేట్ వచ్చి చెప్పాలా ఏంటీ.. నాకు ముందే తెలుసు ఈ రోజు వాతావరణం బాగుంటుందని" అన్నారు కాంతి గారు. గోల్డెన్ గేట్ బ్రిడ్జిని దూరం నుంచి చిన్నగా చూసినప్పుడు Paris వెళ్ళినప్పుడు దూరం నుంచి మొదటిసారి ఐఫిల్ టవర్ చిన్న బొమ్మలాగా కనిపించిన దృశ్యం జ్ఞాపకం వచ్చింది. అప్పుడు వెంటనే "ఇదేనా ఐఫిల్ టవర్! అస్సలేమాత్రం ప్రత్యేకత లేనట్టు అన్నీ రేడియో టవర్లలాగే ఇంత మామూలుగా అనిపిస్తుందేంటి.. నేను బోల్డు గొప్పగా ఊహించుకున్నానే.." అని కాస్త నిరాశగా అనిపించింది. కానీ నేరుగా ఐఫిల్ టవర్ ముందుకెళ్ళి నించున్నప్పుడు మాత్రం అస్సలు రెప్ప వెయ్యలేదు. ఎత్తిన తల దించకుండా అలా దానికేసి చూస్తూ ఉండిపోయాను. అప్పుడెంత ఎక్సైటింగా అనిపించిందంటే "అబ్బా.. అసలు ప్రపంచంలోని అదృష్టవంతులందరూ పారిస్ లోనే ఉంటారేమో! ఎంచక్కా దీన్ని చూస్తూ ఈ చుట్టుపక్కలే ఏదోక పని చేసుకుంటూ ఇక్కడే ఉండిపోతే ఎంత బావుంటుంది అనిపించింది. ఒక ప్రదేశాన్ని చూసి అంతగా మైమరచిపోయి మనసు పారేసుకోడం అదే మొదటిసారి నాకు! ఇప్పుడు కూడా ఆ లేత నీలం రంగు సముద్రాన్ని, దాని మీద ఠీవీగా ఎరుపు రంగులో వెలిగిపోతున్న గోల్డెన్ గేట్ బ్రిడ్జ్ ని చూసినప్పుడు కూడా అచ్చం అలాంటి అనుభూతే కలిగింది. :-)

మేము అక్కడికి వెళ్ళేసరికి టైము ఏడు గంటలు దాటుతున్నా కూడా వేసవి కాలం ఎండ పట్టపగలుని తలపిస్తోంది. కార్ పార్క్ చేసి బ్రిడ్జ్ పెవిలియన్ వైపు వెళ్ళగానే హోరుమని వీచే సముద్రపు గాలి హలో చెప్పింది. ఆ

గాలి అలజడికి జుట్టొక్కటే కాదు మొత్తంగా మనల్నే ఎగరేసుకు వెళ్ళేంత దుడుకుగా వీస్తోంది గాలి. కాంతి గారు రెండు నిమిషాల కన్నా ఎక్కువసేపు బయట నిలబడలేక "మీరిద్దరూ వెళ్ళి తిరిగేసి రండి. నేను మాత్రం రాలేను ఇంత గాలిలో. కార్లో కూర్చుంటాను. నువ్వైనా వెళ్ళలేవేమో తల్లీ.." అన్నారు. "ఉహూ.. ఇంకా నయంలే.. సముద్రం ఎదురుగ్గా నించుని అంత ప్రేమగా పిలుస్తుంటే గాలేం ఖర్మ వానొచ్చినా ఆగే ప్రసక్తే లేదు. నేను వెళ్ళాల్సిందే" అని చెప్పి కిరణ్ ప్రభ గారితో కలిసి బయలుదేరాను. ఆ చుట్టుపక్కల ఒక్కో చోట నించుని చూస్తే ఒక్కో కొత్త కోణంలో కనిపిస్తోంది గోల్డెన్ గేట్ బ్రిడ్జ్. శాన్ ఫ్రాన్సిస్కో బే వెళ్ళి పసిఫిక్ మహా సముద్రంలో కలిసే చోటు పేరు 'గోల్డెన్ గేట్' అని, దాని మీద నిర్మించిన వంతెన కాబట్టే ఆ పేరొచ్చిందని చూసాక "బంగారు రంగులో కాకుండా ఎర్రగా మెరిసే వంతెనని పట్టుకుని గోల్డెన్ గేట్ అని ఎందుకంటున్నారబ్బా.." అన్న నా ప్రశ్నకి సమాధానం దొరికేసింది. ప్రపంచం మొత్తంలోనే మానవ నిర్మితాలైన ఇంజనీరింగ్ అద్భుతాల్లో ఒకటైన ఈ గోల్డెన్ గేట్ బ్రిడ్జి ఎందుకంత గొప్ప నిర్మాణమో వివరిస్తూ దానికి సంబంధించిన అన్నీ రకాల సాంకేతిక విశేషాలతో బోలెడు సమాచారాన్ని పర్యాటకుల కోసం ప్రదర్శనకి పెట్టారు. మేము అవన్నీ ఒక్కొక్కటే చూస్తూ ముందుకి వెళుతుంటే ఆకాశంలో సూర్యాస్తమయానికి సన్నాహాలు మొదలయ్యాయి.



"అలా నడుస్తూ బ్రిడ్జి పైకి వెళ్ళి , అక్కడి నుంచి కింద వైపుకి, తర్వాత బ్రిడ్జికి ఇంకో వైపు కూడా వెళ్ళి అన్నీ కోణాల్లో చూసొద్దాం పద" అని కిరణ్ ప్రభ గారు నడుస్తుంటే నేను ఆయన్ని అనుసరించాను. "సముద్రంలో ఏదో గొప్ప ఆకర్షణ ఉంటుంది కదా.. అలా చూస్తుండిపోవాలనిపించేలా.." అని నేనంటుంటే "ఇక్కడికొచ్చాక ఏమేం చూపించమంటావని నిన్ను అడిగినప్పుడు సముద్రాన్ని చూపిస్తే చాలు. ఇంకేం అక్కర్లేదు అన్నావు కదా.. ఇదిగో ఇప్పుడు నువ్వు చూసేదే పసిఫిక్ మహా సముద్రం ఫస్ట్ లుక్ " అని నవ్వారు కిరణ్ ప్రభ గారు. "నాకు చిన్నప్పటి నుంచి సముద్రాన్ని బొమ్మల్లోనూ, టీవీల్లోనూ ఎప్పుడు చూసినా చాలా నచ్చేసేది కానీ నా కళ్ళతో చూసే అవకాశం అంత తొందరగా దొరకలేదు. జర్మనీకి వచ్చాక 2008 లో నెదర్లాండ్స్ వెళ్ళినప్పుడు మొదటిసారి Rotterdam, Madurodam లలో North Sea ని చూసాను. అప్పటికింకా చలి తగ్గకపోవడం వల్ల నీళ్ళల్లోకి వెళ్ళడం కుదర్లేదు కానీ చూసినందుకే

బోల్డు సంతోషపడిపోయాను. మళ్ళీ ఇన్నాళ్ళకి శాన్ ఫ్రాన్సిస్కో ప్రయాణం అనుకోగానే సముద్రాన్ని చూసే ఛాన్స్ దొరుకుతుంది కదాని అప్పుడలా అన్నాను" అని నా సముద్రం పిచ్చి వెనకున్న కారణాన్ని చెప్పాను. దారిలో గాలికి రెపరెపలాడుతూ ఒక పెద్ద అమెరికన్ జెండా కనిపించింది. సరిగ్గా జెండా పైనే అప్పుడే ముస్తాబై ఆకాశంలో పైపైకి తేలి వస్తున్న తెల్లటి చందమామ. "అటు చూడండి భలే ఉంది కదా" అని కిరణ్ ప్రభ గారికి చూపిస్తూనే "అమెరికాలో ఎక్కడ చూసినా జెండాలు కనిపిస్తున్నాయేంటి.. అమెరికన్లకి దేశభక్తి చాలా ఎక్కువంటారా?" అని అడిగాను. "అమెరికన్లకి దేశభక్తి ఎక్కువే ఉంది గానీ జెండాలు ఎక్కువ కనిపించడానికి కారణం మాత్రం అది కాదు. త్వరలో 4th July అమెరికా ఇండిపెండెన్స్ డే వస్తోంది కదా.. అందుకని చాలా చోట్ల ఇలా జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తూ ఉంటారన్నమాట" అని చెప్పారు కిరణ్ ప్రభ గారు.



బ్రిడ్జి మీదున్న ఫుట్ పాత్ మీద అలా నడుచుకుంటూ కొంచెం దూరం వెళ్ళాం. రయ్యి రయ్యిమని దూసుకుపోతున్న వందల కొద్దీ కార్లని చూస్తూ నించుంటే "మనం కూడా తర్వాత ఈ వంతెన మీద నుంచే అవతలి వైపుకి వెళ్ళి అదిగో ఆ చిన్న కొండ ఉంది కదా, దాని మీద నుంచి బ్రిడ్జిని చూస్తాం. అప్పటికి పూర్తిగా చీకటి పడిపోతుంది. నువ్వడిగినట్టు శాన్ ఫ్రాన్సిస్కో సిటీ కూడా లైటింగ్ లో మెరిసిపోతూ కనిపిస్తుంది" అని చెప్పారు కిరణ్ ప్రభ గారు. వంతెన మీద నుంచి శాన్ ఫ్రాన్సిస్కో బే వైపు చూస్తుంటే దూరంగా నీళ్ళ మధ్యలో ఒక దీవి కనిపించింది. "ఆ ద్వీపాన్ని Alcatraz అంటారు. అక్కడ లైట్ హౌస్ ఉంటుంది. పాతకాలంలో అక్కడ కట్టిన పెద్ద జైళ్ళలో ఖైదీలని ఉంచేవారట. అక్కడికి వెళ్ళడానికి క్రూజ్ ట్రిప్స్ ఉంటాయి. అది కూడా చాలా బాగుంటుంది, వీలు చూసుకుని మనం ఏదో ఒక రోజు వెళదాం" అని చెప్పారు. కాకపోతే ఈసారి ట్రిప్లో నేను అల్కాట్రాజ్ మిస్సయ్యాను కానీ వచ్చేసారి లిస్టులో రాసి పెట్టేశాం. :-) తర్వాత బ్రిడ్జి కింద వైపుకి వెళ్తే అక్కడ గాలి మరీ ఎక్కువగా ఉంది. ఆ గాలి ఊపుకి చేతిలో

కెమెరా కూడా నిలవట్లేదు. చెవుల్లోకి చల్లగాలి వెళ్ళిపోయి తల దిమ్మెక్కేస్తోంది. అయినా సరే కళ్ళ ముందున్న సముద్రాన్ని వదిలి వెళ్ళలేక కాసేపు అక్కడే నించుని సముద్రం ఒడిలోకి మెల్లమెల్లగా జారిపోతున్న బంగారు బంతి లాంటి సూర్యుడిని, కదిలే నీటి అలల మీద నాట్యమాడుతున్న సంధ్యాకిరణాలని చూసి అప్పుడు వెనుతిరిగాము.




మేము కారు దగ్గరికి వెళ్ళగానే కాంతి గారు "ఏంటండీ.. అసలు చల్లగాలిలో అంతసేపు ఉన్నారేంటి? మీరు తొందరగా తీసుకొచ్చేయకుండా ఏం చేస్తున్నారు? పిల్లకి మళ్ళీ ఏ జ్వరమో వస్తుంది సముద్రపు గాలికి.." అని ఆదుర్దా పడిపోయారు. "తనంత ఆనందంగా చూస్తుంటే వెంటనే లాక్కురావాలనిపించలేదులే" అని చెప్పారు కిరణ్ ప్రభ గారు. నిజంగానే కార్లోకి వచ్చి కూర్చోగానే చాలాసేపు నా చెవులు పని చేయలేదు. తలంతా పట్టేసినట్టు అనిపించింది. మేము అక్కడి నుంచి బయలుదేరి గోల్డెన్ గేట్ బ్రిడ్జి మీదుగా వంతెనకి ఆవలి పక్కకి వెళ్ళాము. అటువైపు గాలి ఎక్కువ లేకపోయేసరికి ఈసారి కాంతి గారు కూడా ఉత్సాహంగా కారు దిగారు. అక్కడ చిన్న పిట్ట గోడలా చాలా పొడవున కట్టి ఉంది. అందరూ దాని మీద కూర్చుని బ్రిడ్జిని చూస్తున్నారు. అప్పటికే చీకటి పడిపోయింది. అంతదాకా ఎండలో ఎరుపు రంగులో హొయలు పోయిన వంతెన కాస్తా ఇప్పుడు నలుపు రంగులోకి మారిపోయి అంతలోనే వంతెన మీద వెలిగిపోతున్న విద్యుద్దీపాల వెలుగులో ఇంకోలా మెరిసిపోతూ కొత్త అందం సంతరించుకుంటోంది. అలా బ్రిడ్జి వైపు, దాని మీద హడావుడిగా పరుగులు పెట్టేస్తోన్న కార్ల వైపు చూస్తూ కూర్చున్నాం. "మధురా.. బ్రిడ్జి మీద చూసావా.. వచ్చే వాహనాలు, వెళ్ళే వాహనాలు రెండు రంగుల్లో లైట్స్ ఎలా కనిపిస్తున్నాయో.. రెడ్ లైట్ వరుసేమో అటు వెళ్ళేది, వైట్ లైట్ వరుసేమో ఇటొచ్చేది.." అని చూపించారు కిరణ్ ప్రభ గారు. "భలే ఉంది. ఏదో బుల్లి బుల్లి కార్లతో ఆడుకునే బొమ్మలాటలా ఉంది కదా" అని నేను చాలా సరదాపడ్డాను. :-) ఎప్పుడు ఎక్కడికి వెళ్ళినా నేనూ,

కాంతి గారు అలా ముచ్చట్లలో పడిపోయి టైము సంగతి పూర్తిగా మర్చిపోతాం గానీ కిరణ్ ప్రభ గారు మాత్రం అన్నీ ప్లాన్ ప్రకారం టైముకి జరిగేలా చూసుకుంటూనే ఉంటారు. ఇప్పుడు కూడా దీని తర్వాత నిషి కోసం ఎయిర్పోర్ట్ కి వెళ్ళాలి కాబట్టి దాని ప్రకారం టైం లెక్కలు వేసి "పదండి పదండి.. మనకి టైం సరిపోదు మళ్ళీ.. కొండ మీదకి వెళ్ళి బ్రిడ్జిని చూసొద్దాం" అని ముందుకి నడిపించేశారు.

ఆ కొండ మీదకి కార్లోనే వెళ్ళి అక్కడి నుంచి ఒక ఐదు నిమిషాల పాటు నడవాలి. ఆ దారంతా చిన్న చిన్న మొక్కలు, కంపలతో మన పల్లెటూర్లలో ఉండే సన్నటి మట్టిదారిలా ఉంది. కానీ పౌర్ణమి రోజులు అవడం, అదీ గాక మూడు రోజుల్లో రాబోయే పున్నమి సూపర్ మూన్ అవడం వల్లనుకుంటా.. వెన్నెల పుచ్చపువ్వులా విరగకాస్తోంది.



ఆ వెన్నెల వెలుగులో అసలు చీకటి జాడే తెలీడం లేదు. ఆ కొండ అంచుకి చేరి వంతెనని, సముద్రాన్నీ చూస్తూ నించున్నాం. తెల్లగా చల్లగా కురుస్తున్న ఆ వెన్నెలవానలో సముద్రం మీద నుంచి అలవోకగా వీస్తున్న పిల్ల గాలి గారంగా ముంగురులు సవరిస్తుంటే, కళ్ళ ముందున్న పసిఫిక్ మహా సముద్రపు గాంభీర్యాన్నీ, దూరంగా చిన్ని చిన్ని దీపాలు పెట్టిన బొమ్మరిల్లులా వెలిగిపోతున్న శాన్ ఫ్రాన్సిస్కో నగరపు సౌందర్యాన్ని చూడ్డానికి రెండు కళ్ళూ సరిపోవనిపించింది. తెల్లవారి సూర్యోదయం అయ్యేదాకా అలా ఆ వెన్నెల్లోనే కూర్చుండిపోతే బాగుందు అనిపించింది. అదెలాగూ కుదరదులెమ్మని కాసేపు మాత్రం కూర్చున్నాం. దూరంగా వెలిగిపోతున్న మరో వంతెనని చూపించి అదే మనం సాయంత్రం వచ్చిన 'బే బ్రిడ్జ్' అని చెప్పారు కిరణ్ ప్రభ గారు.

కాసేపటికి ఆకాశంలో చందమామని చూడాలో, దూరంగా కనిపిస్తున్న సిటీని చూడాలో, వెన్నెల్లో వెలిగిపోతున్న బ్రిడ్జిని చూడాలో తెలీక నేను సతమతమైపోతుంటే కిరణ్ ప్రభ గారు "ఇలా రా.. నీకో వింత చూపిస్తా" అని పిలిచి అటుపక్కకి సముద్రం వైపు చూపించి "నువ్విప్పుడు మన ప్రపంచ పటానికి ఒక అంచులో నించున్నావు తెలుసా.." అన్నారు. అదెలా అంటే "ఇక్కడి నుంచి కనుచూపు మేరా సముద్రం కనిపిస్తోంది కదా.. ప్రపంచ పటంలో

ఎడమ వైపు చివరన కనిపించే పసిఫిక్ మహా సముద్రాన్ని నువ్విప్పుడు చూస్తున్నావు. శాన్ ఫ్రాన్సిస్కో సరిగ్గా భూమి సముద్రం రెండూ కలిసే చోట ఉంటుంది. ఇంక ఇక్కడి నుంచి అవతలంతా సముద్రమే! అయితే భూమి గుండ్రంగా ఉంది కదా మరి.. కాబట్టి నువ్విప్పుడు అలా అలా ఈ సముద్రంలో ముందుకి వెళ్తూనే ఉంటే ఎప్పటికో భూగోళానికి ఆవలి పక్కకి చేరి ఏ హాంకాంగో చూస్తావు. అంతకు మించి మధ్యలో ఎక్కడా ఇంక వేరే భూభాగం అంటూ లేదు. ఉన్నందంతా సముద్రమే.." అని చెప్పారు. అలా ఆలోచించి చూస్తే నిజంగా అద్భుతం అనిపించింది నాకు. అసలు ఈ భూమి ఇంత చిత్రవిచిత్రంగా ఎలా ఏర్పడిందో కదా అని మళ్ళీ స్పేస్ పాఠాలు గుర్తొచ్చాయి కాసేపు. ఆ వెన్నెల్లోంచి అస్సలు కదలాలని లేకపోయినా ఆలోచనలు మళ్ళీ ఈ ప్రపంచంలోకి వచ్చి "కాసేపట్లో నిషి వచ్చేస్తోంది కదా.. ఇదే మొదటిసారి మేమిద్దరం ఒకరినొకరు కళ్ళెదురుగా చూస్కోడం.." అని గుర్తొచ్చి "పదండి పదండి ఇంక ఎయిర్పోర్ట్ కి వెళదాం" అని అక్కడి నుంచి పరుగులు పెడుతూ వెనక్కి తిరిగాము.





అప్పటికే టైము రాత్రి పది కావొస్తోంది. గోల్డెన్ గేట్ బ్రిడ్జిని చూసే ఆనందంలో మేము డిన్నర్ సంగతి కూడా మర్చిపోయాం. అప్పుడు ఎయిర్పోర్ట్ కి వెళుతుంటే ఆకలి సంగతి గుర్తొచ్చింది. సరిగ్గా పదిన్నరకి నిషి ఫ్లైట్ లాండ్ అవుతుంది. అంటే ఇంకా అరగంటే ఉంది. మేము సరిగ్గా తనొచ్చేసరికి అక్కడ ఉండగలమో లేదో అన్న కంగారు మొదలై మళ్ళీ తిండి సంగతి మర్చిపోయాం. నిమిషానికోసారి GPS ఇంకా ఎంతసేపని చెపుతుందో చూసుకుంటూ హడావుడిగా ఎయిర్పోర్ట్ కి వెళ్ళేసరికి ఇంకా పది నిమిషాల టైముంది. "నిషి ఫ్లైట్ లాండ్ అవ్వగానే కాల్ చేస్తానంది. ఇంకా చెయ్యలేదంటే రాలేదనే అర్థం. మనం కంగారు పడక్కర్లేదు" అన్నారు కాంతి గారు. "అవునా.. పోనీ మనమే చేసి చూద్దామా.. కిరణ్ ప్రభ గారూ మీరు చెయ్యండి" అన్నాను నేను. "అదేంటి నీ ఫోన్ ఏది? నిషి నీ ఫోనుకే చేస్తుంది కదా.." అని కాంతి గారు అనేసరికి అప్పుడు గుర్తొచ్చింది నేను హడావుడిలో ఫోను కార్లోనే మర్చిపోయి వచ్చేసానని.

"పోనీలే కనీసం కెమెరా మర్చిపోలేదు. ఏవండీ మీరు మాత్రం కెమెరా పట్టుకుని రెడీగా ఉండి నిషి, మధుర కలుసుకోగానే వాళ్ళ మొహాల్లో ఎక్సైట్మెంట్ ని కాప్చర్ చేసెయ్యండి. పోయిన సంవత్సరం నేనూ, నిషి మొదటిసారి కలుసుకున్నప్పుడు ఆ సర్ప్రైజ్ ఫీలింగ్ ని ఫోటోల్లో బంధించి ఉంటే ఎంత బాగుండేది కదాని ఎప్పుడూ అనిపిస్తుంటుంది" అని కిరణ్ ప్రభ గారి చేతికి కెమెరా ఇచ్చారు. ఫ్లైట్ స్టేటస్ చెక్ చేసి ఇంక ఏ క్షణంలోనైనా నిషి వచ్చేస్తుంది అనుకుంటే ఉద్వేగంతో మా ఇద్దరికీ అస్సలు కాలు నిలవడం లేదు. ఆ గేట్ లోంచి వస్తున్న జనాలందరిలో నిషి కనిపిస్తుందేమోనని వెతుక్కుంటూ నించున్నాం.

అలా చూస్తుండగానే కాంతి గారు ఉన్నట్టుండి "అదిగో నిషి తల్లి వచ్చేసింది" అన్నారు. నేను "ఏదీ ఎక్కడా ఎక్కడా" అని అరిచేసరికి "అదిగో చూడు లైట్ గ్రీన్ కలర్ షర్ట్, జీన్స్ లో చూడు.. పద పద" అని కాంతి గారు ముందుకి నడుస్తుంటే ఈ లోపు నాక్కూడా నిషి కనిపించేసింది. తను కూడా మమ్మల్ని చూసి పరిగెడుతున్నంత వేగంగా గబగబా నడుస్తూ వచ్చేసింది. "హేయ్.. నిషీఈఈఈ.." అని అరుస్తూ తన దగ్గరికి వెళ్ళగానే నన్ను గట్టిగా చుట్టేసి "మధురాఆఆ.. నేనొచ్చేసా.." అని తను కూడా అరిచేసింది. మా ఇద్దర్నీ కలిపి కాంతి గారు రెండు చేతులతో దగ్గరికి తీసుకున్నారు. ఆ ఉద్వేగంలోంచి ఇంకా బయటపడక ముందే "ఏంటి కాంతి గారూ.. ఎవరీ స్కూల్ పిల్ల? ఏ హైస్కూల్ నుంచి తీసుకొచ్చారు?" అంది నిషి. అదే తను నన్ను చూసాక మాట్లాడిన మొదటి మాట. "ఓయ్.. నేనేం స్కూలు, కాలేజ్ కాదు. అసలు నువ్వే ఫోటోల్లో కన్నా బయట చిన్నగా ఉన్నావు తెలుసా.." అని నేనంటే "నేను ముందే మీ ఇద్దరికీ చెప్పానా.. మీ ఇద్దరూ ఫోటోల్లో కన్నా బయట చిన్నపిల్లలా ఉంటారని.." కాంతి గారు అనేసరికి అందరం గట్టిగా నవ్వేశాం. తర్వాత నిషి చేతుల్లో ఉన్న రెండు బ్యాగులు చెరొకటి లాగేసుసుకుని అందరం కలిసి లగేజ్ తీసుకోడానికి వెళ్ళాం.

మేమిద్దరం కలవగానే ఆ క్షణంలో మమ్మల్ని ఫోటో తీయడానికి కిరణ్ ప్రభ గారు ఎంత ప్రయత్నించినా అన్నీ కదిలిపోయి సరిగ్గా రాలేదు. ఎందుకంటే మేము అంతలా గంతులు వేసామన్నమాట అప్పుడు. లగేజ్ తీసుకున్నాక పార్కింగ్ లోకి వెళ్ళి కారు తీశాక కాంతి గారు నిషి కారెక్కబోతుంటే "ఆగాగు. నువ్వు అటువైపు కూర్చో. అప్పుడైతే ముందున్న మధుర బాగా కనిపిస్తుంది కదా.. ఇప్పటి నుంచీ నీ ప్లేస్ అదే" అని చెప్పి నాకు ఎదురుగా ఉండే వైపు నిషిని కూర్చోబెట్టారు. "కాంతి గారూ.. అబ్బా మీరెంత స్వీటో అసలూ.." అని నిషి చాలా సంబరపడిపోయింది. కార్లో ఇంటికి వెళ్ళేదారిలో San Mateo Bridge దగ్గరికి రాగానే "నిషీ.. ఇదిగో ఇదే స్వర్గలోకపు ద్వారం. ఇక్కడికి వచ్చామంటే మనం ఇంటికి వెళ్ళబోతున్నాం అన్నమాట. స్వర్గంలోకి నీకు స్వాగతం" అని చెప్తే "ఈ వంతెన నిజంగా

అలానే ఉంది మధురా.. బాగా చెప్పావ్" అని మెచ్చుకుంది. అంతలో కాంతి గారు "ఇలాంటివన్నీ చెప్పినప్పుడు తెలివి గల పిల్లలానే కనిపిస్తుంది కానీ అప్పుడప్పుడూ మాత్రం నువ్విందాక అన్నట్టు నిజంగా స్కూలు పిల్లలాగే చేస్తుంది. ఈ రోజు మధ్యాహ్నం ఏమైందో తెలుసా.." అని మొదలెట్టారు కాంతి గారు. నేను మధ్యలో అడ్డం వెళ్ళి "అబ్బా.. మీరు మరీ చెప్తార్లెండి.. అసలు మీరే స్కూలు పిల్ల. నేనేం కాదు. ఇప్పుడవన్నీ ఎందుకండీ బాబూ.." అని ఆపడానికి ప్రయత్నించాను. నిషి ఏమో చెప్పండి చెప్పండి అని ఒకటే గోల. "మధ్యాహ్నం నేను కాసేపు నిద్రపోయాను. మెలకువొచ్చేసరికి ఎదురుగా బిక్కమొహం వేసుకు నించుని కాంతి గారూ, నేనొక పిచ్చి పని చేసాను. పైన గదిలో తలుపు హేండిల్ ని లాగితే అది ఊడిపోయిందండీ. ఇప్పుడెలా? అంటే కాసేపు నాకేం అర్థం కాలేదు. ఏం కాదులేమ్మా, ఆయనొచ్చాక చూస్తార్లే అంటే ఈలోపే తల వంచుకుని కూర్చుని కళ్ళలోంచి ధారలు కురిపించేసింది. ఆ తలుపు సంగతి చూడటం కన్నా ఈ తల్లి ఏడుపు ఆపి నవ్వించడానికే ఎక్కువసేపు పట్టింది" అని కాంతి గారు చెప్పాక నేను తప్ప అందరూ చాలాసేపు నవ్వారు. "మీరు కూడా ఎప్పుడో అప్పుడు ఏదోకటి పాడు చెయ్యకపోరు. అప్పుడు కొంచెమన్నా ఫీలవుతారో లేదో నేనూ చూస్తాన్లే.." అని రోషంగా అన్నానని ఇంకా ఎక్కువ నవ్వారు. అలా ఏదోకటి చెప్పుకుంటూ నవ్వుకుంటూ ఎయిర్పోర్ట్ నుంచి ఇంటికి క్షణంలో వచ్చేసాం అనిపించింది.

ఇంటికొచ్చేసరికి అర్ధరాత్రి అయిపోయింది. సాయంత్రం చలి గాలి దెబ్బకి మొదలైన నా తలనొప్పి ఇంటికొచ్చేసరికి బాగా ఎక్కువైపోయింది. దిష్టి తీసేస్తే సగం తలనొప్పి పోతుందని కాంతి గారు కిచెన్లోకి లాక్కెళ్ళారు. రోజూ ఇలా దిష్టి తీసుకుంటే మనింట్లో మిరపకాయలన్నీ అయిపోతాయంటే ష్.. అని నోరు మూయించేసి మరీ దిష్టి తీసాక అప్పుడు అన్నం పెట్టారు. నేను వస్తున్నానని కాంతి గారు బోల్డు ప్రేమగా ఒక పెద్ద డబ్బా నిండా సున్నుండలు చుట్టి పెట్టారు. నేనేమో "అబ్బా స్వీటా, అందులోనూ సున్నుండలా.. నావల్ల కాదంటే కాదు" అనేసరికి " నీకసలు మంచి అలవాట్లే లేవు. సరేలే.. నువ్వు తినకపోయినా నిషి తల్లి ఇష్టంగా తింటుందిలే.." అన్నారు. ఆ విషయం ఇప్పుడు గుర్తు చేస్తే కాంతి గారు వెళ్ళి సున్నుండ డబ్బా మూత తీయగానే తనకి స్వీట్లంటే బాగా ఇష్టం కాబట్టి ఎగిరి గంతేసినంత పని చేసింది నిషి. భోజనాలు అయ్యాక కాసేపు కబుర్లు చెప్పుకున్నాక కిరణ్ ప్రభ గారు మాకు గుడ్ నైట్ చెప్పేసి వెళ్ళి పడుకున్నారు. మేము ముగ్గురం మాత్రం అర్ధరాత్రి దాటినా నిద్రపోడం ఇష్టంలేక కబుర్లు చెప్పుకుంటూ అలానే కూర్చున్నాం ఇంకాసేపు. నిషీ వాళ్ళ టైము ప్రకారం ఇంకాసేపైతే తను నిద్ర లేచే వేళ కూడా అయిపోతుంది. దానికి తోడు ప్రయాణపు అలసట కూడా కలిసి తనకి బాగా నిద్రొచ్చేస్తోంది. నాకేమో తలనొప్పి.. ఇంక ఎలాగో తప్పదని రేపొద్దున్నే లేచాక ఫ్రెష్ గా ఇంకా బోల్డు మాట్లాడుకోవచ్చులెమ్మని సర్ది చెప్పుకుని అయిష్టంగానే వెళ్ళి పడుకున్నాం ఆ రోజుకి.

కిటికీలోంచి పలకరిస్తున్న వెన్నెల చంద్రుడిని చూసి నాకు మళ్ళీ సాయంత్రం చూసిన దృశ్యాలన్నీ గుర్తుకొచ్చాయి. మబ్బులు లేని తేటైన ఆకాశంలో, రాత్రి వెలుగులో గోల్డెన్ గేట్ బ్రిడ్జి చూడటం బావుంది కానీ.. ఇప్పుడే ఇంతందంగా ఉందంటే సముద్రం మీద మసక మసకగా అలుముకున్న పొగమంచులో ఇంకెంత అందంగా ఉంటుందో కదా.. ఆ కొండ అంచు మీద నించుని కొద్దిగా చలికి వణికిపోతూ పల్చటి మంచుతెరల మధ్యన తేలే వంతెనని ఎప్పటికైనా చూస్తే బావుండు.. అని ఊహించుకుంటూ నిద్రలోకో, కలల్లోకో జారిపోయాను. :-)

## My San Francisco Diary - 9

### 20.06.2013

### గురువారం

ఉదయం మెలకువొచ్చేసరికి నిన్నటి సముద్రపు గాలి ప్రేమగా ఇచ్చిన తలనొప్పి, గొంతునొప్పి నాకు శుభోదయం చెప్పాయి. అప్పటికే టైము ఎనిమిదైపోతున్నా సరే నన్నెవరూ నిద్ర లేపలేదు. నేను తీరిగ్గా దిగి కిందకొచ్చేసరికి కిరణ్ ప్రభ గారు ఆఫీసుకి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నారు. నిషి, కాంతి గారు కాఫీ తాగుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు. నన్ను చూస్తూనే "నిద్ర సరిపోయిందా? తొందరగా రెడీ అవ్వాలి ఈ రోజు. బయటికెళ్ళే పనుంది కదా" అన్నారు. కాంతి గారి బంధువులు ప్రసాద్ గారు ఆ రోజు ఉదయం పూట తన వర్క్ బిజీ పెద్దగా లేదని మా ముగ్గురినీ శాన్ ఫ్రాన్సిస్కో తీసుకెళ్తానన్నారు. మధ్యాహ్నం మూడింటికల్లా వెనక్కి తీసుకొచ్చేస్తే అప్పుడు మేము మళ్ళీ షాపింగ్ కి వెళ్ళాలి అనుకున్నాం. కిరణ్ ప్రభ గారు బాగా ఎంజాయ్ చెయ్యండి అని చెప్పి ఆఫీసుకి వెళ్ళిపోయారు. నేను వేడి వేడిగా గ్రీన్ టీ తాగాక గొంతు కొంచెం పర్లేదనిపించిది. తొమ్మిదిన్నర కల్లా అందరం రెడీ అయిపోవాలి కాబట్టి నిషి పైకెళ్ళగానే నేను ఇడ్లీ తింటుంటే పద్మవల్లి గారు ఫోన్ చేసారు. నిన్న రాత్రి నిషి ఎప్పుడొచ్చింది, ఎంత ఎక్సైటింగా ఫీలయ్యాము, ఈ రోజు ప్రోగ్రాం ఏంటీ వగైరా విశేషాలన్నీ ఓ ముప్పావు గంటసేపు చెప్పుకున్నాక ఈ లోపు గడియారం చూసి భయపడి అప్పటికింక టాటా చెప్పేసుకున్నాం. ఇడ్లీ తినేసాక మహా బద్ధకంగా ఉన్నాసరే నాదొక్కదానిదే ఆలస్యమంతా అని గుర్తించి నేను కూడా చక చకా తయారైపోయి కిందకొచ్చేసాను. అప్పటికే హాల్లో చిమట శ్రీని గారు మాట్లాడుతూ కనిపించారు . నిషి వచ్చింది కదాని హాయ్ చెప్పి వెళదామని వచ్చారట. రేపు శుక్రవారం రాత్రికి శ్రీని

గారింట్లో డిన్నర్ కి అందర్నీ రమ్మని ఇదివరకే ఒకసారి మెయిల్లో, ఫోన్లో చెప్పినా సరే మళ్ళీ ఒకసారి ముఖాముఖి ఆహ్వానించారు శ్రీని గారు. ఆయనతో మాట్లాడటం భలే సరదాగా ఉంటుంది. శ్రీని గారి సంభాషణల్లో సందర్భానుసారంగా చక్కటి హాస్య చతురతతో పాటు భలే భలే మంచి తెలుగు పదాలు దొర్లుతూ ఉంటాయి. అలా ఆనందంగా వింటూ కూర్చోవచ్చు. మేము అలా మాట్లాడుకుంటూ ఉండగానే టైము దాదాపు పదిన్నర అయింది. మమ్మల్ని పికప్ చేసుకోడానికి ప్రసాద్ గారు, వాళ్ళ టీనేజ్ అబ్బాయి శ్రేయష్ వచ్చారు. శ్రీని గారికి టాటా చెప్పేసి ప్రసాద్ గారు వాళ్ళతో కలిసి శాన్ ఫ్రాన్సిస్కో కి బయలుదేరాము.



అప్పుడు ట్రాఫిక్ పెద్దగా లేకపోవడంతో తొందరగానే శాన్ ఫ్రాన్సిస్కో సిటీలోకి వెళ్ళిపోయాము. San Franciso skyline మధ్యగా వెళుతుంటే ఎత్తులో ఒకదానితో ఒకటి పోటీ పడుతూ నింగినంటుతున్నట్టున్న ఆకాశహర్మ్యాల వంకే చూసుకుంటూ మెల్లగా ఆ వీధుల్లో తిరగడం మొదలుపెట్టాము. వాటన్నీటినీ చూస్తూ అసలు ఇక్కడ ఉద్యోగాలు చేసేవాళ్ళందరూ ఎంత గర్వంగా ఫీలవుతుంటారో కదా అనుకున్నాం. "కానీ సిటీలో ఉండాలంటే చాలా ఖర్చు కాబట్టి వీళ్ళందరూ చాలావరకూ పక్కన ఉండే చిన్న ఊర్ల నుంచీ ఉద్యోగానికి రోజూ వచ్చి వెళుతుంటారు. అందుకే రష్ అవర్ ట్రాఫిక్ బాగా ఎక్కువుంటుంది. సాయంత్రం ఆ టైము దాకా ఉండకుండా ఈ లోపే మనం వెళ్ళిపోతే ట్రాఫిక్ ని తప్పించుకోవచ్చు" అని ప్రసాద్ గారు చెప్పారు. కొన్నిచోట్ల రెసిడెన్షియల్ ఫ్లాట్స్ లా కనిపించిన వాటిని చూస్తూ అసలు ఇక్కడ ఇల్లు కొనుక్కోవాలంటే ఎంత ఖరీదు ఉంటుందో కదా అన్న మాటొచ్చి "ఎక్కువే

ఉంటుందేమో కదా.." అన్నారు కాంతి గారు. "మామూలు ఎక్కువ కాదు. ఇక్కడ చిన్న చిన్న ఫ్లాట్స్ ఖరీదే కొన్ని మిలియన్స్ లో ఉంటుంది. ఇప్పుడు మనం ఉన్నది ఎక్కడనుకున్నావ్ అత్తా.. We are in the heart of San Francisco, One of the world's finest cities!" అని చెప్పాడు శ్రేయష్. నాకు ఆ మాట వినగానే "వావ్.. నిజమే కదా.. ప్రపంచంలోనే గొప్ప నగరాల్లో ఒకటైన శాన్ ఫ్రాన్సిస్కోలో ఉన్నాం కదా ఇప్పుడు" అని భలే థ్రిల్లింగా అనిపించింది.



శాన్ ఫ్రాన్సిస్కో స్కై లైన్ మొత్తానికీ అన్నిటికంటే ఎత్తైన sky scrapper బిల్డింగ్ Transamerica Pyramid దగ్గరికి వెళ్ళాము. ఈ పిరమిడ్ బిల్డింగ్ ని దూరం నుంచీ చూపిస్తూ మొత్తం శాన్ ఫ్రాన్సిస్కో నగరానికి ఇది iconic building అని, ఏ మూలకి వెళ్ళినా కనిపిస్తూనే ఉంటుందని ఇదివరకే కిరణ్ ప్రభ గారు చెప్పారు. ఇప్పుడు మళ్ళీ ప్రసాద్ గారు మమ్మల్ని సరిగ్గా పిరమిడ్ బిల్డింగ్ ముందుకి తీసుకెళ్ళి నించోబెట్టి ఇదే మాట ఇంకోసారి చెప్పారు. అలా తలెత్తి అంత పెద్ద స్కై స్క్రాపర్ ని చూడటం భలే సరదాగా ఉంది. అది పిరమిడ్ ఆకారంలో ఉండటంతో మరింత ప్రత్యేకంగా కనిపించింది. ఆ బిల్డింగ్ ని రకరకాల యాంగిల్స్ లో ఫోటోలు తియ్యడంతో పాటు, మేము దాని ముందు నించున్నపుడు బిల్డింగ్ అంతా ఫోటోలో వచ్చేలా చెయ్యడం కోసం నానా రకాల ప్రయోగాలు చేస్తూ చాలా నవ్వుకున్నాం. శ్రేయష్ తన కొత్త HTC ఫోన్లో తీసిన ఫోటోలు చూసి అందరం బోల్డు సరదా పడిపోయాం.

తర్వాత మోస్ట్ ఎక్సైటింగ్ పార్ట్ ఆఫ్ ది డే - Lombard street రైడ్ కి వెళ్ళాం. San Francisco అంటేనే ఊరంతా మొత్తం ఎత్తుపల్లాలతో, కొండలు, లోయల్లా ఉంటుంది కదా.. ఈ లోంబార్డ్ స్ట్రీట్ ఒక ఎత్తైన కొండ

మీద నుంచీ కిందకి వాలుగా ఉంటుంది. అది స్ట్రెయిట్ గా ఉండకుండా జిగ్ జాగ్ లా wavy గా ఉంటుంది. ఈ వీధికి one of the most crooked street గా ప్రపంచవ్యాప్తంగా చాలా పేరుంది. నేను ఇదివరకు వీడియోలు చూసినప్పుడు "వామ్మో.. ఆ రోడ్డులో అసలెలా డ్రైవ్ చేస్తారో, చూస్తుంటేనే భయమేస్తుంది" అనుకున్నా. అలాంటిది ఆ వీధిలో ఇప్పుడు మేము వెళ్ళ బోతున్నాం అంటే ఏదో పెద్ద జెయింట్ వీల్ ఎక్కబోతున్నట్టు కొంచెం కంగారుగా, కొంచెం ఎక్సైటింగా అనిపించింది. చిత్రం ఏంటంటే ఈ ఊర్లో అంత ఎత్తైన కొండల్లాంటి వీధుల్లో కూడా రెండు వైపులా ఇళ్ళు ఉండి ఆ ఇళ్ళ ముందు అలా వాలుగా నిలబెట్టిన కార్లున్నాయి. వాటిని చూస్తుంటేనే జారి కిందకి పడిపోతాయేమో అనిపిస్తుంది. అసలా కార్లు నడిపేవాళ్ళ ధైర్యానికి మెచ్చుకోవాలి. రోజూ టెన్షన్ పడకుండా స్థిమితంగా ఎలా పార్క్ చేసుకుంటారో ఏంటో అనిపించింది.



లోంబార్డ్ స్ట్రీట్ పైన మా కారు నించున్నప్పుడే కింద కనిపిస్తున్న wavy రోడ్ చూస్తూనే చాలా ఎక్సైట్ అయిపోయాము అందరమూ. ఈ లోపు ప్రసాద్ గారు ముందు సీట్లో కూర్చున్న నాతో "కారు పైనున్న sunroof ఓపెన్ చేస్తాను. మీరు సీట్లో లేచి నిలబడి అప్పుడు ముందున్న వీధిని చూడండి. ఇంకా ఎక్సైటింగా ఉంటుంది" అన్నారు. "అమ్మో.. నాకు భయమేస్తుంది" అంటే "మొన్ననే గొల్లపూడి గారొచ్చినప్పుడు ఈ స్ట్రీట్ అలాగే చూపించాను. ఆయన "నా జీవితంలో నన్ను ఎవరూ ఇలా తిప్పులేదయ్యా.. అద్భుతంగా ఉంది ఈ అనుభవం" అన్నారు. అంత పెద్దాయన

చేయగా లేనిది మీకేం భయం.. మళ్ళీ మళ్ళీ మా Jaguar కార్లో ఇలాంటి ఎక్సైటింగ్ ఛాన్స్ దొరకదు మీకు. ట్రస్ట్ మీ.. ఇట్ విల్ బీ ఏ లైఫ్ టైం ఎక్స్పీరియన్స్.. కమాన్.. గెటప్.." అని చాలా ఎంకరేజ్ చేసారు ప్రసాద్ గారు. నాకింకా మొహమాటంగానే అనిపించి వెనక్కి తిరిగి నిషి వైపు, కాంతి గారి వైపు చూస్తే "పర్లేదు ఎక్కేసేయ్.. భయమేస్తే దిగిపోవచ్చులే" అని ఇంకాస్త గట్టిగా ముందుకి తోసారు. సరేనని కాస్త భయపడుతూనే ముందు సీట్లో సన్ రూఫ్ లోంచి లేచి నిలబడ్డాను. మొదట ఒక నిమిషం కాస్త వణుకొచ్చి చేతులు రెండూ కార్ రూఫ్ మీద ఆన్చి నించున్నా. అలా నిలబడి కిందకి చూస్తుంటే వంకలు తిరిగి వయ్యారంగా ఉన్న crooked స్ట్రీట్, వీధంతా కలర్ ఫుల్ గా విరగబూసిన హైడ్రాంజియా పూల పొదలు, వీధి కింద వైపు పల్లంలో బొమ్మలు పేర్చినట్టు కనిపిస్తున్న ఇళ్ళు, వాటి వెనక దూరంగా సముద్రం, అలా కారు కిందకి మలుపులు తిరుగుతూ వెళ్తుంటే అంత మండే ఎండలోనూ హాయిగా మొహానికి ఎదురు వీస్తున్న చల్లటి సముద్రపు గాలి... ఆహా.. నిజంగా అద్భుతం అనిపించే అనుభవం! ఈ మాత్రం ధైర్యం చెయ్యకపోయి ఉంటే ఎంత గొప్ప అనుభూతి కోల్పోయేదాన్ని కదా అనుకున్నా. కిందకి దిగాక "చాలా అంటే చాలా బాగుందండీ అలా కార్లో నించోడం, చాలా థాంక్స్ ప్రసాద్ గారూ.. మీరు గట్టిగా అనకపోతే ఈ థ్రిల్ మిస్సయ్యేదాన్ని" అని చెప్పాను. "నిషీ.. వానా డూ ఇట్?" అని అడిగారు ప్రసాద్ గారు. "కమాన్ నిషీ.." అని అందరం తనని చీర్ చేస్తూ ముందుకి నెట్టాం. మళ్ళీ ఇంకోసారి లోంబార్డ్ స్ట్రీట్ రైడ్ ఎంజాయ్ చేసాము. ఆ వీధి నిండా ఉన్న టూరిస్టులందరూ మమ్మల్ని చూసి చాలా థ్రిల్ ఫీలయ్యి "ఆర్యూ మిస్ వరల్డ్?" అని సరదాగా అడుగుతూ చప్పట్లు కొట్టి అభినందించడమే కాకుండా మా కారుని బోల్డు ఫోటోలు కూడా తీసుకున్నారు. "అక్కా.. మీ ఫ్రెండ్స్ లాగే నువ్వు కూడా సరదాగా ఎక్కరాదూ.." అని కాంతి గారికి లేని ధైర్యాన్ని నూరిపోసారు ప్రసాద్ గారు. నేను, నిషి, శ్రేయష్ కూడా కాంతి గారిని బలవంతపెట్టి ముందుకి తోసాం. ఆ రోజు వీకెండ్ కాకపోవడం వల్ల ఎప్పుడూ ఉండేన్ని కార్లు లేకుండా కాస్త రద్దీ తక్కువగా ఉంది. అందుకని మొత్తానికి క్రూక్డ్ స్ట్రీట్ లో ముచ్చటగా మూడుసార్లు పైకీ కిందకీ తిరిగి చాలా సరదా పడ్డాం. మమ్మల్ని అంత ఓపిగ్గా తిప్పినందుకు ప్రసాద్ గారికి ఎన్నిసార్లు థాంక్స్ చెప్పినా తక్కువే అసలు.. కేవలం మేము కలిసి వెళ్ళామన్న ఒక్క కారణంగా కాకుండా అప్పుడు కలిగిన థ్రిల్ మూలాన ఈ స్ట్రీట్లో రైడ్ మాత్రం మా ముగ్గురికీ జీవితాంతం ప్రత్యేకంగా గుర్తుండిపోయే జ్ఞాపకం అయిపోతుందనడంలో అస్సలే మాత్రం సందేహం లేదు. అంత బాగా ఎంజాయ్ చేసాము. :-)




అక్కడి నుంచి శాన్ ఫ్రాన్సిస్కో వీధుల్లో అలా అలా తిరుగుతూ Ghirardelli Square వైపు వెళ్ళాం. దారిలో రోడ్ల మీద శాన్ ఫ్రాన్సిస్కో నగరానికి ఐకాన్ లా చెప్పుకునే cable cars కనిపించాయి. ఈ కేబుల్ కార్స్ పంతొమ్మిదో శతాబ్దం నుంచీ నడుస్తున్నాయట. వాటి వెనక అంత చరిత్ర ఉంది కాబట్టే ఇక్కడ అవి చాలా స్పెషల్ అన్నమాట. చూడ్డానికి కొంచెం ట్రాముల్లా ఉండి రోడ్డు మీదున్న ట్రాక్స్ మీద నడుస్తుంటాయి. మేము Ghirardelli Square వైపు వెళుతుంటే దూరంగా బే మధ్యలో Alcatraz island కనిపించింది. శాన్ ఫ్రాన్సిస్కో లోకల్ చాకొలెట్ కంపెనీ Ghirardelli ఉన్న ప్లేస్ అన్నమాట అది. మేము చాకొలేట్ ఫ్యాక్టరీకి వెళ్ళి చూడలేదు కానీ అక్కడే పక్కనున్న ఒక ఆర్ట్ మ్యూజియంకి తీసుకెళ్ళారు ప్రసాద్ గారు. మాకెవ్వరికీ చిత్రకళ గురించి పెద్ద పరిజ్ఞానం లేకపోయినప్పటికీ అక్కడున్న పెయింటింగ్స్ చూసి అద్భుతం అనిపించింది. మ్యూజియం నుంచి బయటికొచ్చాక ఎదురుగా చిన్న బీచ్ లాగా ఉంటే అక్కడికి వెళ్ళాము. అక్కడి నుంచి చూస్తే దూరంగా గోల్డెన్ గేట్ బ్రిడ్జ్ కనిపించింది. ఆ బీచ్ ఒడ్డున పెద్ద పెద్ద ఫెర్రీలు ఉన్నాయి. నీళ్ళ మధ్యలో అల్కాట్రాజ్ కనిపిస్తోంది. అల్కాట్రాజ్ కి తీసుకెళ్ళే ఫెర్రీలు అక్కడి నుంచే ఉంటాయని శ్రేయష్ చెప్పాడు. అక్కడ తిరుగుతున్నప్పుడు నిషికి ఆఫీస్ నుంచి కాల్ వచ్చింది ఏదో ముఖ్యమైన ఇష్యూ వచ్చిందని. తను చాలాసేపు అలా కాల్ మాట్లాడుతూనే ఉంటే నేను "అయినా పర్లేదులే ఈ లోపు మనం కొన్ని ఫొటోస్ క్లిక్ చేద్దాం" అని చెప్పి మేము కూడా తన పక్కనే తిరుగుతూ ఫోటోలు దిగాం.

తర్వాత మళ్ళీ నిన్న గోల్డెన్ గేట్ బ్రిడ్జ్ చూసిన విస్టా పాయింట్ దగ్గరికి తీసుకెళ్ళారు ప్రసాద్ గారు. "ఈ రోజు మబ్బులు, పొగమంచు లేకుండా చాలా క్లియర్ స్కై ఉంది. "చూసేవాళ్ళు చాలా లక్కీ అయితే తప్ప ఇలా జరగదు" అని ప్రసాద్ గారు అనగానే నాకూ, కాంతి గారికీ చాలా నవ్వొచ్చింది. "అవునండీ.. మేము చాలా లక్కీ.. అందుకే నిన్న కూడా ఇలానే ఉంది" అని చెప్తే ఆయన కూడా నవ్వారు. నిషి తో కలిసి కాసేపు అక్కడ తిరిగి ఫోటోలు దిగుదాం అనుకున్నాం. అప్పుడే మళ్ళీ తనకి ఆఫీస్ కాల్ వచ్చింది. అయినా సరే అలాగే ఫోటోలు క్లిక్ చేసేశాం. తర్వాత

ఆ ఫొటోలన్నీ చూస్తుంటే ఎంత ఫన్నీగా ఉందో.. ఎవరన్నా సెలబ్రిటీలు వచ్చి వాళ్ళ పనిలో వాళ్ళుంటే ఫ్యాన్స్ మాత్రం అదేం పట్టించుకోకుండా వాళ్ళ వెనకే తిరుగుతూ ఎలా పడితే అలా పిచ్చి పట్టినట్టు ఫోటోలు తీసుకుంటూ ఉంటారు కదా.. అచ్చం అలానే చేశాం మేము కూడా. ఇంటికొచ్చాక ఆ ఫొటోస్ చూసి నిషి "అయ్యో.. సారీ రా.. మీతో సరిగ్గా లేను కదా అప్పుడు నేను.." అని నొచ్చుకుంటే నేను "ఏం పర్లేదులే.. నీ పనిలో నువ్వున్నాసరే మేమేం నిన్ను మిస్సవ్వలేదు. భుజాల మీద చేతులేసి మరీ ఎలా దిగామో చూడు ఫోటోలు" అని చెప్పేసరికి అందరం చాలా నవ్వుకున్నాం.



అప్పటికే మధ్యాహ్నం రెండు గంటలు కావొస్తోంది. అందరికీ ఆకలేస్తోంది. ఆ రోజు గురువారం కాబట్టి నిషి ఏమీ తినట్లేదని ఉదయం నుంచీ కాంతి గారికి చాలా దిగులుగా ఉంది. అప్పటికీ ఇంటి నుంచి జ్యూస్లు తెచ్చాం గానీ ఈ ఎండలో తిరుగుడుకి నీరసపడిపోతుందేమో అని కాంతి గారి భయం. నిషి ఏమో "ఎప్పుడూ అలవాటేనండీ.. మీరేం వర్రీ అవ్వకండి" అని సర్ది చెప్తూ ఉంది. ఉదయం నుంచీ గంటకోసారి ఈ పరామర్శల పర్వం నడుస్తూ ఉంది. దారిలో సబ్ వే దగ్గర ఆగి అందరం లంచ్ చేస్తే నిషి మాత్రం పక్కనున్న స్టార్ బక్స్ నుంచి frappuccino తెచ్చుకుంది. అక్కడి నుంచి ప్రసాద్ గారు Muir Beach Overlook దగ్గరికి తీసుకెళ్ళారు. అది Golden Gate National Recreation Area లో ఉంది. అక్కడికి వెళ్ళే దారంతా కొండల అంచున ఘాట్ రోడ్డులా ఉంది. దారిలో sunset way అని పేరున్న సైన్ బోర్డు కనిపించింది. మేము వెళ్ళబోయే చోట సూర్యాస్తమయం చాలా



అందంగా ఉంటుందని ప్రసాద్ గారు చెప్పారు. అలా అలా అందరం కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ వెళ్ళాం. ఒక పెద్ద కొండ అంచు మీదకి తీసుకెళ్ళి కార్ ఆపాక అందరం కార్ దిగి ఎదురుగా చూస్తే పైన ఆకాశం, కింద పసిఫిక్ మహా సముద్రం రెండూ ఎండలో నీలం రంగులో మెరిసిపోతూ కనిపించాయి. ఆకాశం, సముద్రం, చుట్టూ కొండలు తప్ప ఇంకేం లేవు అక్కడ. కొండ మీద నుంచి ఒక సన్నటి మట్టి దారి ఉంది. దాని చివరికంటా నడుచుకు వెళ్ళి ఆ అంచున నించుంటే ఇంక కళ్ళ ముందంతా సముద్రమే!

అక్కడ విపరీతమైన గాలి వీస్తోంది. పైనుంచి మండే ఎండలో ఆ చల్లటి గాలి చాలా హాయిగా అనిపించింది కానీ మరీ మనుషుల్ని కూడా ఎగరేసుకెళుతుందేమో అన్నంత ఈదురు గాలి కాబట్టి అందరూ మరీ ఎక్కువసేపు ఉండలేకపోయారు. ఓ పక్క నుంచి చెవులు నొప్పి, తల నొప్పి వస్తున్నాసరే నాకు మాత్రం ఆ సముద్రం ముందు నుంచి అస్సలు కదలబుద్ధియ్యడం లేదు ఎక్కడికెళ్ళి నా. అలా నించుని హోరుమనే అలల శబ్దం వింటూ అంత అందమైన సముద్రాన్ని చూస్తుంటే ఆ ఆకర్షణ ఎంత బలంగా ఉందంటే ఆ సముద్రంలో దూకేస్తే బాగుందు అనిపించేసింది. :-) "కదా.. నాక్కూడా అచ్చం అలానే అనిపిస్తుంది.. భలే ఉంది కదా ఇంత ఎత్తు నించీ సముద్రాన్ని చూడటం " అని నిషి, నేనూ ఇద్దరం అనుకుంటూ ఉంటే ప్రసాద్ గారొచ్చి " ఒక ఐదు నిమిషాలు ఉండండి. మేము వెళ్ళిపోయాక దూకేద్దురు గానీ.. మేము న్యూస్లో చూసి ఓహో ఎవరో ఇండియన్ అమ్మాయిలు సముద్రంలో దూకేసారంట. మాకస్సలు తెలీదు వాళ్ళెవరో.. అనుకుంటాం" అని ఆట పట్టించారు. "ఇంత ఎత్తు నుంచీ చూడ్డానికి అందంగానే ఉంటుంది గానీ ఇక్కడ బ్లూ వేల్స్ ఉంటాయి తెలుసా.." అని చెప్పేసరికి అమ్మో అనిపించి కొంచెం భయమేసింది మాకు. అక్కడ ఆ ప్లేస్ ని గురించి వివరాలు కొన్ని రాసి ఉన్నాయి. రెండో ప్రపంచం యుద్ధం సమయంలో జపాన్ 'పెర్ల్ హార్బర్ ఎటాక్' జరిపిన తర్వాత శాన్ ఫ్రాన్సిస్కో, లాస్ ఏంజెలిస్ సముద్ర తీరాలకి ముప్పుందని చాలా భయపడ్డారట. అప్పుడు ఇక్కడి సముద్ర తీరానికి మిలటరీ ట్రూప్స్ వచ్చి హై అలర్ట్ లో ఉందట. ఇంకా ఆ చుట్టు పక్క కొండల మీద Flora, Fauna ప్రత్యేకతల గురించి కూడా చాలా విషయాలు రాసున్నాయి. అప్పటికే టైము మేము అనుకున్నదానికన్నా ఆలస్యం అయిపోయేసరికి Muir woods కి వెళ్ళే టైము లేదని ఇంటికి బయలుదేరదాం అనుకున్నాం.



మేము మ్యూర్ బీచ్ ఓవర్ లుక్ నుంచి వెనక్కి శాన్ ఫ్రాన్సిస్కో సిటీలోకి వచ్చేసరికి సాయంత్రం నాలుగు దాటిపోయి ట్రాఫిక్ బాగా ఉంది. ట్రాఫిక్లో గంటన్నరకి పైగా ఇరుక్కుపోయి ఇల్లు చేరేసరికి సాయంకాలం ఆరున్నర అయిపోయింది. మా ముగ్గుర్నీ ఇంటి దగ్గర దింపేసాక ఇంత ఎక్సైటింగ్ ట్రిప్ కి తీసుకెళ్ళినందుకు ప్రసాద్ గారికి థాంక్స్ చెప్పి శ్రేయష్ కి టాటా చెప్పాం. మేము ఇంట్లోకి వచ్చేసరికి కిరణ్ ప్రభ గారు ఆఫీస్ నుంచి వచ్చి మాకోసం ఎదురు చూస్తున్నారు. నేను ఇంట్లోకి వస్తుండగానే "రోజెలా గడిచింది తల్లీ.. బాగా ఎంజాయ్ చేసారా?" అని అడిగారు. "ఊ.. ట్రిప్ బావుంది గానీ మీరు లేని లోటు బాగా తెలిసింది. చాలా మిస్సయిపోయాము మిమ్మల్ని" అని నేను చెప్తుంటే కాంతి గారు అప్పుడే ఇంట్లోకి వస్తూ "ఈ పిల్ల మధ్యాహ్నం నుంచి అస్సలేం మాట్లాడకుండా చాలా సైలెంట్ అయిపోయింది. నేనింకా ఒంట్లో బాలేదేమో అని భయపడి రెండు మూడు సార్లు అడిగితే అదేం లేదు బానే ఉన్నానంది. అప్పుడు అర్థమైంది ఈ రోజు ట్రిప్ కి మీరు తీసుకెళ్ళలేదు కదా అందుకే మొహం చిన్నబోయిందని.." అంటూ నవ్వారు. "మనకి రేపు లాంగ్ డ్రైవ్ ఉంది కదమ్మా.. ఇంకా బాగా ఎంజాయ్ చేద్దాంలే" అన్నారు కిరణ్ ప్రభ గారు. ఇంట్లోకి వచ్చీ రాగానే కాంతి గారికి మళ్ళీ నిషి ఉపవాసం సంగతి గుర్తొచ్చేసి వెంటనే సూప్ తయారు చేసే పనిలో పడ్డారు. మీరు ఫ్రెష్ అయిపోయి వేడి వేడిగా టొమాటో సూప్ తాగేసాక facetime లో గొల్లపూడి గారితో మాట్లాడదాం అన్నారు కిరణ్ ప్రభ గారు.

గొల్లపూడి గారికి కాల్ చెయ్యబోతుంటే ఆగండాగండి ఒక్క నిముషం అని ఆపి "అంత పెద్దవాళ్ళతో, గొప్పవాళ్ళతో ఏం మాట్లాడగలం అసలు. నాకేం మాటలు తోచవు. ఏమన్నా చెప్పండి" అన్నాను నేను. నిషి ఏమో "ముందు మామూలుగా ఎలా ఉన్నారండీ అని పలకరించి, మొన్న మీరుండగా వస్తే మిమ్మల్ని కలిసి ఉండేవాళ్ళమండీ.." అని చెపుదాము అంది. "మీరు కనిపించి పలకరిస్తే ఆయనే మీకు బోల్డు కబుర్లు చెప్తారు. మీలాంటి చిన్నపిల్లలతో

కూడా ఆయన చాలా ఆప్యాయంగా మాట్లాడతారు. కంగారు పడకండి" అని కాల్ చేసారు కిరణ్ ప్రభ గారు. కాల్ ఆన్సర్ చెయ్యగానే స్క్రీన్ మీద నిండుగా నవ్వుతూ గొల్లపూడి గారు, వారి శ్రీమతి శివాని గారు హలో చెప్పారు. "అయ్యా.. మీరు మాట్లాడక మూడు రోజులైపోయిందని బెంగ పెట్టుకున్నానయ్యా.." అన్నారు కిరణ్ ప్రభ గారితో. మమ్మల్ని చూస్తూనే "ఇద్దరిలో మధుర ఎవరు, నిషి ఎవరు, ఎవరెవరు ఏ దేశాల నుంచి వచ్చారు" అని అడిగితే మేమిద్దరం మా వివరాలు చెప్పాము. జర్మనీ అనగానే "మేము దాదాపు పదిహేనేళ్ళ క్రితం అనుకుంటాను జర్మనీ వచ్చామమ్మా.." అన్నారు శివాని గారు. "జర్మనీ అనగానే నాకు Cologne, Bonn నగరాలు గుర్తొస్తాయి. Beethoven లాంటి గొప్ప సంగీతకారుడు పుట్టిన చోటు, అదే ఊరిలో పార్కులో బీతోవెన్ బొమ్మ దగ్గర అతని మ్యూజిక్ ని ఒక పియానో మీద వాయిస్తూ ధర్మం యాచిస్తున్న ఒక వ్యక్తిని చూసిన జ్ఞాపకం ఎప్పుడూ మెదులుతూ ఉంటుందమ్మా.." అన్నారు గొల్లపూడి గారు. Beethoven మ్యూజిక్ లో ఏవేవో పేర్లు చెప్పి వాటి గురించి వివరించి చెప్తూ అలా అలా చరిత్రలోకి వెళ్ళిపోయి బోల్డు సంగతులు చెప్పారు. కాసేపు వాళ్ళిద్దరితో మాట్లాడి వారి దగ్గర సెలవు తీసుకున్నాం. ఆయనకున్న అపారమైన జ్ఞానసంపదకీ, ఈ వయసులో కూడా అన్నీటినీ అలా చకచకా గుర్తు చేసుకుంటున్న ఆయన జ్ఞాపకశక్తికీ చాలా ఆశ్చర్యం, అద్భుతం అనిపించింది. మేము ఆ మాటే అంటే "ఆయనకి ఒక్క సినిమాలు, సాహిత్యమే కాదు. రేడియో, ప్రపంచ చరిత్ర, రాజకీయాలు ఇంకా బోల్డు విషయాల మీద గట్టి పట్టుంది. బహుముఖ ప్రజ్ఞాశాలి. బీతోవెన్ మ్యూజిక్ గురించి ఎంత అలవోకగా చెప్పేసారో చూసారా.. ఆయనతో మాట్లాడిన ప్రతిసారీ ఏదొక కొత్త విషయం తెలుస్తుంది మనకి.." అని చెప్పారు కిరణ్ ప్రభ గారు. "అందుకే కదా మరి అలాంటివాళ్ళు అంత గొప్పవాళ్ళు అయ్యేది.." అనుకున్నాం నేనూ, నిషి.

ఏడున్నరకి బయలుదేరి హడావుడిగా Livermore Premium Outlets కి షాపింగుకి వెళ్ళాం. వెళ్ళే దారిలో CVS ఫార్మసీలో నా గొంతు నొప్పికి సిరప్ కొనుక్కుని, మాల్ దగ్గర మమ్మల్ని ముగ్గుర్నీ దించాక షాపింగు పని చూసుకురమ్మని కిరణ్ ప్రభ గారు కార్లో లాప్టాప్ లో కౌముది పని చూసుకుంటానన్నారు. నిషి రాకముందు మేమిద్దరం షాపింగుకి వెళ్ళినప్పుడే తను చెప్పింది మళ్ళీ మన ముగ్గురం వెళదామని. అక్కడికి వెళ్ళాక కాంతి గారు "అమ్మాయిలూ.. మీ ఇద్దరూ మంచి డ్రస్సు సెలెక్ట్ చేసుకోండి. తీసుకుందాం. నిషి ఊరెళ్ళే లోపు టైము ఎక్కువ లేదు కాబట్టి ముఖ్యంగా ముందు నిషికి తీసుకోవాలి" అన్నారు. సహజంగానే "అబ్బా ఇప్పుడెందుకులెండి అవన్నీ .." అని మేము గారాలు పోతుంటే "ఇంకా నయంలే.. ఆడపిల్లలు ఇంటికొస్తే ఉట్టిచేతులతో తిరిగి వెళ్ళకూడదు" అని మమ్మల్ని గట్టిగా ముందుకి తోసారు కాంతి గారు. అలా అలా తిరుగుతూ ఏవో చిన్నచిన్న వస్తువులు కొన్నాం గానీ డ్రస్సు మాత్రం ఏమీ నచ్చట్లేదు. మాకేమో టైము కూడా పెద్దగా లేదు. అసలు అర్జెంటుగా కావాల్సింది నిషి కోసం అని చూస్తూ ఉంటే

అనుకోకుండా రెండు షాపుల్లో "ఈ డ్రస్ చూడు ఎంత బాగుందో.. ఊరికే ట్రై చేసి చూపించు నువ్వు.." అని ఇద్దరూ కలిసి నన్ను ముందుకి నెట్టి "అబ్బా.. ఎంత బాగుందో.. కొనేద్దాం కొనేద్దాం.." అని ఇద్దరూ కలిసి నాకే కొనేసారు. అప్పటికే రాత్రి తొమ్మిదిన్నర అయిపోయిందని బయటికొచ్చేసాం. కార్ దగ్గరికి రాగానే కిరణ్ ప్రభ గారు షాపింగ్ పని అయిపోయిందా అంటే "ఏంటీ అయ్యేది.. ఇద్దరూ కలిసి అసలు వచ్చిన పని మానేసి నాకు కొన్నారు" అని వాళ్ళిద్దరి మీదా కంప్లెయింట్ చేస్తూ చెప్పాను. సరే మళ్ళీ ఇంకో రోజు వద్దాంలే అనుకుంటూ ఇంటికొచ్చేసాం. డిన్నర్ తినేసాక మేము ఊరి నుంచి వచ్చేప్పుడు ఒకరి కోసం ఒకరు తెచ్చిన బుల్లి బుల్లి గిఫ్ట్స్ అన్నీ ముందేసుకు కూర్చుని కబుర్లు చెప్పుకుంటుంటే కిరణ్ ప్రభ గారు "రేపు ఉదయం మనం ఆరింటికల్లా బయలుదేరితే బాగుంటుంది. నేను నాలుగున్నరకి లేపుతాను మిమ్మల్ని" అని గుడ్ నైట్ చెప్పేసి వెళ్ళి పడుకున్నారు. ఇంకాసేపయ్యాక మాకూ ఇంక తప్పక అయిష్టంగానే వెళ్ళి నిద్రపోయాం రేపటి రోజంతా మనదే కదా అని ఆనందంగా తలచుకుంటూ.. :-)

## My San Francisco Diary - 10

### 21.06.2013

## శుక్రవారం

నిన్న బయట తిరుగుతున్నప్పుడు ఆ హడావుడి, గోలలో ఫోన్ మోగిన సౌండ్ వినపడక మా ఇంటబ్బాయ్ కాల్ మిస్సైపోయానని కొంచెం బెంగగా అనిపించింది. తెల్లారితే తన సిడ్నీ ప్రయాణం కదా అన్నీ సరిగ్గా సర్దుకున్నాడో లేదో, తను ఊరెళ్ళే సమయానికి నేనింట్లో ఉంటే బావుండేది కదా.. అని రకరకాల ఆలోచనలతో రాత్రి నిద్ర పట్టలేదు చాలాసేపు. అప్పటికే జర్మనీలో శుక్రవారం వచ్చేసి ఉంటుంది కాబట్టి బయలుదేరే ముందు నాకు ఫోన్ చేస్తే "అది సర్దుకున్నావా, ఇది పెట్టుకున్నావా, లైట్లన్నీ ఆపావా, కిటికీలు వేసావా.." లాంటి రొటీన్ ప్రశ్నలన్నీ ఒక్కోటీ అరడజను సార్లు అడిగాను. ఇంకా నా ప్రశ్నాపత్రం పూర్తి కాకముందే "నేను వెళ్ళేది స్కూలుకి కాదు కాన్ఫరెన్స్ కి.. నువ్వేం వర్రీ అవ్వకుండా హేపీగా ఎంజాయ్ చెయ్యి. వీలున్నప్పుడు ఫోన్లోనో, మెయిల్లోనో కనిపిస్తుంటాను. ఇంక నిద్రపో" అని ఫోన్ పెట్టేసాడు. తన ఫ్లైట్ టేకాఫ్ ముందు పెట్టిన మెయిల్ తెల్లవారు జామున చూసుకున్నాక కాస్త స్థిమితంగా అలా కొంచెంసేపు నిద్రపోయానో లేదో వెంటనే లేపేసినట్టు అనిపించింది. నా గొంతు నొప్పి ఇంకొంచెం

పెరిగినట్టుంది. అప్పటికే ఉదయం ఆరు గంటలు దాటింది టైము. నేను తప్ప అందరూ తయారైపోయారు. హడావుడిగా నేను కూడా తొందరగా తెమిలి మేము ఇంట్లోంచి బయటపడేసరికి ఏడు దాటింది.



ఈ రోజు ప్రయాణం మా ఇంటి నుంచి మూడు గంటల దూరంలో ఉన్న Yosemite National park కి. ఒక గంట ప్రయాణం తర్వాత మధ్యలో ఆగి Denny's రెస్టారెంట్లో హెవీ బ్రేక్ ఫాస్ట్ చేసి మళ్ళీ బయలుదేరాం. "మీరొక్కరే డ్రైవ్ చేస్తే అలసిపోతారేమో.. కాసేపు నేను కూడా డ్రైవ్ చేస్తానండీ.." అని నిషి అడిగితే "అదేం సమస్య కాదులేమ్మా.. మీరు హాయిగా కూర్చుని కబుర్లు చెప్తూ ఉండండి. సరదాగా అవన్నీ వింటూ వెళ్ళిపోదాం" అన్నారు కిరణ్ ప్రభ గారు. ఏదో మాటల్లో మాట మొదలై కిరణ్ ప్రభ గారి కాలేజీ రోజుల వైపు, అప్పటి కవిత్వం వైపు వెళ్ళిపోయాం. సంవత్సరాలు, తేదీలతో సహా అప్పటెప్పటివో విశేషాలు కళ్ళకి కట్టినట్టు చెప్తుంటే ఆసక్తిగా మధ్యలో ప్రశ్నలు అడుగుతూ అక్కడక్కడా ఎదురుపడే పాత్రల గురించి మళ్ళీ గుర్తు చేస్తూ ఒక్కొక్కరి కథ పూర్తిగా చెప్పించుకున్నాం. కిరణ్ ప్రభ, కాంతి కిరణ్ గార్ల పేర్లలో 'కిరణ్' అని వాళ్ళిద్దరూ పరిచయం కాక ముందు నుంచే ఉందని తెలుసుకుని బోల్డు ఆశ్చర్యపోయాం. అసలు ఆ కబుర్లన్నీ ఎంత ఆసక్తిగా ఉన్నాయంటే మేము ప్రయాణం సంగతి మర్చిపోయి దృష్టి అంతా కబుర్ల మీదే పెట్టేసి అదేదో ముచ్చట్లు చెప్పుకోడానికే వచ్చిన ట్రిప్ లా ఒకదాని వెంట ఒకటి అలా కథలు చెప్పుకుంటూనే ఉన్నాం సాయంత్రం దాకా. నేనైతే నా గొంతునొప్పిని గాలికి వదిలేసి రోజంతా మాట్లాడుతూనే ఉన్నాను. మొత్తం నలుగురం కలిసి తలా కాసేపు స్కూలు, కాలేజ్, టీనేజ్, చదువులు, ఉద్యోగాలు, కలంస్నేహాలు, మామూలు స్నేహాలు, ప్రేమలు, పెళ్ళిళ్ళు... ఇలా ఒక్కటి కూడా వదలకుండా అందరివీ ఎప్పటెప్పటి డైరీలో తెరిచి చదివేసాం. అందులో

ఎదురుపడిన రకరకాల వ్యక్తుల మనస్తత్వాల గురించి, ఆయా సందర్భాల గురించి విశ్లేషించుకుంటూ ఆ రోజంతా చాలా ఉత్సాహంగా గడిచింది.



Yosemite వెళ్ళాక లోపల తిరిగి చూసేదే కాకుండా ఆ వెళ్ళే దారిలో డ్రైవ్ చాలా బాగుంటుందని కిరణ్ ప్రభ గారు చెప్పారు. నిజంగానే మా ప్రయాణమంతా తిరుమల కొండ మీదకి వెళ్ళినట్టు పెద్ద పెద్ద కొండల అంచుల్లో వేసిన ఘాట్ రోడ్డులో సాగింది. కొన్ని వేల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పార్క్ సహజసిద్ధంగా అడవి లాంటి కొండలు, లోయలు, జలపాతాలతో ఏర్పడింది. ఎన్నో మిలియన్ సంవత్సరాల క్రితం అక్కడ ఏర్పడిన పెద్ద పెద్ద గ్రానైట్ కొండలు, మంచు కొండలు, జలపాతాలు, అక్కడున్న రకరకాల వృక్షసంపద, జంతువులు, పక్షులతో కూడిన జీవవైవిధ్యం.. వీటన్నిటి విలక్షణతని బట్టి ఈ పార్క్ ని UNESCO world heritage siteగా గుర్తించారు. అంత ఎత్తైన కొండల నడుమ నుంచీ ప్రయాణించడం, సహజంగా ఏర్పడిన అంత పెద్ద గ్రానైట్ రాళ్ళు, అక్కడక్కడా కొండలపైన కురిసిన మంచు కరిగి ఏర్పడిన చిన్న చిన్న ప్రవాహాలు, కొండల మీద నుంచి జారుతున్న జలపాతాలు.. ఇవన్నీ చాలా ఆహ్లాదంగా అనిపించాయి. అక్కడ ఏరుల్లో పారుతున్న నీళ్ళు ఎంత స్వచ్ఛంగా ఉన్నాయంటే నీళ్ళ అడుగున ఉన్న ప్రతీ చిన్న గులకరాయి స్పష్టంగా కనిపిస్తోంది. ప్రకృతిని ఎక్కువ ధ్వంసం చెయ్యకుండా ఉన్నది ఉన్నట్టు ఉండనిస్తే ఎంత అందంగా, ప్రశాంతంగా ఉంటుందో కదా అనిపించింది అక్కడ తిరుగుతున్నంతసేపూ.

Yosemite పార్క్ లోపల అలా అలా ప్రయాణిస్తూ మ్యాప్లో చూపించిన ప్రకారం ప్రత్యేకమైన విస్టా పాయింట్స్ దగ్గర ఆగుతూ ప్రకృతిలోని వైవిధ్యాన్ని, అద్భుతాలని చూసి సంబరపడుతూ ముందుకి సాగిపోయాం. నడి వేసవికాలం అవడం వల్లనుకుంటా జలపాతాల్లో నీరు తక్కువగా ఉంది. ఇదివరకు వచ్చినపుడు చాలా నీళ్ళున్నాయని కాంతి గారు చెప్పారు. మధ్యాహ్నం అయ్యేసరికి తిరిగీ తిరిగీ సగం, కబుర్లు చెప్పుకుని సగం అలసిపోయి లంచ్ కోసం వెతుక్కున్నాం. మేము వెళ్ళిన చోట గ్రిల్డ్ మీట్, సలాడ్స్ తప్ప ఎక్కువేం లేక అందరం ఆ పూటకి ఆకులు, అలములూ భుజించేసరికి టైము రెండు దాటింది. ఆ రోజు ఎండ కూడా విపరీతంగా ఉండటం వల్ల ఇంకా ఎక్కువసేపు ఎండలో

తిరిగే ఓపిక మాకెవరికీ లేదు. అప్పుడు వెనక్కి బయలుదేరితే అలా అలా దారిలో అన్నీ చూసుకుంటూ Yosemite పార్క్ నుంచి బయటపడేసరికి నాలుగు గంటలవుతుంది అనుకున్నాం. మధ్యలో ఒక చోట పెద్ద పెద్ద గ్రానైట్ కొండలన్నీ వరసగా ఉన్న చోట నేనూ, నిషి పైన మాడుతున్న ఎండ సంగతి కూడా మర్చిపోయి మా ఫోటోగ్రఫీ కళానైపుణ్యాన్ని ప్రదర్శించే పని పెట్టుకున్నాం. నిజంగా అసలు ఎంత పెద్ద కొండలో అవి.. వాటి ముందు మేము చీమలంత చిన్నగా ఉన్నాం అనిపించింది! అక్కడొక అరగంట సేపు ఎండలో మాడిపోయేసరికి మా ఓపిక పూర్తిగా హరించుకుపోయింది. Yosemite నుంచి బయటపడేసరికి నాలుగున్నర అయింది. తర్వాత దారిలో ఒక చోట ఫ్రూట్ ఫార్మ్ దగ్గర స్ట్రాబెర్రీస్ కొనుక్కుని, స్టార్ బక్స్ లో వైట్ చాకొలేట్ మోకా కొనుక్కుని ఇంకెక్కడా ఆగకుండా మా కథలు చెప్పుకోడం కొనసాగిస్తూ ఇంటికొచ్చేసాం.



మేము సాయంత్రం ఇంటికొచ్చేసరికి టైము ఏడున్నర కావొస్తోంది. మళ్ళీ అందరం చకచకా ఫ్రెష్ అయిపోయి చిమట శ్రీని గారింటికి డిన్నర్ కి వెళ్ళాలని మాకున్న ప్లాన్. అందుకని ఏ మాత్రం బ్రేక్ లేకుండా మళ్ళీ హడావుడిగా బయలుదేరిపోయాం. మేము బయలుదేరే టైముకి చీకటి అప్పుడప్పుడే పడుతోంది. ఇంకో రెండు రోజుల్లో 'సూపర్ మూన్' గా మారబోయే చందమామ అప్పటికే మిలమిలా మెరిసిపోతున్నాడు. San Ramon లో ఉన్న శ్రీని గారింటికి వెళ్ళే దారిలో అన్నీ ranches ఉన్నాయి. ఆ కొండల వెనక చంద్రోదయం, తెల్లగా కురిసే వెన్నెల్లో మరింతగా మెరిసిపోతున్న కొండలనీ చూస్తుంటే చాలా గొప్పగా అనిపించింది. "మీ అమెరికా చంద్రుడు గొప్ప అందగాడండీ" అంటే నిజమేనంటూ అందరూ నవ్వారు. శ్రీని గారి ఇల్లున్న కాలనీ పేరు sleeping meadow అని చూసి భలే అందమైన పేరు పెట్టారనిపించింది. ఆ ప్రదేశం కూడా కొండల మధ్యలో నిశ్చింతగా నిదురిస్తున్నంత ప్రశాంతంగానే ఉంది. మేము శ్రీని గారింటి దగ్గర్లోకి వెళ్ళాక ఇల్లు వెతుక్కోడానికి కాస్త అయోమయంలో పడ్డాం. ఈ GPS నిద్రపోతున్నట్టుంది అంటూ సరదాగా జోక్స్ వేసుకుని GPS లో వినిపించే అమ్మాయి గొంతుని బట్టి ఆవిడకో పేరు పెడదాం అనుకున్నాం. ఎంతైనా మనకి దారి చూపే దేవత కదా పాపం అని 'జయసుధ' అని పేరు పెట్టేసి చాలా

నవ్వుకున్నాం. "మీరు ఇప్పుడు ఇలా అల్లరి చేస్తూ ఎంత నవ్విస్తారో రేపు మీరిద్దరూ వెళ్ళిపోయాక మాకు ప్రతీ చోటా మీ మాటలు గుర్తుకొచ్చి ఇంతకింతా దిగులు పుట్టించేస్తారు తెలుసా.." అన్నారు కాంతి గారు. అంత నవ్వుల్లోంచి ఓ క్షణం నిశబ్దం అయిపోయాము అందరమూ. అంతలో శ్రీని గారిల్లు వచ్చేసింది.

శ్రీని గారింట్లో అప్పటికే సాహిత్య, సంగీతాభిరుచులు కలిసే మిత్రులు కొందరు వచ్చి ఉన్నారు. పాడుతా తీయగా కార్యక్రమం రోజు పరిచయం అయిన గోకుల్ గారితో పాటు ఇంకా కొత్తవారు కొందరు ఉన్నారు. శ్రీని గారి శ్రీమతి గారు, వారి ఇద్దరమ్మాయిలతో కబుర్లు చెపుతూ కూర్చున్నాం కాసేపు. రోటీల దగ్గర్నుంచీ బిర్యాని, డబుల్ కా మీటా దాకా ఏర్పాటు చేసిన హెవీ డిన్నర్ అందరం కలిసి కబుర్లు చెప్పుకుంటూ ముగించి అప్పుడు తీరిగ్గా సంగీత చర్చలు మొదలెట్టాము. అంతకు కొద్ది రోజుల ముందే చిమట మ్యూజిక్ ఆధ్వర్యంలో జరిగిన తెలుగు సినిమా పాటల క్విజ్ లో ప్రశ్నలుగా అడిగిన కొన్ని పాటల బిట్స్ వినిపించి అవేంటో కనిపెట్టమన్నారు శ్రీని గారు. మధ్య మధ్యలో ఒక్కో పాట చరిత్రలోకి వెళ్ళిపోయి ఎప్పటెప్పటివో పాటల గురించి అందరూ బోల్డన్ని విశేషాలు చెప్తుంటే వింటూ కూర్చున్నాం. మధ్యలో నిషి రాసిన 'ఊసులాడే జాబిలట' నవల గురించి కూడా వాళ్ళందరూ తమ అభిప్రాయాలు చెప్పారు. శ్రీని గారింటి తోటలో కాసిన ప్లమ్స్ తింటూ ఇంకాసేపు కబుర్లు చెప్పుకున్నాక మాకు తెలీకుండానే నిద్రకి కళ్ళు వాలిపోసాగాయి. ఉదయం నుంచీ ఎండలో తిరిగీ తిరిగీ ఆ అలసటకి బాగా నిద్రొచ్చేస్తోంది. అప్పటికే టైము అర్ధరాత్రి పన్నెండు దాటిపోయేసరికి అంత చక్కటి భోజనం, సాహితీ సంగీత కబుర్లతో విందు ఏర్పాటు చేసిన శ్రీని గారి దంపతులకి ధన్యవాదాలు చెప్పి ఇంటికి బయలుదేరిపోయాము.

మేము ఇంటికి తిరిగొచ్చేసరికి అర్ధరాత్రి ఒంటిగంట దాటినా తెల్లారి సాయంత్రం నిషి ఊరెళ్ళిపోతుంది కదా అన్న దిగులుతో మాకు వెంటనే వెళ్ళి నిద్రపోవాలనిపించలేదు. ఒక పక్క కళ్ళు మూతలు పడిపోతున్నా సరే అలాగే కష్టపడి ఇంకో గంటసేపు కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాం ముగ్గురం. అప్పటి మా నిద్ర మొహాల ఫోటోలు చూస్తే చాలా నవ్వొస్తుంది. అర్ధరాత్రి రెండున్నర దాటాక వెళ్ళి పడుకున్నాం రేపటి గురించిన బెంగతో..!



## 22.06.2013

## శనివారం

*ఈ రోజు మా ఉదయం ఎలా మొదలైందో నిషి మాటల్లో...*

~~~~~~~~~~~~~~

అదొక యధాలాపపు ఉదయం..

ఎప్పుడోనే మెలకువ వచ్చేసినా క్రితం రోజు తిరిగిన అలసట శరీరాన్ని లేవనీకుండా బుజ్జగిస్తోంది.. ఇంతలో పక్కన్నుంచి ఏదో ఒక పాట.. లీలగా.. కొంచెం విన్నదే.. ఇష్టమున్నట్టనిపిస్తున్నదే! అంతే! నాగస్వరం విన్న నాగినిలా సగం మూసిన కళ్ళతో వెళ్ళిపోయాను.. తను బోర్లా పడుకుని ఉన్నా.. మెలకువగానే ఉన్నట్టు పాటకి చిన్నగా, లయబద్ధంగా కదులుతున్న పాదాలు చెప్తున్నాయి..

ఆ పాదాలు చూస్తే తగిలీ తగలని ఉదయపు చలికి ముడుచుకున్న బుజ్జి పావురాలు గుర్తొచ్చాయి! అలికిడికేమో? తలెత్తి తను నా వైపు చూడగానే... 'ఎందులోదీ పాట?' అని అడుగుతూ, సమాధానం కోసం చూడకుండా తనని దాటి, మంచం మీద ఖాళీగా ఉన్న అటువైపుకి... పెద్ద కిటికీ వైపుకి చేరుకున్నా.. తను కాస్త సర్దుకుని ఇంకాస్త చోటివ్వగానే, కంఫర్టర్ లో కూడా భాగం తీసేసుకుని.. కంఫర్టబుల్‌గా పక్కనే సెటిల్ అయిపోయి... తీరిగ్గా కళ్ళెత్తి పక్కకి చూశాను..

కిటికీ నిండా.. అంచుల గుండా.. నీలంగా.. ఒదిగిపోయిన ఆకాశం!! నిర్మలంగా, నిశ్చలంగా కనిపిస్తూనే.. మృదువుగానే.. పట్టి లాగేసుకుంటోంది.. కళ్ళు తిప్పనీయడంలేదసలు! అబ్బాయిలు నీలం రంగు ఎందుకు ప్రిఫర్ చేస్తారో కాస్తేదో అర్థమైనట్టనిపించింది!! పక్కనే ఉన్న పేరు తెలీని ఓ పెద్ద చెట్టు ఆకులు మెల్లగా బాలే చేస్తున్నాయి.. ఎవరన్నారు గాలిని చూడలేమని!?!? బయటకే అనేశాననుకుంటా! వెంటనే తను వెల్లకిలా తిరిగి, "నిన్నరాత్రి చూడాల్సింది.. నిండు చందమామ.. కిటికీ పక్కనే.. చేతులు చాచితే అందేట్టు.. అందంగా నవ్వుతూ" అనగానే... 'నిజమా! మరి నన్ను పిలవాల్సింది!' ఏదో అద్భుత ఘట్టం మిస్సైపోయిన ఫీలింగ్ నాలో!
~~~~~~~~~~~~~~

"అనుకున్నా పిలుద్దామని కానీ అప్పటికే చాలా అలసిపోయాం కదా! నిద్ర పోనిద్దాంలే అనుకున్నాను", రాత్రెప్పుడో మిస్సైతే మిస్సయ్యా కానీ ఇప్పుడు మాత్రం ఒక ప్రశాంత చందమామ నవ్వు తన మొహంలో! 'ఇంతకీ ఈ పాట ఎందులోదీ?' ఎప్పుడో పూర్వజన్మలో అడుగుదామనుకున్న ప్రశ్న నెమ్మదిగా బయటకొచ్చింది.. "ఎందులోదేమిటీ!! మొన్న నీకు పంపానుగా! బావుంది వినమని" ఆక్షేపణగా తన గొంతు.. 'యా, పంపావు.. కానీ తెల్సుగా.. చాలా బిజీలో విన్నాను.. సో, అంత ఎక్కలేదు' కాస్త అపాలజిటిక్‌గా అంటూనే 'ఇప్పుడు వింటుంటే చాలా బావుంది!' అని సిన్సియర్‌గా ఒప్పుకున్నా...

"ఇది సరే.. అందులో.. ఈ పాట విన్నావా?...." అంటూ తను ఇంకేదో చెప్పింది.... అలా.. అలా... ఎంతసేపు ఎన్ని పాటల గురించి.. పుస్తకాల గురించి.. బట్టల గురించి.. వాటి గురించి.. వీటి గురించి.. ఆ విప్పారిన నీలాకాశం సామీప్యంలోనే మాట్లాడుకున్నామో!!

నిజంగానే అదొక యధాలాపపు ఉదయం.. But, Thanks to Madhura it was an unforgettable casual morning!!

ఇంతకీ ఆ పాటేంటంటే.......... ***స్నేహమూ నువ్వే.. సంతోషమూ నువ్వే.. ఆత్మలోన నువ్వే.. అనుభూతిలోన నువ్వే.. నేను ఏరి కోరుకున్న కొత్తజన్మ నువ్వే!***

:-)

~~~~~~~~~~~~~

అంతందంగా మొదలైన ఉదయం తర్వాత "ఈ రోజంతా బయట తిరిగే ప్లానులన్నీ కాన్సిల్ చేసేసుకుని స్థిమితంగా ఇంటిపట్టున ఉండాలనుంది" అన్న నిషి కోరిక ప్రకారం అలా బద్ధకంగా ఇంట్లోనే కూర్చున్నాం. "ఈ రోజు మీరు వంట పని పెట్టుకోడానికి వీల్లేదు. ఏదో ఒకటి సింపుల్ గా తినేద్దాం లెండి" అని కాంతి గారిని కిచెన్ వైపు వెళ్ళనివ్వకుండా ఆపేశాం. రోజంతా ఏమేం కబుర్లు మాట్లాడుకుంటున్నా గానీ అందరి మొహాల్లో నవ్వుల వెనుక దాగున్న దిగులు, మాటల వెనక నొక్కిపెట్టేసిన బెంగ అప్పుడప్పుడూ తొంగి చూస్తోంది. ముందుకి కదలొద్దని ఎంత బతిమాలుతున్నా వినిపించుకోకుండా గడియారం మధ్యాహ్నం దాకా లాక్కెళ్ళి పోయింది.

మా లంచ్ కోసమని మిరపకాయ బజ్జీలు, బిర్యాని, ఆర్డర్ చేసి తెప్పించారు కిరణ్ ప్రభ గారు. భోజనం చేద్దామనుకుంటుండగా ఎవరో వచ్చి డోర్ బెల్ కొట్టారు. వెళ్ళి చూస్తే పోస్టులో ఏదో డబ్బా వచ్చింది. దాని మీద కాంతి గారి పేరున్నా సరే కాంతి గారు, నిషి ఇద్దరూ కలిసి "అది నీకోసమే వచ్చింది. ఓపెన్ చెయ్యి" అన్నారు. నాకేం అర్థం కాక అయోమయంగా డబ్బా తెరిచి చూసేసరికి ఆశ్చర్యం! లోపల నాకు 'హేపీ బర్త్ డే' మెసేజ్ తో ఒక
~~~~~~~~~~~~~

అందమైన రిస్ట్ వాచ్ ఉంది. పద్మవల్లి గారు పంపించారు. ఆ సర్ప్రైజ్ లోంచి బయటపడటానికి కాసేపు పట్టింది. వెంటనే పద్మవల్లి గారికి ఫోన్ చేసి"మీరు పంపిన అందమైన కానుక అందింది. చాలా సర్ప్రైజ్ అయిపోయాను. థాంక్యూ సో మచ్" అని చెప్తే "నేను, నిషి కలిసి సెలెక్ట్ చేసాము. నువ్వు పుట్టినరోజు దాకా ఉండకుండా వెళ్ళిపోతున్నావు కదా.. అందుకే ముందే పంపించేసాను. వాచ్ పెట్టుకున్నప్పుడు ఫోటో తీసి చూపించు" అన్నారు. "పుట్టినరోజు కోసం పంపానన్నారు కాబట్టి అప్పుడే పెట్టుకుంటాలెండి. చాలా థాంక్స్" అని చెప్పాను. వాళ్ళిద్దరూ కలిసి ఆ గిఫ్ట్ ఎలా సెలెక్ట్ చేసారని నిషి చెప్తుంటే ఆ కబుర్లు వింటూ లంచ్ పూర్తి చేసేశాం.

"సాయంత్రం నాలుగింటికి షాపింగ్ కి వెళదాం. అప్పటిదాకా మీ ఇష్టం" అని కిరణ్ ప్రభ గారు చెప్పారు. ఏంటో.. నిషి అప్పుడే వెళ్ళిపోతోంది.. ఇంకొక రెండు రోజులుంటే బాగుండేది కదా.. అనుకుంటూ కూర్చున్నాం. "నిషి వెళ్ళిన దిగుల్లోంచి బయటపడక ముందే బుధవారం వచ్చేస్తుంది. మధుర కూడా వెళ్ళిపోతుంది" అని నీరసంగా అన్నారు కాంతి గారు. "అయినా పుట్టినరోజు దాకా ఉండి వెళ్తే బాగుంటుంది. అక్కడికి వెళ్ళినా పుట్టినరోజున ఒక్కదానివే ఉండాలి కాబట్టి ప్రయాణం కాస్త వాయిదా వేస్కోవచ్చు కదా.." అని అందరూ మూకుమ్మడిగా చెప్పారు. ఆ పోస్ట్ పోన్ ప్రాసెస్ ఏదో చాలా కాంప్లెక్స్ గా ఉందంటే "నువ్వు ముందు ఆ ఎయిర్ లైన్స్ కి ఒకసారి కాల్ చేసి కనుక్కో" అని గట్టిగా ముందుకి తోసారు. సరేలే చూద్దామని వాళ్ళకి ఫోన్ చేస్తే ఆ లైన్ కలిసి వాళ్ళు ఒక్కో వివరం అడిగి విషయం తేల్చేసరికి రెండు గంటల పైన పట్టింది. ఒక పక్క ఆ ఫోన్ స్పీకర్లో పడేసి మా కబుర్లలో మేమున్నాం. చివరికి రెండు గంటల తర్వాత మాట్లాడిన అమ్మాయి మీ టికెట్స్ డేట్స్ మార్చుకుంటే ఇంత ఖర్చవుతుంది అని చెప్పి ఇప్పుడు చెసెయ్యమంటారా అని అడిగింది. అప్పటికప్పుడు చెయ్యాల్సి వస్తుందనుకోలేదు నేను. కాంతి గారేమో "ఇంతసేపు కష్టపడి కనుక్కున్నాక మళ్ళీ ఆలోచించేది ఏముందిలే చేసెయ్యి తల్లీ.." అన్నారు. నేను జూలై ఫస్టుకి చేద్దామనుకుంటే రెండో తారీఖుకి చెయ్యమ్మా అని పక్కనుంచి చెప్తుంటే నేను మంత్రం వేసినట్టు రెండో తారీఖుకే చేయించేసాను. తర్వాత అమ్మావాళ్ళకి, మా ఇంటబ్బాయ్ కి అందరికీ ఈ విషయం చెప్తే పుట్టినరోజుకి ఒక్కదానివే ఉండక్కర్లేకుండా మంచి పని చేసావులే అన్నారు.

అనుకోకుండా అలా అప్పటికప్పుడు నా ప్రయాణం వాయిదా పడేసరికి అప్పటిదాకా మా అందరి మొహాల్లో ఉన్న దిగులు కాస్త తగ్గి కొత్త ఉత్సాహం వచ్చింది.ఆ ఉత్సాహంలో షాపింగ్ కి వెళ్ళాం. అదేంటో మనం ఊరికే షాపింగుకి వెళ్ళినప్పుడు 'ఇప్పుడు ఇంత గొప్ప వస్తువు కొనకపోతే నీ ఖర్మ..' అన్నట్టు అన్నీ మంచి మంచివే కనిపిస్తుంటాయి. మనం తప్పనిసరిగా ఏదన్నా కొనాలనుకుని వెళ్ళినప్పుడు ఏదీ ఓ పట్టాన నచ్చదు. ఆ రోజు సరిగ్గా అలాగే అయింది. ఒక రెండు మూడు షాపులు తిరిగి ఇంక టైం అయిపోతోందని బెంగపడే టైములో ఒకే ఒక్కటి మాకు

నచ్చింది కనపడింది. "పుట్టినరోజుకి ఇక్కడే ఉంటావు కదా.. నీక్కూడా కొనాల్సిందే" అని చెప్పి నిషితో పాటు మళ్ళీ నాక్కూడా ఇద్దరం ఒకే లాంటి డ్రస్లు కొనుక్కున్నాం. "నిజమే.. పుట్టినరోజు కోసం ఏమన్నా కొనాలి కదా.. పద పద ఏమన్నా చూద్దాం" అని నిషి కంగారు పెట్టేసింది. అప్పుడు అసలు టైము లేదు, అక్కడ మాకేం పెద్దగా నచ్చేవేమీ కనిపించకపోవడంతో నేను హమ్మయ్యా అనుకున్నాను. మా షాపింగు అయిపోయి ఇంటికొచ్చేసరికి దాదాపు ఏడు గంటలు కావొస్తోంది.

ఇంటికొచ్చి వేడి వేడిగా సూప్ తాగి నేను వచ్చిన రోజు దగ్గర్నుంచీ మార్నింగ్ వాక్ కి వెళదాం అనుకుంటూ వెళ్ళలేకపోయిన పార్క్ కి వెళ్ళాం. నిషి వచ్చే టైముకి పౌర్ణమి రోజు దగ్గర పడుతుంది కాబట్టి తనున్నప్పుడు వెన్నెల్లో వెళదామని ముందు నుంచే అనుకున్నాం. నిషి ఫ్లైట్ అర్ధరాత్రి పన్నెండుకి కదాని ఇప్పుడు తీరిగ్గా



వెన్నెల్లో వాకింగుకి బయలుదేరామన్నమాట. అప్పటికి ఇంకా చీకటి పడకపోయినా పడమటి నుంచి ఆకాశంలో పైపైకి తేలి వస్తున్న పెద్ద చందమామని చూస్తూ చాలాసేపు తిరిగాం. అక్కడ చిన్నపిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆటస్థలంలో ఉయ్యాలలు ఉంటే అస్సలేమాత్రం మొహమాటపడకుండా వాటిల్లో ఊగేసాం. ఇంకా అలా నడుస్తూ నడుస్తూ కొంచెం చీకటి పడేసరికి టైము తొమ్మిదవుతోందని వెన్నెల విహారం చాలించి ఇంటికి బయలుదేరాము.

మేము ఇంటికెళ్ళి డిన్నర్ పూర్తి చేసేసరికి నిషికి టాటా చెప్పి వెళదామని చిమట శ్రీని గారొచ్చారు. కాసేపు ఆ మాటా ఈ మాట మాట్లాడుకుని తొమ్మిది ముప్పావు కల్లా ఎయిర్ పోర్టుకి బయలుదేరాము. నిషిని నిన్నే కదా ఎయిర్ పోర్ట్ నుంచి తీసుకొచ్చాం.. ఇంతలోనే పంపించే రోజు కూడా వచ్చేసిందేంటీ అనిపించింది. కానీ అంతలోనే ఈ మూడు రోజుల్లో మేము ఆనందంగా గడిపిన క్షణాలన్నీ ఒక్కొక్కటే గుర్తు చేసుకుంటుంటే ఆ జ్ఞాపకాల లెక్క తేలిన కొద్దీ చాలా రోజులు కలిసున్నామేమో అన్నంత భ్రాంతి కలిగింది. మళ్ళీ మనం ఎప్పుడు కలుస్తామో కదా అన్న ప్రశ్న వచ్చినప్పుడు "మొదటిసారి కలిసే సమయం ముడిపడటమే కష్టం. రెండోసారి చాలా సులువుగా

కలిసొస్తుంది. నాకా నమ్మకం ఉంది. మళ్ళీ ఇక్కడే శాన్ ఫ్రాన్సిస్కోలోనో, మా ఊర్లోనో, జర్మనీలోనో ఖచ్చితంగా కలుస్తాం అనిపిస్తుంది" అంది నిషి. "అసలు ఎప్పుడో ఒకప్పుడు మనం ముగ్గురం కలిస్తే బావుండు అనుకున్నాం కానీ ఇంత తొందరలో కలవడం కుదురుతుందని అనుకోలేదు కదా.. మనం నిజ్జంగా కలిసాం అన్న విషయాన్ని మళ్ళీ మళ్ళీ తల్చుకుంటే ఈ భావనే చాలా గొప్పగా ఉంది కదా.." అన్నాన్నేను. "మీరిద్దరూ ఇక్కడే ఒక రెండు మూడు గంటల డ్రైవ్ దూరంలో ఉంటే ఎంత బాగుండేదో కదా.." అన్నారు కాంతి గారు. కిరణ్ ప్రభ గారు నిశబ్దంగా మా ముగ్గురి మాటలు వింటున్నారు. మాటల్లోనే ఎయిర్ పోర్ట్ దగ్గరికి వచ్చేసాం.

మూడు రోజుల క్రిందట ఇదే ఎయిర్ పోర్ట్ లో పట్టలేనంత సంబరం, మళ్ళీ సరిగ్గా అదే చోట మనసుకి భారమైన వీడుకోలు సన్నివేశం.. హ్మ్.. మన జీవితం కన్నా గొప్ప డ్రామా ఉన్న సినిమా బహుశా ఇంకేదీ ఉండదేమో అనిపించింది. లగేజ్ చెకిన్ చెయ్యడానికి నేనూ, నిషి వెళ్ళి క్యూ లో నించున్నాం. అక్కడ నించున్న అరగంట సేపూ మేమిద్దరం ఒకరి చెయ్యి ఒకరు వదలకుండా నించున్నామని లగేజ్ ఇవ్వడానికి నిషి కౌంటర్ దగ్గరికి నా చెయ్యి విడిచి వెళ్ళినప్పుడు తెలిసొచ్చింది. చెకిన్ అయిపోయాక ఇంకా దాదాపు గంట టైం ఉంది ఫ్లైట్ బోర్డ్ చెయ్యడానికి. నలుగురం కలిసి వెళ్ళి ఒక టేబుల్ దగ్గర కూర్చున్నాం. "మూడు వారాల క్రితం గొల్లపూడి గారు వాళ్ళని దింపడానికి వచ్చినప్పుడు ఆ టేబుల్ దగ్గరే కూర్చున్నాం. ఈసారి మళ్ళీ వచ్చినప్పుడు ఈ టేబుల్ ని చూసినప్పుడు నిషిని పంపించిన జ్ఞాపకం గుర్తొస్తూ ఉంటుంది" అన్నారు కాంతి గారు. చుట్టూరా మాలాగే ఎవరినో పంపించడానికి వచ్చిన వాళ్ళలో రకరకాల భావాలు కనిపించాయి. చాలామంది లాగే మేము కూడా ఎవరినో పిలిచి ఫోటో తీయించుకున్నాం.

ఎయిర్ పోర్ట్ లోపలకి వచ్చిన దగ్గరి నుంచీ నిషి ఎక్కువ మాటల్లేకుండా మౌనంగా అయిపోయింది. అందర్నీ చూస్తుంటే నేనే ఎక్కువ నవ్వుతూ మామూలుగా కనిపిస్తున్నాననిపించింది. అందరూ నా మాటలు పూర్తి శ్రద్ధగా వింటున్నారో లేదో తెలీకపోయినా నేనేదో ఏదో చెప్పి నవ్వించాను. కాసేపు అటూ ఇటూ నడిచి వద్దామని లేచాం. నిషి నన్నలా దగ్గరగా పట్టేసుకుని ఇద్దరం భుజాల మీద చేతులు వేసుకుని నడుస్తుంటే స్కూల్లో ఎక్కువ రోజులు సెలవలొచ్చే ముందు మళ్ళీ నేస్తాలని ఎప్పటికో కానీ చూడము కదా అన్న బెంగతో పక్కపక్కనే తారట్లాడుతూ తిరిగిన రోజులు గుర్తొచ్చాయి. టాటా చెప్పాల్సిన టైము దగ్గర పడే కొద్దీ మా మధ్యన మాటలు కరువైపోతున్నాయి. ఇంకో పది నిమిషాలు ఉండగానే "ఇంక మీరు బయలుదేరండి. లోపల సెక్యూరిటీ చెక్ టైం పడుతుంది. నేనింక వెళతానులే" అని చెప్పి దూరంగా వెళ్ళి నిలబడింది నిషి. ఇంకాసేపు అక్కడే ఉంటే తన కళ్ళు చెప్పిన మాట వినవని మమ్మల్ని వెళ్ళిపోమంటోందని అర్థమవుతోంది. కాంతి గారు అప్పటికే చాలా సేపటి నుంచి మౌనమైపోయారు. "జాగ్రత్త నిషీ..

హేపీ జర్నీ" అని చెప్పాక టాటా చెప్పేసి అట్టే వెనక్కి తిరిగి చూడకుండా లోపలకి వెళ్ళిపోయింది నిషి. మేము కూడా అక్కడ మాకింకేం పనన్నట్టు క్షణం సేపన్నా నిలబడకుండా వెనక్కి వచ్చేశాం.

ఎయిర్ పోర్ట్ పార్కింగ్లో ఉన్న కారు తీసుకుని బయలుదేరగానే పక్కనున్న ఖాళీ సీటుకేసి చూస్తూ "ఎదురు చూసినంతసేపు పట్టలేదు కదా.. నా పక్క సీటు అప్పుడే ఖాళీ అయిపోయింది" అన్నారు కాంతి గారు. ఎంత అలవోకగా మాట్లాడేవాళ్ళకైనా ఒకోసారి మాటలు దొరకవు. అందులోనూ నాకసలు తల్చుకోడం, మాట్లాడటం ఇష్టం లేని విషయాల్లో ఈ 'వీడుకోలు' ముందుంటుంది. San Mateo bridge మీదకి వచ్చేసరికి ఆ రోజు నేను ఇదే స్వర్గద్వారం అని చెప్పగానే నిజ్జంగా నిజం అన్నంత ఆనందంగా గట్టిగా నవ్వేసిన నిషి గుర్తొచ్చింది. వంతెన పక్కన నిశ్చలంగా ఉన్న నీళ్ళ మీద వెన్నెల కిరణాలు పరావర్తనం చెందుతూ అసలు అక్కడ నీళ్ళే లేవేమో అదంతా నున్నటి గచ్చేమో అన్న భ్రమ కలిగిస్తోంది. అప్పుడప్పుడూ మధ్య మధ్యలో కదులుతున్న నీటి అలల్లో వెన్నెల వయ్యారంగా నాట్యమాడుతోంది. చూడండి చూడండి అంటూ కాంతి గారికి చూపిస్తే కొద్ది క్షణాలు వెన్నెల మాయలో పడిపోయారు. నిషి ఫోన్ చేసి "About to takeoff.. ఇంటికెళ్ళాక మాట్లాడతాను" అని చెప్పి పెట్టేసింది. నిషి కబుర్లతో తొందరగా ఇంటికొచ్చేసినట్టు అనిపించింది. అప్పటికే చాలా రాత్రి అయ్యింది కాబట్టి వెళ్ళి పడుకున్నాం. ఎన్నో రకాల ఆలోచనలు, భావాలు కలగలిసిపోయి మదిని పరిగెత్తిస్తుంటే కిటికీలోంచి తొంగి చూస్తున్న వెన్నెల నా అవస్థ గమనించి ఈ పూటకి నాకు తోడొచ్చి నిదుర దరికి చేర్చింది.



# My San Francisco Diary - 11

## 23.06.2013

## ఆదివారం

ఈ రోజు ఉదయాన్నే వీలైనంత త్వరగా ఇంట్లోంచి బయలుదేరి బీచ్ కి వెళదామని అనుకున్నాం. నేను నిద్ర లేచేసరికే కాంతి గారు మేము తీసుకెళ్ళడం కోసమని పులిహోర కలిపారు. మేము టిఫిన్లు చేసి తీరిగ్గా తయారై ఇంట్లోంచి బయటపడేసరికి దాదాపు పదిన్నర అయింది టైము. బీచులకి వెళదాం అనుకుంటున్నప్పటి నుంచీ హాఫ్ మూన్ బే, 17 మైల్ డ్రైవ్.. వాటికి వెళదామని కిరణ్ ప్రభ గారు చెప్తుంటే నేనేమో ముందు Big Sur కి వెళదామని అడిగాను. ఇదివరకెప్పుడూ వాళ్ళు వెళ్ళలేదు కాబట్టి ముగ్గురికీ మొదటిసారన్నమాట ఈ బీచ్ ట్రిప్. మా ఇంటి నుంచి బిగ్ సర్ కి రెండు గంటల పైనే డ్రైవ్. సగం దూరం వెళ్ళాక రోడ్డుకి ఒక పక్కన సముద్రం, ఇంకో పక్కన పెద్ద పెద్ద కొండలు ఉన్న రోడ్లో సాగింది మా ప్రయాణం. ఆ ప్రదేశం చాలా ఎత్తులో ఉండటం, పక్కనే సముద్రం ఉండడం వల్లనుకుంటా చాలా



తక్కువ ఎత్తులో మన పైపైనే పొగమంచు మబ్బులు తేలుతున్నాయి. కారు వెళుతున్న రోడ్డు నుంచీ కుడి పక్కకి ఓ ఐదారు అడుగులేస్తే కింద పే..ద్ద సముద్రం. అలా కొండ అంచుల్లో వెళుతూ సముద్రాన్ని చూడటం థ్రిల్లింగానే అనిపించినా అలాంటి దారుల్లో డ్రైవ్ చెయ్యాలంటే నాలాంటి ధైర్యవంతులు అస్సలు పనికిరారనిపించింది. ఆ కొండల మీద రకరకాల రంగుల్లో పూసిన గడ్డి పూలు, ముదురాకుపచ్చ కొండలు, లోయల మీదుగా అలా గాలిలో ఎగురుతూ పోతున్న పొగమంచు దుప్పట్లు, వందల ఏళ్ళ నుంచీ సముద్రం మధ్యలో మొండిగా నిలబడిన ఒంటరి శిలలు, ఆ కొండ రాళ్ళ మధ్యలో కట్టిన పాతకాలం వంతెన అవన్నీ కళ్ళార్పకుండా చూస్తూ ఉండిపోవాలనిపించేంత అందంగా ఉన్నాయి.

Big Sur ఊర్లోకెళ్ళాక అక్కడో మ్యాప్ కొనుక్కుని చుట్టపక్కల ఏమేం ఉన్నాయో తెలుసుకుని Pfeiffer Beach కి వెళ్ళాం. ఆ బీచ్ కి వెళ్ళే దారి చూసి అసలు లోపలకి వెళ్తే నిజంగా బీచ్ వస్తుందా రాదా అన్నంత సందేహం వచ్చింది మాకు. ఎందుకంటే అదేదో అడవిలోకి వెళ్ళే డొంక దారి లాగా, ఇంకా చెప్పాలంటే మా ఊరి వైపు అడవుల్లో ఉన్న చిన్న చిన్న ఊర్లకి వేసే సన్నటి సింగిల్ రోడ్డు లాగా ఉంది ఆ బీచ్ కి వెళ్ళే దారి. మా సందేహాలన్నీ మాయం చేస్తూ అక్కడ కార్ పార్క్ చేసి బీచ్ లోకి వెళ్ళే దారి కనపడింది. అప్పటికే ఆకలేస్తూ ఉండటంతో మేం తెచ్చుకున్న పులిహోర తినేసి బీచ్ వైపు బయలుదేరాం. ఆ వెళ్ళే దారి చిన్నగానే ఉంది కానీ లోపలికి వెళ్ళాక అక్కడ పెద్ద పెద్ద కొండలు, బండ రాళ్ళ మధ్యన ఎగిసి పడుతున్న విశాలమైన సముద్రం ఎదురైంది. ఆ బీచ్ లో ఇసుక ఒకలాంటి పర్పుల్ రంగులో ఉంటుందని నేను ఇదివరకే విన్నాను. బీచ్ లో ఇసుక మేటల మీద పై పొర గాలికి ఎగిరిపోయి ఊదా రంగు ఇసుక గీతలు స్పష్టంగా తెలుస్తున్నాయి. కాంతి గారికి కూడా ఆ రంగంటే చాలా ఇష్టం. నేను ముందు ఆ రంగులో ఇసుక ఉంటుందని చెప్తే అలా ఎలా ఉంటుంది అన్నారు. అక్కడ చూసినప్పుడు నాకన్నా ఎక్కువ ఎక్సైటింగా ఫీలయ్యారు. అక్కడి సముద్రపు ఒడ్డున ఉన్న రాళ్ళలో ఉండే మాంగనీస్ వల్ల కొన్ని ఇసుక రేణువులు ఆ రంగులో ఉంటాయట. ఫోటో తీయడానికి ప్రయత్నించినా బయట కనిపించినంత అందంగా నా ఫోటోలకి చిక్కలేదు ఎందుకో! వచ్చేప్పుడు ఆ ఊదా రంగు ఇసుక కొంచెం తీసుకొచ్చుకోవాలని కాంతి గారు ముచ్చటపడ్డారు కానీ అప్పుడు మా దగ్గర ఇసుక నింపడానికి ఏమీ లేక మళ్ళీ ఇంకోసారి వచ్చినప్పుడు తెచ్చుకుందాంలే అని వచ్చేశాం.



ఆ సముద్రపు ఒడ్డున గాలి విపరీతంగా వీస్తోంది. మనుషులు మాత్రం చాలా తక్కువ మంది ఉండి బీచ్ అంతా చాలా ప్రశాంతంగా ఉంది. ఆగి ఆగి ఎగిసి పడుతున్న అలల శబ్దం, అక్కడక్కడా ఒడ్డు మీద ఇసుకలో తిరుగుతున్న చిన్న చిన్న పక్షులు చేస్తున్న శబ్దాలు, గాలి హోరు మినహా వేరే చప్పుళ్ళేవీ వినిపించడం లేదు. అసలు సముద్రంలో ఏదో గొప్ప ఆకర్షణ ఉందనిపిస్తుంది. ప్రకృతి రూపాలన్నీ మనిషి మనసుని ఆకర్షిస్తూనే ఉంటాయి గానీ ఆకాశం, మబ్బులు, వాన, కొండలు, లోయలు, వెన్నెల.. వీటన్నీటిని మించిన బలమైన ఆకర్షణ ఏదో ఒక్క సముద్రంలోనే ఉందనిపిస్తుంది. సముద్రం ఎదురుగా నించుని అలా కనుచూపుమేరా ఉన్న నీలి పరదా లాంటి సాగరాన్ని చూస్తుంటే ఎంతో నిశ్చలంగా, గంభీరంగా ఉన్నట్టుంటుంది. అంతటి విశాలమైన సముద్రపు నీళ్ళలో అలలు ఖచ్చితంగా ఎక్కడ పుడుతున్నాయో అర్థమైనట్టు అనిపించదు. అలా చూస్తుండగానే తీరానికి చేరువయే కొద్దీ అప్పుడప్పుడే నెమ్మదిగా కదులుతున్నట్టు కనిపించిన అల క్షణాల్లోనే తీరం దాకా వచ్చేసరికి ఉవ్వెత్తున ఎగిసిపడుతుంది. ఎగిరిన అల వైపు చూస్తూ రెప్ప వేసే లోపే చప్పున మాయమైపోతుంది. ఎన్నిసార్లు మళ్ళీ మళ్ళీ వచ్చి తీరాన్ని తాకినా కెరటం ఎగిసిన ప్రతీసారీ ఇదే మొదటిసారన్నట్టు అదే ఉత్సాహం, అంతే పరవశం.. బహుశా సముద్రమంత ప్రేమ

ఉంటే అలాగే ఉంటుందేమో! అలా సముద్రం వైపే చూస్తూ నించుంటే అలల చేతులతో తన ఒడిలోకి రమ్మని పిలుస్తున్నట్టుంటుంది. వెనక్కి తిరిగి చూడకుండా అలా వెళ్ళిపోతే బావుండనిపించేంత పరవశంలో తేలుస్తూనే ఒక్కసారి దుడుకుగా ఓ అల వచ్చి మనల్నిముంచెత్తగానే అంతటి సముద్రాన్ని భరించడం మన వల్ల కాదని భంగపడి వెనకడుగు వేసేలా చేస్తుంది. ఎగిరి వచ్చి తడిపేసిన అల వెళుతూ వెళుతూ పాదాల కింద నుంచి సన్నగా ఇసుకని లాగేస్తూ గిలిగింతలు పెడుతూ తనలోకి లాక్కుంటున్నప్పుడు మైకంలో పడేసి మాయ చేసే మహా తుంటరిలా కనిపిస్తుంది సముద్రం. ఎగిరొచ్చే ప్రతీ అల ఏవో ఊసులు చెపుతున్నట్టు, ఆ కెరటాల సవ్వడిలో శ్రావ్యమైన సంగీతమేదో వినపడుతున్నట్టుంటుంది. ఇంకా.. సముద్రంతో నాకేదో విడదీయలేని బంధం ఉన్న భావనేదో... అరే.. ఎంతసేపైనా నా ఈ సముద్రపు మురిపెం తీరదే!



ఒడ్డు మీద ఒక దగ్గర కదలకుండా నించుంటే ఒకదాని తర్వాత ఒకటి వచ్చే అలల్లో ఎన్ని మా పాదాలని తాకి వెళతాయో అని లెక్కలు వేసుకుంటూ చాలా సేపు సముద్రపు నీళ్ళలో ఆటలాడీ ఆడీ అలసిపోయాక ఒడ్డున కూర్చుని కాంతి గారు, నేను పిచ్చుక గూళ్ళు కట్టుకున్నాం. చిన్నప్పుడు వెన్నెల్లో ఇసుకలో ఆడుకున్న దూ దూ

పుల్ల ఆట ఆడుకున్నాం. అక్కడ ఒడ్డున నీళ్ళలో ఆడుకుంటున్న చిన్న పిల్లల్ని, అలల మీద సర్ఫింగ్ ప్రాక్టీస్ చేస్తున్న వాళ్ళని చూస్తూ సరదాపడ్డాం. ఈ ఆటల్లోనే సమయమంతా గడిచిపోయి టైము మధ్యాహ్నం మూడైపోయింది. కాంతి గారికి అస్సలు అక్కడి నుంచి కదలడం ఇష్టం లేకపోయినా ఇంకా 17 మైల్ డ్రైవ్ కి వెళ్ళాలి కదాని అక్కడి అందమైన సముద్రానికి టాటా చెప్పేసి వెనక్కి బయలుదేరిపోయాం.

బిగ్ సర్ నుంచి దాదాపు ఒక గంట సేపు డ్రైవ్ చేసాక 17 మైల్ డ్రైవ్ కి చేరుకున్నాం. దారిలో ఉండగానే వాతావరణం అంతా మారిపోయి అప్పటిదాకా తేటగా ఉన్న ఆకాశం కాస్తా పొగమంచుతో నిండిపోయి సన్నగా మంచు కురవడం మొదలైంది. అప్పటికే నాకున్న గొంతు నొప్పికి తోడు మళ్ళీ సముద్రపు గాలికి తిరిగి, చల్లటి నీళ్ళలో తడిచేసరికి క్షణాల మీద జ్వరం వచ్చేసింది. కానీ అంతదాకా వెళ్ళాం కదాని 17 మైల్స్ డ్రైవ్ లో ఉన్న రకరకాల బీచులని చూస్తూ వెళ్ళాం. ఇంట్లో నుంచి చూస్తే ఆ బీచ్ వ్యూ లు కనిపించేలా అక్కడ చాలా ఖరీదైన ఇళ్ళు ఉన్నాయి. అవన్నీ చూస్తుంటే "కోట్లు కోట్లు డబ్బులు సంపాదించి ఏం చేసుకుంటారో" అని ఎప్పుడూ అనిపించే ప్రశ్నకి సమాధానమేదో దొరికినట్టనిపించింది. కానీ అన్నేసి మిలియన్లు పెట్టి అంతందమైన ఇళ్ళు కొనుక్కున్నవాళ్ళకి వాటిల్లో తీరిగ్గా కూర్చుని గడిపే సమయం ఉంటుందో లేదో మరి సందేహమే! మేము అక్కడికి వెళ్ళేసరికి మంచు కురవడం పెరగడం, నాకు జ్వరం ఎక్కువవడం రెండూ జరిగేసరికి పెద్దగా ఏమీ చూడకుండానే అన్నీ అలా అలా చుట్టేసి ఇంటి దారి పట్టాము. ఇంటికొస్తూనే పిజ్జా హట్ నుంచి తెచ్చుకున్న పిజ్జా తినేసి జ్వరానికి టాబ్లెట్ వేసుకుని నిద్రపోయాను.

## 24.06.2013

## సోమవారం

ఎంత ఘాటు ప్రేమైతే భరించడం అంత కష్టం కదా మరి.. సముద్రంతో ప్రేమలో పడ్డందుకు కానుకగా వచ్చిన జ్వరంతో పడుకోవడంతోనే రోజంతా గడిచిపోయింది. :-)



## 25.06.2013

## మంగళవారం

ఈ రోజుకి జ్వరం కాస్త తగ్గి పర్లేదనిపించింది. పగలంతా యథావిధిగా కబుర్లు చెప్పుకుంటూ గడిపేసాక సాయంత్రానికి ఒక ప్రత్యేకమైన పుట్టినరోజు పార్టీ ప్రోగ్రాం ఉంది. అదేంటంటే మేము పాడుతా తీయగా కార్యక్రమానికి వెళ్ళిన రోజున వసంత అని ఒకమ్మాయి కిరణ్ ప్రభ గారి దగ్గరికొచ్చి పరిచయం చేసుకుని కిరణ్ ప్రభ గారికి వాళ్ళ శ్రీవారు చాలా చాలా పెద్ద అభిమాని అని, 25 వ తారీఖు తన పుట్టినరోజు సందర్భంగా కిరణ్ ప్రభ గారిని బర్త్ డే డిన్నర్ కి పిలిచి సర్ప్రైజ్ చెయ్యాలని తన కోరిక అని చెప్పిందట. మా ఇంట్లో గెస్టు ఉన్నారని చెప్తే "ఏం పర్లేదు మీ గెస్టుతో సహా వచ్చెయ్యండి" అని మరీ ఆహ్వానించిందట. ఆ సర్ప్రైజ్ బర్త్ డే పార్టీకి వెళ్ళాల్సింది ఈ రోజేనన్నమాట. మంగళవారం కాబట్టి సాయంత్రం కిరణ్ ప్రభ గారు విరిజల్లు రేడియో షో పూర్తి చేసేసరికి కాంతి గారు మా ఇంటి బ్యాక్ యార్డులోనే పూసిన పువ్వులతో అందమైన ఫ్లవర్ వేజ్ తయారు చేసారు. అప్పుడు బయలుదేరి వసంత వాళ్ళింటికి వెళ్ళాము. ఆ అమ్మాయి ఇలా సర్ప్రైజ్ ఇచ్చినప్పుడు వాళ్ళ ఆయన ఎలా ఫీలవుతారో కదా.. అని నేనూ, కాంతి గారు రకరకాల ఊహాగానాలు చేస్తూ వెళ్ళాము. మేము వాళ్ళింటి తలుపు తట్టాక పుట్టినరోజు జరుపుకుంటున్న తిరు గారు ఎదురుగా కనిపించిన కిరణ్ ప్రభ గారిని చూసి చాలా సర్ప్రైజ్ అయ్యారు. ఇప్పుడే రేడియోలో మీ షో విన్నాము, ఇంతలో మీరిలా మా ఇంటికొచ్చెయ్యడం నిజంగా గొప్ప థ్రిల్లింగా ఉందని చెప్పారు. వసంత బర్త్ డే కేక్ దగ్గరి నుంచి బజ్జీలు, పులిహోర, సాంబారు, మామిడిపండు దాకా బోల్డు రకాల వంటలతో బ్రహ్మాండమైన పుట్టినరోజు విందు ఏర్పాటు చేసింది. వాళ్ళ ఆతిథ్యాన్ని ఆనందంగా స్వీకరించి కాసేపు కబుర్లు చెప్పిన తర్వాత మేము ఇంటికొచ్చేసాం.



## 26.06.2013

## బుధవారం



నేనొచ్చిన దగ్గర్నుంచీ దాదాపు ప్రతీ రోజూ ఏదో ఒక చోటుకి తిరుగుతూనే ఉన్నాం కదా.. పిలవని చుట్టంలా ఈ జ్వరం వచ్చి పలకరించేసరికి కాస్త తిరగడం తగ్గించేసి ఇంటి పట్టునే ఎక్కువ ఉందామనుకున్నాం. ఈ రోజు సాయంకాలం దగ్గర్లో ఉన్న San Leandro Marina Park కి విహారానికి వెళ్ళాం. వాతావరణం కూడా మరీ ఎండగా కాకుండా, మరీ చల్లగా కాకుండా హాయిగా ఉంది. అక్కడంతా పచ్చటి గడ్డితో నిండిన పార్కులో ఈవినింగ్ వాక్ కి వచ్చిన జనాలు, చిన్నపిల్లలతో సందడిగా ఉంది. అక్కడి నుంచి కనిపిస్తున్న బే లో ముదురు నీలం రంగులో నిశ్చలంగా ఉన్న నీళ్ళని చూస్తూ మేము కూడా ఆ తీరం వెంబడి నడుస్తూ వెళ్ళాం. దూరంగా నీళ్ళ మీద కనిపిస్తున్న వంతెనని చూపించి "అదే మన స్వర్గ ద్వారం, San Mateo bridge" అని చెప్పారు కిరణ్ ప్రభ గారు. అక్కడ

విమానాలు బాగా కింద నించే ఎగురుతూ కనిపిస్తుంటే అవన్నీ పక్కనే ఉన్న Oakland ఎయిర్పోర్ట్ కి వచ్చిపోయే విమానాలని చెప్పారు. అందమైన ఆ పరిసరాల్లో ఆ సాయంత్రం ఆహ్లాదంగా గడిచింది. కాస్త షాపింగ్ పని చూసుకుని ఇంటికొచ్చేసాక కౌముది పత్రిక కొత్త సంచిక విడుదల చేయాల్సిన సమయం దగ్గర పడుతుంది కాబట్టి కాంతి గారు, కిరణ్ ప్రభ గారు ఆ పనిలో పడిపోయారు. నేను కూడా నా 'జర్మనీయం' కాలమ్ రాసుకుంటూ, అందరం పని చేసుకుంటూనే బోల్డు సాహితీ కబుర్లు చెప్పుకుంటూ హాయిగా గడిపేశాం ఆ పూటంతా.

**27.06.2013**

# గురువారం

ఈ రోజు మాత్రం ఎక్కడెక్కడికో వెళ్ళకుండా మనింటి చుట్టుపక్కల ఉన్న పచ్చటి పరిసరాల్లో ఈవినింగ్ వాక్ కి వెళదామన్నారు కిరణ్ ప్రభ గారు. అలా కాసేపు తిరిగాక మా ఇంటి పక్కన పార్కులో ఏర్పాటు చేసిన ఫార్మర్స్ మార్కెట్ కి వెళ్ళాము. అది అచ్చం మా జర్మనీలో చూసే ఫ్రెష్ మార్కెట్ లానే ఉంది. ఇలాంటి మార్కెట్లలో తాజా కూరగాయలు, పండ్లు నేరుగా తోటల నుంచి తీసుకొచ్చినవి దొరుకుతాయి. అక్కడ ఒక చోట చిన్నపిల్లల 'మినీ జూ' లాంటిది ఏర్పాటు చేసారు. ఒక చిన్న కంచె లాగా కట్టి లోపల గొర్రెలు, మేకలు, బాతులు, కోళ్ళు , కుందేళ్ళు లాంటి చిన్న చిన్న జంతువులన్నీటినీ ఉంచారు. చిన్నపిల్లలందరూ లోపలకి వెళ్ళి తిరుగుతూ వాటితో ఆడుకుంటున్నారు. కాసేపు మేము కూడా వాటిని చూసి సరదాపడ్డాం. తర్వాత చల్లగాలికి కాసేపు పచ్చని చెట్ల మధ్యన కూర్చుని చీకటి పడే సమయానికి ఇంటికొచ్చేసాం. అప్పుడు మళ్ళీ ఇంటికి దగ్గర్లో ఉన్న మెక్సికన్ ఈటింగ్ ప్లేస్ Baja Fresh కి డిన్నర్ చేయడానికి వెళ్ళాము. అప్పుడే మొదటిసారి రుచి చూసిన Veggie Tacos నాకు చాలా చాలా నచ్చేసింది. అసలు Tacos కన్నా పక్కనున్న మ్యాంగో సల్సా తినడం ఎక్కువ ఎంజాయ్ చేశాం. ఒకోసారి బాగా తినేసినప్పుడు కూడా అలుపొస్తుంది కదా.. అప్పుడలాగే అనిపించి వెంటనే ఇంటికి రాకుండా అక్కడే బయట చల్లగాలికి కూర్చుని తిన్నది కాస్త గొంతు దిగే దాకా కబుర్లు చెప్పుకుని అప్పుడు బయలుదేరాం. ఈ రోజలా మెక్సికన్ రెస్టారెంట్ పేరు మీదుగా గడిచిపోయింది.

## 28.06.2013

## శుక్రవారం

ఈ రోజు సాయంకాలం షాపింగుకి వెళ్ళి త్వరగానే ఇంటికొచ్చేసాం. ప్రతీ నెలా ఒకటో తారీఖు దగ్గర పడుతున్న కొద్దీ కౌముది హడావుడి పెరుగుతూ వస్తుంది. వాళ్ళిద్దరూ ఆ పని చేసుకుంటుంటే నేను రెండోసారి నా కాలమ్ రాసుకోవడం మొదలుపెట్టాను. దాదాపు పూర్తయిపోయిన డ్రాఫ్ట్ ని నిన్న ఏదో ఫోనులో మాట్లాడుతూ పొరపాటున సేవ్ చెయ్యబోయి డిలీట్ చేసేసాను. అందుకని మళ్ళీ రెండోసారి రాయాల్సి వచ్చింది. టైము ఎక్కువ లేదు కదా అన్న కంగారు వల్ల అర్ధరాత్రి రెండింటి దాకా కూర్చుని అది రాయడం పూర్తి చేసి పడుకున్నాను.

## 29.06.2013

## శనివారం

మళ్ళీ వీకెండ్ వచ్చేసింది. అసలైతే వీకెండ్లో రోజంతా తిరగొచ్చు కానీ అప్పటికే ఎండలు మండిపోతున్నాయి కాబట్టి ఈ వీకెండ్ చిన్న చిన్న ట్రిప్ లు పెట్టుకుందాం అనుకున్నాం. శనివారం ఉదయం కాబట్టి టోరి రేడియోలో కిరణ్ ప్రభ గారి టాక్ షో అయిపోయేసరికి మధ్యాహ్నం అయింది. ఈ రోజు Brentwood ఫ్రూట్ ఫార్మ్స్ వైపు వెళ్ళి ఏదన్నా ఫ్రూట్ పికింగ్ కి వెళ్ళాలని మా ప్లాన్. అక్కడే లంచ్ చెయ్యడానికి వీలుగా ఉంటుందని కాంతి గారు పులిహోర సిద్ధం చేసుంచారు. ఉదయాన్నే ప్రసాద్ గారు వాళ్ళు కాల్ చేసి ఈ రోజు ఎండ చాలా ఎక్కువుంటుందట. బయటికి వెళ్తే కష్టమేమో అని చెప్పారు గానీ మళ్ళీ మాకు టైము దొరకదు కదా అన్న ఉద్దేశ్యంతో మేము Brentwood కి బయలుదేరిపోయాం. ఇంట్లోంచి బయటపడ్డాక గానీ మాకు తెలీలేదు ఎండ ఎంత తీవ్రంగా ఉందో! Brentwood కి వెళ్ళే దారి మాత్రం one of the most scenic drives I've ever been to.. అని చెప్పాలి. బంగారు వర్ణంలో మెరిసిపోతున్న కొండల మీద బోల్డన్ని విండ్ మిల్స్ తిరుగుతూ ఉన్నాయి. ఆ కొండ మధ్యలో నుంచి వేసిన రోడ్డు మీద వాటిని చూస్తూ ప్రయాణం చేయడం చాలా బాగుంది.

మేము వెళ్ళిన టైములో ఎక్కువ Apricots, Peaches, Nectarines తోటల్లో ఫ్రూట్ పికింగ్ ఉంది. మేము ఒక తోట దగ్గరికి వెళ్ళేసరికే ఎండ పెరిగి పెరిగి 108 °F అయింది. ఎండా బాగా ఉంది అనుకుంటూనే తోటలోకి వెళ్ళి విరగ కాసిన ఆ పండ్ల చెట్లని చూసి ముచ్చట పడిపోతూ పీచ్ పళ్ళు తింటూ తీసుకెళ్ళడానికి కోసుకోవడం మొదలుపెట్టాం. ఒక అరగంట గడిచాక కాంతి గారు నావైపు చూసి "అమ్మో.. పిల్ల మొహం చూసారా ఎండ దెబ్బకి ఎలా అయిపోయిందో.. ఇంతవరకూ కోసుకున్న పళ్ళు చాల్లే ఇంక పదండి పదండి" అని వెనక్కి బయలుదేరదీసారు. అక్కడ తోటలోకి వెళ్ళేప్పుడు ఖాళీ బకెట్ తీసుకుని మనకి కావలసినన్ని పళ్ళు కోసుకుని బయటికొచ్చేప్పుడు వాటి బరువు ప్రకారం డబ్బులిచ్చేసి తెచ్చుకోవాలి. అక్కడ కౌంటర్లో ఉన్న అమ్మాయి అది వాళ్ళ సొంత తోటనీ, తను చదువుకుంటూ అప్పుడప్పుడూ టైము ఉన్నప్పుడు తోటలో పని చేస్తుంటానని చెప్పింది. "ఇన్ని పళ్ళు న్నాయి కదా.. మీరు తీసుకెళ్ళి మార్కెట్లో అమ్ముతారా" అంటే "అదేం లేదు.. కేవలం ఫ్రూట్ పికింగ్ కి వచ్చే వాళ్ళ కోసమే మా తోట" అని చెప్పింది. Heritage Fruit Farms అని ఆ తోట పేరు చూడగానే నాకు మన దగ్గరుండే హెరిటేజ్ ఫుడ్స్ గుర్తొచ్చింది. ఇంతకీ నేనొక తింగరి పని చేసాను. ఇంట్లోంచి వచ్చే ముందు కెమెరా మెమరీ కార్డ్ లోనుంచి ఫొటోస్ కాపీ చేసి అది ల్యాప్టాప్ లోనే మర్చిపోయి వచ్చి "అబ్బో కొండలు, తోటలు ఎంత బాగున్నాయో.." అనుకుంటూ తీసిన ఫొటోలన్నీ ఒక్కటి కూడా సేవ్ అవ్వలేదు. చివరి నిమిషంలో తోటలో ఉన్నప్పుడు ఆ సంగతి గమనించాక "ఏం పర్లేదులేమ్మా.." అని కిరణ్ ప్రభ గారు తన బ్లాక్ బెర్రీలో కొన్ని ఫొటోస్ తీసారు.

Brentwood నుంచి ఇంటికొచ్చేసరికి వడ దెబ్బ తగిలిన వాళ్ళలా అయిపోయాము. మేము తీసుకెళ్ళిన పులిహోర మళ్ళీ ఇంటికొచ్చాక తినేసి ఎండ దెబ్బ నుంచి బయటపడటానికి కాసేపు పడుకుందామనుకున్న వాళ్ళం కాస్తా సాయంత్రం దాకా మంచానికి అతుక్కుపోయాం. సాయంకాలం వెళదామనుకున్న తెలుగు నాటకం ప్రోగ్రాం సంగతి కూడా పట్టించుకోలేనంతగా అలసటగా నిద్రపోయాం. నిద్ర లేచాక తోట నుంచి కోసుకొచ్చిన పళ్ళు తీసుకుని ప్రసాద్, పద్మ గారింటికి వెళ్ళాం. "హీట్ వేవ్ ఉందని న్యూస్ లో కూడా చెప్పారు తెలుసా.. అంత ఎండలో మీరు ఫ్రూట్ పికింగ్ కి వెళ్ళారా.." అని వాళ్ళందరూ మమ్మల్ని చూసి ఒకటే నవ్వడం.. చేసేదేం లేక మేము కూడా నవ్వేశాం. కానీ ఆ వడదెబ్బ కొట్టిన గట్టి దెబ్బకి భయపడి రేపు నాపా వ్యాలీ వెళదామనుకున్న ప్లాన్ కాన్సిల్ చేసుకున్నాం. ప్రసాద్ గారింటి నుంచి వచ్చేప్పుడు దారిలో అరగంట సేపు కష్టపడి సెలెక్ట్ చేసి ఒక సూపర్ డూపర్ OREO కేక్ కొనుక్కుని వచ్చాం. ఎందుకంటే మరి రేపు నా Happy Birthday కదా! :-)

## 30.06.2013

## ఆదివారం

ముందు రోజంతా విపరీతంగా అలసిపోయుండేసరికి అర్ధరాత్రి కేక్ కట్ చేసే ప్రోగ్రాములు పెట్టుకోకుండా ఉదయాన్నే ఫ్రెష్ గా సెలెబ్రేట్ చేసుకుందాం అనుకున్నాం. ఆ రోజు అందరం కలిసి ఒకే చోట కబుర్లు చెప్పుకుంటూ నిద్రపోవచ్చని హాల్లో వరసగా పడుకున్నాం. రాత్రి పన్నెండింటికి ఫోను మోసుకొచ్చిన ఆనందక్షణాలని అందుకోవడంతో నా పుట్టినరోజు మొదలైపోయింది. తర్వాత ఎందుకో ఎంత ప్రయత్నించినా సరిగ్గా నిద్ర పట్టకుండానే తెల్లారిపోయింది. మళ్ళీ ఉదయాన్నే లేచీ లేవగానే ఫోనులో బోల్డన్ని పుట్టినరోజు దీవెనలు వచ్చేసాయి. నేనొచ్చిన దగ్గర్నుంచీ కిరణ్ ప్రభ గారు ప్రతీరోజూ వాకింగ్ కి రమ్మని అడిగినా నేనిప్పటి దాకా వెళ్ళలేదు కదా.. నేను ఊరెళ్ళి పోయే లోపు కనీసం ఒక్కసారైనా మార్నింగ్ వాక్ కి వెళ్ళాలని ఈ రోజు ఉదయం ముగ్గురం కలిసి వాక్ కి బయలుదేరాము. వెళ్ళేటప్పుడు లెటర్ బాక్స్ చెక్ చేస్తే అందులో ఒక చిన్ని పేకెట్ కనిపించింది. అది చూడగానే నాకు అర్థమైపోయింది కాంతి గారికి తెలీకుండా తన కోసం నిషి పంపిన బుల్లి గిఫ్ట్ వచ్చేసిందని. అది ఓపెన్ చేసి చూసుకుంటూ, నిషికి ఫోన్ చేసి తనతో కబుర్లు చెప్తూ వాకింగ్ పూర్తి చేసాం. నిషి అప్పటికే నా పుట్టినరోజుకని గిఫ్ట్ పంపించింది. మళ్ళీ కాంతి గారితో పాటు ఇంకో బుల్లి గిఫ్ట్ పంపించింది. అది నా +1 గిఫ్ట్ అన్నమాట.

వాకింగ్ నుంచి ఇంటికొచ్చాక కిరణ్ ప్రభ గారు చాలా సీరియస్ గా "ఇప్పటిదాకా నీ దగ్గర ఒక పెద్ద సీక్రెట్ దాచిపెట్టాము. అదేంటంటే మాకో పాప కూడా ఉంది. తను చిన్నప్పుడు తిరనాల్లో తప్పిపోయింది. తన ఫోటో చూస్తావా.." అని చెప్పి దాదాపు నాలో సగం ఎత్తున్న పోస్టర్ ఒకటి చేతికిచ్చారు. అది తెరిచి అందులో నవ్వుతూ నించున్న నన్ను నేను చూసుకోగానే నాకసలేం అర్థం కాలేదు ఒక్క క్షణం. నా గురించి అక్కడ రాసున్న వాక్యాలు చూసి కళ్ళల్లో నీటి తెర కదలాడింది. "మాకసలు సర్ప్రైజ్ చెయ్యడం ఎప్పుడూ తెలీదు అంటూనే ఎంత పెద్ద సర్ప్రైజ్ ఇచ్చారు మీరిద్దరూ.." అని నేనంటే "నువ్వు ఎప్పుడూ మా పక్కనే ఉన్నావు కాబట్టి నీకు తెలీకుండా ఈ పోస్టర్ డిజైన్ చేసి ప్రింట్ చేయించి తీసుకురావడానికి నిజంగానే కొంచెం కష్టమయింది" అంటూ నవ్వారు. ఆ ఆనందంలోంచి తేరుకున్నాక అమ్మ, నాన్న, తమ్ముళ్ళు , నేస్తాలు.. అందరితో మాట్లాడి అందరి ఆశీస్సులు, శుభాకాంక్షలు అందుకున్నాను. ఎప్పుడూ లేనిది ఈసారి మా ఇంటబ్బాయ్ కూడా అలవాటు లేని పనైనా సరే కష్టపడి మెయిల్లో హేపీ బర్త్ డే చెప్పాడు. తర్వాత తలస్నానం చేసి కొత్త బట్టలు వేసుకుని, కొత్త వాచీతో సహా దేవుడికి దణ్ణం పెట్టుకుని అప్పుడు కేక్ కట్ చేసాను. కేక్ తో

పాటు లంచ్ లో మళ్ళీ మిరపకాయ బజ్జీలు, బిర్యాని తిన్నాం. నిషి ఉంటే ఈపాటికి అన్నీ టేబుల్ మీద సర్దేస్తూ ఉండేది కదా.. అప్పుడే నిషి వెళ్ళి వారం రోజులు గడిచిపోయి నేను ఊరెళ్ళే రోజు కూడా దగ్గరకొచ్చేస్తోంది కదా అనుకున్నాం.

మధ్యాహ్నం ఎండ పూట ఇంట్లోనే ఉండి సాయంకాలం కౌముది పత్రిక సంచిక విజయవంతంగా టైముకి విడుదల చేసి బయటికి వెళ్ళాం. ముందు మొదటిరోజు వెళ్ళిన లివర్ మోర్ టెంపుల్ కి వెళ్ళాం. ఆ మొదటి రోజు గుడి మూసేసి ఉండటం వల్ల దొరకని వెంకటేశ్వర స్వామి దర్శనం ఈ రోజు దొరికినందుకు చాలా సంతోషించాం. కాంతి గారు మళ్ళీ నా చేత డాలర్లు హుండీలో వేయించాక కాసేపు ఏడుకొండల వాడితో కష్టం సుఖం చెప్పుకుని తీర్థ ప్రసాదాలు తీసుకుని గుడిలోంచి వచ్చేసాం. అక్కడినుంచి Stockton లో ఉన్న Combodian Buddhist Temple కి వెళ్ళాం. అప్పుడప్పుడే సూర్యాస్తమయం అవుతున్న సమయంలో ఆ ప్రశాంత పరిసరాల్లో బుద్ధుని సన్నిధిలో గడపడం చాలా సంతోషాన్నిచ్చింది. గుడి ప్రాంగణంలో ఒక్క బుద్ధుడి బొమ్మలే కాకుండా బోలెడన్ని పెద్ద పెద్ద కంబోడియన్ దేవతల ప్రతిమలు ఉన్నాయి. ముఖ కవళికలు కాస్త వేరేగా ఉన్నా వాళ్ళ దేవతలు కూడా మన బ్రహ్మ, విష్ణు, సరస్వతి, లక్ష్మి లానే ఉన్నారనిపించింది. ఆ గుడికి ఒక కోనేరు కూడా ఉంది. కోనేరు చుట్టూ మెట్లు, కోనేట్లో తామరపూలు



చూస్తుంటే అచ్చం మన గుళ్ళలానే అనిపించింది. అంతంత పెద్ద బొమ్మలని అక్కడే ఆ గుడి ఆవరణలోనే తయారు చేస్తున్నారు. ఆ బొమ్మలకి ప్రాణం పోస్తున్న శిల్పితో కూడా మాట్లాడాము. కాంబోడియా నుంచి వచ్చి అక్కడ గుళ్ళో బొమ్మల్ని తయారు చేస్తున్నారట. అమెరికాలో స్థిరపడిన ఆ దేశ పౌరులు అందించే విరాళాలతో గుడి నిర్మాణం, నిర్వహణ జరుగుతుందట. అంత అందమైన గుడి చూసాక ప్రపంచ పటంలో కంబోడియా ఎక్కడుంటుందో కూడా నాకు సరిగ్గా తెలీనందుకు సిగ్గేసింది. తర్వాత థాయిలాండ్, వియత్నాం దేశాల పక్కనే ఉంటుందని తెలుసుకున్నాను. ఓహో అందుకన్న మాట వీళ్ళ దేవుళ్ళు కూడా మన దేవుళ్ళలానే ఉన్నారు అనిపించింది.

పూర్తిగా చీకటి పడే వేళకి కంబోడియా బుద్ధుడి గుడి నుంచి వెనక్కి బయలుదేరాం. దారిలో ఆకాశంలో సంధ్యా సుందరి గీస్తున్న రంగురంగుల చిత్రాలని చూసుకుంటూ, సిరివెన్నెల గారి పాటలు వింటూ వచ్చాము. ఇంకొక రోజులో నా ప్రయాణం అన్న ఆలోచనలో ఉండటం వల్లనుకుంటా సిరివెన్నెల గారు రాసిన 'జ్ఞాపకాలే మైమరపు.. జ్ఞాపకాలే మేలుకొలుపు.. జ్ఞాపకాలే నిట్టూర్పు.. జ్ఞాపకాలే ఓదార్పు..' పాట వింటుంటే ప్రతీ రోజూ మన చేతిలోంచి జారిపోయి గతంలా మారిపోయినా జ్ఞాపకాలు మాత్రం శాశ్వతం కదా అనిపించింది. అలా అలా సిరివెన్నెల గారి పాటల గురించి మాట్లాడుకుంటూ ఉంటే "సిరివెన్నెల గారు ఇక్కడున్నప్పుడు రాసిన కవితలు, పాటల పేజీలు చాలా ఉన్నాయి మనింట్లో" అని కిరణ్ ప్రభ గారు చెప్తే ఇంటికెళ్ళగానే లోపలెక్కడో భద్రంగా దాచిన వాటన్నీటినీ బయటికి తీయించి చూసాను. పాటల కన్నా కవిత్వం రాసిన పేజీలే ఎక్కువ కనపడ్డాయి. సిరివెన్నెల గారి స్వదస్తూరిలో రాసిన ఆ కాగితాలనీ, కవిత్వాన్నీ చూడటం భలే అనిపించింది. తర్వాత రాత్రికి డిన్నర్ చేసేసాక కాంతి గారు, నేనూ కలిసి ఈ ఇరవై రోజుల నుంచీ మేము దిగిన ఫొటోలన్నీ ముందేసుకుని అందులోంచి వెతికి వెతికి 19 ఫోటోలు సెలెక్ట్ చేసి ఒక పెద్ద పోస్టర్ డిజైన్ చేసాము. ఆ పోస్టర్ మా ముగ్గురికీ మూడు కాపీలు అని ప్రింటింగ్ కోసం ఆన్లైన్ లో ఆర్డర్ ఇచ్చేసి అప్పుడు పడుకున్నాం.



## 01.07.2013

# సోమవారం

ఈ రోజు ఉదయం లేచిన దగ్గరి నుంచీ ఏ పని చేస్తున్నా ఇంక ఇక్కడ ఇవాళ ఒక్క రోజే కదాని గుర్తొచ్చి దిగులొచ్చేసింది. చదువుకునే రోజుల్లో ఇంటి నుంచి మళ్ళీ హాస్టల్ కి వెళ్ళేప్పుడు ఇలానే అనిపించేది. ఇప్పటికీ ఇంటికెళితే తిరిగి వచ్చేప్పుడు ఇలానే ఉంటుంది ప్రతీసారి. దిగులుగా ఉన్నాసరే నేనన్నా నవ్వుతూ బానే కనిపించాను కానీ కాంతి గారు బాగా నీరసపడిపోతున్నారు. అలానే ఆ మాటా ఈ మాటా చెప్పుకుంటూ ఉదయమంతా కూర్చుని ఇద్దరం కలిసి సూట్కేసులు సర్దేశాం. ఒకటికి రెండు సార్లు బరువు సరి చూసుకుని సుమారుగా ఒక కేజీ ఎక్కువుంటే అదేం పర్లేదులే అనుకున్నాం. దాదాపు సర్దుకోడం అంతా అయిపోయే టైముకి కాంతి గారికి గబుక్కున గుర్తొచ్చి వెళ్ళి మా ఇంటబ్బాయ్ కోసమని మినపసున్ని ప్యాక్ చేసి తెచ్చిచ్చారు. నేనింటికి వెళ్ళాక ఎలా కలపాలో చెప్తానన్నారు. మొత్తానికి ఆ రోజంతా సర్దుకోవడంలో భారంగా గడిచింది. సాయంత్రం కిరణ్ ప్రభ గారు ఆఫీసు నించి వచ్చాక Costco కి వెళ్ళి రాత్రి ఆర్డర్ చేసిన పోస్టర్ ప్రింట్స్ తీసుకుని నా ఫేవరేట్ Baja Fresh కి వెళ్ళి డిన్నర్ చేసి వచ్చాం. అర్ధరాత్రి దాకా ముగ్గురం కలిసి కబుర్లు చెప్పుకుంటూ కూర్చుని తర్వాత గడియారం బెదిరింపులకి భయపడి నిద్రపోక తప్పలేదు.

ఇరవై రోజులుగా అలవాటైపోయిన ఆ గది కిటికీలోంచి కురుస్తున్న వెన్నెలనీ, చందమామనీ, గాలికి ఊగే చెట్ల ఆకులనీ చూసి నేనిక్కడికి వచ్చిన మొదటి రోజు జ్ఞాపకం వచ్చింది. ఇరవై రోజులు ఎంత వేగంగా దొర్లిపోయాయో కదా అనిపించింది. అంతలోనే సాయంత్రం జరిగిన విషయం గుర్తొచ్చింది. సాయంకాలం నేను కాంతి గారి ఒళ్ళో పడుకుని ఇద్దరం తీరిగ్గా రేపు వెళ్ళిపోయేప్పుడు ఎలా ఉంటుందో అని చర్చించుకుంటున్నాం. కాంతి గారేమో "ఏంటో.. ప్రయాణం వాయిదా వేసుకుని ఎక్కువ రోజులుంటే బాగుంటుందని అనుకున్నాను కానీ ఎక్కువ రోజులు గడిచేకొద్దీ ఇంకా ఎక్కువ కష్టం అయిపోతున్నట్టుంది. నిషి వెళ్ళే రోజే అస్సలు బాలేదు. ఇంక రేపు నాకు ఏడుపు బయటికొచ్చేస్తుందేమో.." అంటుంటే నేనేమో " మిగతా అప్పుడంతా ఎలా ఉన్నా ఇలాంటి భారమైన సమయాల్లో, ముఖ్యంగా వెళ్ళిపోయేప్పుడు మాత్రం నేనస్సలు దిగులుగా ఏడుస్తూ ఉండను. ఎందుకంటే మనం వెళ్ళిపోయాక ఆ చివరి క్షణాల్లోని మన మొహమే ఎదుటివాళ్ళకి గుర్తుండిపోతుంది కదా.. అందుకని ఎంచక్కా నవ్వుతూ ఉండాలి. కాబట్టి రేపు మనిద్దరం కిరణ్ ప్రభ గారికి సెంటిమెంటు సినిమా చూపించకుండా గలగలా మాట్లాడుతూ, హాయిగా

నవ్వేస్తూ సరదా సరదాగా టాటా చెప్పుకోవాలి" అన్నాను నేను. కాంతి గారు గట్టిగా నవ్వి "కానీ ఆ క్షణాల్లో ఏమనిపిస్తుందో ఇప్పుడు చెప్పలేం కదా" అంటుండగా నా ఫోన్ మోగింది. నేను ఆ కాల్ మాట్లాడేసి వచ్చి "కాంతి గారూ... మన దిగులు మూడ్ ని మార్చేసే సూపర్ హేపీ విషయం ఒకటి చెప్పనా మీకిప్పుడు" అంటే కాంతి గారు ఉత్సాహంగా "చెప్పు చెప్పు" అన్నారు. నేను ఫోన్లో తెలిసిన కొత్త సంగతి చెప్పాక ఇద్దరం అప్పటిదాకా ఉన్న దిగులు సంగతి మర్చిపోయి ఈ కొత్త కబుర్లలో పడిపోయాం. ఈ ట్రిప్ లో చివరిదైన రేపటి రోజు ఎలా గడవబోతోందో అన్న కొత్త ఆలోచనల్లో పడి నాకు తెలీకుండానే ఎప్పుడో నిద్రలోకి జారిపోయాను.

నా శాన్ ఫ్రాన్సిస్కో డైరీలో ఆఖరు పేజీ వచ్చేసింది..!

## My San Francisco Diary – 12

'సృష్టిలో తీయనైనది స్నేహమేనోయీ..' అని మనందరం ఎప్పుడో అప్పుడు అనుకోకుండా ఉండము కదా.. ఎందుకంటే స్నేహితులు లేని జీవితాన్ని ఊహించడం కష్టం. ఎవరి జీవితపు పరుగు పందెం వారిదే అయినా ఆ పరుగులో మన పక్కన నిలిచి అలసట తెలీకుండా మన ప్రయాణం ఆహ్లాదంగా సాగేట్టు చేసేది నేస్తాలే కదా మరి! మన జీవితపు పూదోటలో ఎన్నెన్నో రకాల స్నేహసుమాలు.. ఒక్కొక్కరూ ఒక్కో సుగంధాన్ని పంచుతూ మనకి సంతోషాన్ని పంచుతారు. మనం బోల్డు అదృష్టవంతులమైతే మన సంతోషాలు, సరదాలు పంచుకునే స్నేహితులందరితో పాటు ఒక Angel Friend కూడా దొరికేస్తారు. అంటే ఎలాగంటే.. లోకానికి కనిపించని మన కంటిపాప వెనకున్న చీకటిని చూడగలిగి, ప్రపంచానికి వినిపించని మన కన్నీటి సవ్వడిని వినగలిగిన మనసెరిగిన స్నేహం, సంతోషంగా కేరింతల్లో ఉన్నప్పుడు మనవైపు అస్సలు చూడకుండా మన మొహంలో నవ్వు మాయమయ్యే క్షణం కన్నా ఓ క్షణం ముందే వచ్చి తోడుగా మన పక్కనే నించునే స్నేహం, 'నేనింక ఎగరలేనేమో' అని నిరాశపడి నిలిచిపోయిన క్షణాల్లో బలవంతంగా రెక్కపుచ్చుకు లాక్కెళ్ళి మళ్ళీ ఎగరడం నేర్పించి కన్నీళ్ళ సంద్రం నుంచి తప్పించి సంతోష తీరాలకి దారిని చూపించే స్నేహం, అస్సలు తీరిక లేని పనుల్లో తలమునకలుగా ఉన్నప్పుడు పిలిచినా, అర్ధరాత్రి నిద్ర లేపి పిలిచినా సరే అరక్షణమైనా ఆలస్యం చెయ్యక పలికే స్నేహం, నేను పెంచుకుంటున్న మొక్క చచ్చిపోయింది అన్నంత చిన్న విషయానికైనా, ల్యాబ్లో సంవత్సరం పాటుగా చేస్తున్న ఒక పెద్ద ఎక్స్పరిమెంట్ లో ఆశించిన ఫలితం రాలేదు అన్నంత పెద్ద బాధ గురించి చెప్పినా ఒకేలా విని మనలో దిగులు పోగొట్టి స్ఫూర్తిని నింపే స్నేహం.. అదుగో అలాంటి

స్నేహమన్నమాట. ఎప్పుడూ నవ్వుతూ ఎంతో ధైర్యంగా ఉండేవారికైనా కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా.. వసంతమూ, వానే కాకుండా అడపా దడపా పిడుగులు, వరదలు, శిశిరాలు పలకరించిపోతుంటాయి. అవన్నీ మన పక్కనుండి ఓపిగ్గా దాటించి మళ్ళీ మనల్ని నవ్వుల లోకంలోకి తీసుకొచ్చే బాధ్యత తీసుకునే స్నేహితులు ఒకరు ఉండాలిగా మరి.. ఒక్క ముక్కలో చెప్పాలంటే మన హింస అందరికన్నా కొంచెం ఎక్కువ భరించే నేస్తం అన్నమాట.. అదే మాటని తియ్యగా వినిపించేట్టు మార్చి చెప్పాలంటే THE Best Friend అని చెప్పొచ్చు. ;-)

ఇంతకీ ఇదంతా ఇప్పుడెందుకు గుర్తు చేసుకుంటున్నానంటే నాకు ఇలాంటి స్నేహితుడు ఒకరున్నారు. అసలు తన పేరే మంచు కాబట్టి ఇంక తనెంత మంచోరో అంటూ నేను ప్రత్యేకంగా వివరించక్కర్లేదు. మా




మంచుబ్బాయ్ గారు అమెరికాలోనే సిలికాన్ వ్యాలీలో ఉంటారన్నమాట. నేను అమెరికా ప్రయాణం పెట్టుకున్నాక "క్యాబిన్ లగేజ్లో ఏయే వస్తువులు పెట్టకూడదు" అన్న విషయం దగ్గర్నుంచీ విమానం ఎక్కే ముందు "నా ఫోన్ నంబర్ ఫోన్లో ఉన్నా సరే విడిగా కూడా రాసి దగ్గర పెట్టుకో.. ఎక్కడ దేనికి అవసరమైనా వెంటనే నాకు కాల్ చెయ్యి" అని

చెప్పేదాకా బోల్డు బోల్డు సలహాలు, సూచనలు, జాగ్రత్తలు చెప్పారు. అవన్నీ విని నేను "ఎంత మీ అమెరికా గొప్పైతే మాత్రం మొదటిసారి వస్తున్నాం కదాని అడుగు పెట్టీ పెట్టగానే మమ్మల్ని ఇంతలా కంగారు పెట్టేస్తారంటారా" అని ఎదురాడితే "అంత సీరియస్ గా ఏమీ ఉండదులే కానీ ఇవన్నీ జస్ట్ జాగ్రత్త కోసమని.. అంతే" అన్నారు. ముందే ఇలా ఉంటే ఇంక నేను అమెరికా వచ్చాక రోజూ మేము ఎక్కడికి వెళ్తున్నామో కనుక్కుని ఏయే ప్లేసెస్ కి వెళ్తే ఏమేం చూడాలి, ఎక్కడ ఏది ఎక్కువ బాగుంటుంది.. ఇలాంటివాటి గురించి చాలా టిప్స్ చెప్పారు. నాకు శాన్ ఫ్రాన్సిస్కో సిటీ, గోల్డెన్ గేట్ బ్రిడ్జ్, లంబార్డ్ స్ట్రీట్.. ఇలా చాలా చోట్లకి వెళ్ళినప్పుడు ముందే బాగా తెలిసినట్టు చాలా ఫెమీలియర్ గా అనిపించింది. ఇదివరకెప్పుడో వాటన్నీటి గురించి చాలాసార్లు తన మాటల్లో విని ఉండటం వల్ల అలా అనిపించిందని అర్థమైంది. Big Sur బీచ్ గురించి తను చెప్పారనే వెళ్ళాం. కాంతి గారికైతే ఆ బీచ్ ఎంత నచ్చిందంటే ప్రతీరోజూ ఫోటోలు చూసినప్పుడల్లా గుర్తు చేసుకుని "మంచు గారు మనకి ఎంత మంచి బీచ్ ని పరిచయం చేసారో, మనం మళ్ళీ ఇంకోసారి వెళ్తే బావుండు" అనేవారు. రోజూ మా ట్రిప్పుల విశేషాలు వినడంతో పాటు గొంతునొప్పి వచ్చినప్పుడు, జ్వరమొచ్చినప్పుడు పర్లేదు బానే ఉన్నానన్నా గానీ ఎక్కడికెళ్ళి ఏం మెడిసిన్స్ తెచ్చుకోవాలో కూడా చెప్పేవారు. మేము రోజూ బోల్డు ఉత్సాహంగా అన్నీ చోట్లకీ తిరిగేస్తూ గంతులేస్తున్న ఫొటోలన్నీ చూస్తూ ఒక రోజు "మిమ్మల్నింత ఆనందంగా చూస్తుంటే బావుంది కానీ ఈ నాలుగు రోజులూ గడిచాక నువ్వు వెళ్ళిపోయే రోజు వచ్చేప్పటికీ మీ పరిస్థితి ఎలా ఉంటుందో.. నీ కన్నా కాంతి గారికి ఎక్కువ కష్టం అయిపోతుందేమో ఆ దిగుల్లోంచి బయటపడటం" అన్నారు. "హ్మ్.. అవును కానీ మరేం చేస్తాం.. వెళ్ళిపోయే రోజుటి దిగులుని పోగొట్టే మార్గం ఏదన్నా ఉంటే బావుండు కదా.." అనేసి తర్వాత నేను మేము అప్పుడలా అనుకున్న సంగతి మర్చేపోయాను.

## 02.07.2013

## మంగళవారం

నిన్న సాయంకాలం ఒక ఫోన్ కాల్ వచ్చాక మాలో దిగులు కాస్త తగ్గి కొత్త ఉత్సాహం వచ్చింది కదా.. అప్పుడు మాట్లాడింది మంచు గారే! నేను తన ఫోన్ ఆన్సర్ చెయ్యగానే "ఏంటీ హుషారు తగ్గినట్టుందీ.. మళ్ళీ జ్వరమా.." అంటే "జ్వరం కాదు గానీ, మరి నేను రేపు ఊరెళ్ళిపోతున్నాను కదా.. అందుకని కాంతి గారూ, నేనూ దిగులుగా కూర్చున్నాం" అని చెప్పాను. "ఓహో అవునా.. సరేలే అయితే.. నేను మిమ్మల్ని డిస్టర్బ్ చెయ్యన్లే కానీ రేపు

ఎయిర్పోర్ట్ లో కనిపిస్తాను. సరేనా.." అన్నారు. నేను బోల్డు సంబరంగా "రేపు నిజంగా వస్తున్నారా.. అయినా ఇన్ని రోజులు ఎందుకు రాలేదు మీరసలు.." అని దాదాపు పోట్లాడినంత గట్టిగా అడిగేసాను. "అప్పుడంతా మీరు ఎంజాయ్ చెయ్యడంలో బిజీ బిజీగా ఉన్నారు కదా.. అందుకని మధ్యలో డిస్టర్బ్ చెయ్యలేదు. అయినా వెళ్ళే రోజు మీ దిగులు తగ్గించే మార్గం ఏదన్నా ఉంటే బావుండు అన్నావు కదా.." అని అప్పుడెప్పుడో నేనన్న మాట గుర్తు చేస్తే నాకెంత ఆశ్చర్యం వేసిందో! ఇంక బదులు చెప్పడానికి మాటలేం దొరక్క అలాగేనని చెప్పేసి వెంటనే కాంతి గారికి, కిరణ్ ప్రభ గారికి చెప్పాను మంచు గారు ఇలా ఎయిర్ పోర్ట్ కి వస్తానన్నారని. వాళ్ళిద్దరికీ తనతో నేరుగా మాట్లాడిన పరిచయం లేకపోయినా నేనెప్పుడూ చెప్తూనే ఉంటాను కాబట్టి అస్సలేం కొత్త లేదన్నమాట. కిరణ్ ప్రభ గారు వెంటనే "అదేంటి తల్లీ.. మనింటికి రమ్మని అడక్కపోయావా.. కాసేపు కూర్చుని మాట్లాడుకున్నట్టు ఉంటుంది కదా.." అన్నారు. కాంతి గారేమో "నిజమే మధురా.. ఒకేసారి ఎయిర్ పోర్ట్ లో మన ఏడుపు మొహాలు చూడటం కన్నా మనింటికి వచ్చి కలిస్తే నయమేమో కదా.." అన్నారు. సరేనని మళ్ళీ మంచు గారికి ఫోన్ చేసి చెప్పాను. తనేమో "నాకు రేపు సాయంత్రం దాకా రోజంతా ముఖ్యమైన మీటింగ్స్ ఉన్నాయి. రోజు మధ్యలో రావడం కుదరదు. పోనీ మీరు ఎయిర్ పోర్ట్ కి బయలుదేరే టైము కన్నా కొంచెం ముందు ఇంటికే వస్తాన్లే.. సాయంత్రం నాలుగున్నర కల్లా అక్కడుంటాను" అని చెప్పారు.

అందుకని నేనూ, కాంతి గారు నిన్నటి నుంచీ నేను వెళ్ళిపోతున్నానని కాసేపు దిగులుగా, మంచు గారొస్తారు కదాని కాసేపు ఉత్సాహంగా ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ ఉన్నాం. పొద్దున్నే లేచి కిందకి వచ్చాక రోజూ లాగే కాంతి గారి చేత్తో ఇచ్చిన గ్రీన్ టీ తాగేసి, యథావిధిగా వాకింగ్ ఎగ్గొట్టి, కిరణ్ ప్రభ గారిని ఆఫీసుకి పంపించేసి ఇడ్లీలు తింటూ కూర్చున్నాం. ఫోనుల్లో వీడ్కోలు కూడా అయిపోయాక ఇద్దరం కలిసి బ్యాక్ యార్డులో గులాబీ మొక్కల మధ్యకి వెళ్ళాం. కాంతి గారు ఫ్లవర్ వేజ్ లో పువ్వులు మార్చడం కోసం జాగ్రత్తగా ఎంచి చూసి ఒక్కో రకం పువ్వులు కోస్తూ తిరుగుతుంటే నేను ఏమీ పని లేకపోయినా ఊరికే కోసిన పువ్వులు మోస్తూ తన వెనకే తిరిగాను. ఈ రోజు కిరణ్ ప్రభ గారు లంచ్ కి ఆలస్యంగా వస్తానన్నారు. "లంచ్ అయ్యాక ఇంట్లోనే ఉంటాను. ఫోన్లో మీటింగ్ ఉంటుంది. ఇంటి నించి అటెండ్ అవుతాను. అది అయిపోయాక మనం ఎయిర్ పోర్ట్ కి బయలుదేరదాం" అని చెప్పారు. నాకు కొంచెం ఒంట్లో బాలేనట్టు ఉందని కాసేపు పడుకుని, మళ్ళీ లేచి అలా ఇలా తిరుగుతూ అంతలోనే ఎలా టైం అయిపోయిందో తెలీలేదు. లంచ్ అయిపోయాక కిరణ్ ప్రభ గారు మీటింగ్ కి వెళ్ళాక నేనూ, కాంతి గారూ చాలాసేపు నిషితో ఫోన్లో మాట్లాడుతూ కూర్చున్నాం. ఊరెళ్ళిపోతున్నానన్న దిగులు వల్లే నాకు ఒంట్లో బాలేదని నిషితో చెప్పారు కాంతి గారు.

ఎంతసేపైనా మా కబుర్లకి అలుపూ, అంతమూ ఉండకపోయినా గడియారం మాత్రం అప్పుడప్పుడూ ఉరుముతూ ఉంటుంది కదా.. టైము సాయంత్రం నాలుగైపోతుందని బద్ధకం వదిలించుకుని లేచి చకచకా తయారైపోయాను.

నేను కిందకొచ్చేసరికి కిరణ్ ప్రభ గారి మీటింగ్ అయిపోయింది. మేమిద్దరం కలిసి లగేజ్ అంతా నా గదిలో నుంచి కిందకి తీసుకొచ్చి పెట్టాం. ఎప్పటిలా అలవాటుగా నేనున్న గదిలోంచి వెళ్ళిపోయే ముందు కాస్త బెంగగానే గదంతా ఒకసారి కలియచూసుకుని కిందకి వచ్చేసాను. అప్పుడే మంచు గారు కాల్ చేసి దారిలో ట్రాఫిక్ చాలా ఉందని తను రావడానికి కొంచెం ఆలస్యం అవుతుందని చెప్పారు. మేము ముగ్గురం అలా మాట్లాడుకుంటూ కూర్చున్నాం. "కాంతి గారూ.. మనం మంచు గారిని ఇదే మొదటిసారి కదా చూడటం.. మనకెలా అనిపిస్తుందంటారు ఇప్పుడు?" అని నేనంటే "అస్సలేమీ కొత్తగా అనిపించదు. ఎప్పటి నుంచో బాగా తెలిసున్న స్నేహితులం కాబట్టి చాలా మామూలుగా మాట్లాడేస్తాం.." అని కాంతి గారు చెప్తుండగానే మళ్ళీ ఫోన్ మోగింది. ఫోన్లో మంచు గారే! "నేను మీ ఇంటి ముందుకొచ్చేసాను" అనగానే "మాటల్లోనే వచ్చేసారుగా.. ఎదురెళ్ళి స్వాగతం చెప్పెయ్ మరి.." అన్నారు కాంతి గారు. నేను ఫోన్ పెట్టేసి పరిగెత్తుకుంటూ గుమ్మం తలుపు తీసుకుని ఇంటి ముందుకొచ్చాను. అప్పుడే కారు దిగి కార్లో నుంచి ఏవో బయటకు తీసుకుంటూ కనిపించారు మంచు గారు. ముందు తనని చూసీ చూడగానే "Wow.. Here comes my Best friend!" అనిపించింది చాలా సంబరంగా. తనకి ఎదురెళ్ళి చేతులో ఉన్న ఫ్లవర్స్, స్వీట్స్ అందుకోగానే "నీక్కాదు ఇవి.. కాంతి గారు వాళ్ళ కోసం తెచ్చాను" అన్నారు. అదే తను నాతో మాట్లాడిన మొదటి మాట. నాకెంత నవ్వొచ్చిందో.. అస్సలేమాత్రం తేడా లేకుండా ఎప్పుడూ ఎవరెవరం ఎలా ఆలోచిస్తామో, ఎలా ఉంటామో ఇప్పుడు కూడా సరిగ్గా అలాగే చేసాం ఇద్దరి స్వభావాలకి అస్సలు పొంతన లేకుండా! "ఏంటీ.. అంత అలసిపోయినట్టు కనిపిస్తున్నారు" అని అడిగితే "ఆఫీస్ నుంచి నేరుగా వచ్చేసాను. కొంచెం క్రిటికల్ ఇష్యూ ఏదో ఉండి లాస్ట్ మినిట్ దాకా కొంచెం హడావుడి.." అని చెప్పారు. లోపలకి వెళుతూనే "కాంతి గారూ.. ఇవన్నీ మీకోసమే తెచ్చారంట. నన్నస్సలు ముట్టుకోడానికి వీల్లేదన్నారు" అని చెప్తే అందరూ నవ్వారు. కాంతి గారేమో "ఎప్పుడూ మధుర పిలిచినట్టు మీరు అచ్చం మంచబ్బాయ్ లానే ఉన్నారు" అని చెప్తే నిజంగానే చాలా బుద్ధిమంతుడిలా నవ్వి ఊరుకున్నారు. "కాఫీ తీసుకుంటారా.." అని అడిగితే వద్దనేసరికి కాఫీనే వద్దంటే ఇంకేం తీసుకునే ఛాన్స్ లేదని నేను అనుకుంటూ ఉండగానే కాంతి గారు "కేక్ తింటారా.. మధుర బర్త్ డే కేక్ ఉంది" అనేసరికి పాపం కాదనలేక ఊ అనేసారు. తర్వాత కిరణ్ ప్రభ గారు, తను మాట్లాడుతూ కూర్చున్నారు కానీ ఎంతసేపటికీ ఆ కేక్ ముక్క కదలడం లేదు. ఇంక నేను చూడలేక "నా బర్త్ డే కేక్ కదాని కష్టపడకండి. మీకు పనిష్మెంట్ ఇద్దామని కాదులెండి కేక్ పెట్టింది. తినకుండా వదిలెయ్యొచ్చు" అని చెప్పి రక్షించేసాను.

అప్పటికే టైము ఐదున్నర అయింది. ముందు రోజు నేను ఆన్లైన్ చెకిన్ చెయ్యడానికి ట్రై చేస్తే ఎందుకో కుదరలేదు. ఉదయం ఎయిర్ లైన్స్ వాళ్ళకి కాల్ చేసి అడిగితే "క్షమించండి. మీకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం. మీరు నేరుగా ఎయిర్ పోర్ట్ లోనే చెకిన్ చేసుకుని అఘోరించండి" అని చాలా మర్యాదగా చెప్పిందో అమ్మాయి. నా ఫ్లైట్ రాత్రి 9:25 కి. అందుకని "మూడు గంటల ముందు వెళ్ళి చెకిన్ చేసేస్తే కంగారు లేకుండా ఉంటుంది. చెకిన్ అయిపోయాక అప్పుడు తీరిగ్గా అక్కడ ఎయిర్ పోర్ట్లో కూర్చుని కబుర్లు చెప్పుకోవచ్చు. మీరిద్దరూ ముందు బయలుదేరి వెళ్ళి చెకిన్ చేసేసరికి మిగతా లగేజ్ తీసుకుని వెనకే మేము వచ్చేస్తాం" అన్నారు కిరణ్ ప్రభ గారు. ఎలాగూ వెళ్ళిపోవాలని తెలుసు కానీ ఏంటో అలా సూట్కేస్ తీసుకెళ్ళి కార్లో పెట్టేస్తుంటే అదోలా అనిపించింది కొంచెం కష్టంగా.. ఎయిర్ పోర్ట్ లో మళ్ళీ కొనుక్కోడం ఎందుకులే అని నేను ఇంట్లోంచి ఒక రెండు వాటర్ బాటిల్స్ తీసుకున్నాను. ఇల్లంతా చుట్టూ ఒకసారి చూసుకుని, దేవుడికో మాట చెప్పేసి, కాంతి గారు మాకు ఎదురొస్తే మేమిద్దరం ఎయిర్ పోర్ట్ కి బయలుదేరాము. అప్పుడు మా ఇద్దరి మొహాలు చూసి మంచు గారు "ఇప్పుడే కాదు వెళ్ళేది. ఓ గంటలో మళ్ళీ కలుసుకుంటారు కదా.. కొంచెం నవ్వండి" అన్నారు. నేను కారు విండోలో నుంచి వెనక్కే చూస్తూ, మా వీధి మలుపు దాటి మేము అక్కడ రోజూ తిరిగిన పరిసరాలన్నీ దాటిపోయేదాకా అలా మౌనంగా ఉండిపోయాను.

నేను తేరుకుని ఈ లోకంలోకి వచ్చేసరికి మంచు గారు ఏంటో తెగ వెతికేస్తున్నారు ఫోను, GPS రెండిటిల్లోనూ. కళ్ళు మూసుకుని ఎయిర్పోర్ట్ కి వెళ్ళిపోమన్నా వెళ్ళే రకం కదా, ఏదో కొత్త ప్లేస్ కి వెళ్ళాలన్నట్టు అంతలా ఎందుకు చూస్తున్నారో నాకు అర్థం కాలేదు. అదే అడిగితే Stoneridge Drive ఎక్కడుందా అని చూస్తున్నానన్నారు. "Stoneridge Drive అయితే నాకు తెలుసు. అక్కడున్న స్టోన్ రిడ్జ్ మాల్ కి మేము షాపింగ్ కి వెళ్ళాం" అని చెప్తే "ఎలా వెళ్ళాలో తెలుసా నీకు?" అన్నారు. "అంటే.. దారి తెలీదు. కానీ మా ఇంటికి చాలా దగ్గరని మాత్రం తెలుసు" అని చెప్పాను. "ఎలా వెళ్ళాలో GPS చెప్తుందిలే" అని తనంటే అక్కడికి మేము ఎందుకు వెళ్ళాలో అర్థం కాలేదు నాకు. "ఎందుకంటే చిన్న షాపింగ్ పనుంది. అది చూసుకుని ఎయిర్ పోర్ట్ కి వెళ్ళిపోదాం" అన్నారు. "మీరన్నీ మాథ్స్ ఈక్వేషన్లు చెప్పినట్టు చెప్పకుండా నాకు అర్థమయ్యేలా చెప్పండి" అని అడిగాను. "నేను నీకోసం ఒక గిఫ్ట్ తీసుకొచ్చాను. హడావుడిగా వచ్చాను కదా.. గిఫ్ట్ కార్లో పెట్టేసాను అనుకుని మర్చిపోయి వచ్చేసాను. ఆ విషయం మీ ఇంటి ముందు కార్ దిగాక తెలిసింది. అందుకని ఇప్పుడు మనం అలా షాపింగ్ కి వెళ్ళి ఇలా వచ్చేద్దాం. జస్ట్ ఫిఫ్టీన్ మినిట్స్" అని చెప్పారు. "అసలు ఇప్పుడు నాకెందుకు గిఫ్ట్.. ఊరెళ్ళిపోయేవాళ్ళకి గిఫ్టు ఇస్తుంటారా మీ అమెరికాలో" అంటే "అందుక్కాదు. ఈ సంవత్సరానికి నీ బర్త్ డే గిఫ్ట్ వచ్చిందా?" అని నన్ను ఎదురుప్రశ్న అడిగారు. "ఓ అవును కదా.. మర్చిపోయాను. నా బర్త్ డే గిఫ్ట్ ఏది?" అంటే "అదే మరి చెప్పేది మర్చిపోయి వచ్చానని. నీ జర్మనీ బుర్ర అమెరికాలో

సరిగ్గా పని చేస్తున్నట్టు లేదు కదా.." అన్నారు నవ్వుతూ. "ఆ కొనేసి పెట్టిన గిఫ్ట్ తర్వాత ఎప్పుడైనా తీసుకుంటాన్లే.. ఇప్పుడు మళ్ళీ కొనడం ఎందుకు వేస్ట్.. అయినా ఇప్పుడు షాపింగ్ అంటే మనకి ఎయిర్ పోర్ట్ కి వెళ్ళడం లేట్ అయిపోతుందేమో.." అన్నాను కంగారుగా. "కొనేసిన గిఫ్ట్ ఏం వేస్ట్ అయిపోదులే.. అది నేను రిటన్ ఇచ్చేస్తాను కానీ నువ్వు ప్రతీదానికీ కంగారుపడకుండా కాసేపు చెప్పిన మాట విను. నువ్వొక్కదానివే కాదు కదా ఎయిర్ పోర్ట్ కి వెళుతోంది. నేను కదా తీసుకెళ్తున్నాను. నిన్ను మీ జర్మనీకి భద్రంగా పంపించే బాధ్యత నాది. సరేనా.. ఇంక దిగు" అనేసరికి అంతా బానే ఉంది గానీ ఉన్నట్టుండి దిగిపొమ్మంటారేంటబ్బా.. అనుకుని పక్కకి చూసేసరికి అప్పటికే మేము స్టోన్ రిడ్జ్ మాల్ పార్కింగ్లో ఉన్నాం. "ఏంటో.. అయినా నా పిచ్చి గానీ ఎలాగైనా తను చెయ్యదల్చుకున్నదే చేసేస్తారు గానీ మనం చెప్పిన మాట ఎప్పుడైనా వినిపించుకునే రకం కాదు కదా" అని గుర్తొచ్చి సరేనని బుద్ధిగా తనని ఫాలో అయిపోయాను. "మన కార్ ఎక్కడ పార్క్ చేసామో గుర్తుంచుకుంటావా" అంటే "బాబోయ్.. ఇలాంటి విషయాల్లో నన్ను నమ్ముకుంటే మిమ్మల్ని రేపటి దాకా ఇక్కడే తిప్పుతాను. దార్లూ అవీ మీరే గుర్తు పెట్టేసుకోండి బాబూ.. నాకేం సంబంధం లేదు ముందే చెప్తున్నా" అనేసరికి గట్టిగా నవ్వేసి "ఊరికే అన్నానులే.. మళ్ళీ దానికి కూడా కంగారు పడకు ఇప్పుడు. నాకు గుర్తుంటుందిలే.." అన్నారు.

మాల్ లోపలకి వెళ్ళి మ్యాప్ ఎక్కడుందో వెతుక్కుని మంచు గారేమో దాని మీదున్న షాప్స్ ప్లాన్ చూస్తుంటే నేనేమో కాంతి గారితో వచ్చినప్పుడు ఏయే షాప్స్ తిరిగామా అని గుర్తు చేసుకుంటూ దిక్కులు చూస్తూ నించున్నా. మ్యాప్లో రెండు షాపుల పేర్లు చూపించి రెండీటిల్లో దేనికి వెళదాం అని అడిగారు. అందులో ఒక పేరు చూసి కొంచెం కోపంగా "మిమ్మల్నసలూ... ఎవరైనా ఇంత కంగారులో పది నిమిషాల షాపింగ్ కోసమని అలాంటి షాపులకి వెళ్తారా.." అని అరిచేసి ఆ ఇంకో రెండో షాప్ పేరు Sunglass Hut అని చూసి అదైతే నయం అనుకుని దానికి వెళదాం అన్నాను. తనేమో మళ్ళీ నవ్వుతూ "నువ్వు చెప్పకపోయినా మనం Sunglass Hut కే వెళ్ళేవాళ్ళం. ఆ షాప్ కోసమే మనం ఈ అడ్రస్ వెతుక్కుని మరీ వచ్చాం. నేను ఇదివరకు నీకోసం కొన్న గాగుల్స్ లాంటివే ఇక్కడ స్టోర్లో చూసి వెంటనే తీసేసుకుని వెళ్ళిపోవడమే.. ఒకే నా.." అన్నారు. తీరా షాపు దాకా వెళ్ళాక అప్పుడు గమనించారు ఇందాక నా గోలలో పడి కార్లోంచి దిగేప్పుడు వాలెట్ మర్చిపోయి వచ్చేసారని. "నేను ఫాస్ట్ గా వెళ్ళి తీసుకుని వస్తాను. ఇక్కడే ఉండు" అంటే "ఉహూ నేను కూడా వస్తాను" అని వెంట వెళ్ళినందుకు తన నడకతో సమానంగా పరిగెట్టాల్సి వచ్చింది. మళ్ళీ వచ్చి షాపులో తను గాగుల్స్ కోసం వెతుకుతుంటే నేను కూడా ఊరికే ఉండటం ఎందుకు అని కొన్ని కళ్ళద్దాలు చూసాను. వాటికి ఉన్న ప్రైస్ ట్యాగ్స్ అన్నీ వందల డాలర్లలో ఉంటే చూసి నాకు ఇందాక మ్యాప్లో చూసిన ఆ మొదటి షాపుకి వెళ్ళుంటే ఇంతకన్నా నయంగా ఉండేదేమో అనిపించింది. జ్యూయెలరీ షాపు కన్నా కళ్ళద్దాల షాపులో

ఖరీదు ఎక్కువుంటుందని నిజంగా ఊహించలేదు. వెంటనే తన దగ్గరికి వెళ్ళి "బాబోయ్.. ఈ గాగుల్స్ నాకొద్దు. ఇన్ని డబ్బులు పెట్టి ఎవరన్నా గాగుల్స్ కొనుక్కుంటారా అసలు.. ఒకసారి ఏమైందో తెలుసా.. నేను ఫిఫ్టీ యూరోస్ పెట్టి కొనుక్కున్న గాగుల్స్ బ్యాగ్లో పడేసి దాని మీద గీతలు పడితే ఎన్ని రోజులు బాధపడ్డానో తెలుసా.. నాకొద్దు.." అని అరిచి మరీ చెప్పాను. అంతా విని అతి మాములుగా "ఏం పర్లేదు.. అలా గీతలు పడకుండా ఉండాలనే షాపు వాళ్ళు కూడా ఒక డబ్బాలో పెట్టి మరీ ఇస్తారు" అన్నారు. అదొక చిన్న షాపు. Ray Ban, Gucci, Guess లాంటి కొన్ని ఫేమస్ బ్రాండ్స్ వి సెలెక్టెడ్ పీసెస్ కొన్ని ఉన్నాయంతే. అయినా ఆ ప్రైస్ ట్యాగులు చూస్తేనే తెలుస్తుంది కదా వాళ్ళు రోజుకో రెండు కళ్ళజోళ్ళు అమ్ముకున్నా చాలు బ్రహ్మాండంగా బతికేస్తారని! అవునూ.. ఇదివరకు కొన్నది ఏ బ్రాండో అందులో మాత్రం వెతికితే సరిపోతుంది కదాని అదే మాట తనని అడిగాను. "సరిపోతుందనుకో.. కానీ అది కొన్న రోజు పక్కన డిస్ప్లే లో ఉన్న అమ్మాయి మొహం గుర్తుంది కానీ బ్రాండ్ పేరు ఏంటో గుర్తులేదు. ఇక్కడేమో ఆ మొహం కనపడట్లేదు" అన్నారు. "ఇది మాత్రం దారుణం అసలు.. పేరు కూడా చూడకుండా అమ్మాయిలని గుర్తు పెట్టుకున్నారా.. తిక్క బాగా కుదిరింది. బాగా వెతుక్కోండి. కానీ ఇప్పటికే పదిహేను నిమిషాలు అయిపోతోంది. మనం తొందరగా వెళ్ళాలి" అన్నాను. ఇంతలో కళ్ళజోడు కొనుక్కోడానికి పాపం మేమింతలా ఎందుకు హడావుడి పడుతున్నామో అర్థం కాక షాపులో అమ్మాయి హెల్ప్ కావాలా అనడిగితే "ఇప్పుడు నువ్వు ఒక్కో కళ్ళజోడు పుట్టుపూర్వోత్తరాల గురించి వివరించినా వినే టైం మాకు లేదులేమ్మా" అనుకుంటూ వద్దని చెప్పేసాం. మంచు గారేమో "పక్కన నీ గోల లేకపోతే పదిహేను కాదు పది నిమిషాల్లోనే అయిపోయి ఉండేది నా షాపింగ్.. ఇదిగో ఈ మూడీటిల్లో ఏది బావుందో చూడు" అన్నారు. నేను వెంటనే ఆ మూడీటి ట్యాగులు చూస్తుంటే "నేను చూడమన్నది గాగుల్స్, ట్యాగులు కాదు" అన్నారు. నేనప్పటికే చూసేసాను కాబట్టి 4, 3, 2 తో మొదలైన వాటిల్లో నాకా చివరిదే కావాలన్నాను. వాటికి అన్నేసి వందల డాలర్ల రేటు ఉండటం వెనక ఏదో పెద్ద సోది చరిత్ర ఉంటే ఉంటుందేమో గానీ చూడ్డానికి డిజైన్ మాత్రం నేను చెప్పిందే బావున్నట్టుంది. మాకు టైము కూడా ఎక్కువ లేదు కాబట్టి నాతో ఇంకేం వాదించకుండా అది ప్యాక్ చేసి ఇచ్చెయ్యమన్నారు. ఆ VERSACE గాగుల్స్ తో పాటు దానికోసం ఇచ్చిన వైట్ బాక్స్ ఎక్కువ నచ్చేసింది నాకు. వెంటనే డబ్బులు కట్టేసి బయటపడదాం అనుకుంటే షాపులో అమ్మాయి "మీరింత గొప్ప కళ్ళజోడు కొన్న పుణ్యానికి మీ వంశచరిత్ర సగమైనా సరే మాకు చెప్పాలి" అంటూ ఒక పెద్ద ఫార్మ్ ఇచ్చింది ఫిల్ చేసిమ్మని. "నా వల్ల కాదు. ఈ భాగ్యం కూడా మీకే.." అనేసరికి పాపం మంచు గారే ఓపిగ్గా అది రాసిచ్చి అప్పుడు మాల్లోంచి బయటపడ్డాం. నేను నా చేతిలో ఉన్న వాటర్ బాటిల్ షాప్లో మర్చిపోయి వచ్చేసాను. అక్కడి నుంచి నేరుగా ఎయిర్ పోర్ట్ కి బయలుదేరిపోయాం.

దారిలో కబుర్లు చెప్పుకుంటూ వెళ్ళేసరికి క్షణాల్లో ఎయిర్ పోర్ట్ దగ్గరికి వచ్చేసినట్టు అనిపించింది. San Fransisco International అని కళ్ళ ముందు కనపడగానే మళ్ళీ నేను ఊరెళ్ళి పోతున్నాను కదాని గుర్తొచ్చేసింది. మంచు గారు "కాంతి గారు వాళ్ళు ఎక్కడున్నారో కాల్ చేసి కనుక్కో" అంటే వెంటనే వాళ్ళతో మాట్లాడాను. "ఇప్పుడే ఎయిర్ పోర్ట్ లో కార్ పార్క్ చేసి పైకి వెళుతున్నాం. మీరు చెకిన్ చేసేసారా" అనడిగితే "ఉహూ ఇంకా లేదు. ఇప్పుడే వచ్చాం మేము కూడా. అదో పెద్ద కథలెండి. తర్వాత చెప్తాను. రెండు నిమిషాల్లో మీకు కనిపిస్తాం" అని చెప్పేసి "మనకి లేట్ అయిపోయిందేమో.. పదండి పదండి త్వరగా" అని మంచు గారిని కంగారు పెట్టేసాను. అప్పటికి ఇంకా ఏడున్నర కూడా కాలేదు. తనేమో "ఇంకా టైముంది. ఏం పర్లేదు" అంటూనే నా హింస భరించలేక గబగబా లగేజ్ తీసుకుని ఇంటర్నేషనల్ టెర్మినల్ వైపు నడిచాం. సగం దూరం వెళ్ళాక తెలిసింది తను పాపం ఈ హడావుడిలో ఫోన్ కార్లోనే మర్చిపోయి వచ్చారని. చేతిలో లగేజ్ కూడా ఉంది కదా.. "నువ్విక్కడే నించో.. నేనెళ్ళి నిమిషంలో వచ్చేస్తాను" అని చెప్పి పరిగెత్తుకుంటూ వెళ్ళి ఫోన్ తెచ్చుకున్నారు. పైకి వెళ్ళాక Air France చెకిన్ కౌంటర్ ఎక్కడుందో చూసుకుని వెళ్ళాం. కిరణ్ ప్రభ గారు, కాంతి గారు "మీరిద్దరూ వెళ్ళి లైన్లో నించుని చెకిన్ చేసి రండి. మేము ఇక్కడే పక్కన మొన్న నిషిని దింపిన రోజు కూర్చున్న చోట ఉంటాము" అన్నారు.



ఆ క్యూ చూస్తే ఒక అయిదారుగురితో చిన్నగానే ఉండేసరికి హమ్మయ్యా అనుకున్నాను. ఇంటి దగ్గర బయలుదేరిన దగ్గర నుంచీ ఒకటే ఉరుకులు పరుగులేమో నాకు దాహంగా అనిపించింది. కానీ నేను రెండో వాటర్ బాటిల్ కూడా కార్లో మర్చిపోయి వచ్చేసాను. సర్లే చెకిన్ అయిపోయాక కొందాంలే అనుకున్నా. ఇంతలో ఎయిర్ లైన్స్ అమ్మాయి వచ్చి "మీరిద్దరిలో ఒకరు లైన్లో నించుని ఇంకొకరు వెళ్ళి పక్కనే ఉన్న kiosk లో చెకిన్ చెయ్యండి" అని చెప్పింది. అప్పుడున్న కంగారులో నాకు అదంతా చేసే ఓపిక లేక టికెట్ పేపర్స్, పాస్పోర్ట్ అన్నీ మంచు గారి చేతిలో పెట్టేసాను. తను వెళ్ళి ఎంతసేపు ట్రై చేసినా ఎందుకో చెకిన్ అవ్వలేదు. ఎయిర్ లైన్స్ అమ్మాయి కూడా ట్రై చేసి కుదరక "సర్లే కౌంటర్లో చేస్తార్లే.. వెళ్ళి లైన్లో ఉండండి" అంది. లైన్లో చూస్తే జనాలు పెద్దగా లేరు కానీ ఎంతసేపైనా లైను కదిలినట్టే అనిపించడం లేదు. మేము ఆ మాటా ఈ మాట చెప్పుకుంటూ నేను చేతిలో ఉన్న వాలెట్లో యూరో కాగితాలు, నాణేలు చూపిస్తూ "చూసారా.. మా డబ్బులు" అంటే "యూరోలు సరే గానీ డాలర్స్ ఏమీ కనిపించడం లేదేంటి.. మొత్తం ఖర్చు పెట్టేసావా?" అనడిగారు. "ఖర్చు పెట్టెయ్యడం ఎక్కడా.. నేనసలు డాలర్స్ మార్చుకోందే! నేనొక్కదాన్ని అసలెక్కడికీ వెళ్ళలేదు కదా.. షాపింగేమో క్రెడిట్ కార్డ్ తో చేసేసాను" అని చెప్తే "అయితే మాత్రం డాలర్స్ అస్సలు లేకుండా ఎలా ఉన్నావ్.. ఇప్పుడు లోపలకి వెళ్ళిపోయాక ఆకలేసిందనుకో.. వాడు క్రెడిట్ కార్డులు, యూరోలు తీసుకోనంటే ఏం చేస్తావ్.." అంటూనే తన వాలెట్లోంచి కొన్ని డాలర్ నోట్స్ తీసిచ్చారు. "వద్దులెండి. అయినా ఎయిర్ పోర్ట్ లో యూరోస్ తీసుకోకుండా ఉంటారా.." అన్నాను. తనేమో "తీస్కో నువ్వు ముందు" అని గట్టిగా అనేసరికి పైన కనిపించిన 20 డాలర్ నోటు చూసి ఇదొక్కటి అయితే సరిపోతుందిలే.. నేను అంతకన్నా ఎక్కువ తినలేను కదా" అంటే ఈసారి ఏమీ అనకుండా ఒక్క చూపు చూసారు. ఇంకేం మాట్లాడకుండా టక్కున తన చేతిలోంచి డబ్బులు లాగేసుకుని లోపల పెట్టేసుకున్నా. అప్పటికి లైన్లో మా ముందు ఒక్కరే ఉన్నారు ఇంకా.

అక్కడ కౌంటర్లో ఒక మధ్య వయస్కురాలైన ఫ్రెంచ్ ఆవిడ ఉంది. మా వంతు వచ్చాక టికెట్స్ ఇచ్చి లగేజ్ అక్కడ పెట్టాం. ఒక్క నిమిషం అని చెప్పి నా టికెట్స్ తీసుకుని పక్కకి వెళ్ళి పది నిమిషాలైనా రాకపోయేసరికి నాకు టెన్షన్ వచ్చింది. కాసేపటికి తీరిగ్గా వచ్చి "మీ టికెట్ వెయిటింగ్ లిస్టులో ఉంది. మీరు లోపలకి వెళ్ళాక సీట్ అవైలబిలిటీ చూసి బోర్డింగ్ పాస్ ఇస్తారు. ఈ లోపు నేను వేరే పాస్ ఇస్తాను" అనేసరికి నాకు కంగారుగా అనిపించింది. టికెట్ పోస్ట్ పోన్ చేసినప్పుడు ఇలాంటిదేమీ చెప్పలేదు నాకు. ఇప్పుడు సడన్ గా వెయిటింగ్ లిస్టు అంటే అయోమయంగా అనిపించింది. అందులోంచి నేను బయటపడక ముందే "మీ సూట్కేస్ ఒక కేజీన్నర ఎక్కువ బరువుంది. అది తీసెయ్యాలి" అంది. అప్పటికి నాకింక టెన్షన్ పడే ఓపిక కూడా లేక నీరసం వచ్చేసింది. మంచు గారేమో కొంచెమే కదా ఎక్కువుంది అని సర్ది చెప్పబోతే "మా ఎయిర్ ఫ్రాన్స్ లో రూల్స్ అంటే రూల్సే.." అందావిడ.

నేనేమో పక్కనించీ "పర్లేదులెండి.. నేను కొన్ని అంత ముఖ్యం కాని వస్తువులు తీసేస్తాను" అని పక్కకొచ్చి సూట్కేస్ ఓపెన్ చేసి కొంచెం బరువు తగ్గించి మళ్ళీ తీసుకెళ్ళాం. ఈసారి "ఎయిర్ ఫ్రాన్స్ లో మేము చాలా స్ట్రిక్ట్.. నియర్లీ 24 ఈస్ నాట్ 23" అని లెక్కలు నేర్పించేస్తున్నట్టు మహా గొప్పగా చెప్పింది. కాదన్నందుకో, లెక్కలు నేర్పించబోయినందుకో తెలీదు కానీ మంచబ్బాయ్ గారికి కొంచెం కోపమొచ్చేసింది ఈసారి. "ఎక్స్ట్రా బరువుంటే ఎంత డబ్బులు కట్టాలి చెప్పండి" అని వాలెట్ తీసి చేతిలో పట్టుకున్నారు. ఆవిడేమో "జస్ట్ 200 డాలర్స్" అంది. అప్పటికే నాకు టికెట్ వెయిటింగ్ లిస్టు అందనీ, సూట్కేసు బరువెక్కువై ఓపెన్ చెయ్యాల్సి వచ్చిందని చాలా ఇబ్బందిగా, టెన్షన్ గా ఉంటే ఇప్పుడీ కేజీ బరువు కోసం అన్ని డబ్బులు వేస్ట్ చేస్తారేమోనని భయపడి చచ్చాను. గబగబా వెళ్ళి దాదాపు తనని పక్కకి లాగేసినంత పని చేసి "ప్లీజ్.. ఈ ఒక్కసారి నా మాట వినండి. సూట్కేసులో పనికిరాని వస్తువులు చాలా ఉన్నాయి. నేను అవి తీసేస్తాను. వాటి కోసం ఇన్ని డబ్బులు తగలెయ్యడం దండగ" అని బతిమాలేసాను. "సరే.. డబ్బులేం కట్టనులే. నువ్వేం వర్రీ అవ్వకు" అని చెప్పి ఇంకో కేజీ కూడా తీసేసాక అప్పుడు ఆవిడ చెక్ చేసి ఒకే అంది. సాధారణంగా క్యాబిన్ లగేజ్ చెకిన్ దగ్గర చూడరు కదాని అది కాంతి గారి దగ్గరే వదిలేసి వచ్చాం. ఈవిడేమో మళ్ళీ "మా ఎయిర్ ఫ్రాన్స్.." అని మొదలెట్టి అది కూడా తీసుకురండి అంది. కిరణ్ ప్రభ గారికి ఫోన్ చేసి మేమున్న దగ్గరికి తెచ్చిమ్మని చెప్పాక అది కూడా ఓ అరకేజీ ఎక్కువ బరువుంటే ఎలా అన్న సందేహం వచ్చింది. మంచు గారు వెంటనే నా దగ్గర నుంచీ ఫోన్ తీసుకుని మాట్లాడుతూ ఎదురెళ్ళి అందులోంచి కూడా కొంచెం బరువు తీసి పక్కన పెట్టి "మీరిక్కడే ఉండండి. అక్కడికి రాకండి" అని చెప్పి వచ్చారు. మళ్ళీ దాని వెయిట్ చెక్ చేసాక కూడా ఆ ఫ్రెంచ్ పోలేరమ్మకి ఎంత చాదస్తం అంటే ఇందాక బయటకి తీసిన వస్తువుల బ్యాగ్ వైపే చూస్తోంది అనుమానంగా. "తల్లోయ్.. ఇవన్నీ ఇక్కడే వదిలేస్తాను. ఇదిగో ఈయన తీసుకెళ్ళిపోతారు. వెళ్ళేది నేనొక్కదాన్నే కదా.." అని చెప్పాక అప్పుడు శాంతించింది.

ఆ చెకిన్ ప్రహసనం అంతా అయిపోయేసరికి టైము ఎనిమిది దాటింది. అప్పటికి నాకు నించోడానికి కూడా ఓపిక లేనంత వణికించేసింది ఆవిడెవరో గానీ. నలుగురం వచ్చి కూర్చున్నాక ఇందాక తీసేసిన వస్తువులన్నీ కాంతి గారికి ఇస్తే అందులో చాక్లెట్స్ చూసి "అయ్యో.. చాక్లెట్స్ కొన్నే కదా కొన్నావు. ఇవి కూడా తీసేసావా" అన్నారు. ఆ మాట వినగానే మంచు గారు "చాక్లెట్స్ కి ఏం పర్లేదులే" అని లాప్టాప్ బ్యాగ్లో కొన్ని, క్యాబిన్లో కొన్ని సర్దేసారు. "ఇంతకీ లాప్టాప్ బ్యాగ్ ఎక్స్ట్రా అని అంటుందేమో.. దాని సంగతి మర్చిపోయాం కదా.. లోపలకి వెళ్ళాక ఏమన్నా ఇబ్బంది అవుతుందేమో.." అని భయపడ్డాను నేను. "ఆవిడెవరో మరీ సోది మొహంలా ఉంది కానీ ఇంత సీన్ అవసరం లేదు. అస్సలేం ఇబ్బంది ఉండదు. కంగారు పడకు. అంతగా అవసరమైతే నువ్వు లోపల నుంచి మాకు కాల్ చేద్దూ గానీలే..

ఓ.. ఇంక నీ దగ్గర మొబైల్ ఉండదు కదూ.. కాయిన్స్ ఉంటే లోపల ఫోన్స్ యూజ్ చేస్కోవచ్చు" అన్నారు కిరణ్ ప్రభ గారు. "అయినా సెక్యూరిటీ చెక్లో అండర్ ఫోర్టీన్ వాళ్ళని పెద్దగా పట్టించుకోరులే.. భయం లేదు" అని మంచు గారు అనేసరికి నేను తప్ప అందరూ నవ్వారు. నాకు నిజంగానే జోక్ అర్థం కాలేదు. అప్పటికింకా వణుకు తగ్గక నోట్లోంచి మాట కూడా సరిగ్గా బయటికి రావడం లేదు. మంచు గారు నావైపు చూసి "ఆకలేస్తుందా.. ఏమన్నా తింటావా" అని అడిగారు. "మంచినీళ్ళు కావాలి" అని చెప్తే వెళ్ళి ఓ పెద్ద లైన్లో నించుని రెండు వాటర్ బాటిల్స్ తో పాటు గుప్పెడు చిల్లర కాయిన్స్ పట్టుకొచ్చి ఇచ్చారు. అంత టెన్షన్ పడిపోతుండేసరికి ఒకేసారి ఎక్కువ మంచినీళ్ళు కూడా తాగలేకపోయాను. నేను లోపలకి వెళ్ళిపోయే దాకా రెండు నిమిషాలకోసారి మంచినీళ్ళు తాగమని గుర్తు చేస్తూనే ఉన్నారు మంచు గారు. కిరణ్ ప్రభ గారు నా చేతుల వంక చూసి "ఎంత ఎర్రగా కందిపోయాయో చేతులు, మొహం కూడా.. ఇంకేం కంగారు పడకు తల్లీ.. లగేజ్ పని అయిపోయిందిగా" అన్నారు. "మీరే విషయం ఎవరికీ చెప్పకండి. మీరందరూ చిన్నపిల్ల అనడమేమో గానీ నిజంగానే చిన్నపిల్లని ఊరికి పంపిస్తున్నట్టు నానా కంగాళీ అయిపోయింది కదా.. ఎవరన్నా చూస్తే పాపం ఇదే మొదటిసారేమో ఫ్లైట్ ఎక్కడం అనుకుంటారు" అన్నాన్నేను. "టెన్షన్ లగేజ్ ఒక్కదాని గురించే కాదులెండి. టికెట్ వెయిటింగ్ లిస్టులో ఉందని చెప్పారు" అన్నారు మంచు గారు. అంత టెన్షన్ లోనూ కాంతి గారు "వెయిటింగ్ లిస్టా.. అంటే పోస్ట్ పోన్ చేస్తారా.. అలాగైతే ఎంచక్కా మళ్ళీ ఇంటికి తీసుకెళ్ళిపోదాం" అనేసరికి చాలా నవ్వొచ్చింది.

మంచు గారు టైము చూస్తూ "యు హావ్ టు గో ఇన్ ట్వల్వ్ మినిట్స్.. వెయిటింగ్ లిస్ట్ అన్నారు కదా.. ఒకవేళ లోపల వాళ్ళు నీ పేరు అనౌన్స్ చేస్తే ఆ టైముకి నువ్వక్కడ ఉండాలి. అందుకని ముందే వెళ్ళాలి" అని చెప్తే నాకప్పుడు మళ్ళీ "అవును.. నేనింక వెళ్ళిపోతున్నాను కదా" అన్న దిగులు గుర్తొచ్చింది. తను నా ఐఫోన్ తీసుకుని "లోపలకి వెళ్ళాక ఫోన్ లేకపోయినా ఇంటర్నెట్ కి కనెక్ట్ అవ్వగలిగితే మెయిల్ ఇవ్వొచ్చు" అని ఎయిర్పోర్ట్ ఇంటర్నెట్ కి ఎలా కనెక్ట్ అవ్వాలో వివరంగా చూపించారు. "ఫోన్ లాక్ అయినప్పుడు నెట్ డిస్కనక్ట్ అయిపోతుంది. ఎప్పటికప్పుడు రీకనక్ట్ చేసుకోవాలి" అని చెప్తూ నా మొహంలోకి చూసేసరికి తనకి అర్థమైంది తను చెప్పిందంతా నాకొక్క ముక్క కూడా బుర్రలోకి వెళ్ళడం లేదని. "నీ ఫ్లైట్ టేకాఫ్ అయ్యేదాకా నేను ఎయిర్ పోర్టులోనే వెయిట్ చేస్తుంటాను. ఏం అవసరమైనా నాకు కాల్ చెయ్యొచ్చు. డోంట్ వర్రీ.." అన్నారు. హ్మ్.. వెళ్ళడానికి ఇంకో ఐదు నిమిషాలుందనగా నేనొక్కదాన్నే నవ్వుతూ ఏదేదో సోది చెప్తుంటే వాళ్ళు ముగ్గురూ పెద్దగా ఏం మాట్లాడకుండా నన్నే చూస్తుంటే అస్సలు అర్థం పర్థం లేని నాన్సెన్స్ మాట్లాడుతున్నానేమోనని సందేహం వచ్చింది. కిరణ్ ప్రభ గారేమో "టెన్షన్ పడుతున్నావని తెలీకుండా ఉండటానికి బోల్డు మాట్లాడేస్తున్నావా తల్లీ.." అనడిగేసరికి నాకింకేం మాట్లాడాలో తోచలేదు.

మాకున్న టైము అయిపోయింది. అందరం లేచి నించున్నాం. మంచు గారు పాస్పోర్ట్, బోర్డింగ్ పాస్ మళ్ళీ ఒకసారి జాగ్రత్తగా చూసి "ఇవి ఈ చేతిలో పెట్టుకో .ఈజీగా ఉంటుంది "అని నా చేతిలో పెట్టి, ఇంకో చేతికి లాప్టాప్ బ్యాగ్ అందించారు. కాంతి గారు సెక్యూరిటీ చెక్లో ఊరికే తియ్యడం పెట్టుకోడం ఇబ్బంది అని చేతి వాచ్ తీసి బ్యాగ్లో పడేయ్యమని చెప్పి నా స్వెటర్, క్యాబిన్ బ్యాగ్ తను తీసుకుని ముందుకి నడిచారు. కిరణ్ ప్రభ గారేమో నన్ను కొంచెం పక్కకి తీసుకెళ్ళి అక్కడ నుంచి లోపల సెక్యూరిటీ చెక్ దాటాక ఒక పాయింట్ చూపించి "నువ్వు అక్కడికి వెళ్ళేదాకా మేము కనిపిస్తాం. ఇక్కడే నించుని ఉంటాం చూడు" అని చెప్పారు. సరిగ్గా సెక్యూరిటీ చెక్ లోకి అడుగు పెట్టే ముందు దాకా వెళ్ళే సరికి ఇంక వాళ్ళెవ్వరూ ఏమీ మాట్లాడడం లేదు. నేను మాత్రం ఇహ్హిహ్హీ అని తెగ నవ్వేస్తూ "మీరేం కంగారుపడకండి. నేను జాగ్రత్తగానే వెళ్తాను" అని చెప్పి కాంతి గారికి "మళ్ళీ వస్తాను బెంగ పెట్టుకోకండి" అని మరీ మరీ చెప్పి లోపలికి నడిచాను. నేను వెళుతూ వెళుతూ ఎప్పుడు వెనక్కి తిరిగి చూసినా ముగ్గురూ అలా కదలకుండా అక్కడే నించుని నా వైపే చూస్తూ కనిపించారు. "ఏంటో.. నిజంగా చిన్నపిల్లని ఫస్ట్ డే స్కూలుకి పంపిస్తున్నట్టు భలే పెట్టుకున్నారు మొహాలు ముగ్గురూ.." అని చాలా నవ్వొచ్చింది. అంతలోనే నేను మళ్ళీ ఎప్పుడు వీళ్ళని చూస్తానో కదాని బెంగగా అనిపించింది. నేను నవ్వుతూనే ఉన్నాను గానీ కళ్ళ ముందున్న వాళ్ళ ముగ్గురి బొమ్మా అస్పష్టంగా అయిపోతోంది వాళ్ళకీ నాకూ మధ్య దూరం పెరుగుతున్నందుకో, కళ్ళలో కన్నీటి తెర అడ్డుపడినందుకో సరిగ్గా తెలీలేదు. కిరణ్ ప్రభ గారు ఇందాక చూపించిన పాయింట్ దగ్గరికి వెళ్ళి నించుని అక్కడినుంచి నవ్వుతూ ఇంకొకసారి టాటా చెప్పి ముందుకి వెళ్ళిపోయాను.

తర్వాత సమస్యలేవీ లేకుండానే బోర్డింగ్ పాస్ ఇచ్చేసరికి హమ్మయ్యా అనుకుని వెంటనే "All happy.. Worry not" అని కొత్త టెలిగ్రాం భాష కనిపెట్టి మా Thee Musketeers కి మెయిల్ పెట్టడానికి ప్రయత్నించాను. మెయిల్ సెండ్ అయ్యే టైముకి నెట్ డిస్కనక్ట్ అయ్యి వెళ్ళిందో లేదో తెలీలేదు. నాకేమో అక్కడ నించునే టైం లేకుండా వెంటనే ఫ్లైట్లోకి పంపించేసారు. ఫ్లైట్లోకి వెళ్ళి కూర్చున్నాక "వేరే ఎవరినన్నా ఫోన్ అడిగి ఒక కాల్ చెయ్యమ్మా.. ఏమనుకోరు" అన్న కిరణ్ ప్రభ గారి మాట గుర్తొచ్చి అంతలోనే నా జర్మనీ సిమ్ కార్డ్ వేసుకుంటే ఇంటర్నేషనల్ రోమింగ్ లో పని చేస్తుంది కదాని సూపర్ ఐడియా వచ్చింది. అర్జెంటుగా ఆ పని చేసి టెక్స్ట్ పెట్టి ఒకసారి బెటర్ గా ఫీలవుతారని కిరణ్ ప్రభ గారికి కాల్ చేసాను. నేను అంతా బానే అయింది అని చెప్పాక "ఇప్పుడు మేము సరిగ్గా ఎక్కడున్నామో తెలుసా తల్లీ.. స్వర్గద్వారం దగ్గర.. కాంతికి నేను చెప్తానులే.. మంచు గారు నీ ఫ్లైట్ టేకాఫ్ అయ్యేదాకా ఎయిర్ పోర్టులోనే వెయిట్ చేస్తానన్నారు. తనకి కాల్ చేసి చెప్పమ్మా. హేపీ జర్నీ" అని చెప్పి పెట్టేసారు. అసలు ఎయిర్ పోర్ట్ కి వచ్చిన దగ్గర్నుంచీ కాంతి గారు పెద్దగా మాట్లాడలేదు అని గుర్తొచ్చి కాస్త

బాధనిపించింది. వెంటనే మంచు గారికి ఫోన్ చేసి "నథింగ్ టు వర్రీ.. అబౌట్ టు ఫ్లై.. మీరింక ఇంటికి వెళ్ళండి. ఇప్పటికే చాలా రాత్రయిపోయింది కదా.." అని చెప్తే "కాంతి గారితో మాట్లాడావా.. నువ్వు జాగ్రత్త. వెళ్ళగానే ఒక మెయిల్ పెట్టు" అని చెప్పి పెట్టేసారు. ఆ రోజు ఉదయం నుంచీ కొంచెం ఒంట్లో బాలేక, మళ్ళీ సాయంత్రం నుంచీ టెన్షన్ పడీ పడీ ఉన్నానేమో ఫ్లైట్లో సర్దుకుని కూర్చోగానే ఒకేసారి రిలాక్స్ అయిపోయినట్టు అనిపించి మూసిన కన్ను తెరవకుండా విపరీతంగా నిద్రపోయాను. ఎంతలా నిద్రపోయానంటే ప్యారిస్ దాకా దాదాపు పన్నెండు గంటల ప్రయాణం ఎలా గడిచిందో నాకసలేం తెలీలేదు.

## 03.07.2013

## బుధవారం

Charles de Gaulle Airport, Paris లో విమానం దిగేసరికి టైము సాయంత్రం ఐదు దాటింది. బాగా నిద్రపోయి లేచేసరికి అస్సలు ప్రయాణపు అలసటే తెలీలేదు. నేను మామూలైపోయేసరికి రాత్రి నేర్చుకున్న ఇంటర్నెట్ పాఠం గుర్తొచ్చేసి ఫోన్లోంచి నెట్ కనక్ట్ అయ్యి పారిస్ నుంచి అందరికీ హాయ్ చెప్పాను. తర్వాతి ఫ్లైట్ కి ఇంకా గంటే టైముంది కాబట్టి నేను సెక్యూరిటీ చెక్, కస్టమ్స్ చెక్ వగైరాలన్నీ పూర్తి చేసుకుని Munich వెళ్ళే ఫ్లైట్ గేట్ వెతుక్కుని వెళ్ళేసరికి ఆ పాటికే బోర్డింగ్ మొదలైపోయింది. అక్కడి నుంచి ప్రయాణం గంట సేపే కాబట్టి ఫ్లైట్లో కూర్చుని అలా ఒక పది పాటలైనా విన్నానో లేదో అంతలోనే మ్యూనిక్ వచ్చేసింది. Munich లో ఫ్లైట్ లాండ్ అవ్వగానే నా ఫోన్ ఆన్ చేసి అందరికీ ఇంకోసారి మ్యూనిక్ నుంచి హాయ్ చెప్పి మా ఇంటబ్బాయ్ కి కాల్ చేసాను. తను అప్పటికే వచ్చి నాకోసం ఎదురు చూస్తున్నాడు. అలా విమానంలోంచి దిగి ఇలా లగేజ్ తీసుకుని వెళ్ళిపోవడమే కాబట్టి హమ్మయ్యా కాసేపట్లో ఇంట్లో ఉంటాను అనుకుంటూ వెళ్ళాను. లగేజ్ కోసం చూస్తూ నించుంటే దూరంగా మా ఇంటబ్బాయ్ కనిపిస్తున్నాడు. ఎంతసేపటికీ నా సూట్కేస్ రాలేదని ఇద్దరం కాసేపు ఫోన్లో ఎయిర్ ఫ్రాన్స్ ని తిట్టుకుని తర్వాత నేను వెళ్ళి కంప్లెయింట్ ఇచ్చి వచ్చేసరికి దాదాపు ముప్పావుగంట పట్టింది. రాత్రి శాన్ ఫ్రాన్సిస్కో ఎయిర్ పోర్ట్ లో "మా ఎయిర్ ఫ్రాన్స్ పరువు, ప్రతిష్ఠ.." అంటూ ఆవిడ చెప్పిన సోది గుర్తొచ్చి ఒళ్ళు మండిపోయింది. అక్కడ నించున్నంతసేపూ తెగ తిట్టుకుని కంప్లెయింట్ ఇచ్చాక బయటపడ్డాను. అప్పటికీ నా కడుపు మంట చల్లారక ఈ ఎయిర్ ఫ్రాన్స్ వాడు ఎంత దుర్మార్గుడు అన్న టాపిక్ మీద ఉపన్యాసం మొదలుపెట్టబోయి ముందు మంచు గారొచ్చారు తెలుసా ఎయిర్ పోర్ట్ కి అని ఆనందాన్ని ప్రకటించి అర్జెంటుగా నా కొత్త గాగుల్స్ కూడా చూపించేసాను.

అప్పుడు మా తమ్ముడు ఎప్పుడూ చెప్పినట్టు ప్రతీ సీనూ క్లైమాక్స్ లా ఉండే కథలాగా రాత్రి జరిగిందంతా పూసగుచ్చినట్టు మా ఇంటబ్బాయ్ కి చెప్పడం మొదలుపెట్టాను. ఈ స్టోరీ డిస్కషన్ లో లీనమైపోయి మేము మా ఇంటి దగ్గర దిగాల్సిన బస్టాప్ మర్చిపోయి ముందుకెళ్ళిపోయాం. నేను గబుక్కున గమనించడం వల్ల నెక్స్ట్ స్టాప్ లో దిగేసాం. నేను "అయ్యో అలా మర్చిపోయామేంటి.." అంటే మా ఇంటబ్బాయేమో "నువ్వు స్టోరీలు చెప్పడం మొదలుపెట్టాక వినేవాళ్ళు బస్సేం ఖర్మ.. ఫ్లైట్ మిస్సయిపోయినా అందులో ఏం ఆశ్చర్యం లేదు కదా.." అన్నాడు. ఇద్దరం కలిసి నవ్వుకుంటూ ఎండాకాలం కాబట్టి అప్పుడప్పుడే సూర్యాస్తమయం అవుతున్న సమయంలో చాలా రోజుల తర్వాత మా ఊరిని చూసిన ఆనందంలో "ఈ గాలి ఈ నేలా.." అనుకుంటూ సంబరంగా ఇంటికి వచ్చేశాం. ఇంట్లోకి రాగానే ముందు అమెరికా ఫోన్లన్నీ చేసి క్షేమంగా ఇల్లు చేరానని చెప్పి, కాంతి గారికైతే నేను అస్సలు అలసిపోలేదు అని సాక్ష్యంగా నా మొహం కూడా చూపించి అప్పుడు అన్నం తినేసి హాయిగా బజ్జున్నాను.

అలా నా శాన్ ఫ్రాన్సిస్కో డైరీలో ఇప్పటికి మాత్రమే ఆఖరుదైన ఈ చివరి పేజీ పూర్తయింది..!

~~~~~~~~~~~~~~~

నేను ఈ డైరీ రాయడం మొదలుపెట్టాక చాలా సందర్భాల్లో మధ్యలో పూర్తిగా రాయగలనో లేదోనని సందేహించాను. నా డైరీలో కబుర్లు చాలామందికి ఆసక్తికరంగా అనిపించి ఇంత ఇష్టంగా ప్రతీ పేజీ చదువుతారని అస్సలు ఊహించలేదు. ఇది రాయడం మొదలుపెట్టాక చాలా మంది దగ్గర్నుంచీ కొత్తగా వచ్చిన మెయిల్స్, మెసేజెస్ చూసి చాలా ఉత్సాహంగా అనిపించింది. నా రాతలు చదువుతూ నన్ను ప్రోత్సహిస్తున్న వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.

నన్ను ఎప్పుడూ ఒక్క మాట కూడా ఎక్కువగా మెచ్చుకోని మా అమ్మ "నీ డైరీ ప్రతీ పేజీ చదువుతున్నాను. నీతో పాటు పక్కనే నీ చెయ్యి పట్టుకుని తిరుగుతూ అన్నీ ప్రదేశాలని చూస్తున్నట్టు, నీ స్నేహితులందరితో మాట్లాడుతున్నట్టుంది. నీ డైరీ చదవడం ఎంత నచ్చుతోందంటే చదివాక అందరిలాగా నేను కూడా కామెంట్ రాస్తే బావుండు అనిపిస్తోంది. నువ్వు బంగారుతల్లివి కాబట్టే నీకెప్పుడూ అంత గొప్ప స్నేహితులు దొరుకుతారు" అని పొగిడేసినప్పుడు మాటల్లో చెప్పలేనంత సంతోషంగా అనిపించింది. నేనిలా నా జ్ఞాపకాలు
~~~~~~~~~~~~~~~

నాకొక్కదానికే పరిమితం చేసుకోకుండా అక్షరాల్లో కూర్చి అందరితో పంచుకోవడం కొందరికైనా సంతోషాన్ని కలిగిస్తుందంటే నేను మంచి పనే చేసాననిపిస్తోంది.

'నేను' అంటే నా స్నేహితులు, నా రాతలు, నా స్వేచ్ఛ.. అన్నీ కలిస్తేనే నేను అని స్వీకరించి నా సరదాలని, సంతోషాలని ఎప్పుడూ కాదనని మా ఇంటబ్బాయ్ కి బోల్డు థాంకులు చెప్పాలనిపిస్తోంది.

ఇంకా... నా వెనక, ముందు, పక్కన, ఇలా ఎప్పుడూ నా చుట్టూ ఉంటూ ఈ డైరీలోని ప్రతీ అక్షరాన్నీ దగ్గరుండి రాయించిన నా ప్రియాతి ప్రియమైన ప్రాణనేస్తాలకి.. ఈ డైరీలోని పేజీలే కాకుండా నా డైరీలోని ప్రతీ పేజీలోనూ బోల్డన్ని అందమైన రంగుల్ని నింపుతూ నేనెప్పుడూ నవ్వుల్లో వెలిగేలా అపురూపంగా చూసుకునే నిషి, కిరణ్ ప్రభగారు, కాంతిగారు, మంచబ్బాయ్ గారికి... బోల్డంత ప్రేమతో నా శాన్ ఫ్రాన్సిస్కో డైరీ అంకితం! :-)



నా బ్లాగు

www.madhuravaani.blogspot.com